# మిసిమి

చింతనాత్మక సారస్వతం



మాసపత్రిక, జులై, 2016 ₹ 25

ISSN 2454–4329



అల్లిక

# మిసిమి

మాసపత్రిక

**"All that we are is the product of what we have thought"**

*- Dammapada*

**సంపుటి 27** **జులై** **సంచిక 7**

*ప్రధాన సంపాదకుడు*

చెన్నూరు ఆంజనేయ రెడ్డి

*సంపాదకుడు*

వల్లభనేని అశ్వినీకుమార్

*సహాయ సంపాదకులు*

కాండ్రేగుల నాగేశ్వరరావు
డా. వోలేటి పార్వతీశం
కరుటూరి విజయ్

సాంకేతిక సహాయకులు

పడవల ఉమాశంకర్, చేపూరి రమేష్,
మహమ్మద్ కుర్రముద్దీన్ జీ షాన్,
వేములు రాణి, స్వాతి దండోతిక

*సంస్థాపక సంపాదకులు*

**రవీంద్రనాథ్ ఆలపాటి**

*Printed & Published by*

**Bapanna Alapati**
at **Kala Jyothi Process Pvt. Ltd.,**
1-1-60/5, R.T.C. 'X' Roads,
Musheerabad, Hyderabad - 500 020.
Ph. 040-27645536. Cell : 994 951 6567
E-mail : misimi_monthly@yahoo.in
www.misimimonthly.com
**e-magazine : www.kinige.com/misimi**
**http://facebook.com/misimimaasapathrika**
**https://twitter.com/MISMIMONTHLY**

ప్రతి : ₹ 25/- సంవత్సరానికి : ₹300/-
విదేశాలకు ప్రతి : $ 2.50 సంవత్సరానికి : $ 25

LIBRARY OF CONGRESS **LCCN 91-903060**

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE **ISSN 2454-4329**

YouTube **: Silver jubilee celebrations of MISIMI Telugu Monthly**


# ఈ నెల...


కమ్మతెమ్మెరలు ........ 5
వాగ్దేవికి స్వరనైవేద్యం.. ........ 7
*- డా. వోలేటి పార్వతీశం*
మధుర కవితల స్రవంతి కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి.. 10
*- ప్రొ. రావినూతల సత్యనారాయణ*
అక్షరాశ్రువులు ........ 20
*- సి. వేదవతి*
కళింగాంధ్ర జానపదగేయాలు.. ........ 30
*- డా. దామెర వేంకట సూర్యారావు*
ఉనికి కోల్పోతున్న - దళిత గరుడ సంస్కృతి ........ 33
*- ఘట్టమరాజు అశ్వత్థనారాయణ*
పురిటిగడ్డ ........ 36
*- వనజ తాతినేని*
గీటురాయి ........ 42
*- డా. ఎస్. సదాశివ*
ఆంధ్రులు - నాట్యకళ ........ 45
*- నటరాజ రామకృష్ణ*
పెళ్ళిచూపులు ........ 49
అడ్డగోలు కథలు ........ 52
*- గొల్లపూడి మారుతీరావు*
వెండితెరకు వన్నె తెచ్చిన వైజయంతిమాల ........ 55
*- కాండ్రేగుల నాగేశ్వరరావు*
కారే రాజులు.. కొడక్ ఫిల్ములు ........ 58
ఉమ్మిటి శివలింగం ........ 60
*- వి. హర్షవర్ధన్*
కాటమరాజు వీరగాథ - ఆరుద్ర ........ 62
*- డా. ఎమ్.వి. భారతలక్ష్మి*
తెలుగు తెరపై తొలి ఘటోత్కచుడు రాజంరెడ్డి రామిరెడ్డి .... 67
*- హెచ్. రమేష్‌బాబు*
ఆచార్య పింగళి లక్ష్మీకాంతం ........ 69
*- పింగళి సూర్యసుందరం*
వేదం వేంకటరాయ శాస్త్రి రచనలు : సామాజిక చరిత్ర .... 72
*- డా. జి. వెంకటేశ్వరరావు*
అలెగ్జాండ్రియా గ్రంథాలయం ........ 77
*- గబ్బిట కృష్ణమోహన్*
అమరత్వం ........ 84
*- ము.పా.సా.*
కామినేని మల్లారెడ్డి ........ 88
*- ధూపాటి శేషాద్రి రమణ కవులు*
చరిత్రలో ఆవిష్కృతమైన అద్భుత సంఘటన ........ 90
*- దేవినేని మధుసూధనరావు*
షాజహానా కవిత్వం ........ 91
*- డా. దిలావార్*


| | | *చిత్రకారులు :* |
|---|---|---|
| *ముఖచిత్రం* | : గ్రీష్మ తాపం | **రవివర్మ** |
| *రెండవ అట్ట* | : అల్లిక | **పెంచలయ్య** |
| *మూడవ అట్ట* | : అరక | **పెంచలయ్య** |
| *నాల్గవ అట్ట* | : అమ్మ రూపం | **రవివర్మ** |

*వివరాలు : 50 వ పుటలో...*

వేల సంవత్సరాల మానవేతిహాసంలో జరిగిపోయిన, వికృత సంఘటనల పర్యవసానం – బ్రతికి బట్టకట్టి – మిగిలిపోయి జీవించిన వారి–వారి వారసులమే మనం. మనిషిని మనిషి చంపుకునే ఈ యుద్ధాలు, ఆయుధాలేమైనా కానివ్వండి, వీటికి మూలకారణం, పవిత్ర కారణాలేమీ ఉండవు, ఏదో ప్రయోజనాన్నాశించి – ఎవరో నాయకుడనేవాడు రేపిన చిచ్చులే ఇవన్నీ – దేశాలన్ని ప్రజలవే. వీరి జీవిక కోసం శ్రమపడి తిండిగింజలు పండించుకునే ప్రదేశాలే ఈ దేశాలు. పెత్తనం, మతం, అధికారులు – వీరు పరిపాలన వంకతో పన్నులు వసూలు చేసి, ఆ ప్రజల 'శ్రేయస్సు'కోసం 'పాలిస్తారు'. ఇతర దేశాల నుంచి రక్షణ కోసం, సైనికులను తయారుచేసి పోషిస్తారు. వారు ఊరికే ఉండిపోకుండా – సరిహద్దు దేశంతో యుద్ధానికి కాలుదువ్వుతారు. ముందు – సైనికులు చనిపోతారు – సామాన్యులు క్షతగాత్రులవుతారు. అసలు బాధితులు స్త్రీలు. భర్తలు చనిపోయి, అవయవాలు తెగిపోయి, బంధువులు, సంతానం కానరాకుండాపోతే గుర్తుల కోసం శ్మశానాలు వెతుక్కుంటూ దిక్కులేక మిగిలిపోతారు. వారి జీవితం ఎవరిచేతుల్లో పడిపోతుందో, విధిరాత అనుకుని మిగిలిపోతారు – అలా మిగిలిపోయిన సంకరజాతుల వారసులే నేటి ప్రపంచ జనాభా. ఒక జాతి – జాతిగా మిగిలింది లేదు. దేశ సరిహద్దులు మారిపోతూనే ఉన్నాయి. నాగరకత అనే అదృశ్య శక్తి వికృత క్రీడ ఈ ప్రపంచపు పోకడ.

'జీన్స్ ఆర్ సెల్ఫిష్' అనే విజ్ఞాన శాస్త్ర నానుడి ఒకటుంది. క్రోమోజోమ్ కథనంలో 'అమరత్వం' చదివితే, 'గీత'లోని 'నైనం ఛిన్దన్తి శస్త్రాణి నైనం...' గుర్తు రాక మానదు. అయితే, బాధలన్నీ శరీరానికే. అలాగే 'కాలో నిరవధిః' అన్నారంటే, కాలప్రవాహంలో భౌతిక కాష్ఠాలు కొట్టుకుపోతాయి. అయినా, అమరత్వం జీన్స్ శృంఖలాలుగా అనంతం. ఎటొచ్చీ, ఆ జ్ఞానం కోసమే మన తాపత్రయం. భౌతిక ప్రపంచం మీద ప్రేమ చావదు. కానీ, తాత్వికులు మరణం కూడా వరమే అన్నారు. అది లేకపోతే జీవితం విసుగు పుడుతుంది. అశ్వత్థామకు అమరణ శాపం కదా!

అనుభవాలు అందరికీ ఉంటాయి. అనుభవాల శృంఖలాలే జీవితం. అనుభవాన్ని జీర్ణించుకుని, తన ఊహాశక్తితో కల్పన చేసి, నిత్య జీవిత సంఘటనలకు సాహిత్యపు పరిమళాలద్ది, కథగానో, కవితగానో మలిచి, సార్వజనీనం చేయగలిగిన రచయిత ప్రతిభావంతుడు. అందుకే అందరూ కవులు, కథకులు కాలేరు. "ఆ కవి జీవితంలోని అనుభవం మనకూ ఉంటే, మనం కూడా కవులయి వెలిగేవాళ్ళం" అని అసూయపడేవాళ్ళని చూసి జాలిపడాలి. "నేను కవిత్వం రాస్తున్నా, నేను కవిని, నా పురస్కారం నాకివ్వండి" అని ఎగబడుతున్న నేటి తరం రచయితలు – అవ్వ! ఎంతకు తెగబడుతున్నారు?!

'ఆత్మహత్య పిరికిపంద లక్షణం అంటారు, అనైతికం అంటారు' –షోపెన్ హోవర్. ఈ ప్రపంచంలో పిరికివాళ్ళకు ఎప్పుడూ స్థానం పదిలం కాదు. అలాగే, వారిని ఆసరా చేసుకునే గుంపులకు చలనం ఉండకూడదు. ఒక బలి జరగగానే అమ్మలక్కలు, చమ్మచక్కలు, డప్పుడమారాలు, రాహుకేతువులు వాలిపోయారే, ఆ బలిపీఠం ముందు నిలబడి, తమ ప్రచార విశేషాల కోసం నిరసన ఘోషలు అన్ని ప్రసార మాధ్యమాల్లో వినిపించారే. వీరంతా ఈ బలిని నివారించలేరా?! ముందుగా, ఇరుపక్షాలకు సయోధ్య కుదర్చలేరా? వీరికి ప్రచారం మాత్రమే కావాలి. వీరు పోరాడి సాధించే న్యాయం ఏమీ లేదు. రాజకీయ ప్రయోజనం, సొంత ప్రచారం – ఎవరి జెండా వారిది, ఎవరి ఎజెండా వారిది. కొన్నాళ్ళ తరువాత చాప చుట్టుకుని, జెండా మడతపెట్టుకుని మరిచిపోవటానికి సిగ్గుపడరు. మరో బలిపీఠం వెతుక్కోవాలి కదా. నివారించటానికి ప్రయత్నాలేమీ చేయరు. మావుళ్ళయ్య ఆత్మహత్యను ఒక రేడియో అక్కయ్య ఆపగలిగిందికదా....

**– సంపాదకులు**

# కమ్మతెమ్మెరలు

✧ "...ఈ నెల సంచిక పూర్తిగా చదివితిని. బోధన్ చరిత్ర గురించిన నా వ్యాసం ప్రచురించినారు, ధన్యవాదాలు. ఇట్లు చరిత్రపై వ్యాసాలు పరిశోధించి వ్రాయుటకు, నాకు ఆధారాలు గలవు. ఇక నుంచి పంపుతూ ఉండగలను. ప్రచురించుటకు ***మిసిమి*** సహకారం ఉండవలెనని మనవి. ప్రతి సంవత్సరము బౌద్ధ విశేషాలను నిరూపించుతూ మే నెలలో విశేష సంచికలు వరుసగా ప్రచురించుచున్నారు. ఇందు మీ గొప్పతనముగలదు. వేరు పత్రికలలో ఈ ధోరణి ఏమియు లేదు. వరుస క్రమము లేదు. తెలుగువారికి ఇదియే తమ ప్రసాదంగా భావించవచ్చును. డా. ఈమని శివనాగిరెడ్డిగారు ధర్మప్రవర్తన చక్రం శిలాశాసనం వర్ణించి చూపిరి. జైనులు, ధర్మచక్రము ఒక శాస్త్రంగా జనంలో వాడిరి అని ఆధారాలు యున్నవి. బౌద్ధంలో కూడా వీరు చూపిరి. ఇది విశేషతగలదు..... వేలూరి కృష్ణమూర్తి వ్యాసం మగధ రాజ్యకాలం ఆధారాలతో ఇంకను వెనక్కి మర్లుచున్నది. దాని ఆధారముగా గడచిన కాలం ఎంతో వెనుకకు జరిపుటకు వీలున్నది...... అమరావతి స్తూప వర్ణనలో అంధకు ఆంధ్రమూలవారు అని చూపిరి. నేడు నాందేడ్, యావత్మల్, గడ్చిరోలి (మహారాష్ట్ర) జిల్లాలో వందలాది అంధక కుటుంబాలుగలవు. వారి సభలలో నేను వారి చరిత్ర చూపియుంటిని. నా పరిశోధనలో వారు అతి పూర్వ అశ్మక రాజ్యంలోనివారు, కావున అశ్మక రాజ్యంలో మూలనివాసి జనం అనవచ్చును. అశ్మక రాజ్య చిహ్నాలు నేటి బోధన పరిసరాలలో కలవు. ఈ మూలనివాసులు ఆదివాసులు అని చూపవచ్చును...."




*– **కందకూర్తి యాదవరావు** (చరిత్ర పరిశోధకులు), నిజామాబాద్*

✧ "... బౌద్ధ వాఙ్మయ అనువాదాలు : 1. జాతక కథలు – దాదాపు నాలుగు దశాబ్దాల కిందనే స్వామి తల్లావఝ్ఝల శివశంకరులు (శాస్త్రిగారు) జాతక కథలను మిక్కిలి సుందరమైన సరళమైన తెలుగులోనికి అనువదించారు. ఇవి మూడో నాలుగో సంపుటాలు పాళీ నుంచి తెలుగులోనికి అనువదించారు. 2. ధమ్మపథం – దాదాపు దశాబ్దం కిందటనే ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడుగారు, విపుల ఉపోద్ఘాతముతో, దమ్మపథాన్ని తెలుగులోనికి అనువదించారు, పై రెండు గ్రంథాలకు నూతన అనువాదాలు అవసరం లేదనుకొంటాను. పునర్ముద్రిస్తే సరిపోతుంది."

*– **సి.వి రామచంద్రరావు**, చెన్నై*

✧ "... ***మిసిమి*** ఈ నెల చాలా బాగుంది. అందులో జి. లక్ష్మిరెడ్డిగారు వ్రాసిన నేటి విజ్ఞానయుగంలో బౌద్ధధర్మం. దీనిలో లక్ష్మిరెడ్డిగారు న్యూటన్, ఐన్‌స్టీన్ లాంటి వైజ్ఞానికులు భగవంతుడిని నమ్మేవారు అని అన్నారు. అది ఎంతవరకు సబబు? ఐన్‌స్టీన్ మత వ్యతిరేకి, నాస్తికుడు. అటువంటివారికి మతాన్ని అంటగట్టడం అనేది చాలా బాధాకరం."

*– **రవీంద్రనాథ్**, తణుకు*

✧ "... ఫిబ్రవరి సంచికలోని కథ *భవాని* ని గురించి, మే సంచికలో ఎన్నో ప్రశంసలు వచ్చాయి. ఆ ప్రశంసలను చూసి చదవాలనిపించి, పాతసంచిక తిరగవేసి, ఒకే సిట్టింగులో పూర్తిగా చదివేశాను. ఎంతో ఉత్కంఠతో, ఎంతో కవితాత్మకంగా, అనుభూతిప్రధానంగా సాగింది రచన. నా ఉద్దేశంలో ఇది కథకాదు. నిజంగా రచయిత్రి జీవితంలో జరిగిన సంఘటనగా నేను భావిస్తున్నాను (అందువల్లనే మీరు రచయిత్రి పేరు వ్రాయలేదని అనుకుంటున్నాను). ఆమె కవయిత్రి కూడా కావడంవల్ల తన అనుభూతిని చక్కగా వ్యక్తీకరించింది. జీవితంలో రెండవసారి ప్రేమలో పడిన తన ప్రియుణ్ణి ఆమె భౌతికంగా, తనివితీరా కలుసుకుంది. కానీ ఆ విషయాన్ని, శరత్‌లాగ, అందంగా దాటవేసింది. చలంగారిలాగ తన శృంగారనుభవాన్ని పచ్చిగా చెప్పకపోవడం కూడా ఈ కథకు ఒక ఔన్నత్యాన్ని కల్పించిందని నా ఉద్దేశం. ఇలాగే ప్రతి సంచికలోను ఒక కథను కూడా ప్రచురిస్తే బాగుంటుందేమో! ఆలోచించండి. పూర్వం సాహిత్య పరిశోధన పత్రిక అయిన *భారతి* లో ప్రతినెలా ఒక కథ వేసేవారు. ఇది మీకు తెలిసిన విషయమేకదా..."

*– **తంగిరాల వెంకట సుబ్బారావు**, బెంగుళూరు*

# వేదిక

బి.వి. నరసింహారావుగారి *పరితోషణ* ఎన్నో జ్ఞాపకాల పుటలను తెరచింది. బి.వి. గారినీ – కొనకళ్ళ వెంకటరత్నంగారినీ చాలా సన్నిహితంగా చూశాను. నటరాజ రామకృష్ణగారు ఎక్కడైనా ప్రసంగం ప్రారంభించే ముందు *'చుక్కలతో కొండమీద సోకు చేసుకొనేయేళ / పంటబోదె వరిమడితో పకపక నవ్వేయేళ'* అని అద్భుతంగా పాడుతూ – నృత్యం నడకలు చూపించేవారు. మొదటిగా ఆకాశవాణిలో సీత – అనసూయ సోదరీమణులు (కృష్ణశాస్త్రి గారి మేనకోడళ్ళు) పాడి వినిపించి రసజ్ఞుల హృదయాలను కదిలించారు!



కొనకళ్ళ

*చూపులో సిరి చిందుగాక* – చరణం వినగానే చలంగారు ఆనందతాండవం చేశారు.

అడివి బాపిరాజుగారు – కృష్ణశాస్త్రి గారు సాహితీ జైత్రయాత్రలో పాడి వినిపించేవారు. బి.వి. గారు సరేసరి. ఆడేవారు, పాడేవారు. భావనాట్యంతో మంత్రముగ్ధుల్ని చేసేవారు. ఇవన్నీ నా మనసులో మధురంగా నిలిచే ఉన్నాయి. అంతకుముందే నండూరి వారి ఎంకి సాహితీలోకంలో ఎత్తయిన పీఠాన్ని అలంకరించే ఉన్నది. పంచాగ్నుల ఆదినారాయణశాస్త్రి గారి వంటి మహాపండితులు ఎంకి పాటలను ప్రశంసించారు. ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు 'నాజూకు లేదురా నండూరి సుబ్బిగా' అని హేళన చేశారు. అయినా సర్వాంధ్ర రసజ్ఞలోకం ఆదరించి గౌరవించింది ఎంకిని! నండూరివారు తరువాత కూడా పాటలు వ్రాస్తే *'రవల వెలుగుల గంగ రమ్మందిరా – శివమెత్తి తానాలు చేదామురా'* అంటే – చలంగారు "ఎంకి తులసి మాలలు వేసుకుని ఎత్తెత్తి అడుగులు వేస్తోంది" అంటూ చపురించేశారు. నండూరివారు నవ్యసాహిత్య సంగత్‌లో సభ్యులుగా ఉండటంలో వారిని కీర్తి వలచి వరించింది. కొనకళ్ళ వారు పోలీసు శాఖలో ఉద్యోగించారు. వారికి రావలసిన ప్రశస్తి రాకపోవడం ఇదీ ఒక కారణం కావచ్చు. బి.వి. గారు, చలంగారు, చింతాదీక్షితులుగారు, విద్యాశాఖలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్‌గా పనిచేశారు. బి.వి. గారు బాలసాహిత్యంలో ఎంతో కృషిచేశారు. 'బాలబంధు'గా ప్రభుత్వం గౌరవించిందనుకుంటాను. ఏ చీకూ–చింతా లేకుండా స్నేహితుల ఇండ్లకు వెళ్ళి ఆడుతూ–పాడుతూ ఉండేవారు. వారిది పసిహృదయం. బి.వి. చిన్నతనమంతా, చదువు వరకు దేవులపల్లి వారింట గడిపారు. ఆ రోజుల్లో కాకినాడలో దేవులపల్లివారి గృహం సంగీత సాహిత్య సేవాక్షేత్రం. అప్పటికే వారు సంఘసంస్కర్త. ఆ నేపథ్యంలో బి.వి. గారు పెరగటం, సంగీత, సాహిత్య, నృత్య సాంస్కృతిక రంగాలకు జీవితాన్ని అంకితం చేశారు. చలంగారి సన్నిధానానికి వెళ్ళి వస్తూ, బి.వి. తెలుగువారికి అరుణాచలంను సన్నిహితం చేశారు. ఇంకా – *మీగడ తరకలు* శీర్షికతో *భారతి* మాసపత్రికలో 'శాస్త్రి' అనే పేరుతో ఎన్నో జీవిత చిత్రణలు వచ్చాయి. ఎవరా ఈ శాస్త్రి అని చాలా తర్జనభర్జనలు పడ్డారు సాహితీవేత్తలు. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రిగారని కొందరు, ఇంద్రగంటివారని కొందరు చెప్పుకునేవారు. చివరకు కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారే ఎవరితోనో శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి అని చెప్పేశారు.

'శ్రీ భగవద్రామానుజులు – సాంఘిక ప్రబోధం' శ్రీ దామోదరనాయుడు గారి వ్యాసం గుండెలను పట్టుకుంది. రామానుజులవారు సాంఘిక విప్లవం తీసుకొచ్చారు. చాలా గొప్ప వ్యాసం. ***- చెరుకువాడ వెంకట్రామయ్య, విస్సాకోడూరు***

---

✧ "...సంపాదకులకు నమస్తే, పిల్లుట్ల హనుమంతరావు గారి వ్యాసం బాగున్నది (జూన్ **మిసిమి**). ఇది బహుశా 1990 ప్రాంతంలో ఆంధ్రప్రభ వారపత్రికలో వచ్చింది. అప్పటినుంచి ఇది పుస్తకంగా వస్తే తీసుకోవాలని అనుకొన్నాను. పుస్తకంగా వచ్చింది లేనిది తెలియదు. కొన్ని నెలల క్రితం శ్రీ రమణ గారి వద్ద స్వీయ చరిత్రల ప్రస్తావన వస్తే నేను అయన దగ్గర ఈ పుస్తకం ఉందా అని అడిగాను లేదన్నారు. ఇది వచ్చినప్పుడు ఆయన ప్రభ లోనే వున్నారని అనుకొంటా. ఈ పుస్తకం దొరికే అవకాశం వున్నదా? పుస్తకం ఖరీదు రవాణా ఖర్చులు భరిస్తాను. దయచేసి తెలియచేయగలరు...."

***- మనోహర్ పంత్,*** *(మెయిల్)*

✧ బాపన్న గారికి, నన్ను గుర్తించారనుకుంటాను. మీ బాబాయి గోపాల్ క్లాస్‌మేట్ను. ఆస్ట్రేలియా దేశపు మెల్‌బోర్న్ నుంచి వ్రాస్తున్నాను. ఆగస్టు నెలలో హైద్రాబాద్ వస్తున్నాను. మీరు అనుమతిస్తే అప్పుడు స్వయంగా కలుస్తాను. మంచిగా **మిసిమి** నడుపుతూ, నాన్నగారి స్మృతి కొనసాగిస్తున్నందుకై అభినందనలు. తమ్ముడ్ని కూడా గుర్తు చేసుకుంటున్నానని తెలియచేయండి.... *గీతం–సంగీతం* వ్యాసం.. 'నేల మాళిగల్లో చచ్చిన చిలకను చూడడం ఫేషనైతే, నేనూ అదే చేస్తాను' అన్నాడు ఆరుద్ర. లైవ్ సంగీతం, నాటకం ఎందుకు తెలుగువాళ్ళకు పట్టదో ఇప్పటికి తెలిసుంటుంది మీకు! *శంకరా భరణం* సినిమా చూడనివాళ్ళు ముఖ్యమైనది ఏదో కోల్పోయినట్లే అన్న టాక్, శాస్త్రీయ సంగీతాభిమానం ఏమీ కాదు. అది చూసిన తర్వాత విశ్వనాథ్, మహదేవన్‌లు పుట్టించిన పుకారు మాత్రమే అని తెలుస్తుంది.



బుచ్చిరాజారావు

***- రాజుపాలెం బుచ్చిరాజారావు,*** *మెల్‌బోర్న్ (వయా ఫేస్‌బుక్)*

# వాగ్దేవికి స్వరనైవేద్యం

- వోలేటి పార్వతీశం

పద్యం, తెలుగు వాళ్ళ సంపద, అని చాలామంది చెప్పడం, నేను చాలాసార్లు విన్నాను. అది తెలుగువాళ్ళకు ఎందుకు సంపద అయ్యిందో, అలా విన్న తొలినాళ్ళలో నాకు తెలిసింది కాదు. పద్యాన్నిబట్టి చందస్సు పుట్టిందో, ఛందస్సు ఉంది కనుక పద్యం పుట్టిందో నాకు బొత్తిగా తెలియదు. ఇదీ విషయం, అని నాకు చెప్పినవాళ్ళు లేరు. ఎందుకో పద్యం అంటే నాకు అర్థం కానిది అనే అభిప్రాయం చిన్నప్పుడే బాగా కుదురుకుపోయింది. అంత శ్రద్ధగా స్కూల్లో పాఠాలు విన్నవాణ్ణి కాదుగానీ, విన్నంతలో ఏ తెలుగు మాస్టారూ పద్యాన్ని నాకు దగ్గర చేసిన సందర్భం లేదు. ఆ బాల్యం రేడియోతో బాగా సాన్నిహిత్యం ఉండేది కనుక, చాలాసార్లు రేడియోల్లో పద్యం విన్నాను. అప్పుడూ అర్థమయ్యేది కాదు. ఇక నాన్నవెంట కవిసమ్మేళనాలు, అబ్బో ఎన్నని? ఎందరెందరో మహామహాకవుల్ని పంచెకట్టులో అలాంటప్పుడే చూసినవాణ్ణి. అప్పుడు కూడా, పద్యకవుల్ని కాస్త వేరే చూసేవాణ్ణి. కవిత్వ లోపం అని చెప్పే స్థాయి నాకు లేదుగానీ, ఆ పద్య పఠనం నాకు అర్థమయ్యేది కాదు. అందుకే ఆ పద్యకవులెప్పుడూ నన్ను ఆకట్టుకున్న గుర్తులేదు. ఇంకోమాట కూడా చెప్పాలి. ఇంటిల్లిపాదీ కలసికట్టుగా కూర్చుని రేడియో వినే రోజులవి. అలా వినే సన్నివేశాల్లో సరసవినోదిని కార్యక్రమం రాగానే, చదువుకు దూరంగా ఉండే నేను, పుస్తకం తెరిచేవాణ్ణి (సరస వినోదిని అంటే పద్యపూరణలతో సాగే సమస్యాపూరణం కార్యక్రమం అన్నమాట).

ఇలా పద్యానికి దూరంగా బతికేస్తున్న ఆ చిన్నతనపు రోజుల్లోనే, పద్యానికి దగ్గరగా బతకాల్సిన సందర్భాలూ ఉండేవి. దానికి కారణం మా అమ్మమ్మ. తెల్లవారుఝామునే లేచి భాగవత పద్యాలు, దాశరథీ శతకం పద్యాలు వల్లెవేస్తూ ఉండేది. అలా చేస్తూచేస్తూనే, నన్ను చదువుకొమ్మని నిద్రలేపేది. అంచేత నా చిన్నప్పుడు, నా మేలుకొలుపు పద్యంతోనే జరిగింది. అలాగే అప్పుడప్పుడు తాతగారు తను వ్రాసిన పద్యాలు పైకి చదివి వినిపించడమూ ఉండేది. మొత్తం మీద అర్థంకాని ఆ బాల్యంలో దాని జతలోనే పెరగాల్సిన ఒక విచిత్ర స్థితి.

ఇలా ఒక విచిత్ర స్థితిలో సాగుతున్న నా బాల్యంలో నన్ను భయపెట్టిన పద్యం, నన్ను మొదటిసారిగా ఆకట్టుకున్న సందర్భం బహుశా 'నర్తనశాల' సినిమా చూడటం అనుకుంటాను. ఆ సినిమాలో, ఎందుకోగానీ పద్యాలు వింటూ ఉండగానే అర్థమైపోయినట్లుండేవి. ఇది ఎందుకింతగా గుర్తుందీ అంటే, పదోక్లాసులో నాకు 'ఉత్తర గోగ్రహణం' పాఠ్యాంశం. స్కూల్లో తెలుగు మాస్టారు ఆ పాఠం ఎన్నోసార్లు చెప్పి ఉంటారు. కానీ అప్పుడు అర్థం కాని పాఠం, నర్తనశాల సినిమా చూడగానే అర్థమైపోయింది. అలా ఎందుకర్థమైపోయిందో, ఏమిటి కారణమో? నాలో నేను విశ్లేషించుకున్న సన్నివేశాలు తర్వాతి జీవితంలో కలిగాయి. తెలిసున్న ఎన్టీఆరే, పరిచయమున్న ఘంటసాలే. కానీ అక్కడ ఇంకా ఏదో ఉంది. బహుశా మాస్టారు కూడా అలాంటివి చెప్పలేరేమో! తర్కించుకుంటే సూక్ష్మం బోధపడింది. కవి పద్యం చదివే విధానం ఒకటి. స్కూల్లో పాఠం చెప్పే మాస్టారు చదివే విధానం ఒకటి, కవి సమ్మేళనాల విధానం ఇంకొకటి. రేడియోలో వినబడే విధానం మరొకటి, రంగస్థలం మీద నటుడు చదివే విధానం ఒకటి, ఇన్ని విధానాలకు విభిన్నమైన విధం ఒకటి తొలిసారిగా, నాకు నర్తనశాల సినిమాలో వినబడింది. బహుశా నాకు జ్ఞాపకమున్నంతలో పద్యం నాకు దగ్గరైన తొలి బీజం. నర్తనశాల సినిమాలోనే పడింది. తెలుగు పద్యం పలుకుబడికి, ఒక కొత్త ఒరవడిని దిద్దితీర్చిన అపురూప గాయకుడు ఘంటసాల. నాకు సంబంధించినంతవరకు నా విశ్లేషణలో నేను నిర్ణయంగా మార్చేసుకున్న నా తీర్మానం అది.

తెలుగు వాళ్ళ పద్యం చాలా సొగసైనది. మహాకవులు ఎందరో దాని సౌందర్యానికి నగిషీలు చెక్కి, రూపుకట్టించారు.



ఘంటసాల

అందమైన పద్యాన్ని అర్థవంతంగా పలికించిన సమర్థ గాయక శిరోమణి నిస్సందేహంగా ఘంటసాల మాత్రమే. కవి, కవిత్వంలో తన భావప్రకటనా పటిమతో, ఒక చిత్రాన్ని గీస్తాడు. అక్షరాలా దానికి ఆకృతి కల్పిస్తాడు. కవి తన పద్యానికి ఒక స్వభావాన్ని తొడుగుతాడు. సాధారణంగా గాయనీ గాయకులు పాటలోనో, పద్యంలోనో ఉండే పదాలను, పదబంధాలను స్వచ్ఛంగా పలుకుతూ, సర్వసహితంగా పాడతారు. ఒక్క ఘంటసాల మాత్రమే, కవి తన కవిత్వంలో పొదిగిన స్వభావాన్ని పాడతాడు. ఇది అధ్యయనంతో కాదు, జన్మతహా సంక్రమింపచేసుకున్న గంధర్వాంశ ఘంటసాల.

ఆనాటి కాలాన్ని అలా ఉంచితే, ఆధునిక కాలానికి సంబంధించినంత వరకు, అభినవ పోతనగా వినుతికెక్కిన మాన్యకవి, కరుణశ్రీగా తెలిసిన జంధ్యాల పాపయ్యశాస్త్రి. నవనీత సదృశంగా పద్యం చెప్పడంలో ఆయన కవికుల తిలకుడు. ఒకసారి ఆ మధుర కవి రసార్ద్రంగా ప్రాణప్రతిష్ట చేసిన కుంతీకుమారిని పరికించండి. కుంతీకుమారి పద్యాలు సాహిత్యంతో సంబంధం లేని సామాన్యులకు కూడా తెలుసు. దీనికి మూడు కారణాలు. ఒకటి భారతేతిహాసంలో ఆయువుపట్టులాంటి ఇంతి కుంతి. రెండు, కరుణశ్రీ ఆమెపై వ్రాసిన పద్యాలు అక్షరాలా కుంతికి పరిచయ పత్రాలు. మూడు, రమ్యమైన ఆ పదచిత్రంలో ఏ వర్ణమూ లోపించకుండా, ఘంటసాల ఒక స్వర చిత్రంగా మలచడం.

*"అది రమణీయ పుష్పవన - మావనమందొకమేడ - మేడపై*
*నది యొకమాఱు మూలగది - ఆ గది తల్పులు తీసి మెల్లగా*
*పదునయిదేండ్ల యీడుగల బాలిక - పోలిక రాచపిల్ల - జం*
*కొదవెడి కాళ్ళతోడ, దిగుచున్నది క్రిందకు మెట్ల మీదుగన్"*

ఇది భావచిత్రం కాదు. ఒక వర్ణచిత్రాన్నే కళ్ళకు కట్టించేశాడు కవి. ఆ చిత్రంలో నుంచి తొంగిచూసే దృశ్యాన్ని తన గొంతులో పలికించి, ఒక సమాంతర స్వరచిత్రాన్ని ఆవిష్కరించాడు ఘంటసాల. మేడ గది తలుపులు తీసి భయంభయంగా దిగుతున్న సుకుమారి రాచపిల్లను, మెట్లమీద నుంచి, తన మధుర స్వరంలోకి బదలాయించి, సుతిమెత్తగా క్రిందకు దింపినవాడు ఘంటసాల. పరిశీలనగా విని చూడండి, ఆమె దిగే దృశ్యం, ఆయన గొంతులోంచి కనిపిస్తుంది. కవిత్వం తెలియని వాళ్ళకి, కరుణశ్రీ తెలియనివాళ్ళకి కూడా ఆయనెవరో, ఎంతటి మహనీయ కవో తెలియచేసినవాడు ఘంటసాల. నామటుకు నాకు, ఘంటసాల పద్యం విన్న తర్వాతనే జంధ్యాల పాపయ్యశాస్త్రి గారి గురించి తెలిసింది. ఇంతకీ ఇక్కడ చెప్పదలచింది ఏమంటే, కవి అస్థిత్వాన్ని, కవిత్వం స్థితి, గతుల్ని తన గళమాధుర్యంతోనే ప్రకటించగల ఘనతను ఒక్క ఘంటసాలకు మాత్రమే ఆపాదించగలం.

ఘంటసాల లలిత భావయుక్తంగా ఆలపించి, విలపించకపోతే కరుణశ్రీ కవిత్వం ఎంతమందికి చేరేది?

పువ్వులు కవిత్వానికి కొత్తవి కావు. కానీ అవే పూలను కొత్తకోణంలో పరిచయం చేసినవాడు, తుంపివేస్తున్న పూల తొడిమల్లోని గుండె తడిని కరుణార్ద్రంగా ఆవిష్కరించినవాడు కరుణశ్రీ. మనిషిలో ఉండే కారుణ్యరాహిత్యమేమిటో, కరుణశ్రీ ఒక పద్యంలో ఆవిష్కరిస్తే, ఆ పద్యం ముందు తన గొంతును అద్దంలా పెట్టి ఘంటసాల భావ ప్రతిబింబాన్ని చూపాడు.

*"మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ*
*జీవితమెల్ల మీకయి త్యజించి, కృశించి, నశించి పోయె; మా*
*యౌవనమెల్ల కొల్లగొని ఆపయి చీపురు తోడ మ*
*మ్మావల పారబోతురు గదా! నరజాతికి నీతియున్నదా?"*

ఎవరికి వారుగా తమలోకి తాము చూసుకోవలసిన పద్యం ఇది. సరే, అసలు విషయమేమంటే, రెండవ పాదంలో 'మీకయి త్యజించి, కృశించి నశించిపోయె' అన్నచోట మూడు స్థితులున్నాయి. ఇలాంటి మూడు స్థితులుండేది పూలకు మాత్రమే. పువ్వును కొమ్మనుండి తుంపిన తర్వాత కూడ, కొన్ని గంటలసేపో, లేదా ఒక పూట పాటో, ఆ పువ్వు తాజాగానే కనిపిస్తుంది. ఆ తర్వాత వాడిపోయి నశిస్తుంది. మిగిలిన జీవజాలానికి అలభ్యమైన ఇటువంటి మూడు స్థితుల్ని, తన గొంతులో పలికించి, అనుభవపూర్వకంగా తెలియని ఆ స్థితిని, అనుభవ స్థితిలోకి తెచ్చిన ఒకే ఒక్క ఘనుడు ఘంటసాల. త్యజించి, కృశించి, నశించి అన్న మూడు మాటల్ని ఆయన పాడుతుంటే ఆ మూడు స్థితులు మన అనుభవంలోకి వస్తాయి. అలాగే పద్యం చివరలో ఒక మాటన్నాడు కవి. "నరజాతికి నీతియున్నదా!" ఈ మాటను ఘంటసాల ఎంత కరుణార్ద్రంగా పలికాడో, వివరించడానికి మాటలు సరిపోవు. ఆ ఘంటసాల గొంతు తప్ప. నీతి లేని నరజాతి మనస్ఫురణకు రాగానే, సన్నని ముల్లుతో, మన గుండె

కవాటంపైన గుచ్చుతున్నట్లుంటుంది. కరుణ లేని మన కర్కశత్వాన్ని రూపుకట్టి, మన కళ్ళముందే నిలుపుతుంది ఆ గంధర్వవాణి. మరొక సన్నివేశం గుర్తుకొస్తోంది. బహుశా 'శ్రీ కృష్ణార్జునయుద్ధం' సినిమా అనుకుంటాను. ఒకానొక సందర్భంలో శ్రీకృష్ణుడు, కోపగించి మూతిముడిచిన సత్యభామను ప్రసన్నం చేసుకొనే ప్రయత్నం చేస్తుంటాడు.

*"అలిగితివా సఖీ! ప్రియా!*
*అలకమానవా?"*

అంటూ సాగుతుంది పాట. అనునయం అన్న మాటకి, అర్థాలు నిఘంటువుల్లో వెతకాల్సిన పనిలేదు. ఘంటసాల పాడే తీరును వినిపిస్తే చాలు అనిపిస్తుంది. పాట ముగింపులో ఒక ప్రసిద్ధ పద్యాన్ని చేర్చారు.

"నను భవదీయ దాసుని, నెయ్యపు మనంబున కిన్కబూని" అని సాగుతుంది పద్యం. కోపాన్ని చాలించి, యథాస్థితికి రమ్మని వేడుకుంటూ చేసే అనునయం అనిర్వచనీయంగా ఉంటుంది ఘంటసాల గొంతులో. అంతేనా....

*".... మత్తనుపులకాగ్ర కంటక వితానముతాకి*
*నొచ్చునంచు నేననియెద..."*

అని పలికినపుడు, శ్రీకృష్ణుని దక్షిణ నాయకత్వమేమిటో, మనకి తెలిసేలా ఘంటసాల స్వరం సాక్ష్యం చెబుతుంది.

అలాగే 'పాండవ వనవాసం' సినిమా అనుకుంటాను. ద్యూతక్రీడలో విధివంచితులై పాండుకుమారులు సర్వం కోల్పోయాక, ద్రౌపదిని నిండు సభకు ఈడ్పించి, చీరలొల్చి పరాభవించి, ఇకనీ స్థానమిదని, దుర్యోధనుడు, ద్రౌపతికి తన తొడను చూపి సైగ చేసినపుడు, భీమసేనుడి ఉద్రేకం కట్టలు తెంచుకుంటుంది.

*"ధారుణి రాజ్య సంపద మదంబున, గోమలిఁ గృష్ణఁ జూచి రం*
*భోరునిజోరు దేశమున నుండగఁబిల్చిన యిద్దురాత్ము డు*
*ర్వారమదీయ బాహు పరివర్తిత చండగదాభిఘాత భ*
*గ్నోరుతరోరుఁ జేయుదు సుయోధను నుగ్రరణాంతరంబునన్"*

ఈ పద్యంలో భీమసేనుని గొంతుగా పలికే ఘంటసాల స్వరం రౌద్రరసానికి స్థాయీ భావంగా భాసిల్లే క్రోధం యొక్క ఔద్ధత్యం ఎలా ఉంటుందో, ఒక శ్రవ్య చిత్రంగా మలచి మన ముందు నిలుపుతుంది. ఈ పద్యం మనం ఎప్పుడు విన్నా శరీరం రోమాంచితమైపోతుంది. అనన్య సామాన్యమైన ప్రజ్ఞాపాటవాలను ఘంటసాల ప్రకటించిన సందర్భాలు జ్ఞాపకం చేసుకుంటూ ఉంటే, కెరటాల్లో వచ్చిపడుతున్నాయి. మరొక్కటి మాత్రం మనవి చేస్తాను.

*"మాణిక్య వీణా ముఫలాలయన్తీమ్, మదాలసామ్*
*మంజుల వాగ్విలాసామ్"*

మాతను స్తుతించే అమృత తుల్యమైన శ్లోకం. దీన్ని స్మరించకుండా ఘంటసాల జ్ఞాపకాలు సంపూర్ణం కావు. ఇదే శ్లోకాన్ని ఘంటసాల రెండు సందర్భాలలో పాడారు. ఒకటి 'మహాకవి కాళిదాసు' చిత్రంలో అక్కినేని నటించిన కాళిదాసు పాత్రకి, రెండు 'భట్టి విక్రమార్క' చిత్రంలో ఎన్.టి.ఆర్. నటించిన విక్రమార్కుని పాత్రకి. సందర్భోచితం, పాత్రోచితం అనే రెండు మాటలకి ఒకే సమాధానం ఇక్కడ ఘంటసాల గొంతే. ఒక వంక నట సమ్రాట్ అక్కినేని, మరొక వంక నటరత్న నందమూరి. ఘంటసాల ధ్వన్యనుకరణ చేసిన దాఖలాలు ఏమాత్రం లేవు. కానీ ఇద్దరు నటులు ప్రత్యేకంగా వినిపిస్తారు. వాళ్ళ గొంతుల్లోనే తన గొంతును అమర్చేయగల ప్రతిభాశాలి ఘంటసాల. అదలా ఉంచితే, ఒకచోట సాధారణ గొర్రెల కాపరి, అమ్మ దయతో మహాకవిగా మారిపోయిన ఉద్వేగం, మరొకచోట, అమ్మ వైశిష్ట్యాన్ని ఆసాంతం ఎరిగిన మహారాజు చేస్తున్న సంస్తుతిలోని భక్తిమాటున రాజసం. ఈ రెండు స్వభావాలను ఒకే శ్లోకంలో పలికించిన ఆ అమరగాయక మణికి, ఆ గంధర్వగ్రీవానికి ఎన్నని జోతలు చెప్పగలం.

లక్షలాదిమంది సామాన్య శ్రోతలను కూడా, నాలాగే పద్యప్రేమికులుగా మార్చేసిన ఒక స్వరవిరించి ఘంటసాల. ఈ సంగీతారాధకుడు, తన పాటలతో, పద్యాలతో వాగ్దేవికి స్వరనైవేద్యం చేశాడు. అలా నివేదన చేసిన ప్రసాదాన్నే మనం ఇప్పటికీ స్వీకరిస్తున్నాం. ఇక ముందు కాలానికి కూడా ఇంతే, మరో ఘంటసాల పుడతాడా? అంతటి పునీతుని స్వరసరిగమలు ముందు తరాలవారు విని, తరించేనా?




డా. వోలేటి పార్వతీశం
హైదరాబాదు. ఫోన్ : 944 003 1213

## మధుర కవితల స్రవంతి

# కరుణశ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రి

– ప్రొ. రావినూతల సత్యనారాయణ

**ప్రవేశిక :**

కాలప్రభావం వల్ల వార్థక్య లక్షణాలు కనిపించిన పద్య కవితకు సౌందర్య చికిత్స చేసి, నిత్య యవ్వనం కలిగించిన కవిబ్రహ్మ స్వర్గీయ పాపయ్య శాస్త్రిగారు. పాపయ్యశాస్త్రి అనే పేరుకంటే, కరుణశ్రీ అనే కలం పేరుతోనే వారు ప్రఖ్యాతులు. కరుణశ్రీ అని వినగానే, ఓ "రమణీయ పుష్పవనం – అందొక మేడ – మేడపై మారుమూల గది – ఆ గది తలుపులు తీసి మెల్లగా పదునైదేండ్ల బాలిక – పోలిక రాచ పిల్ల – జంకొదవెడి కాళ్ళ తోడ" – మెట్లమీది నుంచి క్రిందికి దిగివస్తున్నట్టి ఓ సుందరమైన దృశ్యము మన కళ్ళ ముందు మెదులుతుంది! పాపయ్యశాస్త్రిగారి కవిత ఆధునిక యుగంలో పద్య కవితా విద్యకు ఒక విజయ పతాక.

తెలుగు సాహిత్యంలోని ఉత్తమ కవితా సంప్రదాయాలను ఆత్మీయం చేసుకుని, నూతన కావ్యసృష్టి చేసిన మహాకవి కరుణశ్రీ పాపయ్యశాస్త్రి. వారి కవిత ఆబాలగోపాలాన్ని అలరింప చేయటానికి కారణం హృదయాలను ఆర్ద్రీభూతం చేసే కరుణారసపూరితమైన ఘట్టాలను ఇతివృత్తాలుగా స్వీకరించి, అందులోను తెలుగు వారికి అత్యంత ప్రియమైన పౌరాణిక కథలను, పౌరాణిక పాత్రలను గ్రహించి, ఆ పాత్రలలోని ఔచిత్యాన్ని అపోహలు లేని రీతిలో వ్యక్తీకరించి, పఠితల హృదయాలను మంత్రముగ్ధులను చేసే రచన పాటవాన్ని అనుసరించారు.

ఇతివృత్తాలు ప్రాచీనాలైనా, నిత్య పరిచిత పదజాలంతో తన స్వంతం చేసుకోవడం కరుణశ్రీ కలంలోని పాటవం! చిన్నచిన్న మాటలతో ఒక దృశ్యాన్ని కళ్ళకు కట్టే విధంగా చిత్రించడం ఆయన కథాకథన వైచిత్రిలో ఒక భాగం.

ప్రసన్నత, అక్షర రమ్యత, ఉద్యమాలు పాపయ్యశాస్త్రి గారి కవితలో పరాకాష్ఠనందుకున్నవి. శబ్దసముచ్చయాన్ని గురించి ముచ్చటిస్తూ "కొన్ని శబ్దాలు శిరీష కుసుమాలు, కొన్ని శబ్దాలు వజ్రకఠోరాలు; కొన్ని శబ్దాలు తరంగాలవలె పైకిలేస్తాయి; కొన్ని శబ్దాలు కురంగాలవలె ముందుకు దూకుతాయి; కిలకిల నవ్వే శబ్దాలు కొన్ని; మిసమిసలాడేవి కొన్ని; గుసగుసలాడేవి మరికొన్ని" అంటారు శాస్త్రిగారు!

సమకాలీన చరిత్ర కరుణశ్రీ హృదయాన్ని సదా స్పదింపజేసింది. అందుచేత ఆయన స్వీకరించిన ఇతివృత్తములు వివాదస్పదములైనప్పటికీ, విశ్వజనీనతను కోలుపోలేదు. ఆయన స్వీకరించిన శీర్షిక ఏదైనా కావచ్చు, దానిని కవితగా ప్రతిబింబించు ప్రతిభ ఆయనది. "అవతరించలేదు అనుభూతి లేకుండ, స్వచ్ఛమైన కవిత జగతియందు" పాపయ్యశాస్త్రిగారి ఖండకృతులన్నిటిలో చిత్తశుద్ధితో నిండిన అనుభూతి జీవనాడివలె స్పందించి చేతికందుతుంటుంది!

శాస్త్రిగారు మానవతావాది. ఆధునిక తెలుగు సాహిత్యంలో ఆవిర్భవించిన ఏ ఇజానికి లోనుకాకుండా మానవతకు మించిన నవత లేదని విశ్వసించిన మహాకవి ఆయన. పాకీపిల్ల నుండి పరమాత్ముని వరకు విశ్వంలోని ప్రతి వస్తువునూ కవితామయం చేశారు శాస్త్రిగారు. ఆయన కావ్యాలలోని దేశభక్తి, కవితలలోని వైవిధ్యం, జాతీయాభిమానం, కాలానుగుణమైన రాజకీయ, సాంఘిక సమస్యలు – వాటిని ఆయన వ్యక్తపరచిన తీరు, చెప్పుకోదగిన విషయాలు. తెలుగు వాఙ్మయ ప్రపంచంలో చిరస్థానమును కల్పించనది ఆయన కవితాశైలి. వాగార్థముల సాహితీ సాయుజ్యమునకు శ్రీ పాపయ్య శాస్త్రిగారి కవిత – తెలుగు భాషలో ఉజ్జ్వలోదాహరణము. క్లుప్తంగా, మధురంగా చెప్పడం

ఒక కళ – తేటగా సూటిగా వ్రాయడం ఒక శాస్త్రం. ఈ రెంటినీ ఆత్మీయం చేసుకొనిన కవి కరుణశ్రీ.

కరుణశ్రీ పాపయ్య శాస్త్రిగారి అద్భుతమైన కవితా ప్రస్థానాన్ని, వారి జీవిత వివరాలతో కూర్చి వివరించుటయే ఈ వ్యాసం యొక్క ప్రధానోద్దేశం. ఆ నా ప్రయత్నంలో నేను ఎంతవరకు కృతాకృత్యుడనైనదీ పాఠక మహాశయుల నిర్ణయానికి వదిలేస్తున్నాను.

**పాపయ్య శాస్త్రిగారి జీవిత విశేషాలు :**

జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు గుంటూరు జిల్లా, పెదనందిపాడు మండలం, కొప్పర్రు గ్రామంలో 1912 ఆగష్టు 4వ తేదిన జన్మించారు. వారి తల్లి తండ్రులు మహలక్ష్మమ్మ, పరదేశయ్య దంపతులు. పాపయ్య శాస్త్రిగారు ఆ దంపతులకు ఆరవ సంతానము. కడపటి సంతానము అయినందున తల్లిదండ్రులు ఆయనను అల్లారు ముద్దుగా పెంచారు. శాస్త్రిగారు జన్మించిన తర్వాత ఆయన కుటుంబం కాకుమాను సమీపంలోని కొమ్మూరు గ్రామంలో స్వగృహం నిర్మించుకుని అచ్చటికి తరలి వెళ్ళారు. కొమ్మూరులో ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసం జరిగింది. అటుతర్వాత పాపయ్యశాస్త్రికి సంస్కృత భాషపై మక్కువ పెరిగింది. అందువలన, భమిడిపాటి సుబ్రహ్మణ్యశర్మ, కుప్పా ఆంజనేయశాస్త్రుల వద్ద సంస్కృత కావ్యాలు అభ్యసించారు. తదుపరి రాష్ట్రభాషా, విశారదా, ఉభయ భాషాప్రవీణ, హిందిభాషాప్రవీణ పరీక్షలలో ఉత్తీర్ణులై అమరావతిలోని రామకృష్ణ విద్యాపీఠంలోను, గుంటూరు స్టాల్ గర్ల్స్ హైస్కూలులోను, ఆంధ్ర క్రైస్తవ కళాశాలలోను అధ్యాపకునిగా పనిచేశారు. 1972లో అధ్యాపక వృత్తి నుండి విరమణ పొందారు. క్రైస్తవ కళాశాల నుండి పదవీ విరమణ చేసిన తర్వాత శాస్త్రిగారు మహవీర కళాశాలలో ఆంధ్రశాఖాధ్యక్షునిగా మూడు సంవత్సరాలు, హిందు కళాశాల యజమాన్యం అభ్యర్థనమేరకు ఆ కళాశాలలో మరో రెండు సంవత్సరాలు పని చేశారు.

శాస్త్రిగారి ఉద్యోగ జీవితమూ, సాహిత్య కృషి, రచనా వ్యాసంగమూ ఏకకాలంలో అవినాభావ సంబంధంతో కొనసాగాయి. సాహిత్య శేఖరులు నండూరి రామకృష్ణమాచార్యులు కూడా అదే సమయంలో ఆంధ్రక్రైస్తవ కళాశాలలో ఉపన్యాసకులుగా ప్రవేశించారు. ఆనాటి నుండి కళాశాల వీరికి సాహిత్య వేదికగా మారింది. వారిద్దరి సాహిత్య మైత్రీబంధం అర్థశతాబ్దకాలం పాటు అవిచ్ఛిన్నంగా, ఆదర్శప్రాయంగా ముందుకు సాగింది.

పాపయ్య శాస్త్రిగారి తొలి కళత్రం విధివశాత్తు వివాహమైన రెండు సంవత్సరాల కాలానికే స్వర్గస్తురాలైనందువలన, 1938లో ప్రకాశం జిల్లా వేటపాలెం వాస్తవ్యులైన శ్రీ రావూరి వెంకటేశ్వర్లు గారి పుత్రిక అనసూయను వివాహమాడారు. వారికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె కలిగారు. ఆ కాలంలోనే తల్లావఝ్ఝల శివశంకర శాస్త్రిగారితో పరిచయం యేర్పడింది. కరుణశ్రీ, నండూరి, శ్రీ వావిలాల సోమయాజులు, ముగ్గురు ప్రతి దినం సాయం సమయాలలో శివశంకర శాస్త్రిగారి వద్ద సాహిత్య సమాలోచనలు జరుపుతూ ఉండేవారు. సంస్కృతాంధ్ర సాహిత్యాలలోని విభిన్నాంశాలపై ఆలోచనాత్మక చర్చలు జరిపేవారు.

**కరుణశ్రీ రచనా ప్రస్థానం :**

శాస్త్రిగారు వోపిదేవి గ్రామంలో సంస్కృత కావ్యాధ్యయనం చేయు సమయంలోనే, *పాకీపిల్ల అను పద్య ఖండికను రచించారు. ఆ కవిత గృహలక్ష్మి అనే పత్రికలో 1930లోనే ప్రచురితమైనది. అంటే, కాదేది కవితకనర్హం అన్న శ్రీశ్రీ ఉద్ఘాటనకు ముందే, దాని అనుచరణ కరుణశ్రీగారు ప్రారంభించారు!* ఈ కవితా ఖండిక ప్రకటన కాలం నాటికే పాపయ్యశాస్త్రిలో సామాజిక స్పృహ మేల్కొనడమే కాక, పేద, ధనిక తారతమ్యాన్ని శాస్త్రి హృదయం గుర్తించి ఆయనలో విశ్వమానవ ప్రేమకు అంకురార్పణ కావించింది.

1942వ సంవత్సరం, ఆంధ్ర క్రైస్తవ కళాశాల వార్షిక సంచిక (Magazine)లో పుష్పవిలాపం కవితా ఖండికను ప్రచురించారు శాస్త్రిగారు. అది తెలుగు సాహిత్య చరిత్రలోనే, ఒక అపూర్వమైన, సుకుమార భావ బంధురమైన రచన! ప్రకృతిలోని ప్రతి వస్తువుకూ, జీవం వుంటుందని, మనస్సు ఉంటుందని, దానిని బాధించరాదనే ఒక వినూత్న సందేశాన్ని ఈ కవితా ఖండిక ద్వారా తెలుగు జాతికి అందించారు మహాకవి. తన బాల్యమిత్రుడైన ఎ.ఎస్. కృష్ణ సహకార ప్రోత్సాహములతో, 1944లో ఉదయశ్రీ ప్రథమ భాగం, ఆంధ్ర పాఠక లోకానికి అందింది. కరుణశ్రీ కలం నుండి జాలువారిన అమృతమయాలైన దాదాపు 34 కవితా ఖండికలు ఇందులో చోటుచేసుకున్నాయి. అదే ఉదయశ్రీ ప్రథమ భాగం.

తర్వాత కాలంలో ఉదయశ్రీ ఖండ కావ్య సంపుటి అయిదు భాగాలలో పూర్తి చేశారు శాస్త్రిగారు. ప్రథమ ముద్రణ 1944లో నవ్యసాహిత్య పరిషత్తు పక్షాన ఆంధ్రుల కరకమలాల

నందుకొనిన ఉదయశ్రీ (50వ) స్వర్ణోత్సవ ముద్రణ పొందుట ఒక చరిత్రాత్మక సంఘటన. ఇంతటి అదృష్టానికి నోచుకున్న కావ్యాలు ఏ భాషాసాహిత్యాలలోనైనా అతిస్వల్పం అంటే అది ఏమాత్రం సత్య విదూరం కాదు!

1930 పాకీపిల్లతో మొదలైన కరుణశ్రీగారి రచనా వ్యాసంగం నిరతరంగా సాగింది. 80 సంవత్సరముల సుదీర్ఘ జీవిత కాలంలో శాస్త్రిగారి కలం నుండి వివిధ సాహిత్య ప్రక్రియలలో దాదాపు 82 రచనలు వెలుగు చూశాయి. అన్ని విధాల రచనలు పాఠకుల అభిమానాన్ని చూరగొన్నాయి. కరుణశ్రీ గారి రచనలన్నిటిలోని విశేషలను స్థూలంగా చర్చించినప్పటికీ, అది ఒక మహాగ్రంథంగా తయారవుతుంది! అందుచేత, శాస్త్రిగారి రచనలలో అత్యంత పేరు ప్రఖ్యాతులు గడించిన కొన్ని కావ్యాలలోని విశేషాలను గురించి మాత్రమే ఈ వ్యాసం ద్వారా చర్చించడమైనది. ఈ వ్యాసం ద్వారా కరుణశ్రీగారి సాహితీ మూర్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని కొంతమేరకైనా పాఠకుల ముందుంచగలిగితే, వ్యాసకర్త ప్రయత్నం సఫలమైనట్లు భావిస్తారు.

**కరుణశ్రీగారి ప్రఖ్యాత కావ్య త్రయం :**

పాపయ్య శాస్త్రిగారికి అత్యంత కీర్తి ప్రతిష్టలు ఆర్జించి పెట్టిన కావ్యత్రయం ఉదయశ్రీ, కరుణశ్రీ, మరియు విజయశ్రీ, శాస్త్రిగారు ఉదయశ్రీని తన హృదయంగాను, కరుణశ్రీని తన జీవితంగాను, విజయశ్రీని తన శిరస్సుగాను పరిగణించారు. అయినప్పటికీ, ఆయన ఖండ కావ్యాలలో ప్రత్యేకమైన స్థానాన్ని సంపాదించుకున్న కావ్యం ఉదయశ్రీ. ఉదయశ్రీ మొదటి భాగంలో అంజలి అనే కవితా ఖండిక మొదలుకొని నమస్తే అనే ఖండిక వరకు దాదాపు 34 కవితా ఖండికలు పొందుపరచబడ్డాయి. ఈ ఖండికలన్నీ దేనికదే తమ ప్రత్యేకతను చాటుతున్నాయి. "హృద్య పద్య రచనలో ఒక ప్రత్యేక మార్గానికి ఉదయశ్రీ ఖండకావ్య సంకలనం అమూల్యమైన ధృవతార"గా పేర్కొన్నారు డా. అమరేంద్రగారు. ఇందులోని కవితలన్నిటిలో వస్తువుకు ఎంతటి ప్రత్యేకత ఉందో దానిని వ్యక్తీకరించే పద్ధతికి కూడా అంత ప్రత్యేకత ఉంది.

కరుణామూర్తి, కరుణా కుమారి, కరుణామయి, పుష్పవిలాపము, కుంతీకుమారి, ఉర్మిళాకుమారి మొదలైన కవితా ఖండికలన్నీ విషాద గాంభీర్యానికి ఉదాహరణలై పఠితల మనసుల్లో చెరగని ముద్ర వేస్తాయి. పఠితలకు వస్తువుమీద సానుభూతిని కలిగించి కెథార్సిస్ (Catharsis)లాంటి అనుభవాన్ని కలిగిస్తాయి. గమనించండి–

*"ఇదియది" యంచు తేల్చి వచియింపగ రాని విషాద మేదియో*
*హృది గదిలించు చున్నది; దహింపసాగె నిరాశ శుష్కమౌ*
*బ్రతుకును; స్నిగ్ధ శీతల కృపారస ధారల, దుర్దినమ్మునే*
*సుదినము చేయరా! యదుకిశోర! కృశాంగి ననుగ్రహింపరా!*

విశ్వప్రేమ సిద్ధాంతం, మానవతావాదం ఉదయశ్రీ కవితాఖండికల రచనకు ఆధారం. ఇతరులను ప్రేమిచడంవల్ల మానవునికి నిరవధిక ఆనందం లభిస్తుంది. మనం ఒకరికి అందించే ప్రేమ మళ్ళీ మనకు ప్రేమను పంచి ఇస్తుంది. అనిర్వ్యాజమైన ప్రేమతత్త్వం ఉదయశ్రీలోని కవితల్లో మనకు సాక్షాత్కరిస్తుంది. ఈ విషయమై విశ్వప్రేమ అనే ఖండికలో చక్కగా వ్యక్తపరచారు శాస్త్రిగారు.

*"ఏ ప్రేమ మహిమచే నీ ధారుణీ చక్ర*
*మిరుసు లేకుండనే దిరుగుచుండు*
. . . . . . . . .
*"ఆ మహాప్రేమ – శాశ్వతమైన ప్రేమ*
*అద్భుత మఖండ మవ్యక్త మైనప్రేమ*
*నిండియున్నది బ్రహ్మాండ భాండమెల్ల*
*ప్రేయసీ! సృష్టి యంతయు ప్రేమమయము"*

పైన పేర్కొనిన పద్యం ఉదయశ్రీలోను, కరుణశ్రీలోను పేర్కొనబడింది. అంటే దానిలోని భావము శాస్త్రిగారు ఎంతగా విశ్వసించారో తెలుసుకోవచ్చు.

చారిత్రకంగా పౌరాణికంగా ప్రసిద్ధిచెందిన పాత్రలను కవితా వస్తువుగా స్వీకరించి కరుణా రసార్ద్రమైన హృదయ సౌకుమార్యాన్ని ప్రకటించారు శాస్త్రిగారు. సామాజిక చైతన్యమూ, జాతీయభావ ప్రబోధమూ, ప్రయోజనాలుగా పాత్ర ప్రధానమైన కుంతీకుమారి, ఊర్మిళాకుమారి, అనసూయాదేవి, సతీసావిత్రి మొదలైన కవితలు రచించడం ప్రశంసనీయం. కన్నపుత్రుని తాను నిర్దయతో విడిచి వచ్చిందన్న అపవాదును తొలిగించి, కుంతీపై సానుభూతిని నింపిన కవిత కుంతీకుమారి.

అలాగే పురాణాల్లో ఒక ఉపేక్షిత పాత్రగా మిగిలి పోయింది ఊర్మిళ. భర్త లక్ష్మణుడు రామునితో కలసి అరణ్యాలకు వెళ్ళిన తర్వాత, ఊర్మిళ అంతఃపురంలో భోగభాగ్యాలతో తులతూగిందన్న అపవాదును కరుణశ్రీ ఈ ఖండిక ద్వారా ఖండించారు.

*నలుగురు "నంగనాచి గహనాలకు కాంతుని గెంటి ఇంటిలో*
*కులుకుచు కూర్చున్న" దనుకొందు రటంచు రవంత యేని చిం*
*తిలకుము తల్లి! త్యాగమయదేవివి నీవని చరిత్రమే*
*తెలుపుచునుండె – లోకము హృదిన్ గదలించు సదా త్వదశ్రువుల్!*

అంటూ ఊర్మిళ త్యాగాన్ని ప్రశంసించారు. ఊర్మిళ ఒక విస్మృత పాత్రగా మిగిలిపోయిందన్న సత్యాన్ని స్మరింపజేసి, ఆమె అత్యంత త్యాగమయి అనే సానుభూతి కంపాలను పఠితల హృదయాలలో అంకురింపజేశారు.

ఉదయశ్రీ సంపుటిలోని కవితలన్నిటిలోను పఠితల హృదయాలలో చెరుగని ముద్రను వేసింది, అనేక పాఠకులకు కంఠోపాఠమైనదీ, పుష్పవిలాపం. కరుణారసానికి కనకాభిషేకం చేసిన మధుర కవిగా పుష్పవిలాపం ఖండికను తెలుగుజాతికి అందించారు శాస్త్రిగారు. పుష్పవిలాపం అనేటటువంటి భావనే శాస్త్రిగారి హృదయ సౌకుమార్యాన్ని వ్యక్తం చేస్తుంది. ఈ సృష్టిలో ప్రతిజీవిలోనూ, ప్రాణం ఉంటుంది. కాబట్టి ఎంతటి అల్పజీవినైనా హింసింపకూడదు. పువ్వులు మానవునికి అలంకారాలే కాదు, వాటికి సహితం హృదయం ఉంటుంది. భగవంతుని కృపచేత చెట్టుకొమ్మకు పూచిన పుష్పం తాను తిరిగి ప్రకృతిలోనే తాదాత్మ్యాన్ని పొందాలని ఆశిస్తుంది. కేవలం మానవుల విలాసం కోసం తాను వినియోగింపబడకూడదని భావిస్తుంది. ఆ భావనే పుష్పవిలాపం కవితా ఖండికకు ప్రాణం. పుష్పాన్ని కోయబోవునంతలోనే, పుష్పాలు జాలిగా నోళ్ళు విప్పి మాప్రాణం తీస్తావా? అని బావురమన్నాయనే భావన హృదయం వున్న ప్రతివ్యక్తినీ కదల్చి వేస్తుంది!

*మా వెలలేని ముగ్ధ సుకుమార సుగంధ మరంద మాధురీ*
*జీవితమెల్ల మీకయి త్యజించి కృశించి, నశించిపోయె, మా*
*యౌవనమెల్ల కొల్లగొని ఆపై చీపురితోడ చిమ్మి మ*
*మ్మావల పారవోతురుగదా నరజాతికి నీతి యున్నదా!*

అని పుష్పవిలాపాన్ని నిరుపమానమైన రీతిలో అద్భుతంగా వర్ణించారు కవి కరుణశ్రీ. శాస్త్రిగారి పద్యాలలో ఈ పద్యం ఒక ప్రత్యేకతను సంతరించుకొంది!

కరుణారస పూరితమైన పుష్పవిలాపం ఘంటశాల వెంకటేశ్వర రావుగారి మధుర గానంలో అజరామరమైన కీర్తినార్జించింది. తెలుగునాట ప్రతివ్యక్తి నాలుక మీద నాట్యం చేసింది. అలాగే కుంతీకుమారి కవితా ఖండిక సహితం వైశిష్ట్యాన్ని చాటుకుంది. పురాణ పాత్రలను గ్రహించి వాటిపై ఉన్న వైముఖ్యాన్ని తొలగించుటలో కరుణారసాన్ని ఆలంబనగా స్వీకరించారు మహాకవి పాపయ్య శాస్త్రిగారు. తెలుగు పలుకుబడి నిలిచి యున్నంత కాలం ఉదయశ్రీలోని కవితా ఖండికలు తెలుగు దేశమును, తెలుగు సాహిత్యమునూ కవితా శరజ్జ్యోత్స్నా సుకుమార సుందరసుషమా సుస్నిగ్ధములు చేయగలవని భావించారు డా. నండూరి కృష్ణమాచార్య. ఘంటసాలవారు తమ మధుర కంఠంతో ఉదయశ్రీ కావ్యంలోని అంజలి, అద్వైతమూర్తి, కుంతీకుమారి, పుష్పవిలాపం మొదలైన కవితా ఖండికలను శ్రావ్యంగా గానంచేసి ఈ కావ్యానికి విశ్వవిఖ్యాతి నార్జించి పెట్టారు.

**విజయశ్రీ :**

ఆంధ్ర సాహిత్య ప్రపంచంలో ప్రచురితమైన వీరరస ప్రధానమైన కావ్యలలో శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు రచించిన విజయశ్రీ ఖండకావ్యం పేర్కొనదగినది. విజయశ్రీ కావ్యాన్ని తన శిరస్సుగా పేర్కొన్నారు శాస్త్రిగారు.

ఎన్నిమారులు చదివినా తనివితీరని రచన మహాభారతం. అది కేవలం కౌరవ పాండవ ఇతిహాసం మాత్రమే కాదు. ధర్మశాస్త్రము, నీతిశాస్త్రమూ కూడాను. భారతగాథ అంతటిలోను ఉద్యోగపర్వంలో శ్రీకృష్ణ రాయబార ఘట్టమ్ముద్యాతి హృద్యమై మనమనస్సులను ఆనందంతో నింపుతుంది. కృష్ణరాయబారం విఫలమైనది. పాండవులు యుద్ధ సన్నద్ధులై సంగ్రామ రంగానికి తరలి పోవుటయే ఈ చిన్న కావ్యంలోని కథావస్తువు. ఏమంత గొప్ప విషయం కాదు. అయినప్పటికీ పాపయ్య శాస్త్రి యలంతి విషయాన్ని చేబట్టి చదివిన కొద్దీ చవులూరించి హృదయాన్ని రంజింపజేసే భవ్యమైన నవ్య కావ్యముగా తీర్చిదిద్దినారు! విన్నాణముతో అద్భుతమైన శిల్పం చూపి, మంత్రాలోచనం, స్కంధావారం, విషాదం, ప్రబోధం, విజృంభణం అనే అయిదు చక్కని రేకులుగా మలచి, సుమనోజ్ఞముగా ఈ దివ్య కావ్యకల్ప ప్రసూనమును రచించారు. ఈ కావ్యానికి సరితూగే ఖండకావ్యాలు తెలుగులో ఎక్కువ లేవంటే, అది ఎంతమాత్రం అతిశయోక్తి కాదు. ఈ కావ్యం చదవగానే, మన మనసుకు తగిలేది కవితల్లుటలో కరుణశ్రీగారికి గల చాతుర్యము. కథాకలితార్థ యుక్తిగల పదాలు ఏర్చి, కూర్చి రసజ్ఞుల ముందుంచారు చక్కని పద్యాల రూపంలో! ఇదిగో ఈపద్యం తిలకించండి!

*ఇమ్మన్నాడయిదూళ్ళు భీష్ముడు; గురుండేదో విధిన్ సంధి కా*
*నిమ్మన్నాడు, విచిత్రవీర్య తనయుం డేలా విరోధమ్ము పో*
*నిమ్మన్నాడటు మీద కర్ణుని మొగమీక్షించి పొందేమి పో*
*పొమ్మన్నాడు సుయోధనుం డనుగు తమ్ముల్ రొమ్ము లుబ్బింపగన్*

పైపద్యంలో భావం పదాలనే విధంగా ఆకట్టుతూ తరుముక పోయిందో ఆశ్చర్యం కదూ!

కావ్యంలోని ప్రతి పద్యమూ ఇదేరీతి కథనరీతిలో కుంటులేకుండా ఉద్వేగముతో నడిచింది. ఇందులోని మరోవిశేష మేమిటంటే, మనం సామాన్యంగా మాట్లాడుకొనే మాములు మాటలతోనే శక్తివంతమైన గొప్ప కవిత్వం చెప్పడం శాస్త్రిగారికి సహజ సిద్ధంగా అలవడిన ప్రజ్ఞ! కవి వాడిన అన్ని శబ్దాలు మనకు పరిచయమైనవే! తేలికవే! అయినా, భావాన్ని ఎంత స్ఫూర్తితో బలంగా మలచి మూర్తిమంతం చేస్తున్నాయో గమనించండి!

*ఆడుది ఏడ్చి తెచ్చుకొనినట్టి దయారక్ష ధర్మభిక్షకై*
*గూడలు క్రుంగి కుంతి కొడుకుల్ చెయిచాచుట యెగ్గుసిగ్గులన్*
*వీడుటకాదే? "దేహి" యని వేడుదురే పగవారి? నేడిటుల్*
*పాలొనర్చితిమిపో అమృతాంసు కుల ప్రతిష్ఠలన్!*

ఈ కావ్యంలోని మరోగుణం పద్యాలలోని హృద్యమైన శైలి. చూడండి!

*అంధుడు వృద్ధరాజట! మదాంధుడటే యువరాజు! రాజ సం*
*బంధులు ద్యూత బంధులటే మంచికి మార్గమికెట్లు? గాఢ గ*
*ర్వాంధ తమస్తమస్వినుల స్వార్థ పిశాచము గజ్జెగట్టగా*
*సంధిలునయ్య సంధి? కొనసాగునటయ్య నయప్రయత్నముల్?*

విజయశ్రీ కావ్యం వీరరస ప్రధానమైనది. సంధికార్యము విఫలమైనది. ఒక్క ధర్మరాజు తప్ప మిగిలిన వారందరూ కౌరవులమీద కారాలు, మిరియాలు నూరుతున్నారు! ధర్మరాజు మాత్రం గురుబంధు జన సంహారానికి సుముఖుడు కాదు. అయితే, "పరాభవానల దందహ్యమాన మానస" పాంచాలి తన పతులను ఉపాలంభించి, యుద్ధానికి పురికొల్పుతుంది. కృష్ణుడు కూడా దండోపాయం తప్ప మార్గాంతరంలేదని నిశ్చయించాడు. అందుచేత చివరికందరు యుద్ధానికే కృతనిశ్చయులయ్యారు. తగిన ప్రయత్నాలలో నిమగ్నులయ్యారు. ఈ వివరాలన్నీ మంత్రాలోచన ఘట్టంలో వర్ణితమైనవి. మంత్రాలోచనఘట్టం రసవంతములైన పద్యాలతో యెంతో హృద్యంగా ఉంది. ఇందులో పాంచాలి పాత్ర అతి విశిష్టమైనది. "ఆమె కోపోద్రిక్త అయి పతులను వెగటుగాను, వికటంగాను ఎత్తిపొడుస్తూ, ఆడత్రాచులాగా శౌర్యాగ్ని విస్ఫులింగాలు వెదజల్లుతూ బుసలు కొడుతుంది! ఆ స్వాధ్వి పలికే ఒక్కొక్క పలుకూ కాలకూట విషాన్ని వెదజల్లుతుంది" అంటారు శ్రీయుతులు మల్లంపల్లి సోమశేఖర శర్మగారు.

ఆమె హృదయోద్వేగమూ, ఉద్రేకమూ పరవళ్ళు త్రొక్కిన విధానం ఈ క్రింద ఉదహరించిన పద్యం వెల్లడిస్తుంది.

*భుజాగ్రముల్పొంగ పురోగమింతురో*
*ధ్వజాగ్రముల్వంగ తిరోగమింతురో*
*శరమ్ముల్దాల్చి పరాక్రమింతురో*
*కరమ్ముల్మోడ్చి పరిక్రమింతురో*

ఈ పద్యం చిత్రమైనది. అది చదువుతూ ఉంటే ఆ పాంచాలి హృదయంలోని భావోద్వేగ తరంగాలు ఒక దాని నొకటి తరుముకొని పోతూ ఉవ్వెత్తుగా లేస్తూపడుతూ లయబద్ధమైన ద్రుతగతిలో సాగిపోతున్నట్టు స్ఫురిస్తుంది మనకు. అదే కరుణశ్రీ కవి చాతుర్యము!

అలాగే ఈ ఎత్తిపొడుపు ఎంత నిష్ఠురమైనదో గమనించండి!

*త్యజింతురో క్షాత్రకుల ప్రతిష్ఠలన్!*
*భజింతురో శాత్రవ పాదపద్మముల్!*
*భుజింతురో కానల కందమూలముల్!*
*సృజింతురో తాత్త్విక ధర్మశాస్త్రముల్!*

ఒక విధంగా ఆలోచిస్తే, ద్రౌపది పలుకులు పాండవులకు మాత్రమేకాక, ఆ కాలంలో దాస్యశృంకలాల్లో బంధింపబడిన సమస్త భారతజాతికి మేలుకొలుపు సందేశంగా భావించాలి. పారతంత్ర్యంలో అణగారి పోయిన జాతిని, దేశాన్ని, తిరిగి ఉత్తేజ పరిచే ప్రబోధం చేశారు శాస్త్రిగారు విజయశ్రీ కావ్యం ద్వారా.

మహాభారత గ్రంథంలో శిఖర సదృశమైనది గీతాసందేశం. ఇది శ్రీకృష్ణుడు అర్జునునికి మాత్రమే బోధించిన గీత కాదు. సర్వమానవాళిని కర్తవ్యోన్ముఖులను చేసే దివ్యసందేశం. కర్తవ్యదీక్షను, స్వధర్మ నిర్వహణను ప్రపంచ మానవులకు ఉపదేశించింది. గీతాసందేశాన్ని ఆంధ్రీకరించడం ఒకవైపు, ఆంధ్రులకు భారత జాతీయతా భావాన్ని ప్రబోధించటం మరొకవైపు. ఈ రెండు మహత్తర ప్రయోజనాలు ఈ సన్నివేశంలో సాధింపబడ్డాయి. భగవద్గీతలోని భావం తప్పిపోకుండా తెలుగు వారికి దేశభక్తిని నూరిపోయటంలో ఆయన కృతాకృత్యులయ్యారు.

జీవితమే ఒక చిత్రమైన కురుక్షేత్రం. ఈ రంగంలో ఆస్తికి – నాస్తికి, శాంతికి – క్రాంతికి, ధర్మానికీ – అధర్మానికీ, న్యాయానికి – అన్యాయానికి అహరహమూ – అనుక్షణమూ – భయంకర సంగ్రామం జరుగుతూనే ఉంటుంది. ధర్మం జయిస్తుంది! విజయశ్రీలో నరుని విషాదయోగం వీరవ్రతంగా పరిణమిస్తుంది. సమకాలీన భారతీయ చరిత్రలోని గాంధేయవాదం, స్వాతంత్ర్యోద్యమం ఈ కావ్యంలో తాత్త్వికంగా ప్రతిఫలించాయి.

**కరుణశ్రీ (గౌతమబుద్ధ) కావ్యం :**

శాస్రిగారి కావ్య త్రయములో మూడవది కరుణశ్రీ కావ్యం. అంధకార బంధురమైన ప్రపంచంలో అహింసాజ్యోతి వెలిగించిన అమరమూర్తులు – బుద్ధభగవానుడు, క్రీస్తుప్రభువు, గాంధీమహాత్ముడు. అఖండమైన త్యాగంతో, అనన్య సామాన్యమైన ఆత్మార్పణంతో, అచంచలమైన కర్తవ్య దీక్షతో విశ్వాసాన్ని ప్రేరేపించిన త్రిమూర్తులు వారు. కరుణశ్రీ అన్నది ఈ కావ్యానికి సాంకేతిక నామం. కరుణశ్రీ అంటే బుద్ధుడని పాపయ్యశాస్త్రిగారి నిర్వచనం. కరుణామయుడైన బుద్ధభగవానుని జీవితం కనుక ఈ కావ్యానికి కరుణశ్రీ అని పేరు పెట్టడం జరిగింది. ఇందులో సిద్ధార్థుని ఆవిర్భావం మొదలుకొని ధర్మచక్ర ప్రవర్తనం వరకు బుద్ధుని జీవితం వర్ణించబడింది. హింసామయమై, ఈర్ష్యాద్వేషాలతో కలుషితమై, అస్తవ్యస్తంగా ఉన్న ఈ నాటి సమాజానికి బుద్ధదేవుని బోధలు అత్యావశ్యకాలని భావించి, ఈ కావ్య రచనకు పూనుకున్నారు పాపయ్య శాస్త్రిగారు.

ఈ కావ్యరచనకు స్ఫూర్తి తెలుగులో వచ్చిన తిరుపతి వెంకటకవుల బుద్ధచరిత్రము, పింగళి – కాటూరి వారి సౌందరనందము, మల్లంపల్లి సోమశేఖర శర్మగారి చారిత్రక వ్యాసములు; మరికొన్ని ఇతర రచనలు. డా. నందూరి రామకృష్ణమాచార్యులు అన్నట్లుగా ఈ కృతి అశ్వఘోషుని కావ్యానికి అనువాదముకాని, అనుసరణ కాని కాదు. తెలుగులో అవతరించిన పునఃసృష్టి! కరుణశ్రీ కావ్యం ప్రథమభాగం 1952లో వెలువడింది. మొదటిభాగం వెలువడిన 40 సంవత్సరాల తర్వాత 1992లో రెండవ భాగంతో కలసిన పూర్తికావ్యం ప్రచురితమైనది. కరుణశ్రీ పూర్తి కావ్యాన్ని డా. ఉండేల మాలకొండా రెడ్డిగారికి అంకితం చేశారు శాస్త్రిగారు. 1952–92 మధ్యకాలంలో కరుణశ్రీ మొదటిభాగం 25 పర్యాయాలు ముద్రింపబడి, రజతోత్సవాన్ని జరుపుకుంది! గౌతమబుద్ధ (కరుణశ్రీ) కావ్యం 43 ప్రకరణాలతో నిండిన కావ్య సంపుటి. ఇందులో ప్రతి ప్రకరణం అద్భుతమైన కవితాశైలిలో ముచ్చటైన పద్యాలతో పఠితల హృదయాల నాకర్షిస్తుంది. కావ్యము పునరాహ్వానము కవితా ఖండికతో మొదలై ధర్మచక్ర ప్రవర్తనముతో ముగుస్తుంది. శాస్త్రిగారి ధ్యేయం తథాగతుడు, గమ్యం తథాగతుడు! కనుకనే, కరుణశ్రీ పేరుతో బుద్ధభగవానుని జీవితచరిత్ర పరిపూర్ణంగా రూపొందించి సమాజానికి అందజేయుటయే తన పరమలక్ష్యంగా పరిగణించాడు ఆయన. కరుణ, అహింస, ప్రేమలతో మానవ సమాజం అంతా ప్రశాంతి నిలయంగా రూపొందాలన్న ఆశయం శాస్త్రి గారిది. పునరాహ్వానములో తొలి పద్యం తిలకించండి.

*దయసేయం గదవయ్య శాక్యమునిమునిచంద్రా! నీపద స్పర్శచే*
*గయి సేయ గదవయ్య భారత మహీఖండంబు దీవ్యత్కృపా*
*మయ మందార మరంద బిందులహరీ మందస్మితాలోకముల్*
*దయసేయం గదవయ్య మానవ మనస్తాపంబు చల్లారగన్*

అంటూ బుద్ధదేవుని ఈ లోకానికి పునరాహ్వానించారు శాస్స్రిగారు. ఏ ప్రకరణానికి ఆ ప్రకరణమే మధురాతి మధురమైన పద్యాలతో పఠితలను మురిపిస్తుంది. పాపయ్యశాస్త్రిగారు బుద్ధుని అవతారమూర్తిగా దర్శించారు. "మాయయ్య క్షిరాబ్ధిశాయియే గాకున్న" అనే పద్యంలో ఈ విషయాన్ని సూచించారు. "ఉపనిషత్తులలో ఉయ్యాలలూగే హంస వచ్చి లుంబినీ వనంలో వాలిందనీ, చిట్టితండ్రి రేపు శ్రీమహావిష్ణువై ముద్దులొలుకు పసిడి గద్దెనెక్కుతాడని సూచించడంలో సిద్ధార్థుడు శ్రీమహావిష్ణువు అవతారమేనని భావించారు" కవి. చిన్న వయసులోనే కపిలవస్తుపురాన్ని కలియజూస్తూ ప్రకృతి సౌందర్యాన్ని ఆస్వాదిస్తూనే, పరిసర ప్రాంతాలలోని ప్రజల కష్టాలను చూచి మనసు కరిగిపోయి కరుణార్ద్ర హృదయంతో తపించిపోతున్న అనుభూతిని, ఆందోళనను శాస్త్రిగారు అతిచక్కగా చిత్రించారు. అలాగే, రాజకులము వారికి ప్రాణరక్షణయే కర్తవ్యంగాని, ప్రాణభక్షణం కాదని దేవదత్తునికి నీతులు బోధించి, కలహంసకు ప్రాణభిక్ష పెట్టిన సంఘటనను శాస్త్రిగారు వర్ణించిన తీరు ప్రశంసనీయం.

గౌతముని దృష్టిని ఆధ్యాత్మిక చింతననుండి ఐహిక సుఖాల వైపు ఆకర్షించుటకై త్వరలో వివాహం జరిపించాలని నిర్ణయిస్తాడు మహారాజు శుద్ధోదనుడు పెద్దలనందరిని సంప్రతించి, అచిరకాలంలోనే యశోధర అనే రాజకుమారితో

గౌతముని వివాహం రాజలాంఛనాలతో వైభవంగా జరుగుతుంది. నూతన దంపతుల సౌకర్యార్థము మహారాజు మూడు సౌధాలను నిర్మించాడు. నూతన దాంపత్య సుమనోరథములు తీరుటకు కావలిసిన సరంజామా అంతా అమర్చబడింది! నవదంపతులైన యశోధరా గౌతములు సత్యంతో అహింసలా, శౌర్యంతో జయలక్ష్మిలా, సాహిత్యంతో రసధ్వనిలా జత కలిశారు. అయినప్పటికీ

*కమల పత్రమ్ముపై హిమకణము కరణి*
*శాక్యరాణ్ణందనుని మానస ప్రవృత్తి*
*అంటి అంటదు రాజ్యసౌఖ్యముల యందు*
*విశ్వకారుణ్య భావనావేశ వశత!*

శృంగారలీలలో మునిగిన యశోధర ఇలా అంటుంది గౌతమునితో

*రతినై నీ నవమన్మథాకృతి సమారాధింతు; కళ్యాణ భా*
*రతినై నీ చతురానన ప్రభలలో రాణింతు; కల్పంపు టా*
*రతినై నీ చరణాంబుజద్వయము నీరాజింతు; నానాథ! ఈ*
*బ్రతుకెల్లన్ విరజాజినై కదలి నీపై పూలు వర్షించెదన్.*

అనిన కౌగిలిలోని యశోధరతో గౌతముడు ప్రేమ తత్త్వాన్ని వివరిస్తాడు. ఆ పద్యాన్ని ఆస్వాదించండి!

*ఏ ప్రేమ మహిమచే నీ ధారుణీ చక్ర*
*మిరుసు లేకుండగనే తిరుగు చుండు / ... ... ...*
*ఆ మహాప్రేమ శాశ్వతమైన ప్రేమ*
*అద్భుత మఖండ మవ్యక్తమైన ప్రేమ*
*నిండియున్నది బ్రహ్మాండ భాండమెల్ల*
*ప్రియసఖీ! సృష్టియంతయు ప్రేమ మయము.*

అంటూ తన మనస్సులో జరుగుతున్న మథనను వివరిస్తాడు. కొంతకాలం గడుస్తుంది. ఇంతలో యశోధరకు రాహులుడు జన్మిస్తాడు. వాతావరణమంతా భోగభాగ్యాలకు అనుగుణ్యంగా ఉన్నప్పటికీ, గౌతముని మనసులోని మథన ఎక్కువయింది. అంతర్వాణి "ప్రేయసీ ప్రేమలోన కనిపించెడు తీయని స్వర్గ మొక్కటే నీజీవిత ధ్యేయము కాదు, లోకంలో దీనజనులు అనేక విధాల కష్టాలకు లోనై కుమిలి పోతున్నారు. బుద్ధుడవై, ధర్మోద్ధరణ కోసం బ్రతుకు సాగింపుము. మానవసంఘ సేవయే సిద్ధికి మార్గము" అని ప్రబోధిస్తుంది. యెవరో రమ్మని పిలిచినట్లు గౌతముడు వికలాత్ముడై, నిదురమాని యశోధర దగ్గరకు వెళ్తాడు. అర్థరాత్రి వేళ అచ్చటికి వచ్చిన గౌతముని చూచి, ఆశ్చర్యపడి ఆయనను అనునయంతో కారణమడుగుతుంది ఆమె. గౌతముడు యశోధరకు తన మనస్థితిని వివరిస్తాడు! యశోధర గౌతముని స్థితిని గ్రహించి, విశ్వకళ్యాణ యాత్రలో తను అడ్డురానని, రాత్రి ప్రొద్దు పోయిందని, పడుకోమని, అర్థించి శయన మందిరానికి చేరుస్తుంది. తర్వాత గౌతముడు యశోధరకు చెపితే వెళ్ళనివ్వదని మరుసటి రోజురాత్రి సారథి అయిన చెన్నుని రథము సిద్ధపరచి రమ్మని పిలిపించి, మహాభి నిష్క్రమణమునకు సాగిపోతాడు. చెన్నుడు తిరిగి వచ్చి గౌతముడు సన్యాసము స్వీకరించి, కాషాయ వస్త్రములతో తపస్సు నిమిత్తం వెళ్ళిపోయారని తెలియజేస్తాడు. ఆ వార్త తెలుసుకొని అంతఃపురములోని అందరూ చింతాక్రాంతులవుతారు.

కొంతకాలం గడుస్తుంది. శృతుల తత్త్వార్థాలను, సర్వశాస్త్ర పాండిత్యాన్ని సంపాదించి, పండితులను సేవించి, సిద్ధార్థుడు సర్వజ్ఞుడయ్యాడు. మమతానురాగాలను పరిత్యజించి, బ్రహ్మజ్ఞానంపొంది పరివ్రాజకుడయ్యాడు. జ్ఞానయోగసిద్ధి పొందాడు. అహింసా ప్రబోధము ప్రారంభించాడు. మగధ రాజ్యాన్ని ఆ కాలంలో బింబిసారుడు పరిపాలిస్తున్నాడు. సిద్ధార్థుడు ఆ రాజు యజ్ఞశాలకు వెళ్ళి మోక్షప్రాప్తి కోసం యజ్ఞశాలలో చేసే కర్మకాండను, జంతుబలిని నిరసించాడు. తన వాదనాపటిమతో మహారాజైన బింబిసారుని ఒప్పించి, యజ్ఞయాగాదులలో పశుబలిని ఆపుచేయిస్తాడు. తర్వాత కాలంలో బింబిసారుడు భిక్షువై బౌద్ధమతాన్ని స్వీకరించి, దేశమంతా వ్యాప్తి చెందుటకు అశేషకృషి చేశాడు.

జానపదాంగన అయిన సుజాత, సంతానం కోసం బుద్ధుని సమీపించి, వినయం, భక్తి, గౌరవంతో నిండిన పరిపూర్ణ మనసుతో స్వామిని అర్థించి, కనికరింపబడింది. ఆమెకు పుత్రోదయం కలిగింది. కృతజ్ఞతతో మధురాన్నముతో నిండినపాత్ర ఆయనకు సమర్పించింది. బుద్ధుడు ఆ పాయస పాత్రను గ్రహించి, అప్యాయంగా భుజిస్తాడు. అటుతర్వాత, మారుడు గౌతముని దీక్ష భగ్నం చేయుటకు రకరకాల ప్రయత్నములు చేసి విఫలుడవుతాడు. గౌతమునికి జ్ఞానోదయం అవుతుంది. సృష్టి రహస్యమంతా తేటతెల్ల మవుతుంది. శాక్యముని చంద్రుడు బుద్ధుడై సర్వార్థ సిద్ధుడవుతాడు! కపిలవస్తు పురానికి తిరిగి వెళ్తాడు. సిద్ధార్థుని పునరాగమన వార్త తెలుసుకొనిన రాజ కుటుంబీకులు,

పురజనులు ఆ మహామునిని సందర్శించుటకు అత్యంత ఆత్రుతతో యెదురు చూస్తారు! సిద్ధార్థునితో యెలా వ్యవహరించాలో యశోధర తనయుడైన రాహులినికి వివరించి చెప్తుంది!

*దూరాన నిల్చి కేల్దోయి మోడ్చువుగాని,*
*పరువెత్తి పోయి పైబడెదు సుమ్మ!*
*... ... ... / నాన్న మా నాన్న యని అమాంతముగ పరవ*
*శించి స్వామి కౌగలించెదవు సుమ్ము!*

అలా చేయవద్దని యశోధర ముందుగనే పిల్లవానికి తెలియ చెప్తుంది! సందర్శనము ప్రకరణములో ఎంతో హృద్యమైన పద్యాలలో చిత్రించారు పాపయ్య శాస్రిగారు. మచ్చుకు కొన్ని పద్యాలు ఆస్వాదించండి!

*ఖేద మోదాశ్రు మిశ్ర సంవేదనుండు*
*రాజు శుద్ధోదనుడు మునిరాజు గనె;*
*అతిశయ విషాదవతి ప్రజావతి విశీర?*
*మతి జగన్నుతుండగు ప్రియ సుతుని గాంచె.*
*... ... ...*
*"స్వామి"! యను మాట చెలినోట సగము గూడ*
*వెడలెనో లేదొ బాష్పముల్ వెడలె కనుల,*
*పతి "యశూ" యని పలికెనో పలుక లేదొ*
*సతి కరమ్ములు ప్రభు పాదాబ్జముల ముట్టె*
*... ... ...*
*రాలినవి ప్రేమమూర్తి నేత్రాల నుండి*
*అశ్రు బిందువులు రెండు ప్రేయసి శిరాన*
*కన్నతండ్రిని గన్న బంగారు తండ్రి*
*రాహులుడు కొంతవింత సంభ్రమము తోడ*
*తడబడచు పోయి స్వామి పాదములు కనుల*
*కద్దుకొనె; తండ్రి చేతులు ముద్దు గొనెను.*

అలాగే సమాగమము ప్రకరణము సహితము అత్యంత కరుణా మయంగా చిత్రితమైనది. యశోధరకు సిద్ధార్థునికి మధ్య జరిగిన సంభాషణ అతిమృదువైన పదజాలంతో కూడి, పఠితల హృదయాలను కదిలిస్తుంది. ఈ పద్యాన్ని గమనించండి!

*మంగళమూర్తి నీ రాక సమస్యవు; నిన్ను గ్రహింపలేని ము*
*గ్ధాంగన యీ యశోధర; దిగంతము లేలు దృగంతముల్ కళా*
*రంగము లయ్యె నా ప్రణయ రాగిణి కంచు దలంచినాను; నా*
*మంగళ సూత్రమే భువన మంగళ సూత్ర మటంచెరుగనే!*

అదే తరుణంలో నర్తకి అయిన ఆమ్రపాలి స్వచ్ఛమైన ప్రవృత్తితో బుద్ధుని ఆహ్వానించింది. ఆమె ఆహ్వానంపై, భిక్ష స్వీకరించడానికి వెళ్ళిన బుద్ధుని చూచి లోకులు పరిపరి విధాల భావించారు. అయినప్పటికీ బుద్ధుడు వారి మాటలకు భావాలకు లొంగక, ఆమ్రపాలిని అనుగ్రహించినందుకు ఆమె యెంతయో ఆనందించింది. ఆమ్రపాలి అపార భక్తిభావం, తన్మయత్వం, శ్రీచరణాలను శరణు కోరిన విధానం అతి చక్కగా ఆవిష్కరించారు మహాకవి శాస్త్రిగారు. అలాగే "ప్రతీకారము ప్రకరణలో దేవదత్తుడు బుద్ధుని హింసించి, వంచించి, ఆపదలకు లోను చేయుటకు అనేక ప్రయత్నాలు చేస్తాడు. అన్ని ప్రయత్నాలు విఫలమౌతాయి. చివరకు పశ్చాత్తాపంతో అతని మన్నన కోర్తాడు. బుద్ధుడు అతనిని మన్నిస్తాడు.

బుద్ధ భగవానుడు ధర్మచక్ర ప్రవర్తన చేయుచూ వివిధ ప్రాంతాలకు వెళ్తాడు. ప్రయాణిస్తుండగా మార్గంలో అంగులీమాలుడనే గజదొంగ ఆయనపై లంఘించి, ఆయనను చంపుటకు ప్రయత్నిస్తాడు. బుద్ధ భగవానుడితో ఉన్న శిష్య బృందమంతా భయపడి పరుగులెత్తుతారు.

కాని, బుద్ధుడు ఆ గజదొంగకు అబయహస్త మిచ్చి మందహాసం చేస్తాడు. బుద్ధ భగవానుని శక్తికి గజదొంగలో హృదయ పరివర్తన గల్గి, శిష్యునిగా మారిపోతాడు. కొన్ని వేలమంది చేతివేళ్ళు ఖండించి దండ గ్రుచ్చి మెడలో వేసుకొన్న అంగులీమాలుడు తాను పశ్చాత్తాపబడినా అతని ద్వేషం చల్లారదు. దానికి కారణమేమని బుద్ధుని అడుగుతాడు. ఆ ప్రశ్నకు బుద్ధభగవానుడు "హింస చేత హింస ఎప్పుడూ చల్లారదు, హింస ప్రేమ చేతనే శమిస్తుంది. అగ్ని చేత అగ్ని ఆరిపోదు. నీళ్ళు చల్లినంతనే చల్లబడుతుందని వివరిస్తాడు.

సమాజంలో ప్రేమ కొరవైన వారు బాధ్యతలు తెలియక అంగులీమాలునిగా తయారవుతారని సూచిస్తారు కవి కరుణశ్రీ ఈ ఉదతం ద్వారా!

కరుణశ్రీ మహాకావ్యం ధర్మచక్ర ప్రవర్తనముతో ముగుస్తుంది. ఇందులో బుద్ధుడు ఎన్నో ధర్మ ప్రబోధాలు చేశాడు. అందులో ముఖ్యమైనవి "ఆరోగ్యం పరమ భాగ్యం; సంతృప్తి పరమ ధనం; విశ్వాసమే పరమ సుఖం; కామాన్ని పోలిన అగ్నీ, ద్వేషం వంటి భూతం, మోహంతో సమానమైన వల, ఆశ వంటి మహాప్రవాహం లేవు". అదే విధంగా మంచి సంకల్పం, మంచి భాషణం, మంచి చర్య, మంచి జీవనం,

మంచి ప్రయత్నం, మంచి సంస్కృతి, మంచి దీక్ష అనేటటువంటి అష్టాంగ మార్గాలను అభ్యసిస్తే, దుఃఖం లేకుండా ప్రజలు శాశ్వతానందంతో అనంత సుఖాలు పొందుతారని ప్రబోధించాడు. ధర్మచక్ర పరివర్తనముతో బుద్ధుడు జగతికి ఇచ్చిన సందేశం:

*కరుణ శాంతినిచ్చు; కరుణ కాంతి నొసంగు;*
*కరుణ లేని నాడు ధరణి లేదు*
*కరుణ శుభము నిచ్చు; పరమ సౌఖ్యమునిచ్చు*
*కరుణ లేని నరుడు గడ్డి బొమ్మ.*

కరుణశ్రీ కావ్యంలో ప్రతి పద్యం మనోజ్ఞమై, సుందరమై, సుమధురమై కవితా నవమల్లికల పరిమళాలను ప్రసరింప జేస్తుంది. ఈ మహాకావ్యం పఠితల మనసుల్లో నిలిచి పోతుందనుట అతిశయోక్తి కాదు.

**అమర్‌ఖయ్యాం :**

11వ శతాబ్దంలో పారశీక భాషలో రుబాయతును రచించిన కవి ఉమర్‌ఖయ్యామ్. పూర్తి పేరు ఘియాత్ ఉద్దీన్ అబుల్ ఫతహ్ ఉమర్. ఎడ్వర్డ్ ఫిడ్జెరాల్డ్ దీనిని ఆంగ్లంలోకి అనువదించాడు. శాస్త్రిగారు రుబాయిలకు స్వేచ్ఛానువాదము చేశారు. రచయితకు ప్రాధాన్యమిస్తూ 142 పద్యాలతో ఉమర్‌ఖయ్యాము రుబాయతును అమర్ ఖయ్యాముగా రచించారు కరుణశ్రీ. ఇందులో మూడు విభాగములున్నవి.

మొదటిది ప్రణయిని, రెండవది ప్రపంచము, మూడవది పరమేశ్వరుడు. ఒకొక్క విభాగము నందు అనేక విషయాలు పాఠకుల దృష్టిని ఆకర్షిస్తాయి. ఖయ్యామ్ కవిత్వం ప్రతీకలతో కూడినది.

అదే విధంగా కరుణశ్రీగారి కావ్యము నందు కూడా ప్రతీకల ప్రాబల్యము కనిపిస్తుంది. ప్రణయిని ఖయ్యామ్ ప్రియురాలు, సాఖీ మధువు నందించెడు స్త్రీ. ఇది బహిరంగమైన లౌకిక అర్థము. అంటే, సామాన్యులకు తోచునది. అలా కాకుండా, ప్రతీకగా గ్రహించునప్పుడు జీవాత్మ ప్రతి ఫలించును. కొన్ని సమయాలలో భక్తి భావమే, ప్రతిఫలించును.

ఇచ్చట పరమేశ్వరుడు ప్రతీకలో ఒదగక, స్పష్టముగానే ప్రశస్తినందుకొనుచున్నాడు. ప్రణయినికీ, పరమేశ్వరునికి మధ్యనున్నది ప్రపంచము. అంటే, జీవాత్మ, పరమాత్మల నడుమ వంతెన వంటిది ప్రపంచం.

కరుణశ్రీ గారు ప్రణయిని చిత్రించిన విధం :

*రసమయివై, సదా హృదయ రంజనివై, యనురాగ పూర్ణవై,*
*కుసుమిత వల్లివై, మధుర కోమల హాసవిలాసరేఖవై,*
*అసదృశ సుప్రసన్న ముఖివై, సఖివై మురుపించు నిన్ను కై*
*వస మొనరించుకొంటి భగవంతుని చెంతకు చేరు కోర్కెతో.*

ఇందలి ప్రణయిని భక్తికి ప్రతీక. ఇందులోని ప్రతి విశేషమును ప్రణయినికి అన్వయించినట్లే భక్తికి సైతము అన్వయించును. ప్రణయిని భాగంలోనే జీవితము క్షణికమన్న విషయాన్ని చక్కగా నిరూపిస్తాడు కవి! గమనించండి –

*కాలము నిల్వబోదు క్షణకాలము; మృత్యువు చేతిలోని కూ*
*జాలము; నిలవజాలని నిజాలము; ఎప్పటి కేమొ చెప్పగా*
*జాలము; గాన ఎందుకింక జాలము? బాలకురంగ నేత్ర! నీ*
*వాలుగనుల్ తళుక్కుమన వంచుము శీధువు పాన పాత్రలో!*

అత్యంత మనోహరమైన పై పద్యం శబ్దశిల్పమునకు మణిప్రాయముగా గ్రహింప వచ్చును. పద్యంలో బరువైన పదమొక్కటి కూడా లేకపోవుట గమనార్హము. అమర్‌ఖయ్యామ్ కావ్యాన్ని గూర్చి చర్చిస్తూ "కరుణశ్రీ గారి ప్రసన్న మధురమైన కవిత నాలించు నప్పుడు శ్రోతలు తేనెసోనల నానుతున్నట్లు, మలయ పవన వీచికలలో తేలిపోవు చున్నట్లూ, నెయ్యపు కిన్కనొంది శాంతించిన తొయ్యలి బిగికౌగిట సాగియున్నట్లు మేనులు మరచి బ్రహ్మానంద లీనమానసు లగుదురు" అంటారు ఆచార్య దివాకర్ల వేంకటావధాని!

స్వర్గం ఇలా ఉంటుందని ఎవరూ చూచివచ్చిన వారులేరు. లేనిలోకం కోసం తపన పడటంకంటే చేతికి అందుబాటులో ఉన్న ఈ భూలోక స్వర్గాన్ని అనుభవించమంటూ

*ఏడ్చుచు పుట్టినా రెపుడొ! యేడ్చుచు పోదురు రేపు! సాటి వా*
*రేడ్చుదు రీర్ష్యతోడ; పెద యేడ్పుల సంత , జగమ్మిదంత; ఇ*
*ట్టేడ్చుచు మొండిబండ బ్రతుకీడ్చుట మంచిదొ! గోస్తనీ రస*
*మ్మోడ్చుక త్రావి కన్నులర మోడ్చుట మంచిదొ నిశ్చయింపుమా!*

అని ప్రేయసి మీద మక్కువ చూపిస్తూ, ఏడుస్తూ బ్రతకటంకంటే మద్యం తాగి కన్నులర మోడ్చడం మంచిదని భావించడం వెనుక మధువు అనే భగవదానుగ్రహాన్ని పొంది అరమోడ్పు కళ్ళతో ఆరాధనలో నిమగ్న మవటం మంచిదనే భావాన్ని వ్యక్త పరుస్తాడు కవిఖయ్యామ్. ఖయ్యామ్ తత్త్వాన్ని చక్కగా చిత్రించారు కరుణశ్రీగారు. జగన్నాటక సూత్రధారి లీలలు అనంతాలు. జీవితం అనే నాటక రంగస్థలం మీద మానవులు పాత్రధారులు. తమపాత్ర పోషణ అయిపోయాక

రంగస్థలం నుండి తెరవెనుకకు వెళ్ళిపోతారు. ఈ లోకం అనే రంగస్థలం మీద పాత్ర పోషణ సరిగ్గా చేయలేని పాత్రధారి భగవంతుని సహాయన్ని అర్థిస్తూ, చేయూత కోసం ఎదురు తెన్నులు చూస్తాడు. పైన పేర్కొనిన విషయాన్ని చక్కని పద్య రూపంలో వ్యక్త పరుస్తారు శాస్త్రిగారు. రసికుల హృదయ క్షేత్రాలలో దూరి ఆనంద సాంద్ర స్థితిని అక్షర రూపంలో అందించిన పాపయ్య శాస్త్రిగారికి అక్షర నీరాజనాలు.

పైన వివరించిన రచనలే గాక, మిక్కిలి వైవిధ్య భరితమైన రీతిలో అనేక సాహిత్య ప్రక్రియలను కరుణశ్రీగారు తెలుగు సాహిత్యానికి అందించారు. పద్య కావ్యాలు, గేయకావ్యాలు, నాటకాలు, నాటికలు, వచన కృతులు, నవలికలు, బాలల కథా సంపుటాలు, వ్యాఖ్యానాలు, ఆకాశవాణి గేయనాటికలు, సాహిత్య విమర్శ వ్యాసాలు, సమీక్షలు వీరి లేఖిని నుండి వెలువడి, తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేశాయి. కరుణశ్రీ సాహిత్యంపై విశ్వ విద్యాలయాల్లో విశేషమైన పరిశోధన సాగింది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, కాశీ హిందూ విశ్వవిద్యాలయం, ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి ఎమ్.ఫిల్., పిహెచ్.డి. సిద్ధాంత వ్యాసాలు వెలువడ్డాయి.

**కరుణశ్రీ సామాజిక స్పృహ :**

ఉత్తమ కవికి సామాజిక దృక్పథం ముఖ్య లక్షణమై ఉండాలి. ఆధునిక యుగంలో ప్రజల జీవన వైవిధ్యం విస్తృత మయింది. మానవ జీవితం అస్తవ్యస్తం కావటం ప్రారంభమైనది. కరుణా, ప్రేమ, సహజీవనం, సమతా దృష్టి మొదలైన గుణాలు లోపించ సాగాయి. అట్టి తరుణంలో సమాజ హితంకోసం, సమతా దృక్పథంకోసం కలం పట్టిన వారు శ్రీ జంధ్యాల పాపయ్య శాస్త్రిగారు. సర్వమానవ సౌభ్రాతృత్వం కరుణశ్రీ కవితా రచనకు లక్ష్యం. ఇక్కడ పుట్టిన ప్రతి వ్యక్తికీ స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని, కులమతాలు, సంఘ దురాచారాలు, మూఢవిశ్వాసాలు, దానికి అడ్డుగోడలు కారాదని పాపయ్య శాస్త్రి తన కవిత్వం ద్వారా ఆశించారు. ఆయన మానవతావాది. సమాజ పురోభివృద్ధికి వర్ణవ్యవస్థ, మూఢవిశ్వాసాలు ప్రతిబంధకాలనీ, వాటిని రూపుమాపాలని వారి లక్ష్యం. మనిషికి గుణం ప్రధానం కాని కులం కాదని ఆయన గాఢ విశ్వాసం. వర్ణవ్యవస్థను నిరసిస్తూ కరుణశ్రీ రచించిన కవితా ఖండిక తప్పులేని తమ్ముడు అనేకమంది ప్రశంసలనందుకొంది. ఆధునిక సమాజం సర్వతో ముఖాభివృద్ధిని పొందటానికి అవసరమైన సాంఘిక, రాజకీయ, మత, మానసిక స్థితి గతులన్నిటినీ తమ రచనల్లో చర్చించారు. మార్గోపదేశం చేశారు. సామాజిక సమస్యలపై కలాన్ని బాణంగా ప్రయోగించిన కవి కరుణశ్రీ.

విద్వత్‌కవి (విద్వత్కవి) శేషేంద్ర శర్మగారి మాటల్లో "కరుణశ్రీ భావకవితా యుగపు సంధ్యాకిరణం అఖిలాంధ్రావళి అధరాల మీద నర్తించే మధురాక్షర చక్రవర్తి. కవిత సంగీత, సాహిత్య మిధునావతారమని చూపించిన కావ్యతంత్ర సిద్ధుడు". ఇంతటి ప్రతిభాశాలికి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించక పోవుట విచారకరం!

ప్రొ. రావినూతల సత్యనారాయణ
హైదరాబాద్. ఫోన్ : 961 852 4702

---

వేదిక

పిల్లుట్ల హనుమంతరావుగారి స్వీయచరిత్రను మీరు అరుదైన పుస్తకంగా వర్ణించడం నాకెంతో సంతోషాన్ని కలింగించే విషయం. ఎందుకంటే ఆ పుస్తకం నా వద్ద కూడా ఉంది. అయితే, అది పుస్తక రూపంలో కాదు. ఒక వారపత్రికలో వారంవారం సీరియల్‌గా వచ్చినప్పుడు ఆ భాగాలను భద్రపరచిన పుస్తక రూపమిది.

మొక్కపాటి రామమూర్తిగారి ప్రస్తావన వచ్చింది కాబట్టి ఒక మాట. మన తెలుగునాట స్వేచ్ఛా ప్రణయానికి అంకురం వేయించింది, చలం అని కదా సాధారణ అభిప్రాయం. ఇటీవల అంటే, ఒక సంవత్సరంలోపు భీమునిపట్నం నుండి 'చలం ఇంకా...' అనే పుస్తకమొకటి నా చేతికి వచ్చింది. అందులో మొక్కపాటి రామమూర్తి ప్రస్తావన ఉంది. అతడు ఆత్మహత్య చేసుకున్న విషయం చలం దృష్టికి తెస్తే "నాకు రామమూర్తి సమాధివద్ద బిగ్గరగా నవ్వాలని ఉంద"ని చలం అన్నట్టు నేను చదివిన గుర్తు. ఇంకొక మాట కూడా ఏదో ఉంది. సరిగ్గా జ్ఞాపకం లేదు. కారణం ఆ పుస్తకాన్ని కాళీపట్నం రామారావుగారికి చదవమని పంపుతూ 'చలం నిర్వాకం' అనే పేరుతో చిన్న చీటీ వ్రాసి దానికి జతచేశాను. దానిని కా.రా. గారు చదివారో లేదో తెలియదు. కాని, ఆ పుస్తకం కథానిలయం పుస్తకాల్లో చేరిపోయింది. అందువల్ల ఆ పుస్తకంలో మొక్కపాటి రామమూర్తి ఆత్మహత్యపై చలం స్పందన ఏమిటీ అన్నది ఇప్పటికప్పుడు ఉన్నది ఉన్నట్లు చెప్పలేకపోతున్నాను.

- కణుగుల వేంకటరావు, శ్రీకాకుళం

# అక్షరాశ్రువులు

– సి. వేదవతి

*'పునరపి జననమ్ – పునరపి మరణమ్'*

జీవితం ఎంత సత్యమో మరణమూ అంతే సత్యం! ఈ భూమిమీద ప్రాణంపోసుకున్న ప్రతి జీవీ ఎప్పుడో ఒకసారి మరణించేదే! ఒద్దన్నా, కద్దన్నా, ఎప్పటికీ తప్పించుకోలేనిది మృత్యుశీతలస్పర్శ!

అవునా? ఈ మృత్యువు మాట ఎత్తుకొన్నప్పుడు ఆశ్చర్యం కలిగించే విషయం ఒకటి ఉంది!

ప్రపంచంలో అన్నిటికన్నా ఆశ్చర్యం కలిగించే విషయం ఏమిటయ్యా! అని అడిగాడు యక్షుడు చాటుమాటున దాక్కుని ఉండి!

"ఏమున్నదీ! రోజూ కోట్లాదిమంది జీవులు ఈ లోకాన్ని వదలి పరలోకానికి వెళుతూనే ఉంటారు. జీవించి ఉన్నవారు ఒకవైపున ఇదంతా చూస్తూనే ఉంటారు! అయినా, తాము మాత్రం ఇక్కడే స్థిరంగా ఉండాలని కోరుకొంటూ ఉంటారు! ఇంతకన్నా వింత మరేముంటుంది!" అని చెపుతాడు యమధర్మరాజు కొడుకు ధర్మరాజు!

తత్త్వశాస్త్రాలు తరచిన వేదాంతులకైనా మరణం గురించి రాజీపడటం కష్టమే అనిపిస్తుంది! ఆప్తులైన వారి మరణం తాత్కాలికంగానైనా క్రుంగ తీస్తుంది. ఇక జీవితం వృథా అన్నంత రసహీనం చేస్తుంది.

భౌతిక జీవితం ఒక ప్రయాణంవంటిదే! మన సహప్రయాణికులు హఠాత్తుగా ఎక్కడో ఒకచోట తమ గమ్యం వచ్చినట్లు ఆగిపోవడం మన అనుభవంలోకి వస్తుంటుంది. ఆ ఆగిపోయినవారు మనకు ఆప్తులైనవారయితే – అంతులేని వ్యధా, ఒంటరితనమూ ఆవరిస్తుంది. ఆ మరణం జీవితాన్ని పంచుకున్న సహచరులదే అయినప్పుడు – ఆ దుఃఖం మరీ గుండెలను తొలిచేదిగా ఉంటుంది.

మనిషికి స్మృతి అనేది నిజంగా ఒక వరం, మరొక విధంగా శాపమున్నూ అనిపిస్తుంది! అవి మధురస్మృతులైతే – మనసును మురిపించి చలువ చేస్తాయి! విషాదస్మృతులే అయితే – మనస్సును వేగించి మరిగిస్తుంటాయి!

'భరించరాని శోకం ఒక్కొక్కసారి మూగపోతుంది!
మరొక్కమారు అక్షరాశ్రువు అయిపోతుంది!
ఊపి ఊపి మనసున ఒక్కొక్క వేదన
కావ్యమౌను మరియు గానమౌను–'
అంటాడు వేదనా నాదం ఎరిగిన కృష్ణశాస్త్రి!

ఇట్లా – మనసును ఊపివేసిన మహా శోకం నుంచీ కొన్ని గొప్ప కావ్యాలు పుట్టుకువచ్చాయి!

అర్జున విషాదయోగం కారణంగానే భగవద్గీత ఆవిర్భవించింది! క్రౌంచ మిథున వియోగ జనిత శోకం నుంచీ రామాయణ కావ్యానికి నాందీ శ్లోకం ఉద్భవించింది!

అది తన శోకమైనా, ఇతరుల శోకమైనా తాపహరంగా, సహానుభూతి సూచకంగా పుట్టుకువచ్చిన మహాకావ్యాలు! వేదన నుంచీ పుట్టిన వేదనాదాలు అవి!

స్మృతి రచనకు వియోగ విషాదమే భూమిక!

లోకంలో మహా పురుషులు – దేశ నాయకులు గతిస్తారు. అప్పుడు కలిగే దిగ్భ్రాంతి, విషాదం ప్రజలందరిదీని!

ఇది సమష్టి దుఃఖం! దేశమంతా ఏకమై ప్రతిస్పందించి విషాదంలో మునిగిపోవడం అది!

రక్తసంబంధం కలిగినవారూ, ఆప్తులైనవారూ వెళ్ళిపోయినప్పుడు కలిగేది వైయక్తిక దుఃఖం! ఇది ఎవరికి వారు ఒంటరిగా అనుభవించవలసిన దుఃఖం!

ఈ రెండు రకాల దుఃఖాలకూ స్పందిస్తాడు కవి అయినవాడు! ఏదో ఒక కావ్యం వెలయిస్తాడు – ఆ దుఃఖభారంతోనే!

వెళ్ళిపోయినవాళ్ళని గురించి తలచుకొని శోకించటం రాజులకైనా, సామాన్యులకైనా తప్పని అనుభవం!

రామాయణంలో దశరథుడు చనిపోతే, వాలి చనిపోతే, మండోదరి విలపిస్తుంటే – భారతంలో అభిమన్యుడు చనిపోతే, యుద్ధంలో కౌరవులందరూ చనిపోతే – ఎన్నెన్ని విషాదమయ

ఘట్టాలు! ఎన్నెన్ని శోక వర్ణనలు!

అవతార పురుషుడూ, ఆదిమధ్యాంత రహితుడూ అనుకొన్న కృష్ణుడే తనువు చాలించినప్పుడు–

"మన సారథి, మన సచివుడు, మన వియ్యము, మన సఖుడు – మన బాంధవుడు మనలను విడిచిపెట్టి వెళ్ళిపోయాడు అన్నా! అంటూ ఆపుకోలేని దుఃఖంతో వివశుడవుతాడు అర్జునుడు!

భారతంలో కపోత కథ ఎంత కరుణాత్మకంగా ఉంటుంది! చిన్న ముచ్చటైన పావురాళ్ళ జంట! భార్య ఏదో తిండి ఏరుకువద్దామని బయటకు వెళ్ళింది. గాలి వానలో ఎటు కొట్టుకుపోయిందో తెలియలేదు! గూటిలో పిల్లలను కాచుకుని ఉన్న మగపిట్ట ప్రాణాలు పైకి ఎగిరిపోతున్నాయి!

ఎక్కడ ఉన్నదో! ఆవిడ ఎట్లా ఉన్నదో! నన్ను వదలి ఇంతసేపు ఎక్కడా ఉండలేదే! ఆమె లేకపోతే ఇంక నాకీ బ్రతుకెందుకు! ఆమె లేని ఈ గూడు పాడుపడిపోయినట్లున్నదే! అని పరిపరివిధాల దుఃఖిస్తున్నది కపోతం!

అయితే – ఇటువంటి వియోగదుఃఖ వర్ణనం కవి పాత్రపరంగా చేస్తున్నాడు. పాత్రలో తాను పరకాయ ప్రవేశం చేసి వర్ణిస్తున్నాడు!

ఇటువంటివి – స్మృతి రేఖలను – ఇముడ్చుకొన్న కావ్యగత వర్ణనలు – మన కావ్యాలలో ఎన్నో కనిపిస్తాయి, పాత్ర మనోధర్మాన్ని చెప్పడంలోనూ కవి కొంత వ్యాకులతను అనుభవించక తప్పదేమో!

వైయక్తికమైన అనుభవాలతో తీవ్రంగా గుండె గాయపడినప్పుడు కవి స్వయంగానే పలుకుతాడు విషాదగీతం:

"కాశికా విశ్వేశు గలసె రత్నాంబరము లే రాయ డిచ్చు!"

అంటూ గద్గదంగా స్మరిస్తున్నాడు శ్రీనాథుడు – తనకు కస్తూరినీ, హేమపాత్రనీ, దినవెచ్చాన్నీ ఇచ్చిన మహామంత్రులనూ రాజులనూ!

"ఎదురైనచో మదకరీంద్రము డిగ్గి కేలూతయొసగి యెక్కించుకొనియె"–

కృష్ణదేవరాయలవారు స్వర్గానికి చేరుకొన్నప్పుడు పెద్దనగారు దుఃఖిస్తూ పద్యం చెప్పారు.

ఇవి ఇప్పటికీ స్మృతి సాహిత్యంలో నిలచిపోయిన పద్యాలే!

*ఆధునికకాలంలో ఆంగ్లంలోనే ఎక్కువగా స్మృతిరచనలు వెలిశాయేమో! ఇంగ్లీషు భాషా జ్ఞానంతో మనమీద ఆంగ్ల సాహిత్య ప్రభావంపడ్డ వైనాలు ఎక్కువగానే కనిపిస్తాయి!*

*ఆంగ్లంలో అయితే ఎలిజీ అంటారు! తెలుగు మనం స్మృతి కావ్యాలు అంటున్నాం!*

మనవాళ్లూ ఎన్నో సందర్భాలలో వ్రాసిన స్మృతికి సంబంధించిన కావ్యాలు చాలానే ఉన్నాయి.

ఈ వ్రాసిన కవులందరూ పరమాప్తులయినవాళ్ళు ఎవరో ఒకరు పరమపదించి దుఃఖోద్వేగాన్ని రగిలించినప్పుడే కలం పట్టినవాళ్ళు! దుఃఖాశ్రువుల్ని రుధిరాశ్రువులుగా మార్చి, అందులో కలం ముంచి వ్రాసినవాళ్ళు!

నిజమే! ఇది ఆ కవులకు మాత్రమే సంభవించిన విషాదం!

అయితే అతడు కవి! దుఃఖమైనా, ఆనందమైనా, అణచుకోలేని భావతీవ్రత అతనిది! దానిని అక్షరంలో ఒదిగించాలి! ఇతరులకూ ఆ అనుభవాన్ని రుచి చూపించాలి?

అందువల్ల ఏమిటయ్యా ఎవరికైనా లాభం?

తనలో తానే ఏడవక ఇతరులకూ ఇంత ఏడుపు ఎందుకూ పంచిపెట్టడం?

కవి ఏడుపు ఎప్పుడయితే అక్షరాలకెక్కిందో – అప్పుడు అది అందరినీ కదిలించే వస్తువయింది! సుఖం, దుఃఖం నుంచీ వచ్చే అనుభూతి సర్వస్వం మనిషి జాతి అంతటిదీ! ఒక మనిషినుంచీ ఆ అనుభూతిని మరొకరు అందుకోవటంలో అది సమష్టి వ్యవహారమైపోయింది! సహానుభూతి యోగమయిపోయింది!

"రాత్రివేళ చంద్రుడు లేకపోయినా, నక్షత్రాల వెలుగు కొంత ఉండి ఆకాశం తెలుస్తుంది! నీవు లేకపోతే దీపమే ఆరిపోయి – నా బ్రతుకు పూర్తిగా చీకటి అయిపోయింది!" అంటాడు వడ్డాది సుబ్బరాయ కవి – తన జీవితాన్ని పంచుకొన్న ఇల్లాలు మలిగిపోయినప్పుడు!

*నా విరులతోట పెంచికొన్నాడ నొక్క*
*పవడపు గులాబి మొక్క నా ప్రణయ జీవ*
*నమ్ము వర్షమ్ముగా ననయమ్ము కురిసి!*

ప్రణయ వనంలో విరిసిన ఆ గులాబి పువ్వుకు ఒక్క క్రూరార్క కిరణం సోకి సోలి తూలి – తనను వీడిపోయిందని విలపిస్తాడు – వియోగ దుఃఖితుడు కృష్ణశాస్త్రి.

విశ్వనాథకూ భార్య గతించినప్పుడు గుండె చితాభస్మం అయింది! ఆ భస్మరాశి నుంచీ ఉద్భవమైంది – వరలక్ష్మీ త్రిశతి అన్న పద్య కావ్యం!

మహాకవి అయితేనేమి – కవి సమ్రాట్టు అయితేనేమి

– అతడు మనిషి! మనిషి వెనుక ఉండే ఆత్మబలం ఆమె! ఆమె గేస్తురాలు, నేస్తురాలు. ఆమె ఉంటేనే కవిత్వానికైనా జీవితానికైనా ప్రేరణ!

*"నా యఖిల ప్రశస్త కవనంబున కాయమ పట్టభద్రురాలు*
*ఆయమ లేక యాధునికమైన మదున్నత చిత్తవృత్తి లేదు"*

విశ్వనాథ వాక్కులో ఇది సతీస్మృతి–

ప్రసిద్ధ కవులు చాలామందికి భార్యలు గతించడం ఎందుచేతనో వారిచేత దుఃఖకలశాలవంటి స్మృతికావ్యాలు వ్రాయించడంకోసమా? అనిపిస్తుంది ఒక్కొక్కసారి!

*గాజులును మెట్టెలెవరివో ఘల్లుమనిన*
*తెలియకుండనె కన్నులు తిరిగిచూచు*
*అంత దారుణ యథార్థ మాత్మమెరవ*
*గుండె జల్లను, నిట్టూర్పు మెండుకొనును!*

అంటూ కలవరపడిపోతాడు దువ్వూరి!

అంతేనా? తన మనస్సును దొంగిలించినట్లుగానే – ఈ స్మృతిని కూడా హరింపచేయుమని కనుమరుగైన సతిని వేడుకొంటున్నాడు!

మాతృమరణ దుఃఖం నాయని సుబ్బారావుచేత చిన్న కావ్యమే వ్రాయించింది! ఎవ్వరా నిర్దయ స్వాంతుడు? నన్ను తల్లి లేని బిడ్డను చేసినవాడు? ఎవ్వడా క్రూరకర్మరుడు? నట్టింట దీపం ఆర్పినవాడు?

అంటూ హుంకరించేట్లు కూడా చేస్తుంది ఆ ప్రథమ దుఃఖోద్వేగం! కన్న కొడుకు కళ్ళముందే బూడిద అయితే, తండ్రి – నాయని – మరో స్మృతికావ్యంలో–

*పోయిన సూర్యుండు వచ్చు – పోయిన తారకల్ వచ్చు*
*పోయిన మోహనా! వినయభూషణా! తిరిగిరావేమి?*

అంటూ విలపిస్తాడు – బసవరాజు అప్పారావుకు కూడా తన చిన్నబిడ్డ నక్షత్రాల్లో కలిసిపోయి దుఃఖం కలిగించింది!

*నా మంగళప్రదా నా చిన్నతల్లి*
*మరువలేదే నిన్ను మా కన్నతల్లి!*

–అంటూ పాడుకుంటేకాని కడుపుకోత కొంత అణగారదు!

*ఇరువది సంవత్సరాలహరహంబు*
*తోడునీడగ మెలగి యీనాడు కన్ను*
*మూసి మరపించి దోబూచి చేసిపోతి*
*వెదకి వెదకిన గానరావింక నాకు!*

–ఇది పింగళివారి పరివేదన! సతీసంస్మరణ!

కన్నుల వెన్నెలగా చిన్న పాపాయి పుట్టింది! నట్టింట్లో రత్నమాణిక్యం లాగు తిరిగి ఆడుకునే పిల్ల ఉన్నట్లుండి మట్టి ఒడిలోకి వెళ్ళిపోయింది. మూడేళ్ళు నిండకుండానే మురిపాలన్నీ తీర్చుకుని వెళ్ళిపోయిన పాపాయి పేరు మాంచాల! ఆ పేరు పెట్టుకుని పొంగిపోయిన పితృ హృదయం దుఃఖంతో చెరువైపోతే – 'తల్లికాన' – 'కడుపుచిచ్చు' – అనే ఖండికలు పుట్టాయి! ఆ తండ్రి ఏటుకూరి వెంకట నరసయ్య. ఆయన కవిత్వం హృదయ స్పర్శకం!

వయస్సు ముంచుకు రాకముందే జీవితేశ్వరి తొందరపడి వెళ్ళిపోయింది!

'నిండీ నిండని జవ్వనంపు సిరితో నిర్భాగ్యతా పూర్ణమై'

బూటకపు బ్రతుకు సాగించి – నన్నిట్లా మండీమండని మొండిని చేశావు కదా!

తుమ్మల వారి దుఃఖోద్వేగం ఇది!

ఎక్కడినుంచో పనసపండుల్లాగ దిగివస్తారు పాపాయిలు. బోసినవ్వులతో తప్పటడుగులతో, తొక్కుపలుకులతో ఇంటిని నందనవనం చేస్తారు! పంపించిన పరమాత్ముడికే మోజు పెరుగుతుందేమో! కొందరిని తనవద్దకే పిలుచుకొంటాడు!

*కాపురమొచ్చిన కన్ని పాపాయి*
*ఇల్లు ఖాళీ చేసి వెళ్ళిపోయాడు!*

బసవరాజు అప్పారావు పసికొడుకు ఖాళీ చేసి వెళ్ళిపోయింది ఇల్లు కాదు – గుండె గూడు!

పుత్ర వియోగం రాయప్రోలుకూ తప్పలేదు. నందా! – అన్న ఖండిక వ్రాయడం – అతడు కవిగా కొంత ఉపశాంతి పొందడానికే!

అప్పటివరకూ తోడుగా బ్రతికి – ఒక్కసారిగా జోడు కరువైపోతే! చూస్తుండగానే హంస ఎగిరిపోయింది! లోలోపలకు కుంచించుకుపోతూ అంటాడు కుందుర్తి–

*తోడులేని ఒంటరిగాణ్ణి*
*తొంగి చూస్తే భయంగా ఉంది–*

నిస్సహాయత కమ్ముకున్న కవి భయస్థుడైపోయి నిర్వేదిస్తున్నాడు–

*ఇన్నేళ్ళ సాహచర్య ధమని*
*లోపల ఎందుకు తెగిందో తెలీదు.*
*ఇంత పెద్ద నెత్తురు ముద్దై కాలం*
*ఎర్రగా నన్నెందుకు చూస్తుందో తెలీదు!*

ఆమె నిష్క్రమణవేళ ప్రళయంగా అనిపించింది అంటూ

గుండెకు తగిలిన మాతకు కావ్యరూపం ఇచ్చుకొన్నాడు తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు!

గుండెలోనే ఇల్లు కట్టుకు ఆమె కూర్చుని ఉండగా ఆమె లేదనే మాట ఎట్లా నమ్మటం! అంటాడు కామేశ్వరి స్మృతికావ్యంలో కలపటపు రామగోపాలరావు!

కవితాక్షేత్రంలో పుట్టి, కవితా రసామృతంతోనే ప్రాణం పోసుకొని జీవించే కవితాగత ప్రాణికయినా, వెన్నుదన్నుగా వెనుక ఆమె నిలచి ఉంటేనే మనుగడ! ఆమె ఆలంబన పుటుక్కున తెగిన క్షణం తన ప్రాణసంధులన్నీ విడిలిపోయాయనీ, తన కవిత్వవీణ మూగపోయిందనీ చెప్పుకుని దుఃఖిస్తున్నాడు జాషువా!

*నీవటు కాటిదక్కు పయనించిననాటి మరుక్షణాన స*
*ర్వావయవ సంధి బంధనములన్నియు వీడె, కవిత్వ భారతీ*
*దేవత మూగపోయె, సుదతీమణీ నాదు కళా స్రవంతియున్*
*నీ వెనుకన్ శ్మశానధరణిన్ నిదురించినదో! సతీమణీ!*

ప్రేమాభిమానాలు పెంచుకోవటానికి అయినవారే కానక్కరలేదు! మిత్రులూ ఉంటారు! ఒకానొక ఓజస్సుతో దేశాన్ని ముందుకు నడిపే నేతలు జనం గుండెల్లో పీఠం వేసుకు కూర్చుంటారు!

నెహ్రూ కన్నుమూస్తే చాలామంది భారతీయులకు భవిష్యత్తు శూన్యం అనిపించిన మాట నిజం!

*ఈవేళ పువ్వులన్నీ వాడిపోయిన రోజు*
*ఏకాంతంలో భూమి ధృవగళాలెత్తి ఏడ్చిన రోజు*
*ప్రిన్స్ ఛార్మింగ్ డార్లింగ్ ఆఫ్ ది మిలియన్స్ వెళ్ళిపోతున్నాడు!*

–తిలక్ పాడిన దుఃఖగీతం గుండెల్ని చీల్చుకొంటూ వచ్చిన ఆర్తనాదం! కొంపెల్ల జనార్ధనరావు అంటే ఎంతో ఇష్టం శ్రీశ్రీకి! మిత్రుడికి కావ్యాన్ని ఇస్తూ కన్నీళ్ళు పెట్టాడు!

*తలవంచుకు వెళ్ళిపోయావా నేస్తం*
*సెలవంటూ ఈ లోకాన్ని వదలి*
*తలపోసిన వేవీ కొనసాగకపోగా*
*దూర్త లోకంలో నిలబడజాలక*
*తలవంచుకు వెళ్ళిపోయావా నేస్తం!*

తన నేస్తం – డా. శ్రీదేవి మరణవార్త విని 'ఏం చెప్పను నేస్తం!' – అన్న స్మృతి కవితను వ్రాశారు డా. నాయని కృష్ణకుమారి.

ఇంతటి నేస్తాలు వెళ్ళిపోతే – ఎంత కష్టం! ఎంత కష్టం!

రవీంద్రుడంతటి విశ్వకవి ఈ లోకం నుండి నిష్క్రమించినప్పుడు రాయప్రోలు 'అస్తమయం' పేరున ఖండికలు వ్రాసి గుండెబరువును దించుకొన్నాడు.

గురజాడవంటి అభ్యుదయ మహారచయిత మృతి కృష్ణశాస్త్రికి చెప్పలేనంత పరివేదన కలుగజేసింది!

జాతిముత్యాలు సరాలు గుచ్చి తెలుగుతల్లికి భక్తితో ఇచ్చిన గురజాడ – భౌతికం చాలిస్తే – కవికి ఇలా అనిపించింది:

*రంగవల్లిక మాయమయ్యెను*
*చండతేజము మాసిపోయెను*
*సందెకెంపులు సాగిపోయెను*
*వెదుకుచున్నారా?*

వాస్తవాన్ని నిర్వేదంగా అంగీకరిస్తూ వ్యధ పొందుతున్నాడు కవి!

గాంధీగారు తనువు చాలించితే – దేశమంతా అశ్రు పయోధి అయితే – అందులో ఒక్కొక్క కవి ఆర్తగీతం ఒక్కొక్క దుఃఖాశ్రువు!

వేయిగాదు లక్ష విశ్వకళాపరిషత్తు లెన్నినాళ్ళు మొత్తుకొన

నేర్వలేని తెల్వి నీవీ జగమ్మున కిచ్చినాడ విరులు విచ్చివీడ!

అంటూ జోహారు చెప్పినవాడు తుమ్మల సీతారామమూర్తి!

మనకేమీ కాకపోయినా, అన్నీ అయిపోయిన వాళ్ళు – దేశం కోసం, పరహితం కోసం ప్రాణాలర్పించినవాళ్ళు – ఎందరో మహానుభావులు! వాళ్ళు తనువు చాలించితే దేశమంతా బంధువర్గమై విలపిస్తారు. జోతలర్పిస్తారు – కవులైతే స్మృతి రచనంతో అశ్రుతర్పణం చేస్తారు.

కలిసి బ్రతికిన బ్రతుకు, కష్టసుఖాలు పంచుకొని బ్రతికిన బ్రతుకు – కాలం కోరల్లో చిక్కి విదగ్ధమైతే – కంఠదఘ్నమైన దుఃఖం ఎవరికైనా దుస్సహంగా ఉంటుంది.

దుగ్గిసెట్టి రమణయ్యవంటి కవికి కంఠగతంగా నిలచిపోయిన స్మృతులెన్నో! 'సతీస్మృతి'లో అవన్నీ ఆవిష్కరించుకొంటాడు!

*"నీ కమనీయ సంస్మృతులు నిర్భర నీరధులౌచు గుండెలన్*
*దూకొను, వాని తాకిడికి ద్రుళ్ళుచు లేచెడి శోక వీచికల్*
*నా కనుగొనలన్ నిలిచి నన్ను కలంచును రేపు మాపు"*

దుఃఖ దఘ్న హృదయంతో – సతీస్మృతిని స్మరణ చేసుకొంటున్న విధం ఇది!

ఆమె కన్నులకు కనుపించకపోయినా తన మనోనేత్రంతో చూస్తున్నాననీ, చేతికందని లోకాలకు వెళ్ళిపోయినా ఊహలలో స్పృశిస్తాననీ తనను తానే ఓదార్చుకొంటాడు!

*నడచినయట్లు, నా యెదుట నవ్వినయట్టుల, నాకనుంగవన్*
*బొడమెడి భావమున్ గని ప్రఫుల్ల ముఖంబున నిల్చినట్టు, ప్రే*
*ముడిని మృదూక్తులన్ బలికి ముట్టినయట్లు, మనోజ్ఞమూర్తి, నీ*
*నడవడి నా మనంబున గనంబడు నిత్యనూత్నభావమై!*

జీవించినంతకాలం వెంటవెంటనే ఉండి మనసును ఊగించే నిత్యస్మృతి కాదూ ఇది!

స్మృతులలో జీవం పోసుకోవడం అంటే ఇదేనా?

మనసు ఉన్నంతకాలం మనిషికి స్మృతులు తప్పవు! అవి వేధించేవే అయినా అతడు వాటికి దూరం కావాలని అనుకోడు!

మంచి జ్ఞాపకాలు మనిషికి ఊతం ఇస్తాయి. బ్రతకటానికి కావలసిన సత్తా ఇస్తాయి!

స్మరణలూ, స్మృతులూ గతించిపోయినవారిని మనోధర్మంతో మన దగ్గరలోనే కట్టి పడవేసుకునేందుకు సాధనాలు అవుతాయి! అందుకే అవి విషాదభరితాలే అయినా ప్రియ భావనలే!

ఆ స్మృతి చక్రవర్తులచేత తాజమహళ్ళు కట్టించింది! రాజు కన్నుల నుండి రాలిన భాష్పధారలే తాజమహల్‌గా ఘనీభవించినవని కవి చమత్కరిస్తాడు! ఆ తాజమహల్ మీదా ఎన్నో భావుక సంస్మరణలు చేస్తాడు!

ఒక స్మరణ అట్లా అద్భుత కళాఖండంగా రూపుదిద్దుకొంటుంది – అతడు తాజమహళ్ళు కట్టగల రాజు కనుక!

ఒక స్మరణ – అక్షరాలకెక్కి, కవిత్వ శిఖరాల కెదిగి శాశ్వతంగా నిలచిపోతుంది – అతడు కవి కనుక! కవితా స్రష్ట కనుక!

ఒక స్మరణ – నిస్సహాయ నీరవాశ్రుకణమై – కంటి తుదలలోనే నిలచిపోతుంది – అతడు మామూలు మనిషి కనుక!

కవికి స్వీయ దుఃఖమెంతో ప్రపంచపు దుఃఖమై అంత! ఒక మహానాయకుడు నేలకూలిన, ఒక మహా వటవృక్షం నేలమట్టమయినా, ఒక మహా సామ్రాజ్యం అంతరించిపోయినా, ఒక శిల్పవైభవం సురిగిపోయినా – అతడు తపన పడిపోతాడు; గళమెత్తి దుఃఖనాదం వినిపిస్తాడు.

అందుకే ఒక హంపీక్షేత్రం – ఒక పెనుగొండలక్ష్మి కాలానికి ఎదురీదిన స్మరణ కావ్యాలై నిలచిపోయాయి.

*ఎనలేని దిగులుచే నిలువకయె*
*అంతరంగాబ్ధి బడబాగ్ని కీలలతోడ*
*అనిశము ధ్వనించెడు మహార్తిఘోషలతోడ*
*వెలువడిన కనరాని వేడి నిట్టూర్పులివి!*

–అంటాడు కొమరవోలు నాగభూషణరావు!

దుఃఖాతిశయమే అట్లా వేడి నిట్టూర్పులుగా మారితే – అవి స్మృతికావ్యాలు అయి ఉంటాయేమో!

*దళతి హృదయం గాఢోద్వేగాద్, ద్విధాతు న భిద్యతే*
*వహతి వికలః కాయో మోహం, న ముఞ్చతి చేతనామ్*

ఇది భవభూతి భావనలో – రామచంద్రుడే అనుభవించిన ఉత్కట దుఃఖం!

గుండె భయంతో, కలవరంతో పగిలిపోతున్నదేకాని, రెండు ప్రక్కలు కాదేమి? దేహం దుఃఖంతో మూర్ఛపోతున్నదే కానీ – ప్రాణం వదలిపోదేమీ? కడుపులో మండుతుండే వ్యధ, దేహాన్ని మండిస్తున్నదేకానీ – గుప్పెడు బూడిద చేయదేమీ? ఆయువుపట్టులైన సంధులన్నిటిమీదా దెబ్బ కొడుతున్నదేకానీ, విధి ఆయువును కత్తిరించివేయదేమీ?

అంతటి రాముడికైనా అంతటి బాధను కలిగిస్తున్నది వియోగయోగం!

మామూలు మనిషినైతే జీవచ్ఛవాన్ని చేస్తుంది!

కవిని కావ్యస్రష్టను చేస్తుంది!

ఈ కావ్యాలూ, స్మృతిగీతాలూ ప్రజల్లోకి వెళ్ళినప్పుడు వైయక్తిక స్పర్శను విడనాడతాయి! చదువరి మనస్సును సమార్ద్రం చేసి – సహానుభూతిని పుట్టిస్తాయి.

సహానుభూతి పొందడానికి సౌహార్దమయమైన దర్శనం కావాలి!

కరిగి నీరయ్యే కారుణ్యమయ మనఃస్థితి కావాలి!

ఈ లక్షణం మనిషితనం నిలుపుకోవటానికి మరీమరీ అవసరం! ఏ కష్టమైనా మనుషులందరికీ ఒకటే! ఈరోజు ఒకరికి – రేపు మరొకరికి అట్టి దుఃఖం సంభవం కావచ్చు! సుఖజీవనంలాగే దుఃఖానుభవమూ విశ్వజనీనమైనది!

స్మృతులు మన అందరివీ! అందరితో పంచుకోవాలని అనుకొనేవీ! పంచుకుంటేకాని మనసు తీరనివి! ఒకే బ్రతుకుగా – కలసి జీవించిన జంటతనానికి అఘాతం కలిగినప్పుడు అశ్రుసిక్తమైన కవి గుండె అక్షరాకృతి అయిపోతుంది.

స్మృతివాహిని అయిపోతుంది! సతీవియోగం – కవులను కలతపరచి కలవరపరచి చెప్పించిన స్మృతి కావ్యాలే మనకు ఎక్కువగా కనిపిస్తాయి. వడ్డాది సుబ్బరాయకవి ఆదిగా – ఆధునిక కవులు కొందరు ఉత్కటమైన సతీవియోగ దుఃఖంతో కావ్యాలు వ్రాసిన వారు ఉన్నారు. తన భార్యను పోగొట్టుకున్నప్పుడు అగ్గలమైన దుఃఖోద్వేగాన్ని వరలక్ష్మీ త్రిశతి – అన్న కావ్యంలో నిక్షిప్తం చేసుకొన్నాడు విశ్వనాథ.

*"అణగిపోయితి గిలగిలలాడి పోతి*
*లొంగిపోయితి తల పగులంగ బడితి"*

కవిని సమూలంగా కదిలించిన మహాశోక స్వరూపం ఇది!

*"హృదయమును దొంగిలించిన రీతిగానె*
*స్మృతిని సైతము నీవు హరింపు మతివ!"*
*దువ్వూరి వారి దుఃఖార్తి ఇది!*
*"కన్నుమూసి మరపించి దోబూచి చేసిపోతి*
*వెచట వెదకిన గానరా వింక నాకు."*
*ఇది పింగళి వారి విషాద వాక్కు!*
*'పరమ దుష్ట కాలాగ్ని విద్వరము రగిలి*
*ప్రళయ మనిపించె నీదు నిష్క్రమణవేళ!'*

'ప్రేయోనువాకము' – అన్న స్మృతికావ్యంలో తన దుఃఖ తీవ్రతను ఆవిష్కరించుకొంటున్నారు తుమ్మలపల్లి రామలింగేశ్వరరావు. ఇటీవలి కాలంలో – సతీస్మృతిని డైరీల రూపంలో వ్రాసి స్మృతి రచనలకు ప్రక్రియాపరంగా ఒక నవ్యతకు శ్రీకారం చుట్టినవారు డాక్టర్ రావూరి భరద్వాజ.

ప్రఖ్యాత రచయిత అయిన భరద్వాజకు డైరీ వ్రాసుకొనే అలవాటు చిరకాలం నుంచీ ఉంది. అనుబంధాల పుట్ట అయిన ఆయన జీవితంలోని ఘటనలూ, ఆలోచనలూ – ఆయన డైరీలకు ఎక్కినవి – ఎన్నో నిష్ఠురమైన జీవన సత్యాలకు ప్రమాణాలుగా నిలుస్తాయి. కానీ ఆయన పుస్తకాలుగా ప్రచురించినవి – 1986 ఆగస్టు 1వ తేదీన – ఆయనకు సతీవియోగం కలిగినప్పటి నుండీ వ్రాసుకొన్న వేదనాత్మక డైరీ రచనలే! ఒక దుఃఖ తీవ్రత – అతని కలం నుంచి అక్షరాలను క్రుమ్మరించింది. ఆమె స్మరణలను త్రవ్వి పోసుకొన్నది. ఆమె ఉన్నత వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించింది. ఆమె లేకపోవడంలోని చేదు అనుభవాన్ని తీరుతీరుగా వర్ణించింది. అంతకు ముందు లేని కొత్త ఆలోచనలకూ తాత్త్విక చింతనలకూ జీవిత స్పృహలను విరజిమ్ముకొన్నది. ఇవి అన్నీ కలిసి అయిదు కావ్యాలుగా ముద్రితమైనాయి. కవిత్వ స్పర్శ కలిగిన హృదయ స్పర్శకమైన సాహిత్య రచనలే అయినాయి.

డైరీలు ప్రచురణకోసం వ్రాసుకొనేవి కావు కాని ఒక వైయక్తిక దుఃఖాన్ని మానవీయమైన అనుభూతులతో చిత్రించడంవలన – భరద్వాజ వ్రాసుకొన్న ఈ డైరీల రచన ప్రచురణ యోగ్యమూ పఠన యోగ్యమూ అయింది.

జంటగా కలిసి బ్రతకడంలోని అద్భుత సౌందర్యమూ కష్టసుఖాలను కలిసి పంచుకోవటంలోని సహజీవన శిల్పమూ, పురుషుని చేయి పట్టుకు నడుస్తున్న భ్రమ కలిగిస్తూనే – తానే పురుషుని పుణ్యపురుషునిగా తీర్చిదిద్దగలిగిన స్త్రీత్వంలోని మహనీయ తత్త్వమూ అర్ధనారీశ్వరతత్త్వంలో – అద్వైత దాంపత్యసిద్ధిని ఆవిస్కరించుకునే దివ్య ప్రయత్నమూ, భరద్వాజ స్మృతి రచనలో తొంగిచూచే ముఖ్యమైన భావధారలు.

ప్రక్రియాపరంగా ఒక వైవిధ్యాన్ని సాధించిన ఆధునిక రచనలు కనుక – వీటిని గురించి ప్రత్యేకించి చెప్పుకోవలసి ఉంది. ఇంతగా అతని గుండెలలోనే గూడుకట్టుకొని భరద్వాజచేత పరంపరగా స్మృతి రచనలు చేయించిన స్త్రీ మూర్తి పేరు కాంతం. ఆమెలోని అమ్మతనాన్ని అనుభవించిన అతనికి ఆమె కాంతమ్మ. మొదటి గ్రంథం "నాలోని నీవు"లో – ఒక దుర్భర దుఃఖం కత్తిపోటుగా గుండెను చీల్చినప్పటి ఆర్తనాదపు ధ్వనులే ఎక్కువగా వినవస్తాయి.

"సముద్రమంత దుఃఖాన్ని తట్టుకొని ఉన్నానంటే – ఇప్పుడు నన్ను చూసి నాకే ఆశ్చర్యంగా ఉంది!"

అని – సాగరం అంతటి దుఃఖాన్ని దిగమ్రింగే ప్రయత్నంలో – ఆమె సుందర వ్యక్తిత్వాన్నీ, ఆమెతో తనకు కుదిరిన అనుబంధాన్నీ ఇలా అంటాడు. నెచ్చెలి, స్నేహితురాలు, హితవరి, శ్రేయోభిలాషి, ప్రభ్వి, బిడ్డ, చెల్లి, తల్లి, జన్మ జన్మలుగా తాను చేసిన పుణ్యాల ప్రోవు.

ఆమె తన భౌతిక జీవితాన్ని మాత్రమే కాక తన మనోమయ ప్రపంచాన్ని కూడా – సత్య శివ సుందరంగా మలచిన మహాశిల్పి – అంటాడతను.

"నీ అంతఃసౌందర్య ప్రకాశ వాహిని – నా జీవిత మరుభూమిని సస్యశ్యామలం చేసిందని నాకు తెలుసు!"

తనను అంతగా ప్రభావితం చేసిన స్త్రీమూర్తిగా – ఆమె వ్యక్తిత్వ సౌందర్యాన్ని – భక్తిగా, ఆర్తిగా, గౌరవంగా

స్మరించుకొంటాడు. దుస్సహ వేదనా ప్రవంతిలో ఉద్భవించిన ఒక శోక తరంగం వంటిది భరద్వాజ తొలి స్మృతి కావ్యం – 'నాలోని నీవు'.

ఆమె వియోగాన్ని భరించలేకా, భరించక తప్పని స్థితిచేతా గుడుసుళ్లు పడుతున్న వేదనా రవమే వినిపిస్తుంది – 'అంతరంగిణి' అనే రెండవ స్మృతి రచనలో. ఆవేదన వెనుకగా – అప్పుడే బయలుదేరినట్టున్న ఒక తాత్త్విక ధోరణి తాలూకు ఛాయలు కూడా కనిపిస్తాయి.

తనదైన దుఃఖపాతాన్ని ఒక కంట అణచి పెట్టి – మరొక కంట ప్రపంచంలోని పరితాపాలనూ, దారిద్ర్యాలనూ, అన్యాయాలనూ చూచి కలవరపడుతూ –

"మహాసత్వా! నా సమస్త శక్తులను ఈ ప్రపంచ ప్రజల సంక్షేమానికి ధారపోసే సత్సంకల్పాన్ని నాలో దృఢపరచు" – అనుకునేటంత విశాల దృక్పథం కనిపిస్తుందీ రచనలో.

ఆమె స్మృతులలో కరిగిపోవటమూ, ప్రకృతిని మానవీకరణ భావనలతో పరామర్శించటమూ, జీవన వికృత స్థితిగతుల పట్ల స్పందించటమూ – ఇలా భరద్వాజ పలికిన ఆలోచనా తరంగిణి – అతని స్మృతి రచన 'అంతరంగిణి.'

మంచితనంలాంటి వెన్నెలని, కరుణలాంటి వెన్నెలని అనుభవింపనేర్చిన భరద్వాజ హృదయం కారుణ్యభరితం అయి ఉంటుంది. అందుకే – "ఐతరేయం" – అనే తన మూడవ స్మృతి గ్రంథాన్ని – చిరిగిన పీలికల మధ్య కారుణ్యరేఖలాగా మెరిసిపోతున్న ముసలి కుంటి బిచ్చగాడికి అంకితం ఇచ్చాడు.

ఒకడు కవీ, పండితుడూ కాకపోయినా ఫర్వాలేదు కానీ, మంచి మనిషి కాకపోతే సహించలేననీ– చిరిగిన పరికిణీ జాకెట్టుతో ఎండుపుల్లల్ని ఏరుకొంటున్న ఒక చిన్న బంగారు తల్లికి చేయవలసినంతగా సాయం చేయలేకపోయాననీ– వ్రాసుకోవడంలో అతని హృదయం ఒక కారుణ్య జలదం అయిన వైనం తెలుస్తుంది. ఆ కారుణ్యమూర్తి కాంతమ్మగారేననీ, ఆమె తన సౌజన్యంతో, మంచితనంతో, క్షమాగుణంతో అనురాగంతో, ఆత్మీయతతో – తన అంతరంగాన్ని పవిత్రం చేసిందనీ స్పష్టంగా వ్రాసుకొంటాడు భరద్వాజ.

ఈ సరికి కాంతమ్మలో తన అనురాగమూర్తినేకాక – ఒక కరుణార్ద్రమైన ఈశ్వర తత్త్వాన్ని కూడా చూడడం ప్రారంభించాడు అతడు.

"ఇవాళ నీ నుంచి – స్వామి సన్నిధికి మనస్సు పాకుతూ వెళ్లింది. చెట్టులోనూ, పుట్టలోనూ, గట్టులోనూ – స్వామిని చూస్తున్నానిప్పుడు" అనటంలో ఈశ్వరాన్వేషణలోనూ ఆమె ఆలంబనతోనే అతడు ముందుకు సాగుతున్నట్టు అనిపిస్తుంది.

కాంతమ్మ స్మృతి తరంగాలు కారుణ్యమహతిని సున్నితంగా మీటుతున్న ధ్వనులు ఆ తరువాత రచనలలోనూ వినిపిస్తాయి. ఆమె ఒక ప్రతీకగా అతనిలో చెలరేగిన భావతరంగాలు 'ఒకింత వేకువ కోసం' – అనే స్మృతి రచనల నిండా పరుచుకున్నాయి.

ఆమె జ్ఞాపకాలు – కాల్చికాల్చి తప్తం చేసిన హృదయంలో జ్ఞాన భాండం నింపుకునే తపనలో, అతడు చేస్తున్న మనోమయయోగం ఒకటి వ్యక్తం అవుతుంది. కాంతమ్మ ఆ సాధన కంతటికీ కేంద్రబిందువు.

"నీ వెళ్ళిపోయాక తెలుసుకొంటున్నాను. నీవు నా ఉపనిషత్తువని, బ్రహ్మసూత్రానివని, భగవద్గీతవని" – ఆమెకూ – పరతత్త్వానికీ ఒక అభేద స్థితిని వర్తింపచేసుకొన్న అభివ్యక్తి ఇది! భరద్వాజలోని కవీ, కథకుడూ – ఒక క్రొత్త రూపంలో, క్రొత్త ప్రతీకలతో ఏవో అపురూప భావనలను మన ముందు పరచినట్లు ఉంటుంది – "ఒకింత వేకువ కోసం" అన్న అయిదవ స్మృతి కావ్యం.

తానూ, కాంతం – అనే వాస్తవాలను అతడు – ఆమె అన్న భావ చిత్రాలలో పొదిగించి కథలుగా, సంభాషణలుగా – స్మరణమాధుర్యాలను చిత్రిస్తాడు. అవి ఒకప్పుడు కరుణాత్మక గీతాలుగా, కవితాధారలుగా గల్పికలుగా, చిత్ర రచనలుగా సాగుతాయి.



చింతమనేని వేదవతి
ఫోన్ : 939 246 7795
040 - 23510837

**ఆంగ్లంలో స్మృతి గీతాలను ఎలిజీలంటారు.**
**కీట్స్ తన 25వ ఏట మృత్యువాత పడితే షెల్లీ లాంటి ప్రేమ మూర్తి తన దుఃఖాన్ని ప్రపంచపరం చేస్తూ చెప్పిన ‘ఎడొనిస్’ ఎలిజీని ఈ సందర్భంగా పాఠకులకు తెలుగులో అందిస్తున్నాం.**

1. *ఎడొనిస్ చనిపోయాడు, దుఃఖమా*
*అశ్రువులు ఘనీభవించాయి, అతని తల చుట్టూ*
*శిరస్త్రాణంలా !*
*అనంత కాలంలో ఈ దుఃఖ ఘడియను ఎలా*
*దాచుకోవాలి ?*
*ప్రియ స్నేహమా నీ విధివ్రాత అనంతంలో*
*వినిపించే ప్రతిధ్వని,*
*నీ కీర్తి ఎప్పటికీ ప్రకాశించే కాంతిరేఖ ...*

2. *అమ్మా... ఎక్కడున్నావమ్మా ...*
*నీ కొడుకు విగతజీవుడై పడివున్నాడే,*
*చీకటిలో కాంతి చొరబడినట్లు – చావులో ప్రవేశించాడు.*
*చూడలేదా అమ్మా – ఎక్కడున్నావు ?*
*యురేనియా – ఇదిగో ఎడొనిస్ చనిపోయాడు*
*నీకు కనిపించలేదా ? నీవే స్వర్గంలో వున్నావు ?*
*అరమోడ్పు కనులతో అతని చివరి శ్వాసను వినలేదా?*
*జ్ఞాపకాలతో ఊపిరాడుతూనే ఉందే*
*పూలు తమకిందే ఉన్న ముల్లును దాచినట్లు*
*తన ఊపిరుల చాటున దాగిన మరణాన్ని చూడలేదా?*

3. *ఎడొనిస్ చనిపోయాడు*
*లే అమ్మా ! నిద్రలేచి మత్తువదిలి ఏడ్వాలి*
*కన్నీళ్ళు పక్క తడపాలి*
*నీ గుండెదడ బిగ్గరగా వినపడాలి*
*అతను వెళ్ళిపోయాడు – అవును*
*బుద్ధిగలవాళ్లు శుద్ధిగా వుండే చోటుకే !*
*ఇప్పుడింకా కలలెందుకు ? అగాధం నుంచి*
*అతను రాలేడు – అతని పీలగొంతు చావు నొక్కేసింది*
*మన దుఃఖాన్ని చూసి నవ్వుతోంది, పగలబడి !*

4. *అతనింక మేల్కోడు ఎప్పటికి !*
*శవపేటికలో సంధ్య చీకటి పరుచుకుంది*
*మరణపు ఛాయ – ఆ తలుపు చాటునే*
*అవినీతి తొంగి చూస్తోంది, అదే*
*తీరని ఆకలి, దాహం, అక్కడే దాగి ఉన్నాయి*
*అతని మరణ ఘడియ కోసం !*
*దయ, కరుణ తెల్లముఖాలతో దుఃఖిస్తున్నాయి*
*అంత అందమైన ఆహారాన్ని – చీకటి గుహలో*
*మర్త్య కర్మకోసం మోసుకుపోవాలంటే*
*మట్టిలో కప్పివేయాలంటే ...*
*భయంతో చీకటి కోసం ఎదురు చూస్తూ ...*
*దయ, కరుణ తెల్లముఖాలతో దుఃఖిస్తున్నాయి*

5. *ఆమె వణికే చేతుల్లో చల్లని శిరసు –*
*వెన్నెల రెక్కలతో విసురుతూ, రోదిస్తూ*
*ఓ ప్రేమా, ఓ దుఃఖమా నీవు చనిపోలేదు–*
*చూడు నీ లేత కనురెప్పల మెత్తందనం,*
*పూరేకుల పై మంచు బిందువులా*
*అదిగో ఒక దుఃఖాశ్రువు*
*అది నీ సుప్త చేతనం నుంచి*
*తెగిపడిన స్వప్నం కాదా ?*
*ధ్వంసమైన స్వర్గంలో దారి తప్పిన దేవత కాదా –*
*అయ్యో ! అదెలా తెలుస్తుంది?*
*అక్కడ కనీసం జాడ కూడా లేదే –*
*ఓ నల్లమబ్బు కన్నీళ్లన్నీ ఒలకబోసి వెళ్లిపోయిందే ...*

6. *ఒకరు నక్షత్రాల తడిని – సున్నితంగా అతని*
*గాయాలకు లేపనాలను పూస్తూ –*
*మరొకరు తన కురులను కన్నీళ్లతో తడిపి*
*అతని మెడలో ముత్యాలహారంలా ఘనీభవింపించి –*
*ఇంకొకరు – తన దుఃఖాన్ని – రెక్కల గాలితో*
*గడ్డ కట్టిన అతని చెక్కిలి నిమురుతోంది ...*

7. *మరొక దేవత – అతని పెదవులను వెలిగించింది –*
*అవి శ్వాసించే సమయం – అతని స్పందించే*
*హృదయం... పలికిన సంగీతం –*
*అయ్యో ! మాయ చావు – ఇవన్నీ దోచుకుపోయిందే–*
*ఆ మృదువు పెదవులను మంచులా మార్చిందే –*
*కాని – వెన్నెల పొడిని అద్ది మెరిపించింది*
*పాలిపోయిన శరీరం – గ్రహణంలో చందమామ!*

8\. ఎందరు ?– ఎంతమంది – కోరికలు – కిరీటాలు
రెక్కల – ముసుగుల్లో – దాగిన విధానం –
అద్భుతాలు – అంధకారాలు – ఎండమావుల్లా
పునర్జన్మలు–
ఆశలు – భయాలు – సంజవేళ భ్రమలు
చివరగా దుఃఖం – నిట్టూర్పుల గుంపులతో –
ఆనందం – నీటి తెరలతో గుడ్డిగా – గొప్పగా,
ఊరేగింపుగా – పొగమంచులో ప్రవాహంలా....

9\. అతని ప్రేమ – ప్రేమించింది – భావంగా మారిపోయి–
రంగు, రూపు, పరిమళం – తీయని సంగీతం –
అన్నీ అతని కోసం దుఃఖిస్తున్నాయి –
ఉదయం జుట్టు విరబోసుకుని – కన్నీళ్లతో
వెలుగు రేఖలను తడిపి –
ఎక్కడో విషాద మేఘం ఘూర్ణిల్లితే –
సముద్రపుటలలు ఎగిసిపడుతుంటే –
అడవి గాలులు సుడులు తిరిగి వెక్కివెక్కి ఏడుస్తున్నాయి–

10\. అన్నీ లోయల్లో మార్మోగుతుంటే –
అతని జ్ఞాపకాలతో దుఃఖిస్తుంటే
ప్రతిధ్వనులన్నీ నిశ్శబ్దాలై మూగబోతే –
చిన్ని పక్షులు – రెక్కలల్లార్చుతుంటే –
గొరైల కాపరి బూర నిశ్శబ్దాన్ని పగలగొట్టి
ఈ శబ్దాలన్ని నీడలై, సాయంత్రమై
చివరికి మరమర గొణుగుడుగా
అడవిలో అంతరించిపోతున్నాయి ...

11\. నీ ఊపిరులన్నీ పూలకు వదిలి –
నీ జన్మలన్నీ నక్షత్రాలకు కుదిరి –
నీ ప్రాణాలన్నీ పరిమళాలకు పూసి –
నువ్వెళ్లిపోయావా?
కత్తి ఒరలో దాగినట్లు
కనిపించని అణువు
మెరుపు – సాంద్రంగా వెలిగినట్లు –
ఒక్క క్షణం మండి – చల్లబడిపోయావా?

12\. తూర్పు నుంచి ఉదయించిన రాత్రిలా
రాత్రి నుంచి పొడిచిన పొద్దులా –
పారిపోయే దెయ్యాల్లా –
బాధ – భయం – ఎంతగా మూర్కొన్నాయి
తుఫాను తెరల్లో– దుఃఖపు రోదన
ఈ నేలమీద వదిలిన పార్థివ దేహం,
అయ్యో – ఇక్కడే ఎడొనిస్ పడి వున్నాడు ...

13\. ఒక్క క్షణం వుండవా ? మరొక్కసారి మాటాడవా?
ఒక్క ముద్దు అద్దవా ? అది ప్రాణం పోయదా ?
హృదయం లేని గుండె – మంటలు రేపే మస్తిష్కం !
ఆ మాట – ఆ ముద్దు – అవే ఆలోచనకు
జీవంపోస్తాయి...
ఇప్పుడు నీవు లేవు – అది కూడా నీలో భాగమే – ఈ
మరణం!
నీ కోసం అన్నీ ఇస్తా – ఎడొనిస్ – నీ కోసం
నేను వస్తా– కాని ఈ కాలపు సంకెళ్లు నన్ను కదలనీయవే ...

14\. వెలుగు విరజిమ్మితే – పాములన్నీ పారిపోతాయి
పొద్దు వాలిపోతే – కీటకాలన్నీ నిద్రలేస్తాయి
చావు చుట్టూ చేరతాయి – చీకట్లు ముసురుతాయి
మళ్లీ చుక్కలన్నీ కళ్లు విప్పుతాయి – హా! ఇదే ప్రపంచం ...
గంధర్వుడు నేలను వదిలితే –
స్వర్గ ద్వారాలు తెరుచుకుంటాయి –
ఈ భూమి – బురదలో మిగిలిపోతుంది!

15\. ఇంకా ఎందుకు ఏడుపు ? మన నేస్తం ఎంతో
ఎత్తుకు – ఎక్కడికో వెళ్లిపోయాడు –
పిచ్చి కేకలు పెట్టే పెనుగాలులను వదిలి –
ఎక్కడో నిద్రపోతున్నాడు –
మరెక్కడో నిద్రలో మేల్కొన్నాడు – అంతగా మనం ఎగరలేం–
అతను కూర్చున్నచోటుకు చేరలేం –
మట్టి – మట్టిలో కలిసిపోవాలి –
స్వచ్ఛమైన వెలుగు – వెళ్లిపోతుంది నక్షత్రాల దారిలో –
అనంతంగా – కాలాన్ని మించి – మార్పుని మించి –
ఇక్కడ ఈ చలిమంట ఆరిపోయి – సిగ్గుతో చచ్చిపోతుంది...

16\. ఆహా! అతను ఇప్పుడే మేల్కొన్నాడు –
ఈ బ్రతుకు కలలోంచి నిద్రలేచాడు –
మనమా? – ఇక్కడే నశించిపోతాం – భయంతో
బాధతో – ఇవే మనల్ని తినివేస్తాయి
మట్టిమనుషులం – బురదలో అన్నీ పురుగులే –
మనల్ని తినివేసే పురుగులే ...

17. ఇప్పుడు అతన్ని ఏదీ చేరలేదు, ఏమీ చేయలేదు –
అసూయ – అసహ్యం అన్నింటికీ అతీతం
ఇవేమీ అతన్ని అంటుకోలేవు
ఈ అంటు రోగాలు – ప్రపంచ భోగాలు అతన్ని తాకలేవు
అతను భద్రంగా వున్నాడు – ఇంక ఇప్పుడు దుఃఖమెందుకు ?
అతని హృదయం మంచులా – అతని ఆత్మ వెలుగులా–
ఇప్పుడు అన్నీ ఆరిపోయాయి – తెల్లని బూడిదలా –
మిత్తి భరిణి నిండా –

18. అతను బ్రతికేవున్నాడు – అతను మేల్కొనేవున్నాడు –
చావు చనిపోయింది –
ఉదయం – యౌవనంలోనే వుంది –
తడినంతా ఆరనీ –
నీ హృదయం వెలుగుతూనే ఉంది –

19. ఎడొనిస్ కోసం ఎవరు దుఃఖిస్తున్నారు?
మిమ్మల్ని – మీకు తెలుసా –
ఎడొనిస్ మీకు తెలుసా?
భూగోళాన్ని – ఒక్కసారి చూడండి –
అన్ని లోకాలకావల నుంచి – దాని కేంద్రం –
అతని ఆత్మకాంతితో చిల్లుపడింది –
దాని ఉపరితలం కుంగిపోయింది
మన పగలు – రాత్రిగా చిన్న బిందువులా క్షీణించింది–
గుండెను చిక్కబట్టుకో – భూమి చివరి
అంచుకు ఆశ ఆకర్షించి – మళ్ళీ చిగురిస్తుంది ...

20. రోమ్ వెళ్లండి – అతనికోసం కాదు –
అక్కడ కూలిన సామ్రాజ్యాలు –
నిలిచిన శిథిలాలు – మట్టిలో కలిసిన మతాలు –
అక్కడే అతనికోసం కీర్తికోటలు కట్టాయి
ప్రపంచమే – వాటికి ఆహారం
మేధావి చక్రవర్తి – కాలాన్ని శాసించిన
రారాజు – అక్కడే వున్నాడు !
వెళ్లండి – రోమ్ వెళ్లండి !

21. ఒకప్పటి స్వర్గం – రోమ్ వెళ్లండి –
అతని సమాధి – అతని నగరం –
పగిలిన కొండలు గుట్టలు –
విరుస్తున్న పూలు – పరిమళాలు వెదజల్లే పూలు –
అతని నగ్న శకలాలను – కప్పివేస్తున్నాయి ...
మీకు దారి చూపుతాయి – ఆకుపచ్చని లోయ
పసివాని నవ్వులా – చావుని కప్పివుంచుతోంది ...
పూలు నవ్వుతున్నాయి – పచ్చిక పరుచుకుంది
వెళ్లండి స్వర్గంలాంటి రోమ్ వెళ్లండి –
ఎడొనిస్ అక్కడే వున్నాడు ...




22. సమాధి చుట్టూ దిగులుగా గోడలు లేచాయి
కాండం విప్పుకుంటున్న బెరడులా
కాలం శిథిలాలను నెమరువేస్తున్నది
దుమ్ములో అతనికి మేడకట్టింది
మట్టి కాలి – పాలరాయిగా మారింది
అక్కడే ... దాని కిందే – అతని స్వర్గం ...
అతని నివాసం ...
ఆరిపోయిన ఊపిరితో వెలుగుతోంది ...

23. విశ్వాన్ని వెలిగించే కాంతి నవ్వు –
అంతటా వ్యాపించిన సౌందర్యం
మరణాన్ని జయించిన గొప్ప వరం
మనిషినీ, ప్రకృతినీ, జంతువునీ అల్లుకున్న
ప్రేమ – నేలను, నింగిని, నీటిని అన్నింటినీ
వెలిగించే – జ్వాలలు – ఇప్పుడు
నా మీద ప్రసరిస్తున్నాయి
చివరి క్షణాలు ప్రాణాలను మండిస్తున్నాయి ...

24. నా మీద ఈ బరువైన శ్వాస సంగీతంలా
వాలుతోంది – నా ఆత్మను స్వేచ్ఛగా వదిలి
అన్ని తీరాలకు దూరంగా – అన్ని
గుంపులకు దూరంగా – తెరలు నిండా
గాలి నింపి – తుఫానులో ప్రవేశించి
నేలను వదిలి – ఆకాశంలోకి వెళ్ళిపోతున్న
చీకట్లో పుట్టాను – భయంతో – ఎంతో దూరంగా
స్వర్గతీరాల తెరల్లో మండిపోతున్న – ఎడొనిస్
ఆత్మ పిలుస్తోంది – అనంత లోకాల్లో కాంతిలా –
రమ్మంటోంది – అమర లోకంనుంచి –
పిలుస్తోంది – పిలుస్తోంది ...



YouTube : **Adonois ppt pptx** (వీడియో చూడండి).

# కళింగాంధ్ర జానపదగేయాలు

- దామెర వేంకట సూర్యారావు

జాతికి జీవన నాలిక జానపదగీతిక. జానపద సాహిత్యం జాతి సమష్టి సంపద. జాతి హృదయానికి ప్రతిబింబం. శిష్ట సాహిత్యానికి జానపదుల వాఙ్మయం ప్రాతిపదికవంటిది. 'పల్లె సారస్వతం వేద సారస్వతం వంటిది' అంటారు నేదునూరి గంగాధరం. జానపద వాఙ్మయం జనసామాన్యంలో పుట్టి వారిలో ప్రచారం పొంది జీవిస్తుంది. జానపదుల మానసిక భావనాస్వరూపాన్ని, సుఖదు:ఖాలను యథాతథంగా చిత్రిస్తుంది. పల్లెప్రజల ఆచారవ్యవహారాలకు, సంస్కృతి సంప్రదాయాలకు జానపదవాఙ్మయం ప్రతిబింబం. ఏ భాషా సాహిత్యంలోనయినా పదగేయరూపమైన దేశి కవిత ప్రాచీనమైన రచన. శిష్టసాహిత్యంపై జానపదుల మౌఖిక వాఙ్మయ ప్రభావం ఉంటుంది. జానపద వాఙ్మయం ఒక్కొక్క కాలంలో కొత్తకొత్త రూపాల్ని సంతరించుకొంటూ ప్రదేశానికి, కాలానికి తగినట్టుగా పరిణామం చెందుతూ వికాసాన్ని సంతరించుకుంటుంది.

జానపద వాఙ్మయం చాలాకాలం నిరాదరణకు గురయింది. వాటిని పల్లెపాటలుగా పండితులు ఈసడించుకొనేవారు. తెలుగులో జానపదగేయాల సేకరణకు ఆద్యుడుగా జె.ఎ. బాయిలీను పేర్కొంటారు. సర్వాయి పాపడికి సంబంధించిన ప్రసిద్ధ చారిత్రక గీతాల్ని మొదటిసారిగా ఈయన సేకరించాడు. నేదుకూరి గంగాధరం, కృష్ణశ్రీ జానపద గేయాలను అసంఖ్యాకంగా సేకరించారు. బిరుదురాజు రామరాజు, నాయని కృష్ణకుమారి, తంగిరాల వెంకట సుబ్బారావు మొదలైన వారు విశ్వవిద్యాలయాల్లో జానపద వాఙ్మయంపై గొప్ప పరిశోధనలు గావించారు.

ఈ నేపథ్యంలో ఇటీవల వెలసిన గ్రంథం 'కళింగాంధ్ర జానపదగేయాలు'. రచయిత బద్రి కూర్మారావు. ఇప్పటికే వీరు 'ఉత్తరాంధ్ర జానపద కళలు' అనే గ్రంథం ప్రచురించారు. జానపదగేయాల సేకరణ ఎంతో వ్యవప్రయాసలతో కూడుకున్నపని. ఎన్నో గ్రామాలు తిరిగి అక్కడి జనంతో మాట్లాడి వారితో పాటలు పాడించుకుని రికార్డుచేసి భద్రపరచి పుస్తకరూపంలో మనకందించారు. గ్రామీణ నేపథ్యం, పల్లెప్రజల జీవన విధానం, సంస్కృతులను గురించిన విశేష పరిజ్ఞానం, ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై ఆవేదన, గొప్ప కళాభిరుచి, జానపదుల పాటలను, కళలను అంతరించిపోకుండా భద్రపరచి ఒక అపురూపమైన సాంస్కృతిక సంపదను పరిరక్షించాలనే తపన పుష్కలంగా ఉన్న బద్రి కూర్మారావు ఈ బృహత్తర కార్యాన్ని తలదాల్చారు.

ఈ పుస్తకానికి రచయిత 'కళింగాంధ్ర జానపదగేయాలు' అని పేరుపెట్టారు. ఇందులో 36 విభాగాలు ఉన్నాయి. ముందుగా రచయిత కళింగాంధ్ర భౌగోళిక చారిత్రక, సామాజిక నేపథ్యాన్ని వివరించారు. కళింగప్రాంతం వివిధ చారిత్రకదశల్లో విభిన్నమైన భౌగోళిక విస్తృతి కలిగి ఉండేది. ఉత్తరాన మహానది, దక్షిణంగా గోదావరి, తూర్పున బంగాళాఖాతం, పశ్చిమంగా తూర్పుకనుమలు కళింగ ప్రాంతానికి హద్దులుగా పరిగణించారు. ఐతే ఒకనాటి కళింగసీమలోని కొన్ని ప్రాంతాలు ఒడిశా రాష్ట్రంలో కలిసిపోవడంతో ఉత్తరాంధ్రజిల్లాలు మూడింటిని ఇప్పుడు కళింగాంధ్రగా వ్యవహరిస్తున్నారు. రచయిత కళింగాంధ్ర జానపద సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకురావలసిన ఆవశ్యకత వివరిస్తూ, ఇతర ప్రాంతాల్లో జానపదవాఙ్మయంతో జరిగినకృషి ఉత్తరాంధ్ర పల్లె ప్రజల పాటలకు సంబంధించి జరగలేదని, ఈ విషయంలో కూడా ఉత్తరాంధ్ర వెనుకబడే ఉందని, అనేక కళలు, పాటలు కాలగర్భంలో కలిసిపోతున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. జానపదకళలను నమ్ముకున్నవారు ఉపాధికోసం ఇతర వృత్తులలోకి తరలిపోతుండడం, ప్రజల

అభిరుచుల్లో  మార్పు, ప్రభుత్వ ప్రోత్సాహం లేకపోవడం మొదలైన కారణాలవల్ల ఉత్తరాంధ్రుల మౌలిక సాహిత్యం, కళలు కొన ఊపిరితో ఉన్నాయని రచయిత గుర్తించారు.

జానపద గేయాలను విమర్శకులు స్థూలంగా పౌరాణిక గేయాలు, చారిత్రక గేయాలు, పారమార్థిక గేయాలు, స్త్రీలపాటలు, శ్రామికగేయాలు, బాలగేయాలు, శృంగార గేయాలు, కరుణరసగేయాలు, హాస్యరసగేయాలు, అద్భుతరస గేయాలుగా వర్గీకరించడం పరిపాటి. దాదాపుగా ఆయా విభాగాలకు చెందిన గేయాలన్నీ ఈ పుస్తకంలో చోటు చేసుకున్నాయి. విభిన్న ఉర్షికల్లో ఆయా విభాగాల పాటల్ని పరిఉలించారు. ఇవిగాక గిరిజనులపాటలు, పడవపాటలు, ఒడియా జానపద గేయాలు, రెల్లి జానపదగేయాలను సేకరించారు.

జానపదుల దేవతా ప్రార్థనలను రచయిత సేకరించారు. వీటిపై సంస్కృత ప్రార్థనా శ్లోకాల ప్రభావం ఉండవచ్చు. జానపద సాహిత్యంలో బాలగేయాలది ఒక ప్రత్యేకశాఖ, పసిపిల్లల లేత హృదయాలాగే వారి పాటలు కూడా నిర్మలంగా మృదువుగా ఉంటాయి. ఈతరం పిల్లలు ఆటలకు, పాటలకు అందమైన బాల్యానికి దూరమైపోతున్నారు. 'గుడుగుడు గుంచం గుండేరాగం – పాములపట్నం పడగే రాగం', 'అప్పడప్పడతాంద్ర ఆవకాయతాంద్ర' మొదలైన పాటలు ఉత్తరాంధ్రలో చాలా ప్రసిద్ధమైన పిల్లలపాటలు. పిల్లలు ఒకదగ్గర గుండ్రంగా కూర్చుని ఆడుకుంటూ పాడుకునే పాటలివి. ఇంకా అనేక పిల్లల పాటల్ని ఈ విభాగంలో పొందుపరిచారు. ఇందులో ఉద్దానం పల్లెలో డా॥ కె.ముత్యం సేకరించిన పాటలూఉన్నాయి.

రామాయణ, భారత, భాగవతాలకు భారతీయ సంస్కృతితో విడదీయరాని అనుబంధం ఉంది. జానపదులను ఆకట్టుకున్న పౌరాణిక గాథల్లో రామాయణం అగ్రస్థానంలో నిలిచింది. స్త్రీల రామాయణపాటలు ఆంధ్రదేశమంతటా ప్రాచుర్యంలో ఉన్న కళింగాంధ్రలో జముకులపాటగాను, తప్పెటగుళ్లు కళాకారుల పాటగానూ ఇంకా అనేక రూపాల్లోనూ వినవస్తాయి. 'నోమీ నోమన్న నాలో సీతమ్మ పుత్రూలు , పిన్నిరాజులుకారు మాపుకి సిన్నోలు .... ఇలా సాగుతుంది లవకుశల విద్యాభ్యాసంపాట. మహా భారతానికి సంబంధించి అజ్ఞాతవాసంలో విరాటరాజు కొలువులో పాండవుల జీవితం జానపదుల పాటల్లో వినిపిస్తుంది. భాగవత



గాథలకు సంబంధించి చాలా పాటలు రచయిత సేకరించారు. 'రేపల్లెవాడలో చెంచీత' అనే చెంచుభాగవతం పాట ప్రసిద్ధమైనది.

స్త్రీల పాటల్లో సాంఘిక జీవన సమగ్రంగా గోచరిస్తుంది. స్త్రీల పాటలు మౌఖిక సాహిత్యంలో ఆణిముత్యాల్లాంటివి. జోలపాటలు, లాలిపాటలు జానపదస్త్రీల పాటల్లో విశిష్టమైనవి. కృష్ణసంబంధమైన 'కస్తూరి రంగరంగా – నాయన్న కావేటి రంగరంగా' సుదీర్ఘమైనపాట. కృష్ణుని జననం, మహిమలు, బాల్యచేష్టలు వర్ణించబడ్డాయి. తెలుగువారి సంస్కృతిలో గ్రామదేవతల ప్రాధాన్యం ఇంతింతనరానిది. కళింగాంధ్రలో మజ్జి గైరమ్మ, పైడితల్లెమ్మ, మోదకొండమ్మ, నూకాలమ్మ, పోలమ్మ, మొదలయిన వారు ప్రసిద్ధమైన అమ్మవార్లు.

ఈ అమ్మవార్లకు సంబంధించిన పాటలు కొన్ని ఈ పరిశోధకుడి సేకరణలో చోటు చేసుకున్నాయి. పొలాల్లో పనిచేసుకునే ఆడా,మగ శ్రమతెలియకుండా ఉండటానికి, ఉత్సాహంగా పనిజరగడానికి పాటలు పాడుకునేవారు. నాట్లు వేసేటప్పుడు, కలుపుతీసేటప్పుడు, ఏతమెత్తేటప్పుడు, దున్నేటప్పుడు, పంటకోసేటప్పుడు ఇలా సేద్యానికి సంబంధించిన ప్రతిదశలోనూ పాటలున్నాయి. వాటిలో 'ఉల్లిమల్లి సీరకట్టి – గజ్జెలు పైకెగసికట్టి ఉన్నవాళ్ల పిల్లావొచ్చేరా ఓరోరిమావా' వంటి శృంగారగీతాలూ ఉన్నాయి.

ఆర్ష సంస్కృతిలోనూ, స్త్రీల భక్తి విశ్వాసాల్లోను గౌరిదేవికి చాలా ప్రాముఖ్యం ఉంది. తెలంగాణాలో బతుకమ్మ, ఉత్తరాంధ్రలో గైరమ్మపండుగ, గైరమ్మ పాటలు చాలా ప్రాచుర్యం గలవి. వివిధ గ్రామాలనుండి ఈపాటలను కూర్మారావు సేకరించి అక్షరబద్ధం చేసారు. జానపద



వాఙ్మయంలోని చారిత్రక గేయాలను వీరగీతాలంటారు. కాటమరాజుకథ, బొబ్బిలియుద్ధం ఈకోవకు చెందిన గాథల్లో ప్రసిద్ధమైనవి. బొబ్బిలి కథను శిష్టకవులు కూడా కావ్యనాటకాలుగా మలిచారు. బొబ్బిలి యుద్ధానికి సంబంధించిన దాసర్ల సితార పాటను ఈ పుస్తకంలో చూడవచ్చు.

భారతదేశంలో స్త్రీ దేవతారాధన సింధునాగరికత కాలంనుంచి ఉంది. అకాల మరణం పొందిన స్త్రీలను పేరంటాలుగా కొలిచి వారికి గుడులుకట్టి పూజించే విధానం తెలుగునాట గ్రామాల్లో ఉంది. ఉత్తరాంధ్రలోని పేరంటాళ్ల గురించి విపులమైన విషయసేకరణ చేసారు రచయిత. తాను పుట్టిపెరిగిన ఉద్దానం ప్రాంతంలోని పాటలు ఈ పుస్తకంలో కూర్మారావు నిక్షిప్తం చేశారు. గోంగూరపాట ఇతర ప్రాంతాల్లోనూ ఉన్నా ఉత్తరాంధ్రలోనూ ఉంది. 'అత్తలేని కోడలుత్తమరాలు కోడల్లేని అత్త గుణవంతురాలు'పాట వ్యంగ్య వైభవాన్ని, హాస్యాన్ని సంతరించుకున్న స్త్రీల పాట. శ్రీకాకుళంజిల్లాలో 'మందులోడా ఓరిమాయలోడా – మామరారా గోపిచిన్నవాడ' అనేపాట వెనుకటిరోజుల్లో బాగా జనంనోళ్లలో నలిగిన పాట. బుర్రకథ దళాలు కూడా ఈ పాట పాడేవారు.

బద్రి కూర్మారావు జానపదుల పాటల్లో గిరిజనుల పాటల్ని ప్రత్యేకంగా చేర్చడం బాగుంది. గిరిజనుల వ్యవహారాలూ, వారి పండుగలు–పబ్బాలు వీటిల్లో ప్రసక్తమౌతాయి. 1913లో గిడుగు రామమూర్తి గారు సేకరించిన 'సవరపాటలు ' వాటి అనువాదం విశిష్టమైన సేకరణ.

కళింగాంధ్రలో ఒడియా–తెలుగుమిశ్రమ సంస్కృతి గోచరిస్తుంది. ఈపుస్తకంలో ఒడియావారి సంప్రదాయ భక్తి కీర్తనలు పొందుపరిచారు. రెల్లికులస్తులకు ప్రత్యేకభాష ఉంది. దీనికి లిపిలేదు. విశాఖనగరానికి చెందిన చెన్నా సన్యాసిరావు సేకరించిన రెల్లి పాటలూ ఈ పుస్తకంలో చూడవచ్చు. వాటికి తెలుగు అనువాదాలు పొందుపరిచారు.

ఉత్తరాంధ్ర నుండి ఉపాధికోసం ఇతర ప్రాంతాలకు వలసలు ఎక్కువ. ఈ కారణంగా వలస పాటలూ వెలిశాయి. 'రాపిల్లడో బిలాయెల్దుమా' పాట, దిమిలి పొడుగుమనిషి పాటగా ఒకప్పుడు జనాన్ని ఉర్రూతలూగించిన 'రంగమెల్లి పోయావో రంగోలిపెరంచూసావో' శ్రీరంగం నారాయణబాబు రచనగా వెలుగుచూసిన 'రంగమెళితేనేటి రంగైనవోడా' మొదలైన పాటలు మంచిసేకరణ. మందస జమీందార్లపై తిరుగుబాటు చేసిన వీరనారి గున్నమ్మపై గంగిరెద్దులవారు, మాలదాసర్లు పాడిన పాటలు ఆనాటి రైతాంగ ఉద్యమాన్ని కనకళ్లముందుంచుతాయి.

ఉత్తరాంధ్ర జానపదగీతాలకు నేటితరంలో ప్రతినిధి వంగపండు ప్రసాదరావు. ఉత్తరాంధ్రుల యాసలో, జానపదబాణీలో పేదల బ్రతుకు దృశ్యాల్ని పాటల్లో ఆవిష్కరింపజేసిన వంగపండు 'ఏం పిల్లడో వెల్దమొస్తవ – ఏంపిల్లో వెల్దమొస్తవా' శ్రీకాకుళం ఆ సీమకొండకు ప్రసిద్ధమైనపాట.

ఇంకా ఈ పుస్తకంలో శ్రమజీవుల పాటలున్నాయి. సినీగీతాల్లో ఉత్తరాంధ్ర జానపదుల బాణీలనూ చర్చించారు. ఆయా పాటల దిగువ పాడిన వారిపేరు, ఊరు పొందుపరిచారు. అద్భుతమైన పల్లెకారుల మౌఖిక మౌలిక సాహిత్యాన్ని ఎంతో శ్రమకోర్చి ఈ పుస్తకం ద్వారా అందించిన రచయిత కూర్మారావు అభినందనీయుడు. విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వ సంస్థలు చేపట్టాల్సిన బృహత్ సారస్వత యజ్ఞాన్ని నిర్వహించి ఉత్తరాంధ్రుల సంస్కృతికి నివాళులెత్తిన విశిష్ట పరిశోధకుడు కూర్మారావు. 'కళాంగాంధ్ర జానపదగేయాలు' సాహిత్యాభిమానులందరూ చదవదగిన పుస్తకం.

డా. దామెర వేంకట సూర్యారావు
విశాఖపట్నం-6.
సెల్ : 988 518 8431

# ఉనికి కోల్పోతున్న దళిత గరుడ సంస్కృతి

– ఘట్టమరాజు అశ్వత్థనారాయణ

గరుత్మంతుని వీపుమీద స్వారీ చేస్తున్న విష్ణువు చిత్రం మీరు చూసే ఉంటారు. ఈ చిత్రంలోని కల్పన (మిథో)ను అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. దళిత గరుడ సంస్కృతిపై సవర్ణ సంస్కృతి పెత్తనం చలాయించడమే ఈ ప్రతీక అర్థం. విష్ణువు అధికార వర్గానికి చెందినవాడైతే, గరుత్మంతుడు దళిత వర్గానికి చెందిన వ్యక్తి. విష్ణువుకు ప్రాధాన్యం లభించడం బ్రాహ్మణకాల కాలం నుంచే ప్రారంభమయిందనొచ్చు. కాని ఆ కాలానికి గరుత్మంతుడు విష్ణువుకు వాహనమై ఉండలేదు. ఎందుకంటే ఆ కాలానికి సంచార జాతికి చెందిన దళితులు గరుడ సంప్రదాయంగా రూపొంది ఉండలేదు. పైగా అప్పటికి దేశద్రిమ్మరులైన దళితులు ఓ వర్గంగా ఏర్పడి ఉండలేదు.

పురాణయుగంలో గరుడ సంప్రదాయం బలం పుంజుకోసాగింది. అది బౌద్ధమతాన్ని సమర్థించసాగింది. అంతేకాక గరుడ సంప్రదాయం సమాజంలో వేళ్ళూరసాగింది. క్రీ.పూ. ఒకటవ శతాబ్దం నుంచి గరుడ పురాణం రచింపబడే దానిని గరుడ సంస్కృతిని అణచివేసే గాథలు మిథ్ (కల్పన)ల రూపంలో ప్రచారంలో ఉండేవి.

గరుడులు నాథ, సిద్ధ, సంత కవులకు మునుపే జానపద సమాజంలో ప్రబల శక్తిగా రూపొంది ఉన్నారు. ఈ విషయాన్ని నిరూపించేందుకు బలమైన చరిత్రకాధారాల్ని చూపించటం కష్టం. కాని పురాణాల్లోని ఎన్నో కల్పన (మిథో)ల రహస్యాల్ని ఛేదించడంవల్ల గరుడ సంస్కృతి ప్రబలంగా ఉండేదని చెప్పొచ్చు. గరుడులు నేల నాలుగు చెరగులా తిరుగుతూ, పాముల్ని పట్టడం, చంపడం, పాముకాటుకు విరుగుడు వనమూలికలు అమ్మడం, తాయెత్తులు కట్టడం వగైరా వృత్తులు చేపట్టి సంఘంలో గౌరవ మర్యాదలు సంపాదించారు. అంతేకాక, పాముకాటువల్ల వెంటనే విషం కాటుకు గురైన మనిషి నరనరాల్లోకి ప్రాకిపోకుండా, ప్రభావకారియైన నల్ల రాతిని అమ్మేవాళ్ళు, ఈ గరుడులు పాముకాటు నుంచి మనుషుల్ని రక్షించేందుకు రకరకాల ఫలకారియైన చికిత్సలు చేసేవాళ్ళు. ఈ గరుడులు భయంకరమైన కాలసర్పాల్ని కూడా పట్టే ప్రావీణ్యం సాధించి ఉండేవాళ్ళు. పాములు తిరిగే ప్రాంతాల్లో ఈ గరుడులకు గొప్ప గౌరవ మర్యాదలు లభించేవి. ప్రసిద్ధ హిందీ కృష్ణ భక్త కవి సూరదాసు ఓ పదంలో ఇలా అంటారు :

*"డసీరీ మా ఈ శ్యామ్ భు అంగమ్ కారే*
*తంత్రో న పురై మంత్రోలాగే చల్ గుణీగణో హారే*
*ఆనహు బేగి గారుడీ గోవిందో జోయహి విషహి ఉతారే"*

(అమ్మో! కృష్ణుణ్ణి కాలసర్పం కాటేసింది. మంత్రతంత్రాల వల్ల ఎలాంటి ప్రయోజనం చేకూరలేదు. గొప్పగొప్ప వైద్యులు చేతులెత్తివేశారు. ఓ గరుడా తొందరగా వచ్చి, కన్నయ్య దేహంలో ప్రాకుతున్న పాము విషాన్ని తీసివేసెయ్.) గరుడ సంస్కృతి నాథ, సిద్ధ, సంత కవుల కవిత్వంపై గాఢ ప్రభావం ప్రసరింపచేసింది. జానపద జగత్తులో మాంత్రికుల, తాంత్రికుల, ఇతర జ్ఞానులకంటె గరుడుల ప్రభావం ఎక్కువగా ఉండేది. మహాకవి సూరదాసు తన కృష్ణభక్తి గీతాల్లో ఈ గరుడ సంస్కృతి ప్రభావాన్ని చక్కగా వ్యక్తం చేశారు. మన సమాజంలో పాములోళ్ళుగా చలామణీ అవుతున్న సంచార జాతి జనులు ప్రాచీన గరుడ సంస్కృతి వారసులంటే తప్పుకాదు. హిందీ కథాచక్రవర్తి ప్రేమ్‌చంద్ 'మంత్రో' అనే కథలో గరుడ సంప్రదాయస్థుల త్యాగం, కరుణ, దయా స్వభావాన్ని చక్కగా చిత్రించారు.

ప్రాచీన కాలంలో గరుడజాతి దళిత వర్గానికి చెందిన శ్రమజీవుల సముదాయంగా పరిగణింపబడేది. వీళ్ళు శూద్ర జాతికి చెందినవాళ్ళుగా గుర్తింపబడ్డారు. ప్రజోపయోగమైన తమ కార్యకలాపాలవల్ల ఈ గరుడ జాతి జనులు దళితులకు, వెనుకబడ్డ వర్గాలవాళ్ళకు, నిమ్న మధ్య తరగతి వాళ్ళకు, సవర్ణలకు గౌరవపాత్రులయ్యారు. పురోహితవర్గం గరుడుల పెరుగుతున్న ప్రాబల్యాన్ని సహించలేకపోయింది. వీళ్ళ సంస్కృతి తమ గౌరవ ప్రతిష్ఠల్ని ఎక్కడ, ఎప్పుడు దెబ్బతీస్తుందో అన్న భయం యాజమాన్య వర్గాన్ని పట్టిపీడించసాగింది. అందువల్లనే కాబోలు పురోహితవర్గం గరుడుణ్ణి విష్ణువుకు వాహనంగాచేసి గరుడ జాతిని కించపరిచింది.

పురాణాల ప్రకారం గరుత్మంతుని తల్లి వినత. తండ్రి కశ్యపుడు – ఇతనికి చాలామంది భార్యలుండేవాళ్ళు. వాళ్ళలో

ఒకరి పేరు కద్రు. రెండో ఆమె పేరు వినత. వినత కొడుకు గరుత్మంతుడైతే, కద్రు కుమారులు నాగులు (పాములు, నాగులకు, గరుడునికి బద్ధ వైరం. ఇది అసహజమైనదేమీ కాదు. వాస్తవానికి నాగులు, గరుడుడు ఇద్దరూ దళితులే. ఇద్దరిమధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమని మండిపోతుంది. అంత వైరమన్న మాట. సవర్ణులు నాగుల, గరుడుని మధ్య శత్రుత్వాన్ని పెంచేందుకు ఎన్నో రకాల పన్నాగాలు పన్నారు. నేటికీ ఈ సవతి బిడ్డల మధ్య వైరం, ద్వేషం రావణకాష్ఠంలా మండుతూనే ఉంది. కశ్యప ముని భార్యలైన కద్రు, వినతల పేర్లు పరిశీలిస్తే వాళ్ళ పేర్లలోనే వైరం ఉన్నట్లు తెలుస్తుంది. 'కద్రు' అంటే బుసకొట్టటం అని అర్థం. 'వినత' అంటే వంగింది, నడ్డిది, గూనిది అని అర్థం. పుట్టుకతోనే వైరత్వం, వైరుధ్యం కల వీళ్ళు ఇద్దరికీ ఇద్దరే! అలాంటప్పుడు ఈ తల్లుల స్వభావాలు, వీళ్ళ పిల్లలకు వొంటబట్టకుండాపోతాయా?

పాములంటే మనం ఈ రోజుల్లో కూడా గజగజా వణికిపోతాంకదా! గుప్తరాజుల కాలంలో పాముల వినాశనానికి ఓ మహాసర్పయోగం నిర్వహించబడింది. గారుడ సంప్రదాయానికి చెందినవాళ్ళు పాముల్ని పట్టుకొని, బుట్టల్లో పెట్టి, నాగస్వరం ఊదుతూ ఎలా ఆడిస్తుంటారో మనం చూసే ఉన్నాం. ఈ ప్రతీకల అర్థం గ్రహిస్తే గారుడ సంస్కృతి నాగ సంస్కృతిని ఎలా అణచిపెట్టిందో తేటతెల్లమవుతుంది. మన ప్రాచీన చరిత్రకారులు నాగుల గురించి ఎంతో రాశారు. కాని ఈ నాగుల్ని హింసించి, కాలరాచిన గారుడ సంస్కృతి గురించి మౌనం వహించటం ఆశ్చర్య విషాదాల్ని కలిగించే చారిత్రక సత్యం.

శాస్త్రాలు, పురాణాలు, చరిత్రలు, కావ్యాలు దళిత సంస్కృతిని బహిష్కరించాయనే చెప్పొచ్చు. ఈ బహిష్కరణ వెనుక ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక కారణాలు కూడా ఉండొచ్చు. ఇవన్నీ కలసి దళితుల్ని శాపగ్రస్తులుగా చేశాయి. నేడు విష్ణుభక్తులు దశావతారాల ఆరాధకులు దళితుల (గరుడుల) వీపుల మీద సవారి చేస్తున్నారు. గరుడుల నాగుల మధ్య వైరం నానాటికీ విజృంభిస్తూ ఉంది.

గరుడుని సోదరుని పేరు అరుణుడు. అరుణుడు అంటే మూగవాడని అర్థం. అతను సూర్యుని రథసారథి. ఇతను కూడా గరుడునిలాగే పెదవి విప్పడు. ఏదో తన పని తాను చేసుకొనిపోయే వ్యక్తి. పురాణకర్తలు ఈ అరుణుని (మూగవాని) గురించి చిలువలువలు కల్పించి ఎన్నో కథలల్లారు. చరిత్రకారులు కూడా అరుణుని గురించి పట్టించుకోలేదు. ఇక సాహిత్యకారులకా? అరుణుని నుంచి చెడ్డ కంపు కొట్టుకొచ్చేది. భారతదేశ చరిత్రలో బాబాసాహెబ్ అంబేడ్కర్ పుట్టుకొచ్చిన తర్వాత అరుణునిలాంటి మూగజీవాలకు మాటలొచ్చాయి.

రామాయణ, మహాభారత, పురాణాల ద్వారా ఈ గరుడ సంప్రదాయస్థులు సైన్యవిద్యలో రాటుదేలినవాళ్ళని తెలుస్తూంది. వీళ్ళు శత్రుసైన్యాలతో పోరాడేటప్పుడు గరుడ వ్యూహాన్ని పన్ని తమ రణ కౌశలాన్ని ప్రదర్శించేవాళ్ళు. ఈ గరుడ వ్యూహం ముందూ, వెనుకా చిన్నగా ఉంటుంది. రెండువైపులా బలపరాక్రమ సంపన్నులైన యోధులు మోహరించి ఉంటారు. ఆయుధాలు ధరించిన ఈ వీరుల్ని 'గరుత్మంతులు' అనే వాడుక. ఈ గారుడుల ఆయుధం పేరు 'గారుత్మతం'. ఇది చాలా పెద్దదీ, బరువైనదీను. వరాహ వ్యూహంలోని మధ్య భాగాన్ని కాస్తా పెద్దది చేస్తే, అది గరుడ వ్యూహమవుతుందని మనుస్మృతి (7/87) చెప్తుంది.

గారుడ సంప్రదాయస్థులు నృత్యవిశారదులు కూడా. వీళ్ళ నృత్యానికి 'గారుడప్లుత'మని పేరు. ఈ నృత్యం గురించి భరతముని నాట్యశాస్త్రంలో (అధ్యాయం – 4, శ్లోకం – 43) చెప్పాడు. ఈ నాట్యంలో లతావృశ్చిక కరణ ముద్ర ప్రదర్శింపబడుతుంది. చేతుల్ని తీగల్లాగా, కాళ్ళను తేళ్ళలాగా విస్తరింపచేసి, కడుపును నేలకు ఆనించి, తలను పైకెత్తి చూపడమే లతావృశ్చిక కరణాముద్ర. అలాగే గారుడ నర్తకులు వీరాసనంలో కూర్చొని రకరకాల భావాల్ని వ్యక్తీకరించేవాళ్ళు. గారుడులు పాటలు పాడటంలో కూడా ప్రవీణులే. గుడిసెలు, ఇళ్ళు కట్టడంలో కూడా వీళ్ళ ప్రతిభ ప్రశంసనీయమైనది.

పురాణాలు కశ్యప మునిని విచిత్ర పురుషునిగా చిత్రించాయి. ఇతను ఇద్దరు పెళ్ళాల ముద్దుల మొగుడు. ఇతనికి ఇద్దరు పెళ్ళాల జంటలుండేవి. కద్రు, వినతలు దితి అదితిలు ఇలా. కశ్యపునికి ఆరు జంటల భార్యలు – అంటే మొత్తం పన్నెండు మంది భార్యలన్నమాట. ఇతని సంతానంలో బ్రాహ్మణులతో పాటు శూద్రులు కూడా ఉండేవాళ్ళు. కశ్యప ముని భార్యలు కద్రు వినతలు. కద్రు పరమ గయ్యాళి. కాని వినతకంటె అందమైంది. మరి వినతేమో గూనిది. కశ్యప ముని వినతను కద్రుకు దాసిగా నియమించాడు. ఆమెకు శూద్రత్వం ఆపాదించాడు. గరుడులు సవర్ణులు కారని

మనుస్మృతిలో (మొదటి అధ్యాయం - 34-37 శ్లోకాలు) చెప్పబడింది. ఈ రోజుల్లో గరుడ సంస్కృతి దినదినానికీ కనుమరుగు అవుతూ ఉంది. ఈ విలుప్త ప్రాయ జాతి గురించి లోతైన పరిశోధనలు జరగటం అవసరం.

గారుడ సంస్కృతి ఏదైనా ఓ ఆదిమజాతి సంస్కృతికి చెందినది అయి ఉండొచ్చు. మొదట్లో ఈ సంస్కృతికి జనని అయిన వినతను దాసి, గూనిది, తలొంచుకొని బతికేది - వినతిజీవా అని అన్నారు. వినత మహాభారతంలో రోగాన్ని వ్యాపింపచేసే రాక్షసిగా చిత్రింపబడింది. వాల్మీకి రామాయణంలో కూడా ఈమె రాక్షసే. రావణాసురుడు అశోకవనంలో దాచి ఉంచిన సీతకు కావలి కాసే దానిగా వినతను నియమించాడు. శస్త్రచికిత్సా పితామహుడైన సుశ్రుతుడు మధుమేహం (చక్కెర వ్యాధి)వల్ల కలిగే ఓ పెద్ద పుండును 'వినత' అన్నాడు. ఈ 'పుండు' ప్రతీకను విశ్లేషిస్తే సుశ్రుతుని కాలంలో వినత (దళిత స్త్రీ) సవర్ణుల చక్కెర వ్యాధి వల్ల కలిగిన కురుపు అనొచ్చు. కాని పాపం ఆ సవర్ణులు రాబోయే రోజుల్లో ఈ కురుపే, ఈ పుండే - సవర్ణుల పాలిట మృత్యుదేవత అని ఊహించలేకపోయారు. ''నేడు భారతదేశంలో ఓ కుతూహలకరమైన మలుపు తిరిగింది. ఈ అసహజమైన పద్ధతిని అంతమొందించేందుకు నిరంతర ప్రయత్నాలు సాగుతున్నాయి" (9 మే, 1916 : కొలంబియా విశ్వవిద్యాలయం, న్యూయార్క్. గోల్డన్ వైజర్ గోష్ఠిలో చదివిన వ్యాస సారాంశం) అన్నాడు. అంబేడ్కర్ మాటల్ని మనం మరోసారి మననం చేసుకోవాలి.

86 ఏళ్ళ క్రితం (ఈ వ్యాసం సెప్టెంబరు - అక్టోబరు 2002, *ఉత్తరప్రదేశ్* అనే మాసపత్రికలో అచ్చయింది) డా. అంబేడ్కర్ 'నిరంతర ప్రయత్నం' అని వాడిన మాట నేడు 'నిరంతర ఆక్రమణ'గా మారింది. సవర్ణుల వాదనలో నేడు పస బాగా తగ్గినట్లు తోస్తుంది. బ్రాహ్మణుల్లోనూ, క్షత్రియుల్లోనూ జాత్యహంకారం ఇంకా కాసింత మిగిలిందేమోకాని, ఈ రోజుల్లో వీళ్ళు కూడా మనువు చెప్పిన మాటల్ని పూర్తిగా నమ్మడంలేదని తోస్తుంది. "శూద్రం తు కారయేత్ దాస్యం క్రీతం అక్రీతం ఏవ వా, దాస్యాయ ఏవహి సృష్టః అసౌ బ్రాహ్మణస్య స్వయంభువా." (మనుస్మృతి 3/13) మనువు చెప్పిన ఈ మాటల్ని నేటి అగ్రవర్ణులు నమ్మకపోవటానికి కారణాలేమిటో అందరికీ తెలుసు. స్వతంత్ర భారతదేశంలో కొత్త రాజ్యాంగ చట్టం అమలవుతున్నప్పటి నుంచి ఈ దేశంలో 'స్వయంభువులు' ఎవ్వరూ లేరన్న సంగతి అందరికీ తెలిసిందే.

గరుడ వంశీకులు మూలతః బుద్ధభగవానుని అనుయాయులన్న సంగతిని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. పురాణాలు కశ్యపుణ్ణి గరుత్మంతుని తండ్రిగా ఘోషిస్తున్నాయి. కశ్యపుణ్ణి వ్యక్తిగా మాత్రమేకాక ఓ సంప్రదాయకంగా భావించేందుకు ఆస్కారముంది. కశ్యపుడు బౌద్ధమతంలో మహాకశ్యపుడిగా పేర్కొనబడ్డాడు. ఇతను అజాతశత్రువు పరిపాలనాకాలంలో రాజగృహానికి సమీపంలో ఉన్న వైభారపర్వతంలోని సప్తపర్ణి అనబడే గుహలో సుమారు 500 మంది స్థవిరులతో సభ నిర్వహించాడు. ఆ సమావేశంలో ఉపాలి బుద్ధభగవానుడు ఉపదేశించిన వినయపిటకాన్ని వెలుగులోకి తెచ్చాడు. అజాతశత్రువు బుద్ధుని సమకాలికుడని చరిత్ర చెపుతుంది. అందువల్ల మహాకశ్యపుడు కూడా బుద్ధుని సమకాలికుడని చెప్పొచ్చు. ఇతను బౌద్ధయానం నాటి ఓ నాయకుడని భావించవచ్చు. ఈ సాక్ష్యాలన్నింటి ద్వారా గరుడ సంస్కృతి ప్రాచీన కాలంలో సమాజ శ్రేయస్సు కోసం పాటుపడే దళిత సంస్కృతి అని తెలుస్తుంది. కాని నేడిది అదృశ్యమైపోతూండటం విచారకరం.

ఆ రోజుల్లో శ్రావణ భాద్రపద మాసాల్లోనయినా గరుడ సంప్రదాయానికి చెందిన పాములవాళ్ళు కనపడేవాళ్ళు. కాని ఈనాడు వాళ్ళు కనపడటం అరుదు. పురాణాల్లో గరుడ సంస్కృతికి చెందిన ప్రతీకలు, కల్పనలు ఉన్నాయి. వీటిని సునిశితంగా పరిశీలిస్తే, వాటి నేపథ్యంలో దళిత గరుడ సంప్రదాయపు సర్ప కులం వాళ్ళ ఆర్తనాదాలూ, హాహాకారాలు లీలగా అయినా వినపడకపోవచ్చు.

గరుడులు, నాగులు శూద్రులే అన్న సంగతి తెలుసుకున్నాం. అలాంటప్పుడు తరతరాలుగా వీళ్ళిద్దరూ పరస్పరం బద్ధ శత్రువులుగా తన్నుకు చావడం ఏమిటి? దళిత సోదరులిద్దరి మధ్య చీలికలు సృష్టించి, వాళ్ళను ఆజన్మవైరులుగా మలచినవాళ్ళెవరో, అన్వేషించాలి. చరిత్రకారులు, పురాతత్త్వవేత్తలు చేదోడువాదోడుగా పనిచేసే మనకు గరుడ సంస్కృతిలోని దాచేస్తే దాగని సత్యాలెన్నో తెలిసే అవకాశం ఉంది.

(హిందీ : డా. భవదేవ పాండేయ్)

ఘట్టంరాజు అశ్వత్థ నారాయణ
ఫోన్ : 0 996 408 2076

# పురిటిగడ్డ

– వనజ తాతినేని

ఇదిగో మేస్త్రీ.. బియ్యం కొలుస్తాను రా! గోతాము సంచీ తెచ్చుకో అని పిలిచింది వర్ధనమ్మ.

'సంచీలు మా దగ్గర ఏడ ఉండాయమ్మా! ఊరినుండి నేరుగా ఇక్కడికే కదా వచ్చాం' అనుకుంటూ వచ్చాడు మేస్త్రీ.

ఏం పేరు నీది ? ఏ వూరు మీది ? ఎంతమంది వచ్చారు?

నా పేరు ఆర్ముగమ్ అమ్మా ! తిరుత్తిణి దగ్గర సింధురాజపురం అమ్మా ! మొత్తం ఇరవై మందమ్మా!

వరుస ప్రశ్నలకి వరుస సమాధానాలు వింటూ సన్నగా నవ్వుకుంది రాధ.

డిసెంబర్ నెల మలి పక్షపు రోజులు వచ్చేసరికి ప్రతి యేడు లాగానే ఆ వూరికి వలస కూలీలు చేరుకుంటున్నారు, చెరుకు నరకడంలో బాగా ఆరి తేరినవాళ్ళు. అందరిని పరిశీలనగా చూస్తూ ఎంతమంది ఉన్నారో కళ్ళతో లెక్కేస్తుంది రాధ. మొత్తం ఇరవై మంది. అందులో పన్నెండు మంది పైగా మగవాళ్ళు ముగ్గురు ఇరవైయేళ్ళ లోపు మగ పిల్లలు, నలుగురు ఆడవాళ్ళు ఉన్నారు. మేస్త్రీ చెప్పిన లెక్క సరిపోయిందత్తమ్మా.

సర్లే ! మేమే సంచీ ఇస్తాం కానీ కాస్త ఆ బియ్యం బస్తాని కిందికి దించి గోడకి ఆనించి నిలబెట్టి బస్తా దారం విప్పు అంటూ కొట్టు గదిలోకి తీసుకెళ్ళి బియ్యంబస్తాల మేటు చూపించింది. ఏభై కేజీలున్న బియ్యం బస్తాని అతను కిందికి దించడానికి తంటాలు పడుతుండగా ఈ లోపు నేను శేరు డబ్బా తీసుకుని వస్తాను అని లోపలి వెళ్ళింది. ఆమె డబ్బా తెచ్చేలోపు సర్రుమనుకుంటా ఒక్క లాగుతో దారాన్ని లాగేసి బస్తాలో ఉన్న బియ్యాన్ని చేతిలోకి తీసుకుని ముక్కు దగ్గర పెట్టుకుని వాసన చూస్తున్నాడు. కోటా బియ్యం కాదులే ! సన్నాలు వడ్లు కొని మిల్లులో పట్టించుకొచ్చిన బియ్యం. ఈ బియ్యం అయిపోయేటప్పటికి మీరు యెనిమిదెకరాల చెరుకు కొరవ పెట్టకుండా కొట్టెయ్యాలి అంటూ ఒక ఖాళీ యూరియా సంచీని ఆర్ముగమ్ కి ఇచ్చి ముందుగా ఒక గుప్పెడు బియ్యం తీసుకుని కళ్ళకద్దుకుని ఆ గోతాములో వేసింది. తర్వాత ఒకటి రెండు, ఆరునొక్కటి ,పన్నెండునొక్కటి, పద్దెనిమిది పంతొమ్మిది ఇరవై అని అక్కడితో ఆపేసి అంతేగా ఇరవయ్యి మందేగా అంది. అవునమ్మా అన్నాడు.

"వీళ్ళు ఇళ్ళ దగ్గర రేషన్ బియ్యం తిన్నా ఇక్కడికొచ్చి జీలుకర్ర మసూరి బియ్యం తిన్నాం అన్నట్టు మాట్లాడతారు" అంది కోడలితో

"అట్టా ఏమీ కాదులే అమ్మా ! మాకు ఉప్పుడు బియ్యం తినేది అలవాటు గందా, అందుకే వాసన చూసా" అని అన్నాడు తెలివిగా

ఆ మాటతో శాంతించిన వర్ధనమ్మ కొట్టంలో అటక మీద దబరలు, బిందెలు,కూరాకు సట్టిలు, గరిటలు అన్నీ ఉన్నాయి. అయన్నీ కిందకి దించండి. నేనొచ్చి ఎన్ని ఇచ్చానో లెక్కపెట్టుకుంటాను అంది.

బేటా డబ్బులియ్యడం మర్చిపోయావమ్మా అని అక్కడే నిలబడి గుర్తు చేసాడు ఆర్ముగం. ఎంత? మనిషికి ఇరవయ్యా! చెరుకుకి ఫ్యాక్టరీ వాళ్ళు ఇచ్చే డబ్బులు నాలుగేళ్ళుగా పెరగలేదు మీకు ఇచ్చేది మాత్రం ఏ యేటికాయేడు పెరిగిపోతుంది అనుకుంటూ నాలుగొందలు తెచ్చి ఇచ్చింది.

ఫ్యాక్టరీకి వెళ్ళి ఫీల్డ్ మేన్ ని పట్టుకుని నాలుగు రోజులకి సరిపడా కటింగ్ ఆర్డర్ కాగితాలని తీసుకుని ఇంటికొచ్చిన నాయుడు చొక్కా విప్పి గోడకున్న వంకీకి తగిలిస్తూ నిన్న ఫీల్డ్ మెన్ చెపుతున్నాడు, ఈ యేడు టన్నుకి మూడొందలు ఇస్తే కానీ చెరుకు తోటలోకి దిగమని అన్నారంట. ఎన్ని టన్నులు నరికితే అన్ని డబ్బులు ఆళ్ళకి. వాళ్ళ పనే బాగుంది. ఎకరాలున్నాయన్నమాటేగానీ మనకి చేతికొచ్చేదాంట్లో అన్ని ఖర్చులు తీసేస్తే మనకి అయ్యే మిగుల్తున్నాయి. అంత దండుగ మారి సేద్యమయిపోయింది అని అంటూ వచ్చి వరండాలో ఉన్న కుర్చీలో కూర్చున్నాడు

మనకి బెజవాడ పక్కన ఉండప్పుడూ,బళ్ళారి దగ్గర ఉన్నప్పుడూ ఇదే దిగులు. అక్కడ అమ్ముకొచ్చి ఇక్కడ కొని మళ్ళీ అయ్యే తిప్పలు. పిల్లి పిల్లలని నోట బెట్టుకుని ఏడు ఊళ్ళు తిరిగినట్టు అరవాళ్ళు పొట్ట బట్టుకుని తిరుగుతుంటే మనం పొలాలు బట్టుకుని నెత్తి నిండా అప్పులు బెట్టుకుని ఊరూరా తిరుగుతా ఉండాము అంది ఆయన పక్కనే ఉన్న ఇంకో కుర్చీలో కూర్చుంటూ.

ముందు ముందు సేద్యం చేసేది మరిచిపోతే తప్ప అప్పుల బాధ తగ్గేటట్టు లేదు రణం బాధ రుణం బాధ ఒకటే

నన్నారు పెద్దాళ్ళు. అట్టాగే ఉంది ఇప్పుడు మన పని అన్నాడు. కళ్ళల్లో ఏవేవో దిగుళ్ళు కట్టుకొయ్యకి కట్టేసిన పెంకి పడ్డల్లే తిరుగుతుండగా గడ్డం కింద చేయి పెట్టుకుని మౌనంగా కూర్చుంది వర్ధనమ్మ.

కోడలు రాధ అత్తమామలిద్దరికి కాఫీ గ్లాసులు ఇచ్చి వచ్చి వరండా అరుగు పై కూర్చుని కొడుక్కి పాలు తాగిస్తూ ఉంది.

ఆమ్మా! ఇందాక అవ్వ బియ్యం కొలిచేటప్పుడు ఆరునొక్కటి, పన్నెండు నొక్కటి పదహారున్నొక్కటి అంటుంది ఏమిటమ్మా. నువ్వూ, మా మిస్ అట్లా అనమని నాకు చెప్పలేదుగా అన్నాడు. నాలుగేళ్ళ అబ్బయ్య బుర్ర నిండా ప్రశ్నలే ! రాధ ఓపిగ్గా అన్నింటికీ సమాధానాలు చెపుతుంది. వాళ్లకి మనం మాట్లాడే తెలుగు రాదనీ అట్టా చెప్పిందిలే అవ్వ. నువ్వు పోయి హోం వర్క్ చేసుకో అబ్బయ్యా ! మా నాన్నవి కదూ అని బతిమలాడింది. తల అడ్డంగా ఊపుతూ ఊహూ ! నేను తర్వాత చేసుకుంటా. ఇప్పుడు వాళ్ళని నేను కూడా చూస్తా అన్నాడు. సరే రా పోదాం అంటూ కొడుకుని చంకన వేసుకుని కొట్టం దగ్గరికి వెళ్ళింది రాధ.

అప్పటికే కొట్టంలో ఉన్న పశువులన్నింటిని రోడ్డుకి ఆనుకుని వున్న చెట్లకి కట్టేసి కిందంతా శుభ్రం చేసి చెట్టు కింద పోసిన ఇసుక మట్టిని తెచ్చి గోతుల్లేకుండా సమానంగా చేసుకున్నారు. ముగ్గురు మనుషులు తోటలోకి వెళ్లి టెంకాయ మట్టలు కొట్టుకొచ్చి ఒక్కో మట్టని రెండు భాగాలుగా నరికి నాటిన వెదురు బొంగులకి ఆకులని ముడేసి కట్టి చుట్టూరా దడులు కట్టేశారు. వాములో నుండి వరి గడ్డి తెచ్చి నేలంతా పరిచేసి పడుకోవడానికి వీలుగా తయారు చేసుకున్నారు.

రాధ చంకన ఉన్న అబ్బయ్య వాళ్ళు చేస్తున్న పనిని శ్రద్ధగా చూస్తున్నాడు. అమ్మా! వాళ్ళు ఎందుకు అట్లా చేస్తున్నారు అడిగాడు ఆసక్తిగా. వాళ్ళది ఈ వూరు కాదుగా, ఇక్కడ వాళ్లకి ఇల్లు లేదు. రాత్రిపూట పడుకోవడానికి ఇల్లు తయారు చేసుకుంటున్నారు అని చెప్పింది.

వర్ధనమ్మ అక్కడికి వచ్చి వీళ్ళు చూడు ఎంత తొందరగా అన్ని ఏర్పాటు చేసుకున్నారో. మనవాళ్ళకి అసలిట్టా చేతకానేకాదు. ఈ అరవాళ్ళు ఉట్టి మాయా ముండా కొడుకులు ఎక్కడైనా చెలాయించుకుని బతికేస్తారు అంది.

మరి నేను ట్రక్కులో పడుకుంటాననంటేనే కింద పడుకుంటే తేళ్ళు, పాములు తిరుగుతాయి వద్దు అంటుందిగా



చెరుకు నరుకుతున్న నిలువ కూలీలు

అవ్వ. వాళ్ళు కింద పడుకుంటే వాళ్ళని కుట్టవా అయ్యి అని అడిగాడు. కొడుకు చెంపకి చెంప ఆనించి ముద్దు పెట్టుకున్నటు శబ్దం చేసి, బంగారం వాళ్ళని అవి ఏమీ చేయవు. వాళ్ళ దగ్గర చెరుకు నరికే కత్తి ఉంటుందని వాళ్ళ జోలికి వెళితే కత్తితో కొడతారని వాటికీ తెలుసు. అందుకే వాళ్ళ జోలికి అవి వెళ్ళవు అని మాయ చేసింది అంతకన్నా ఏమీ చెప్పలేక.

అటక మీద నుండి సామాను దించి వాళ్లకి ఇచ్చినవన్నీ లెక్క పెట్టుకున్నాక కరంటు వైరు బల్బులు ఇవ్వండమ్మా అని అడిగారు. అవి ఇచ్చినతర్వాత కిందేసుకుని పడుకోవడానికి పట్టాలు ఇవ్వండి అని అడిగాడు ఆర్ముగం. పట్టాల్లేవ్, గిట్టాల్లేవ్ మీరు ఇంటి దగ్గరనుండి దుప్పట్లు తెచ్చుకోకుండానే వచ్చారా అయ్యేసుకుని పడుకోండి. అదిగో అక్కడే ఉంది అంగడి. అన్నీ అక్కడే దొరుకుతాయి వెళ్లి కొనుక్కోచ్చుకోండి అడక్కముందే అవెక్కడ అడుగుతారో అన్నట్టు గబా గబా చెప్పేసి లోపలి వెళ్ళిపోయింది.

గట్టిగా కొడితే ఇరవై రోజులకల్లా చెరుకు కొట్టడం అయిపోతుంది. పెద్ద పండక్కి ముందే వీళ్ళు వెళ్ళిపోతే బాగుండు. అబ్బయ్యకి సెలవలు ఉన్నాయి కాబట్టి పుట్టింటికి వెళ్ళవచ్చు అని లెక్కలేసుకుంది రాధ...

ఈసారి బ్యాచ్‌లో నిండు గర్భిణీగా ఉన్న స్త్రీ కూడా వచ్చింది మేస్త్రీ ఆర్ముగం భార్య. పేరు అలివేలు. ఒంటి ఊపిరితో తిరుగుతూ ఉంది. చెరుకు తోటలో పనికి వెళ్ళకుండా వాళ్లకి వసతి ఇచ్చినచోటనే ఉండి అందరికి వంట చేసి పెడుతుంది. ఎన్నో కానుపు అడిగింది వర్ధనమ్మ. కుడి చెయ్యి పైకెత్తి వ్రేళ్ళు దూరం చేసి చూపించింది. వచ్చిన

కూలీలకి కొద్దిగా తెలుగు మాత్రమే తెలుసు అవసరమయినప్పుడు ఆ తెలిసిన తెలుగులోనే అర్థమయ్యేటట్లు చెప్పేవాళ్ళు. పని చేయించుకునే యజమాని పనికి సంబంధించి ఏమైనా చెప్పబోతే మాత్రం చేతులు దూరంగా విదిల్చి అరచేతులు ఆకాశానికి చూపిస్తూ మీ మాటలు నాకు తెలియడం లేదు అంటూ తప్పించుకుంటారు కొందరు పని దొంగలు.అలాంటి మనిషేమో అనుకుంది కానీ అలివేలు అసలు మాట్లాడటమే రాని మనిషి అని కాసేపటికే అర్థమయ్యింది రాధకి.

అంతకు ముందు నలుగురు ఆడపిల్లలు ఉన్నారని చెప్పు కొచ్చింది. ఈ సారి అయినా మగ పిల్లవాడు పుడతాడని గ్యారంటీ ఏమిటే ? అసలే ఓపిక తక్కువగా కనబడుతున్నావ్. ఎవరు పుట్టినా ఆపరేషన్ చేయించుకో అని చెపితే ఆ సంగతి నా మొగుడు చెప్పాలి అది నా ఇష్టం కాదు అంది సైగలతో.

“తినడానికి తిండి లేకపోయినా పిల్లలు మాత్రం దండిగా కావాలి వీళ్ళకి. ఆడైతే ఏమిటి మగ అయితే ఏమిటీ ? ఇద్దరు చాలరా ఇంటికి.మంది ఎక్కువైతే మజ్జిగ పలుచన” అత్తగారి అవగాహన, ముందు చూపు ఎలాంటిదో తెలిసిన రాధ ఏమీ మాట్లాడలేదు.

వర్ధనమ్మ చెప్పుకుంటూ పోతూనే ఉంది. ముగ్గురు కొడుకులని పెట్టుకుని తలా నాలుగెకరాలయినా ఇవ్వకపోతే ఎట్టాగని ఇచ్చిందమ్మి ఇక్కడ కొన్నాం. అక్కడికి పోయి మాత్రం ఏమి సంపాదిచ్చారు. పిల్లలకి సరైన చదువూ లేదు ఉద్యోగం లేదు. మీరు తప్ప ఇక్కడున్నాళ్ళంతా వైభోగంగా బతుకుతున్నారు అని దెప్పుతున్నారు బెజవాడ వాళ్ళు. మీకు ఒక్కొక్కళ్ళు చాలులే. వాళ్ళని బాగా చదివిచ్చుకుంటే చాలు అంది.

సూక్ష్మంగా ఆమె ఏమి చెప్పిందో అర్థం చేసుకుంది రాధ. అయినవాళ్ళు చూసేచిన్న చూపు, ఎగతాళి మాటలు,ధన బలం ముందు వ్యవసాయాన్ని నమ్ముకుని బక్క చిక్కి పోతున్న తమ బతుకులని తలుచుకుని అత్త బాధ పడుతుంది అని అర్థమై అన్ని కాలాలు ఒకటిగా ఉండవు. మనకి మంచి కాలం ముందు ఉంది బాధపడకు అత్తమ్మా అంది.

మనసులో మాత్రం ఇంకోటి అనుకుంది. ఒకొకరికి ఒకోదానిపై ప్రీతి. అర్ముగమ్ కి మగ సంతానం కావాలని, అత్తమ్మ కేమో బంధువుల మధ్య బిడ్డలు రాయసంగా బతకాలని.

అదే రోజు సాయంత్రం రాహుకాలం లేకుండా చూసి చెరుకు తోట దగ్గర కెళ్ళి భూమికి పసుపు కుంకుమ పెట్టి పూలు జల్లి పూజ చేసి కొబ్బరి కాయ కొట్టి కత్తులకి హారతిచ్చి చెరుకు నరకడం మొదలుపెట్టారు. కానుకగా పూజ పళ్ళెంలో నాయుడు పెట్టిన రెండు వందలు తీసుకెళ్ళి ఊర్లోకెళ్ళి చికెన్ తెచ్చుకుని ఆపూట విందు చేసుకున్నారు.

మరుసటి రోజు నుండి పొద్దు పొడవక ముందే ప్యాంటూ చొక్కా తొడుక్కుని నోట్లో పదుంపుల్లేసుకుని అలివేలు మినహా అందరూ తోటకేళ్ళేవాళ్ళు. పెద్దవాళ్ళు చెరుకు నరికి ఆకు చెలిగి వెనక్కి పడేస్తూ ఉంటే చిన్న పిల్లలు ఆడవాళ్ళు ఆ చెరుకు గడలని మనిషి మోయగల్గే బరువు ఉండేటట్టు కట్టలు కట్టేవారు. ఇంటికి వచ్చేటప్పుడు చెరుకు దవ్వ మోసుకొచ్చి పశువుల ముందు వేసేవారు. అందుకు గానూ అందరికి టీ పెట్టుకుంటే సరిపోయినన్ని పాలు పోసేది వర్ధనమ్మ. రాత్రిపూట ఎక్కువగానే వండిన అన్నంలో నీళ్ళు పోసి చద్ది చేసి పెట్టేది అలివేలు. దాంట్లోకి ఏదో ఒక పచ్చడి నూరి పెడితే తొమ్మిదింటికి మేస్త్రీ వచ్చి సద్ది దబరని పచ్చడిని నెత్తిన పెట్టుకుని కయ్యల్లోకి మోసుకెళ్ళేవాడు. చేను చుట్టూ వేసిన కంప చెట్లు నుండి ఎండిపోయిన చెట్ల కొమ్మలు లాగి పుల్లలు నరికి ఇవ్వడం, మార్కెట్ కి వెళ్లి కూరగాయలు,వంటకి కావాల్సిన సామాను తెచ్చివ్వడం మధ్యాహ్నం వంటకి సాయం చేయడం చేస్తూ ఉండేవాడు. అందరూ మధ్యాహ్నం అన్నానికి వచ్చి ఒక గంట విశ్రాంతిగా ఉండి మళ్ళీ పరుగులు పెట్టేవారు. వాళ్ళు వచ్చేసరికి వంట ముగించి పొయ్యి మీద నీళ్ళు పెట్టి ఉంచేది అలివేలు. చీకటి పడే సమయానికల్లా ఇంటికి చేరుకొని ఒక్కొక్కరే వేడి నీళ్ళతో స్నానం చేస్తూ రేడియోలో తమిళ్ పాటలు పెట్టి పాటకి అనుగుణంగా గొంతు కలుపుతూనో అన్నం తినే పళ్ళేల పై దరువేస్తూనో సందడి చేసేవారు.

ఆడవాళ్ళు పొద్దస్తమ్ ఒంగి పంజేసి నడుం పీక్కు పోతుంది, కాస్త జండూ బామ్, టైగర్ బామో ఉంటె పెట్టమ్మా అని వర్ధనమ్మ దగ్గరికి వచ్చి అడిగితే ఇంకొకళ్ళు కాస్త కొబ్బరి నూనె ఎయ్యమ్మా తల మండిపోతంది అని అడిగే వాళ్ళు. వాళ్ళు అడిగింది ఇచ్చినా ఇవ్వకపోయినా అలివేలు కి మాత్రం పొద్దునపూట నాస్టా పెట్టి ఇచ్చేది. మధ్యాహ్నం పూట అన్నంలోకి మజ్జిగ పోసేది.ఎంత బలహీనంగా ఉందొ ఎట్టా ఒడ్డున పడుద్దో ఏమో అనేది.

మగవాళ్ళు ట్రాక్టర్‌కి కానీ లారీకి కానీ లోడింగ్ చేస్తున్నప్పుడు ఆడవాళ్ళు పని లేకుండా ఖాళీగానే ఉండేవాళ్ళు. బట్టలుతుక్కుంటూ, తలలో పేలు దువ్వి పోసుకుంటూ అప్పటికప్పుడు కోళ్ళు కొనుక్కొచ్చి వాటిని కోసి కూరవండుకుంటూ సందడిగా ఉండేవాళ్ళు. అప్పుడప్పుడూ కొందరి మధ్య తగువులు. దినంబూ ఒక లారీకి, ఒక ట్రాక్టర్‌కి సరిపడినంత చెరుకు నరికేవాళ్ళు.

ఒకరోజు చేటలో చిర్రాకు వేసుకుని గడ్డిపోచలు ఏరేస్తూ, ముదురు కాడలు తీస్తూ కూర్చున్నరాధ దగ్గరికొచ్చి కాస్త ఎడంగా క్రిందే కూర్చుంది అలివేలు. ఎందుకట్టా ఎక్కడబడితే అక్కడ కూర్చుంటావు. లేచేటప్పుడు కష్టంగా ఉంటది కదా ఆ అరుగు మెట్టుపై కూర్చో పో అంది. నీతో మాట్లాడాలని అని సైగ చేసింది. నాతోనా? ఏమిటి చెప్పు అంది రాధ. సైగలు చేసుకుంటూ చెప్పుకొచ్చింది. ఊర్లో ఉన్న పెద్ద కూతురు వయసు కొచ్చిందంట. సాంగ్యంగా అన్ని వేడుకలు చేయాలని బంధువులందరూ అంటున్నారంట. పప్పన్నాలు లేవు ఏమీ లేవు శుభ్రంగా స్నానం చేయించి బడికి పంపించేయమను అని సైగ చేసింది. తల అడ్డంగా ఊపి నోటి మీద చెయ్యేసుకుని అట్టా మాట్లాడటం, చేయడం తప్పు అన్నట్టు అభినయించి చూపించింది. ఏవో! ఎట్టాగొట్టా చేసుకోపో అని విసుక్కుని పిల్ల పెద్దయ్యాక కూడా ఇంకా పిల్లలని కంటూ కూర్చుంటావా? ఇకపై పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకో అంది.

ఒక నవ్వు నవ్వేసి కేలండర్ చూపిచ్చి పిల్ల పెద్దదైన రోజు మంచి రోజేనా కాదా చూసి చెప్పమని అడిగింది. పిల్ల పెద్దదైన రోజు కూడా మంచి చెడూ అని నిర్ధారించడం ఏమిటీ? కేలండర్ చూసి మంచిది కాదంటే మళ్ళీ అందుకూ శాంతులు పూజలు అంటూ ఇంకా వెర్రి చేష్టలు చేస్తారు అని మనసులో అనుకుని ఈ కేలండరు మీ కేలండర్ ఒకటి కాదు మీ వూర్లో మీ కేలండర్ లోనే చూడాలి అని చెప్పింది. ఆర్ముగమ్ కూడా ఆ మాట నిజమేనని చెప్పాక మెదలకుండా ఊరుకుంది. అలివేలుతో మాట్లాడి మాట్లాడి పది రోజుల్లోనే రాధకి కూడా సైగలు చేసి మాట్లాడటం అలవాటై పోయి కొడుకుతో కూడా అల్లాగే మాట్టాడుతుంటే అబ్బయ్య కూడా అలాగే సైగలు చేసి మాట్లాడే వాడు. ఆ మూగది ఇక్కడి నుండి పోయేటప్పటికి మీకు మూగ భాష బాగానే వచ్చేటట్టు ఉంది. టీవిలో ఆదివారం వార్తలు చదివే ఉద్యోగానికి అప్లై చేసుకోవచ్చు అని చతురాడేవాడు అబ్బయ్య వాళ్ళ నాన్న.

నిండు కుండని నడుంపై పెట్టుకుని మోస్తూ రెండో కుండని పొట్టలో మోస్తూన్నట్టు నిదానంగా నడుస్తూ వంట చేస్తున్న చోటుకి పంపు దగ్గరికి తిరుగుతున్న అలివేలుని ఆశ్చర్యంగా చూస్తూ ఆమె పొట్ట అలా ఎందుకుంది అని అడిగేవాడు అబ్బయ్య. అందులో చిన్ని బాబు ఉన్నాడు. కొన్నాళ్ళు అయినాక బయటకి వస్తాడు అని చెప్పింది. నేను కూడా అట్టాగే వచ్చానా అమ్మా అన్నాడు. అవును కదా, నీకు చెల్లో తమ్ముడో పుట్టేటప్పుడు నేను అలాగే ఉంటాను అంది. గబుక్కున అమ్మ వొళ్ళో పడుకుని చీర చెంగు లోపలికి చెయ్యి దూర్చి అమ్మ పొట్టని ప్రేమగా తడిమాడు. మురిపంగా కొడుకుని ముద్దు పెట్టుకుని చెల్లి కావాలా తమ్ముడు కావాలా అని అడిగింది రాధ. ఇద్దరూ కావాలి అన్నాడు. పెద్దవాళ్ళు తప్ప పిల్లలెవరూ కనబడని ఊరు చివర పొలంలో ఉన్న ఇల్లు వాళ్ళది. ఆడుకోవడానికి తన ఈడు పిల్లలు లేని అబ్బయ్య కి అది బాగా లోటుగా ఉండేది కూడా !

మధ్యలో అనుకోకుండా వర్షం కురిసి నాలుగు రోజులు పని ఆగిపోయింది, బియ్యం,బేటా ఇస్తూ ఈ వాన ఎప్పుడు ఆగి పొద్దో పని లేకుండా రోజుకి ఇరవై మందిని భరించడం కష్టం అయిపోతుంది అనుకున్నాడు నాయుడు. వాన తగ్గి బాగా ఎండా వచ్చేసరికి ప్యాక్టరీ రిపేరుకి వచ్చింది. అది బాగై నాలుగెకరాలు చెరుకు కొట్టేసరికి ప్యాక్టరీ నెమ్మదిగా ఆడటం వల్ల వెళ్ళిన లోడ్లు వెళ్ళినట్లే ఆగి పోయి ఉండాయని కటింగ్ ఆపారు.ఎండలు ముదరకుండానే చెరుకు నరికితే టన్నేజీ బాగా వస్తుందని ఆశ పడితే ప్యాక్టరీ ఇట్టా ఏడిపిస్తుంది. ఇక చెరుకు నరకడం పడకన పడినట్టే అనుకుని

ఆర్ముగం! మళ్ళీ కటింగ్ ఆర్డర్ ఎప్పుడు ఇస్తారో తెలియకుండా ఉంది. ఒక పదిహేను రోజులు తర్వాత రండి. దామరమడుగు మనోహర్ నాయుడు నాయుడు పేట ప్యాక్టరీకి తోలుతున్నాడంట. బ్యాచీ కావాలని అడిగాడు. మిమ్మల్ని పంపుతానని చెప్పా, గబాల్న అక్కడికి పోండి లేకపోతే ఎవరో ఒకరు పోతారు అక్కడికి అని తొందరపెట్టాడు నాయుడు.

నాయనా! ఈళ్ళని పంపించేస్తే మళ్ళీ బ్యాచీ దొరుకుద్దో లేదో, ఈళ్ళతో వరి కోతలు కోయిస్తే సరి అన్నాడు. వరి కోత కూలికి ఈళ్ళు పనిచేయరు. చెరుకు నరికినంత కూలి అడుగుతారు. జడ కట్టకుండా పెరిగిన చెరుకు ఎడాపెడా పడి నరకడం ఆలస్యం అవుతుందని టన్నులు ఎక్కువ రాలేదని

గోల చేస్తున్నారు. ఇప్పుడు కూడా ఉండమన్నామంటే అడ్వాన్స్ ఇవ్వమని పీక్కు తింటారు. తర్వాత అయిపు లేకుండా జారుకుంటారు. అవసరమైనప్పుడు పది రూపాయలు ఎక్కువ పడేసయినా పని చేయించుకోగలం కానీ పని లేనప్పుడు వీళ్ళని జాలిపడి కూడా భరించలేము ఆళ్ళని పోనీయరా అన్నాడు కొడుకుతో. నాయన చెప్పిన మాట నిజమే అనుకున్నాడు చిన్న నాయుడు. ఆ రోజే అందరూ మూటాముల్లె సర్దుకుని దామరమడుగు వెళ్ళడానికి సిద్ధమై పోయారు. వెళ్ళేటప్పుడు అలివేలు రాధ దగ్గరికి వచ్చి చీరలిమ్మని అడిగింది. రెండు కాటన్ చీరలిచ్చింది. ఇంకా ఈడీడ ఎందుకు తిరుగుతావ్ గాని ఇంటికిపో, నెలలు నిండే టప్పుడు ఇంటికాడ ఉంటే మంచిది అంది వర్ధనమ్మ. తలూపి నవ్వుతూ అమ్మ చంకలో ఉన్న అబ్బయ్య బుగ్గ లాగి ముద్దు పెట్టుకుంటూ వెళ్ళింది.

ఇది జరిగిన రెండో నాడు పెద్దాసుపత్రి గేటు పక్కన గోడకానుకుని ఏడుస్తూ కూర్చున్నాడు ఆర్ముగం. చేతిలో చిల్లిగవ్వ లేదు. దగ్గరలో ఉన్న అతనికి తెలిసిన వాళ్ళ దగ్గర ఉండే అవకాశమే లేదని అతనికి తెలుసు. చేయడానికి పనిలేక తినడానికి తిండి లేక పొట్ట చేత్తో పట్టుకుని ఊరు కాని ఊరుకి వలస వచ్చిన వాళ్ళు అందరూ. అంతకు ముందు చెరుకు నరికిన పనికి వచ్చిన లెక్కంతా పోస్ట్ ఆఫీస్ కెళ్ళి ఎవరి ఇళ్ళకి వాళ్ళు మనియార్డర్ చేసుకున్నారు. ఇప్పుడు ఎవరిని అడిగినా పైసా కూడా అప్పు పుట్టదు. ఆర్ముగమ్ కి తెలిసిన మనిషి నాయుడు ఇంటికి పోవాలన్నా భార్య శవాన్ని బిడ్డని వేసుకునే వెళ్ళాలి. ఆర్ముగం కి కన్నీళ్లు కారిపోతున్నాయి భార్య పాత చీర చించి పుట్టిన బిడ్డని వీపుకి కట్టుకున్నాడు. రెండు చేతులతో భార్యని ఎత్తుకుని టౌన్ బస్ ఎక్కి కూర్చున్నాడు. డ్రైవర్ కి విషయం తెలిసి చచ్చిపోయిన మనిషిని పెట్టుకుని బస్ ఎక్కావేమిటయ్యా ! అన్నాడు. బాబు మీ కాళ్ళు పట్టుకుంటా. నా దగ్గర డబ్బుల్లేవ్. కొద్దిగా జాలి చూపించి స్టేషన్ దగ్గర దించమని బతిమలాడుకున్నాడు. సర్లే ! ఎవురన్న అడిగితే భార్యకి బాగోలేదని చెప్పు, చచ్చిపోయిందని చెప్పకు అంటూ వెనక సీట్లో కూర్చో బెట్టాడు. స్టేషన్ దగ్గరకి రాగానే బస్ ఆపి దిగేటప్పుడు డ్రైవర్ కండక్టర్ చెరో వంద రూపాయలు అతని జేబులో పెట్టారు. భార్య శవాన్ని రెండు చేతుల్లో మోస్తూనే రైల్వే స్టేషన్‌లోకి అడుగు పెట్టాడు. వీపున ఉన్న పసి గుడ్డు ఏడుపు మొదలపెట్టాడు. చేతుల్లో ఉన్న శవాన్ని గోడ వారగా పడుకోబెట్టి టీ అంగడి దగ్గరికి వెళ్లి "పసి గుడ్డు ఏడుస్తా ఉన్నాడు. వాళ్ళమ్మకి వళ్ళు బాగాలేదు. కాసిని మంచి పాలు ఇయ్యండి బాబూ" అని అడిగాడు. టీ షాప్ అతను అనుమానంగా చూసాడు. వీడెవడో రోజుల పసి గుడ్డుని వేసుకుని తిరుగుతున్నాడు. వీడి వాలకం చూస్తుంటే వేరొకరి పిల్లాణ్ణి ఎత్తుకొచ్చినట్టుంది అనుకుంటూనే పాలు కలిపి ఇచ్చి ఒక స్పూన్ కూడా ఇచ్చాడు. ఆర్ముగం వీపున కట్టుకున్న బిడ్డని ఒళ్ళోకి మార్చుకుని గ్లాస్‌లో ఉన్న వేడి పాలని నోటితో ఊది ఊది చల్లారాయి అనుకున్నాక బిడ్డనోట్లోకి పోస్తున్నాడు. ఆకలి తీరిన బిడ్డ చిన్నగా నిదరపోయాక మళ్ళీ బిడ్డని వీపున గట్టుకుని టీ కొట్టు దగ్గరికి వచ్చి ఈ పాలు ఏదన్నా సీసాలో పోసి ఇవ్వు బాబూ అని అడిగాడు. ఒరేయ్ ఒక చిన్న సీసా చూసి శుభ్రంగా కడిగి ఇయ్యిరా. పసి బిడ్డకి పాలు పోసి ఇవ్వాలి అన్నాడు. ఒక ప్లాస్టిక్ బాటిల్ లో పాలు పోసి ఇచ్చాక ఆ సీసాని, స్పూన్‌ని జేబులో పెట్టుకుని మళ్ళీ భార్య శవాన్ని రెండు చేతుల్లోకి తీసుకోబోతే కాళ్ళు చేతులు బిగదీసుకుపోయి ఎంతకీ ఒంగకపోయేటప్పటికి కడుపులో నుండి ఏడుపు తన్నుకొచ్చింది. ఏడుస్తూనే ఈసారి చేతుల్లో అడ్డంగా కాకుండా భుజాన వేసుకుని ముందుకు నడుస్తున్న అతన్ని కొంతమంది ఆశ్చర్యంగా చూసారు, కొంత మంది పరిశీలనగా చూసారు.

స్టేషన్ లోపలకి అడుగుపెట్టబోతున్న అతన్ని రైల్వే పోలీస్ ఆపేసి, ఏమైంది? ఆమెని ఎందుకు అట్టా భుజాన మోసుకెళతన్నావ్ అని అడిగాడు. నా భార్య సార్, ఆమెకి వళ్ళు బాగుండలేదు. మా వూరికి తీసుకెళతన్నా అన్నాడు. ఆరోగ్యం అంత బాగుండలేని మనిషిని కూర్చోపెట్టి ఏమి తీసుకెళతావ్, హాస్పిటల్‌కి తీసుకుపో ముందు అన్నాడు. లేదు సామీ, ఇంటికే తీసుకుపోవాలి అనుకుంటూ ముందుకు కదిలాడు. వెనక నుంచి ఆర్ముగం భుజాన వేలాడుతున్న మనిషి చూడగానే పోలీస్‌కి అనుమానంతో గబగబా వచ్చి ముందుకెళ్ళి వెళ్ళనీయకుండా ఆపేసి టికెట్ తీసుకోకుండా ఎక్కడికి జొరబడతన్నావు, ఆ మనిషిని ఆ బెంచీ మీద కూర్చోబెట్టి టికెట్‌లు తీసుకో పో అన్నాడు. అయ్యా నా దగ్గర టికెట్‌కు సరిపడా డబ్బుల్లేవ్. బతుకు తెరువుకి ఈ వూరి కొచ్చాం. దయతలిచి వదిలేస్తే ఎట్టాగొట్టా మా ఊరుకి చేరుకుంటాం, వదిలేయండి బాబూ అన్నాడు. అదెట్టా కుదురుద్ది టికెట్ లేకుండా మీరసలు లోపలి పోడానికే లేదు. వెళ్ళు

వెళ్ళు.. బయటకి పో ముందు అంటూ తరిమేసాడు. పుట్టింటికి వెళ్ళడానికి స్టేషన్కి వచ్చి క్యూలో నిలబడి టికెట్ తీసుకుంటున్న రాధమ్మ చూపు ఆర్ముగమ్ మీద పడింది. టికెట్ తీసుకుని ఒకచేత్తో బేగ్ ని రెండో చేత్తో కొడుకు చేయి పట్టుకుని వెనుక నుండి ఆర్ముగమ్ దగ్గరికి వచ్చింది. బయటకొచ్చి భార్య శవాన్ని రోడ్డు పై పడుకో బెట్టి పెద్దగా అలివేలూ ఇప్పుడు నిన్నేమి చేయనే అని ఏడుస్తూ మీద పడిపోయాడు. టీ షాపతను కొట్టు వదిలేసి గబ గబా అక్కడికి వచ్చాడు. రాధ నిశ్చేష్టురాలై నిలబడి పోయింది. ఆర్ముగమ్, అలివేలుకి ఏమైంది? అనడిగింది ఆందోళనగా. అతనికి తెలిసిన మనిషి ఒకరు కనబడే టప్పటికి కడుపులో నుండి దుఃఖం తన్నుకొచ్చింది. “ఇంకెక్కడి అలివేలమ్మా! చచ్చిపోయింది. ఇదిగో నేను అడిగిన మగ బిడ్డని నాకిచ్చి అది చచ్చిపోయింది” అన్నాడు అలివేలుని చూపిస్తూ. మొన్న మా చేను కాడి నుండి వెళ్లిపోయేటప్పుడు బాగానే ఉందిగా అని అడిగింది. అప్పుడు బాగానే ఉందమ్మా ! నిన్న మధ్యాహ్నం మేము కటింగ్ కి పోయాక నొప్పులు వచ్చాయంట. చేను చానా దూరం. ఎవరో మహానుభావుడు ఆటో ఎక్కించుకెల్లి నెల్లూరు పెద్దాసుపత్రిలో వదిలేసి పోయాడు. నాకు తెలిసి నేను ఆడకి ఎల్లే సరికే ఆసుపత్రిలో వాళ్ళు నీ పెళ్లామేనా ఆమె? ఇదిగో ఈ బిడ్డని కని చచ్చిపోయింది. ఇదిగో బిడ్డ అంటూ నాకిట్టా ఇచ్చారమ్మా ! అని చెప్పి మళ్ళీ ఏడుపు అందుకున్నాడు. నిన్న నేనూ హాస్పిటల కి వచ్చాను అలివేలు నాకప్పుడు కనబడలేదు బాధ పడుతూ చెప్పింది రాధ. స్టేషన్ లోపలికి వెళ్ళే వాళ్ళు బయటకి వచ్చేవాళ్ళు అక్కడ కాసేపు ఆగి చూసి అయ్యో పాపం అని జాలి పడి వెళ్ళిపోతుంటే, ఇంకొందరు ఇది ఇంకో రకం ప్రయాణం అనుకుంటూ తేలికగా తీసుకుని వారి ప్రయాణం వైపు వారు సాగిపోతున్నారు.

అలివేలూ.. పిల్లకాయలు అమ్మ ఏది అని అడిగితే నేను ఏమి చెప్పనే ! నువ్వు రానన్నా నేనే నిన్నిక్కడికి తీసుకొచ్చి ఈ గతి పట్టిచ్చానే. దేవుడా! నా బిడ్డలకి ఆళ్ళ అమ్మని ఆఖరి చూపు కూడా చూసుకోకుండా చేస్తున్నావు కదా అని గట్టిగా ఏడ్చాడు. దిక్కుతోచని స్థితిలో కుళ్ళి కుళ్ళి ఏడుస్తూన్న ఆర్ముగమ్ని చూసి కదిలిపోయింది రాధ. మొన్నటి దాకా ఇరవై రోజులపాటు తన కళ్ళ ముందు తిరిగిన అలివేలు, బిడ్డల గురించి ఎన్ని కబుర్లు చెప్పిందో, ఎన్ని కలలు కందో, ఇప్పుడిలా నిర్జీవంగా నడి రోడ్డుపై పడి ఉండటం చూసి కన్నీరు కార్చింది రాధ. మరుక్షణం తన పర్స్‌లో ఉన్న డబ్బు తీసి అతనికిచ్చింది.

ఆ డబ్బు తీసుకుని ఆమెకి దణ్ణం పెట్టి ఎట్టా గొట్టా తిరపతి దాకా పోతే చాలమ్మా. అక్కడినుండి మా వూరికి ఎట్టాగైనా వెళ్లిపోగలను. తిరపతి దాక వెళ్లేదే కష్టంగా ఉంది తల్లీ ! బస్ ఎక్కనీయరు, బండి ఎక్కనీయరు నేనేం చేయాలమ్మా ఇప్పుడు. కారుకి కిరాయి కట్టుకుని నేను తీసుకుపోగాలనా? అన్నాడు. అదంతా చూస్తున్న టాక్సీ స్టాండ్‌లోవాళ్ళు ఆటోవాళ్ళు, టీ కొట్టువాడు అందరి మనసు ద్రవించిపోయింది. వెంటనే తమ జేబుల్లో నుండి ఎంత డబ్బు ఉంటే అంత తీసి అర్ముగానికి ఇచ్చారు. అంతే కాదు అప్పటికప్పుడు అద్దెకి కారుని మాట్లాడిపెట్టారు. ఆ కారు కిరాయి తను ఇస్తానని రైల్వే పోలీసు ముందుకొచ్చాడు. దేవుడు మీ అందరిలో ఉన్నాడు బాబూ అంటూ అందరికి దణ్ణాలు పెట్టాడు ఆర్ముగమ్. బతుకు తెరువు కోసం నిండు గర్భిణిగా ఉన్న భార్యని వెంట బెట్టుకొచ్చిన ఆర్ముగం వొళ్ళో పసి గుడ్డుని పెట్టుకుని భార్య శవాన్ని పక్కన బెట్టుకుని దుఃఖంతో వెళ్ళే దృశ్యాన్ని కన్నీళ్ళతో చూస్తూ

*“ప్రతి ప్రసవం గండమని,*
*ప్రతి నిమిషం మరణమని*
*తెలిసి కూడా కన్న తల్లులు*
*మరల మరల కంటారు పిచ్చి తల్లులు”*

అన్న పాటని గుర్తు చేసుకుంది. జరుగుతున్నది చూస్తూ సగం అర్ధమయ్యి సగం అర్ధం కాకుండా బిక్క మొహం వేసుకుని అమ్మ కాళ్ళకి గట్టిగా అతుక్కుపోయిన అబ్బయ్యని ఎత్తుకుని స్టేషన్ లోపలికి వెళుతుంది రాధ. అమ్మ మెడని గట్టిగా వాటేసుకుని అమ్మా ! నాకు చెల్లీ వద్దు తమ్ముడూ వద్దు. నాకు నువ్వే కావాలి అన్నాడు. చేతిలో సంచిని కింద పెట్టి పచ్చి పొట్టని ఒకసారి చేత్తో తడుముకుని కొడుకుని ముద్దు పెట్టుకుంది రాధ.


వనజ తాతినేని
విజయవాడ.
ఫోన్ : 998 598 1666




# గీటురాయి

**– ఎస్. సదాశివ**

*మిత్రులు డా. ఎండ్లూరి సుధాకర్ గారికి,*

*నమస్తే,*

**మీ**రు ఫోన్ చేసినారేమో! శ్రీ ఏ. విద్యాసాగర్ ఐ.ఎ.ఎస్. గారు ఫోన్ చేసినారు. నాకు చాలా సంతోషమయింది. డా. ఎక్బాల్ చంద్ *గీటురాయి* (11-8-2006)లో రాసిన వ్యాసానికి జవాబు రాస్తారని మీకు చెప్పినాను. కానీ రాయదలుచుకోలేదు. రాయాలన్నా రాసే శక్తి లేదు. మా అబ్బాయిచేత రాయిస్తున్నాను. విమర్శ ఎంత మృదువుగా రాసినా ఎదుటివాడిని నొప్పించినట్టే అవుతుంది. ఇంతకాలం నేను ఎవరినీ విమర్శించలేదు. నావాడనుకుంటే మందలించినాను. ఎక్బాల్‌చంద్‌కు చెప్పవలసిన కొన్ని మాటలు మీకే రాస్తున్నాను.

*గీటురాయి* లోనూ ఈ మధ్య హిందూ ముస్లిం భావాలు రెచ్చగొట్టబడుతున్నాయి. కొన్ని వారాలు డా. సాంబశివరెడ్డి అనే లెక్చరర్ ఇంటర్మీడియట్ చరిత్ర పుస్తకంలో మతాల, ప్రాంతాల ప్రసక్తి తెచ్చి భావజాలం, పదజాలం అనుకుంటూ కొన్ని వ్యాసాలు వరుసగా రాసినాడు. అవి రాసి అతడు హిందూ ముస్లింలను ఎంత దగ్గరకి తెచ్చినాడో తెలియదు కానీ, ఆ భావజాల పదజాలాలను అందిపుచ్చుకొని డా. ఎక్బాల్‌చంద్ చరిత్రలోనే కాదు సాహిత్యంలోనూ చారిత్రక తప్పిదాలు అంటూ ఒక వ్యాసం రాసినాడు. ఆ వ్యాసం రాయటానికి అతనికేవో లేటెస్ట్ పుస్తకాలు దొరికినట్లు మీకు చెప్పినట్లు మీరన్నారు. గత చరిత్రను విశ్లేషించటానికి ఆ కాలంలో రాయబడిన పుస్తకాలు ప్రమాణమా? ఇన్నాండ్ల తరువాత దొరికిన లేటెస్ట్ పుస్తకాలు ప్రమాణమా? నేను 60 ఏండ్లుగా ఉర్దూ సాహిత్యాన్ని గురించి రాస్తున్నాను.

చివరి మొగల్ చక్రవర్తి రెండవ బహదూర్‌షా జఫర్ మంచి కవి. అతని ఆస్థానంలో ఎందరో కవులుండేవాళ్లు. డబ్బులేని చక్రవర్తిని ఆశ్రయించి ఏమి లాభమని కొందరు అవధ్‌కు వెళ్ళిపోయినారు. అయోధ్య నవాబులు పేరుకు వజీర్ నవాబులే, అంటే ఢిల్లీ చక్రవర్తి సామంతులే. కానీ చాలా సంపన్నులు. కవులను ఘనంగా పోషించేవారు. ఎక్కడికీ వెళ్ళలేక కొందరు మహాకవులు ఢిల్లీలోనే ఉండిపోయినారు. అటువంటివాళ్ళలో ఢిల్లీ గల్లీలను విడిచి వెళ్ళలేనివాళ్ళు ఇద్దరు. షేఖ్ ఇబ్రహీమ్ జోఖ్. అతడు చక్రవర్తి రాసిన గజల్లకు ఇస్లాహ్ ఇచ్చేవాడు. అనగా సవరించేవాడు కాబట్టి రాజగురువు. ఇంకొకడు మీర్జాగాలిబ్. అతడు చాలాకాలం దర్బారుకు వెళ్ళేవాడు కాదుకానీ, ఆర్థిక పరిస్థితుల కారణంగా మిత్రుల బలవంతంమీద దర్బారుకు వెళ్ళేవాడు. చక్రవర్తి గజల్లకు ఇస్లాహ్ ఇచ్చేవాడు. ఇంకొక పెద్ద కవి మోమిన్‌ఖాన్ మోమిన్ అతడు మంచి గజల్ కవే. కానీ ఎవరి దర్బారుకూ వెళ్ళేవాడు కాదు. తండ్రి తాతల వైద్యవృత్తిని కొనసాగిస్తూ సంపన్నుడుగానే బతికినాడు. అతనికి జఫర్ గజల్లకు ఎటువంటి సంబంధం లేదు.

డా. ఎక్బాల్‌చంద్, జోఖ్ పేరు మరిచిపోయినాడుగానీ మీర్జా గాలిబ్, మోమిన్‌లు బహదూర్ షా జఫర్ గురువులు అని రాసినాడు. అతని ఉద్దేశంలో బహదూర్ షాకు ఆ ఇద్దరూ మొదటినుంచి కవితా రచన నేర్పినారు. ఇది పొరపాటు. ఎందుకంటే ఈ ఇద్దరు మొగల్ దర్బారులో చేరకముందే బహదూర్‌షా కవిగా ప్రసిద్ధుడు. తన దర్బారీ కవులందరికంటే వయస్సులోనూ పెద్దవాడు. వృద్ధాప్యం కారణంగానో, రాజగురువు జోఖ్ మీది గౌరవంవల్లనో, మిర్జాగాలిబ్‌మీది అభిమానంవల్లనో తన గజల్లను వాళ్ళచేత దిద్దించుకునేవాడు. ఈ వ్యవహారంలో మోమిన్ ఖాన్ మోమిన్ ప్రమేయం లేదు.

అంతవరకు ఉర్దూ సాహిత్య చరిత్రకానీ, ఉర్దూ కవుల చరిత్రకానీ ఫారసీ వచనంలో రాసే సంప్రదాయం ఉండేది. మొట్టమొదట ఉర్దూ కవుల చరిత్రను ఉర్దూవచనంలో రాసిన మహమ్మద్ హుసేన్ ఆజాద్, షేఖ్ ఇబ్రహీమ్ జోఖ్ శిష్యుడు.

ఆ పుస్తకం పేరు *ఆబెహయాత్. ఆబెహయాత్* మొదటి ముద్రణలో అతడు ఏ కారణంగానోగానీ మోమిన్‌ఖాన్ మోమిన్‌ను వదిలిపెట్టినాడు. దేశం నలుమూలల నుండి విమర్శలు వచ్చిన తరువాత రెండవ ముద్రణలో చేర్చుకున్నాడు. మోమిన్ ఖాన్ మోమిన్ గొప్ప కవే కానీ అతని గురించిన సమాచారం మొత్తం సంపాదించ లేకపోయినానని సంజాయిషీ చెప్పుకున్నాడు. అతని గురుభక్తి గొప్పది. బహదూర్‌షా జఫర్ గజల్లలో చాలావరకు తన గురువు జోఖ్ కవితే ఉన్నదని రాసినాడు.

ఆ కాలంలోనే మిర్జాగాలిబ్ శిష్యుడు అల్తాఫ్ హుసేన్ హాలి *యాద్ గారె గాలిబ్* అనే పేర ఉర్దూ వచనంలో గాలిబ్ జీవితం రాసినాడు. అందులో అతడు బహదూర్ షా సగం మిస్రానో, మిస్రానో పంపితే గాలిబ్ షేర్లు తయారు చేసేవాడని రాసినాడు. భక్తి ముదిరితే మూఢత్వమవుతుంది. ఆజాద్, హాలీలు ఇద్దరూ గొప్ప రచయితలే. కానీ గురుభక్తి ముదిరినందువలన బహదూర్ షా జఫర్ గురించి అసత్యమే రాసినారు. ఆ ఇద్దరి మాటలను సత్యమని నమ్మితే బహదూర్ షా జఫర్ కవే కాడు. అయితే అదంతా జోఖ్ కవిత లేదా గాలిబ్ కవిత. నేడు మనకు బహదూర్ షా జఫర్ కవిత్వమంతా అందుబాటులో ఉన్నది. ఎక్కడా గాలిబ్ కవితా లక్షణాలు కనిపించవు. ఒకవేళ వాళ్ళిద్దరూ దిద్దినా, అంటే వ్యాకరణ ఛందోదోషాలు దిద్దినా తమ శైలి రాకుండా బహదూర్ షా శైలిలోనే దిద్ది ఉంటారు. తాననుభవించిన కష్టాలను దుఃఖాలను స్మరిస్తూ ఆ చక్రవర్తి కరుణరస ప్రధానంగా రాసిన కవిత జోఖ్ రాయగలిగేవాడు కాదు. గాలిబ్ రాయగలిగేవాడు కాదు.

"ఇంతటి గురువులు లభించినా బహదూర్ షా కవిత్వానికి ఒరిగిందేమీలేదు" అని రాసినాడు ఎక్బాల్‌చంద్. కాబట్టి అతడు జఫర్ కవిత్వాన్ని చదివి ఉండడు. అవసరం లేని మోమిన్ ప్రసక్తి తెచ్చినాడు. కాని మోమిన్ కవితగూడా చదివి ఉండడు. గాలిబ్ కవిత గూడా అంతగా చదివి ఉండడు.

*తుమ్ మెరే పాస్ హోతె హో గోయా*
*జబ్ కోయీ దూస్‌రా నహీ హోతా*

అనే షేర్‌ను ఎవరో చదువగా విని మిత్రులతో చదరంగమాడుతున్న మిర్జా గాలిబ్ ఆట ఆపివేసి మళ్ళీమళ్ళీ చదివించుకొని తన్మయుడై "మోమిన్ ఖాన్ ఈ ఒక్క షేర్ నాకిస్తే నా దీవాన్ మొత్తం అతనికిచ్చివేస్తా"నన్నాడట.

ఈ ఇద్దరు మహాకవులు మహాకవులేకాని మంచి గురువులు కాలేకపోయారు అని విచారించినారు ఎక్బాల్ చంద్ గారు. జోఖ్ శిష్యుడు ఆజాద్, దాగ్ దహెల్వీ, దాగ్ దహెల్వీ శిష్యుడు డా. ఎక్బాల్ . మోమిన్ ఫారసీ శిష్యుడు నవాబ్‌షేఫ్తా. మిర్జా గాలిబ్ శిష్యులనేకులు. అతని ఉర్దూ శిష్యులు నవాబ్ షేఫ్తా, నవాబ్ రాంపూర్ (యూసుఫలీఖాన్), మీర్‌మహెదీ మజ్రూహ్, హరగోపాల్ తఫ్తా, అల్తాఫ్ హుసేన్ హాలీ ఇందరినీ తయారు చేసిన వీళ్ళు మంచి గురువులు కారా? ఏమంటున్నారు డా. ఎక్బాల్ చంద్?

మజాజ్‌ను విమర్శించేవాళ్ళేకానీ అతని కవిత్వాన్ని గురించి ఎవరూ శ్రద్ధచూపలేదట. అతన్ని గురించి *గీటురాయి* లోనే ఎన్నో వ్యాసాలు రాసినాను. వార్త - ఆదివారం అనుబంధంలో రాసిన వ్యాసాలను తెలుగు విశ్వవిద్యాలయం వాళ్ళు *ఉర్దూ భాషా కవిత్వ సౌందర్యం* పేర ప్రచురించుకున్నారు. అందులో మజాజ్‌ను గురించిన వ్యాసమున్నది. దాని శీర్షిక 'మజాజ్ కవితలు మనోహరం'. మజాజ్ తాగుబోతు. ఉర్దూ కవుల్లో తాగుబోతులు చాలామంది ఉన్నారు. అతని అరాచక జీవితంను చిత్రించటంలో ఉన్న శ్రద్ధ అతని కవితను వ్యాఖ్యానించుటలో చూపించలేదన్నారు డా. ఎక్బాల్‌చంద్.

*జబ్ కిష్తీ సాబిత్ సాలిమ్ థీ సాహెల్‌కి తమన్నా కిస్ కూ థీ*
*అబ్ అప్నీ షికిస్తా కిష్తీపర్ సాహెల్‌కి తమన్నా కోన్ కరే*

ఇంత మంచి షేర్ చెప్పిన మజాజ్‌ను ఎవరయినా మరచిపోగలరా?

గాలిబ్ గురించి చాలామంది మాట్లాడుతారట. కానీ అతని భాషాసౌందర్యాన్ని అర్థం చేసుకోవటానికైనా ప్రయత్నించరట. ఉర్దూ తెలిసినవాళ్ళు గంటసేపు మాట్లాడితే గాలిబ్ షేర్లు రెండయినా చదువుతారు. అతని దీవాన్‌కు వ్యాఖ్యానం రాసిన అయిదారుగురు పండితులే అతని భాషాసౌందర్యాన్ని, భావగాంభీర్యాన్నీ కొన్నిచోట్ల అర్థం చేసుకోలేకపోయినారు.

*జిక్ర్ ఉస్ పరీవష్ కా ఔర్ ఫిర్ బయాఁ అప్నా*
*బన్‌గయా రఖీబ్ ఆఖిర్ జోథా రాజ్‌దాఁ అప్నా*

ఈ షేర్‌ను డా. ఎక్బాల్ చంద్ గారు అర్థంచేసుకోనే ప్రయత్నం చేసినారా? అర్థంచేసుకొంటే వివరించి పత్రికలల్లో రాయమనండి. గుంపులో దెబ్బలు కొట్టటం ఎందుకు?

ఇక శరత్చంద్రుని నవలల గురించి, ప్రేంచంద్ నవలల

గురించి రాసినారు. పసలేని ప్రసంగం. జవాబు పెద్దగా రాయవలసి వస్తుంది కనుక, రాయను. అఫ్సర్ తండ్రి షంషుద్దీన్ కౌముది నా మిత్రుడు. అతనికి రావలసిన గుర్తింపు వచ్చింది. మోలానా హస్రత్ మోహానీ రాసిన

*చుప్కే చుప్కే రాత్ దిన్ ఆంసూ బహానా యాద్ హై*

అనే గజల్‌ను ప్రస్తావించినారు. ఆ గజల్ హస్రత్‌దని అందరికీ తెలుసు. 'నికాహ్' అనే సినిమాలో అనుమతి లేకుండా వాడుకున్నందుకు హస్రత్ వారసులు కోర్టుకెక్కిన విషయం గూడా చాలామందికి తెలుసు.

స్వాతంత్ర సమరంలో మార్చింగ్ సాంగ్‌గా పాడుకున్న

*సర్ఫరోషీకే తమన్నా అబ్ హమారే దిల్ మె హై*
*దేఖ్ నా హై కిత్ని తాకత్ బాజుయే ఖాతిల్ మె హై*

అనే కవిత రాంప్రసాద్ బిస్మిల్ రాసిందని అందరికీ తెలుసు. మఖ్దూమ్ రాసిందని ఎవ్వరూ అనుకోలేదు. దాన్ని హస్రత్ మొహానీ "ఖచ్చితంగా" రాయలేదు. మఖ్దూమ్ ప్రేమ కవిత్వం రాసిన సంగతి అందరికీ తెలుసు. బషీర్‌బాగ్‌లోని ప్రెస్‌కౌన్సిల్‌లో మఖ్దూమ్ సభ పెట్టి ప్రజాసాహితీవాళ్ళు నన్నుగూడా ఆహ్వానించినారు. ఆ సభలో మఖ్దూమ్ కొడుకులిద్దరూ, కోడండ్లు, భార్యా ఇతర కుటుంబ సభ్యులున్నారు. అంతా తెలుగే, మాకేమీ అర్థంగావటంలేదని ఆడవాళ్ళు గోలపెడుతూ ఉంటే నేను కాసేపు ఉర్దూలో మాట్లాడి ఎక్బాల్‌చంద్ గారు తప్పుగా రాసిన షేరును, ఇంకో షేర్‌ను సరిగా చదివి అర్థం చెప్పినారు.

*1. రాత్‌భర్ దీదయె నం నాక్‌మె లహెరాతె రహే*
*సాంస్ కీ తరహ్ సే ఆప్ ఆతేరహే జాతే రహే*
*2. ఆప్ కీ యాద్ ఆతీ రహీ రాత్ భర్*
*ఛష్మెనమ్ ముస్కురాతీ రహీ రాత్‌భర్*

ఆ సభలోనే మెట్లు దిగేటప్పుడు మఖ్దూమ్ పెద్దకొడుకు నుస్రత్ మొహియుద్దీన్ దాదాపు నన్ను ఎత్తుకొని దించినాడని నా యాదిలో రాసుకున్నాను.

భారతీయ సాహిత్యంలో మొదటి లోరీ పాటను రాసింది అమీర్‌ఖుస్రూ, మరొక కవి పేరు చెప్పలేదుగానీ అమీర్ ఖుస్రోను అంగీకరిస్తాం అని అడుగుతున్నాడు డా. ఎక్బాల్ చంద్ గారు. అమీర్‌ఖుస్రూ ఫారసీ కవి. హిందూయి అనే ఒక భాషను తయారుచేసే ప్రయత్నం చేసినాడు. అప్పటికీ ఆ భాష ప్రస్ఫుటంగా ఏర్పడలేదు. అమీర్‌ఖుస్రూ ఆ లోరీని ఏ భాషలో రాసి ఉంటాడు? అమీర్‌ఖుస్రూ ముస్లిం అయినంతమాత్రాన ఈ ఎత్తిపొడుపా? ఉమరలీషా గొప్ప కవి అని అందరికీ తెలిసిందే. అయితే అతన్ని ఇంతవరకు ఎవరూ ముస్లిం కవి అనలేదు. చెట్టుకవి ఇస్మాయిల్ గొప్ప కవి. సాహసకవి వజీర్ రహ్మాన్ 55 ఏండ్ల కిందట నా మిత్రుడు. అతన్ని ముస్లిం కవి అని ఎవరూ అనలేదు. ఇస్మైల్‌గారు నాకు తెలిసినవారే. వారినీ ముస్లింకవి అని అనుకోలేదు. ఈ మైనారిటీ కవులలో వీళ్ళందరినీ కలపటమెందుకో? ఇస్మైల్‌గారు ఇస్మత్ చొగ్తాయి రాసిన 'లెహాఫ్'ను గొంగళి అని అనువదిస్తే ఇలా చదివి అలా మరిచినారట. మాకు దొరకనేలేదు. పంపించే ఏర్పాటు చేయండి మహాప్రభూ! చదివి దగ్గరపెట్టుకుంటాం. గోలకొండ తానాషా ముస్లిం (తానీషా తప్పు). రామదాసు హిందువు. కాబట్టి జైలులో పెట్టినాడని ఎవరూ నిందించలేదు. రాయల్ ప్రిజనయినా మామూలు ప్రిజనైనా జైలు జైలే. రామదాసు కూడా నిందించలేదు. సర్కారి సొమ్ము వృధా ఖర్చు చేసినందుకు జైలుశిక్ష పడవలసిందే. తానాషా కూడా గొప్ప సూఫీయోగి. రాజూఖత్తాల్ శిష్యుడు. ఈ అనవసరమైన మతభేదాలు కలిగించటమెందుకు మిత్రమా!

మైనారిటీ కవులతో ఊరుకోక దళిత కవులను కూడా కలుపుకొస్తున్నారు. వాహెద్ ఆ మాటన్నాడా? నాకు తెలిసినంతవరకు చాలా మంచివాడుగదా!

మీ గురువుగారు డా. ఎండ్లూరి సుధాకర్‌గారి సంపాదకత్వాన వెలువడే జూన్ జూలై 2006 వాఙ్మయిలో జమాతే ఇస్లామియే హింద్‌ని గురించి రాస్తూ "గతంలో సంప్రదాయబద్ధంగా వ్యవహరించిన మతసంస్థలు ఇప్పుడు సహజీవనాన్ని కోరుకుంటున్నాయి" అని రాసిన మీరు "హిందూ ముస్లింల మధ్య ఉన్న దూరాన్ని చెరపటానికి స్వస్థానీయతపై నమ్మకం కలిగించటంలో ఈ సంస్థ ప్రధానపాత్ర పోషిస్తున్నది" అని రాసిన మీరు ఆ సంస్థ నడిపే *గీటురాయి* లో దూరాలను పెంచే రచనలు రాయటం భావ్యమా?



(డా. ఎస్. సదాశివ)

# ఆంధ్రులు - నాట్యకళ

– నటరాజ రామకృష్ణ

భరతుని నాట్యశాస్త్రములో ఆంధ్రుల నృత్యకళనుగూర్చి

*శ్లో॥ మహేంద్రో మలయః సహ్యోమేకలః పాలమంజరః ।*
*ఏతేషుసంశ్రితా దేశాస్తేజ్ఞేయా దక్షిణాపథాః ।*
*కౌసలాస్తో శలాశ్చైవ కలింగాయవనాః ఖసాః ।*
*ద్రవిడాంధ్ర మహారాష్ట్రా వైణ్ణావైవానవాసజాః ।*
*దక్షిణస్య సముద్రస్యతధా వింధ్యస్య చాంతరే ।*
*యేదేశాస్తేషుయుంజీతదాక్షిణాత్యాంతునిత్యశః ।*

మహేంద్ర మలయాది పర్వతములుగల దేశమునకు దక్షిణాపథమని పేరు. ఈ దక్షిణాపథము ఆంధ్ర. ద్రావిడ, మహారాష్ట్రాది ప్రాంతములతో గూడినట్టిది. దీని కుత్తరమున వింధ్య పర్వతములును, దక్షిణమున సముద్రమును హద్దులు. అట్టి దక్షిణ భారతమందలి జనులు పలువిధములైన నృత్యగీతవాద్యములతో దాక్షిణాత్యమని ప్రసిద్ధిగాంచిన 'కైశికీవృత్తి' యందు నాట్యము చేయుదురు. ఈ శ్లోకమునగల 'వైణ్ణా' యనుదానికి కృష్ణవేణి. పెన్నాతీరవాసులని అభినవ గుప్తాచార్యులు తమ వ్యాఖ్యానములో వివరించెను. ఈ ప్రదేశమంతయూ ఆంధ్రదేశములోనున్నది. ఆంధ్రులు – 'ఆంధ్రి' అను రాగమును తమ జాతి పేర సంగీతానికి సమర్పించిరి.

మాతంగుని 'బృహద్దేశి'లో ఈ విషయము పేర్కొనెను. 'ఆంధ్రి' మాలవ వంక రాగముయొక్క ఆరు రాగిణులలో ఒక్కటి యక్షగానము.

యక్షులు, నాగులు – రెండు అతి ప్రాచీన తెగలు ఆంధ్రలో.

యక్షులనే జక్కులవారనిగూడ పిలుతురు. వాని సంగీత సంప్రదాయమే యక్షగానము

ఇది ప్రత్యేక దేశిసంప్రదాయము.

దీనినే భరత శాస్త్రానుసారముగా నాటకరూపములో వృద్ధిపరచి భాగవత నర్తకులు వీధినాటకమనే పేరుతో ప్రదర్శించుచున్నారు.

హాలుని గాధా సప్తశతిని జూచిన క్రీస్తుకు పూర్వమే అనేక విధాలుగా, ఆంధ్రలో నృత్యకళ అభివృద్ధి చెందినట్లు తెలియునుగాని, నాటి సంప్రదాయములతీరు తెలియుటలేదు. శాతవాహనులు, ఇక్ష్వాకుల కాలముల గూర్చిన గ్రంథములందు కొన్ని నృత్య వర్ణనలు మాత్రము గన్పించుచున్నవి. ఆనాడు వర్ధిల్లిన కళావిన్యాసముల వివరములు మరుగుపడినవి, బౌద్ధుల కాలమునాటి కళ : ఆరామ శిల్ప భంగిమలే ఆధారము. జపాను బుద్ధాలయాల్లో నేటికీ ప్రదర్శింపబడే నాట్యముల పరిశోధనవల్ల కొన్ని బౌద్ధయుగము నాటి ఆంధ్రుల కళల గూర్చి తెలియవచ్చును. *అభినయ దర్పణము, భారతార్ణవము* రచించిన నందికేశ్వరుడు ఆంధ్రుడని పండితుల అభిప్రాయము.

నన్నెచోడుని కుమారసంభవములో రంభ నాట్యవర్ణన నాటి కళ గూర్చి కొంత తెలియజేయును.

అట్లే తిక్కన భారతములోని విరాట పర్వములో బృహన్నల నాట్యము గూర్చి ప్రశంసవల్ల ప్రాచీన నాట్యముల గూర్చి తెల్పును.

వాని వివరములు కొంతవరకూ భారతార్ణవమందున్నవి.

కాకతీయుల కాలము – పశుపతి సంప్రదాయ శైవమత ప్రచారము – దినమునకు ఆరు పర్యాయములు దైవారాధన. ఆలయాల్లో మూలవిరాట్టు కెదురుగా వలయాకార బలిపీఠము. అట దేవదాసీల నృత్యపూజ ఆంధ్రలో ఆలయ శిల్పములో ఇదొక ప్రత్యేకత. *అభిలషార్థ చింతామణి* – సోమేశ్వర II రెండవ సింగ ప్రభువు – సారంగదేవుని *సంగీత రత్నాకరము*నకు సంగీత సుధాకర వ్యాఖ్యాన రచన.

కాకతిగణపతిదేవ కాలము –

జాయసేనాపతి – *నృత్త రత్నావళి* గ్రంథ రచన

అతని గురువులు కొండామాత్య, వెన్నెలకంటి

సూరామాత్య

పెదకోమటి వేమారెడ్డి – *సంగీత చింతామణి* గ్రంథ రచన

కొమరగిరి ప్రభువు – *వసంతరాజీయం* గ్రంథ రచన లకుమ – అతని ఆస్థాన నర్తకి

ప్రతాపరుద్రదేవ – ఆస్థాన నర్తకి మాచల్‌దేవి.

విదానాధుడు – 'ప్రతాపరుద్రీయము' అలంకార శాస్త్ర రచన

విజయనగర ప్రభువులు – రంజకం, శ్రీ రంగరాజు, కుమార్తె కుప్పాయి ప్రఖ్యాత నర్తకులు.

పాల్కురికి సోమనాధుని – *బసవ పురాణము.*

పండితరాధ్య చరిత్రలో నాటి మార్గి. దేశి నృత్యముల వర్ణనలు.

శ్రీనాథుని *పల్నాటి వీర చరిత్రము*లో నృత్య వర్ణనలు.

*క్రీడాభిరామ*మందు జక్కులపురంధ్రి నృత్యవర్ణన, జంగము కథ వర్ణనలు

రఘునాధరాయలు : – రామభద్రాంబ ప్రఖ్యాతి గాంచిన నర్తకీమణి.



అచ్యుతప్ప : భాగవతులకు అచ్యుతాపురము దానము చేయుట అచ్యుతాపురమే "మేలటూరు" మేళముల ఊరు.

విజయరాఘవనాయక : వివిధ యక్షగానముల రచన.

క్షేత్రయ్య ప్రఖ్యాత పదకర్త.

రంగరాజమ్మ : కవయిత్రి – నాట్య సంగీతములందు గొప్ప పండితురాలు.

మహారాష్ట్ర ప్రభువులు : 'కేళిక' నృత్యాభివృద్ధి చిన్నయ్య, పొన్నయ్య, వడివేలు, శివానందము – కచ్చేరి నాట్యమునకు ఈ అన్నదమ్ముల సేవ.

*శహజీ : పంచరత్న ప్రబంధ* రచన నాటి నృత్య సంప్రదాయమును గూర్చి తెలిసికొనుటకు ఆ గ్రంథముల యొక్క ప్రాముఖ్యత.

ఖండోజీ : విచిత్ర రాయవతంస కవి నాట్యశాస్త్రము. పద్యరూపములో రచన.

ఆంధ్రలో శాస్త్రీయ నాట్యానికి ఆధార గ్రంథములు

*నాట్యశాస్త్రము, అభినయ దర్పణము, భరతార్ణవము, భరతసార సంగ్రహము* :

*ప్రతాపరుద్రీయము, రసమంజరి, రసప్రకరణము* మరియు – తెనుగులో పద్య, గద్య రూపములో పై శాస్త్రాలననుసరించి, దేశి పద్ధతులజేర్చి రచింపబడిన అనేక గ్రంథములు.

తెలుగునాట శాస్త్రీయ నృత్యకళ నారాధించువారు :

1. నట్టువ మేళము : స్త్రీలు నాట్యం చేసే సంప్రదాయము.

2. నాట్య మేళము : పురుషులు నాట్యం చేసే పద్ధతి.

**నట్టువ మేళము :**

దాసి ఆట, భోగము ఆట, భోగము మేళము లేక సానిమేళము, మేజువాణి, కచ్చేరి ఆట. కేళిక భరతనాట్యము.

భోగమువారు – సభలందు, దర్బారులందున నర్తనమాడువారు.

సానులు (దేవదాసీలు) : ఆలయాల్లో ఆరాధాన నాట్యమాడువారు.

వీరు గుడి సేవకై నియమింపబడినవారు. గనుకనే గుడిసానులు పూర్వము మండలేశ్వరులు వీరినుండి కన్యలను వివాహమాడు ఆచారముండినది.

నాట్యమేళము : వీధిభాగవతము, బ్రాహ్మణ భాగవతులు (కూచిపూడివారు, కోటకొండవారు).

జంగం భాగవతుల (జంగాలపల్లెవారు) : ఎఱ్ఱిగొల్ల భాగవతులు, దాసరి భాగవతులు, బహురూపులు, గంటె భాగవతులు, చిలకల భాగవతులు, యానాది భాగవతులు, చిన్నమాదిగ భాగవతులు.

**కలాప నర్తకులు :**

భామాకలాపము, గొల్లకలాపముల నాడువారు.

వీరందరూ ఆంధ్రలో వివిధ జిల్లాలలో నున్నారు.

**నృత్యశిల్పము – ఆలయాలు :**

జాయపసేనుని 'నృత్తరత్నావళి' – రామప్పగుళ్ళలో సుందర నృత్యశిల్పము.

అందలి వినాయక నర్తనభంగిమలు – అష్టదిక్పాలక ఆరాధన సమయములందు (బలిహరణ) ధ్వజస్థంభమువద్ద నర్తకిజేసే ప్రథమ నాట్యం – గణపతి ఆరాధన.

మదస్కలిత కరణ విన్యాసము – పిమ్మట వినాయక తాళమందు ''గణపతి కవుతము'' అటుపై వివిధ

కరణాంగహారములతో కుమారస్వామి ఆరాధన.

తరువాత ఇంద్రస్తవము – ఆ గణపతి నాట్యమే అందు రూపొందించబడెను.

కాకతీయుల కాలము – శైవసంప్రదాయ కళాప్రచారము. దశవిధ శివలీలలు – సప్తలాస్యములు – పేరిణి, ప్రేంఖణ, కుందలి, దండిక, శుద్ధ, దేశి ఇత్యాది నాట్యముల ప్రచారములు.

"గొండ్లి" – రాజగోండుల దేశి సంప్రదాయ నృత్యము – ఆంధ్రులకు మధ్యప్రదేశ్‌నందలి 36 గోండు సంస్థానములకుగల సాంస్కృతిక సంబంధము. వారి సంప్రదాయ కళాప్రచారము.

**విజయనగర రాజుల కాలము :**

లేపాక్షి ఆలయ సుందర శిల్పము – నృత్య భంగిమలు.

వీరవైష్ణవ, వైష్ణవమత ప్రచారానికి అనుగుణ్యమైన కళాభివృద్ధి.

రాధామాధవ మధురభక్తి ఉపాసన – వల్లభాచార్యుల మతప్రభావము – అభినయకళ ప్రత్యేకాభివృద్ధి – గీత గోవిందమునకు నృత్యాభినయములు – రస నిలయములు, క్షేత్రయ్య, పదములసృష్టి – వానికి అభినయము.



**తంజావూరు నాయకరాజుల కాలము :**

యక్షగానములకు స్వర్ణయుగము. కేళిక – నేటి భరతనాట్య ప్రదర్శనక్రమము 'పేరిణి' పద్ధతిననుసరించి రూపొందుట.

నృత్యములో మొదటిసారి పదములు ప్రముఖ స్థానము వహించుట. నాటినుండి అభినయ విద్యలో క్రొత్త పోకడలు. కచ్చేరి నాట్యము – నృత్త, నృత్య, అభినయాదులకు క్రమమైన ఏర్పాటుకు కృషి.

సిద్ధేంద్రయోగి – ప్రాచీన యక్షగాన పద్ధతిలో (పారిజాతము) భామాకలాప రచన. ఆ విద్య కూచిపూడి వారి ద్వారా ప్రచారము యక్షగానములో అనేక శాస్త్రీయ మార్పులు వర్ణనాత్మక గేయరూపములో నుండి ఏకపాత్ర నృత్యానికి అనువుగానుండిన యక్షగానము. స్వరూపము మార్చి, అనేక పాత్రల సృష్టించి, నృత్య నాటకముగా రూపొందుట.

**రంగాజమ్మ విజయరాఘవనాయక :**

వారి యక్షగానములు – నాట్యానికి అలంకారములు. రంగాజమ్మ విరచితము – మన్నారుదాస విలాస యక్షగానము – నర్తకుని విద్య పరీక్షించుటకు చక్కని గ్రంథము.

నాయకరాజుల కాలమందు క్షేత్రయ్య పదములు అభినయ విద్యాభివృద్ధికి కారణభూతమయినట్లు మహారాష్ట్ర రాజుల కాలములో రచింపబడిన "పదవర్ణములు" నృత్త, నృత్యముల అభివృద్ధికి తోడ్పడినవి.

వివిధ రకములైన అడవు, జతి, గతి, విన్యాసముల ప్రదర్శనకు అనువైనట్టి "దరువు" అందలి ఆట క్రమము.

అనేక విధముల విభావానుభావ సాత్విక సంచారుల ప్రదర్శనమునకు వీలైనట్టి పదములు, అభినయపోకడలు, ఆధారముగాగొని తాన వర్ణక్రమముననుసరించి గావింపబడిన నూతన సంగీత సృష్టి "పదవర్ణము" లేక "చౌకవర్ణము", పదవర్ణములు తరువాత సృష్టింపబడిన సంగీత రచనలు.

ఆంధ్రలోని వివిధ జమీందారుల కళాపోషణ :

కార్వేటినగరము, కాళహస్తి, వెంకటగిరి, కోల్లాపురము, గద్వాల, వనపర్తి, నూజివీడు, పిఠాపురం, పెద్దాపురం, తుని, విజయనగరము, బొబ్బిలి, జయపురము, మొదలైన సంస్థానములందు – పల్లవులు, జక్కిణి దరువులు, పద దరువులు, పెద్ద వర్ణములు, పదములు మొదలైన సంగీత రచనలు గావించబడినవి. భామాకలాపముగొల్ల కలాపము, వీధినాటకము, పోషింపబడినవి.

దేవతాస్తోత్రములైన కవుతములు అతి ప్రాచీనములు, శబ్దములు లేక సలాంజతులు మొదటిసారిగా మహారాష్ట్ర ప్రభువుల పాలనలో 'కేళిక' సమయంలో రాజనర్తకినులు ప్రభువుల స్తోత్రముతోగూడిన నర్తనము సల్పుట నిమిత్తం రచింపబడినవి.

ఆటపై అట్టి రచనలే ఇతర జమీందారీలందలి ఆస్థాన కవులు రచించిరి. ఇవ్విధాన వివిధ సంస్థానములందు రచింపబడిన ఈ రచనలు కొన్ని వందలున్నవి.

హంపీ విజయనగరము తరువాత ఆంధ్రలో నృత్యకళను అనేక రీతుల నభివృద్ధిలోనికి దెచ్చిన సంస్థానము విజయనగరము, గనుకనే విజయనగరమును కవి పండితులు విద్యలనగరముగా గొనియాడిరి. ఆనంద గజపతి మహారాజుగారు అందు ముఖ్యులు. వీరి కాలములో అనేకములైన పదములు, పల్లవులు, శబ్దములు రచింపబడినవి.

అన్నిటిలో అతిముఖ్యమైన సంగీత రచన – "మండూక శబ్దము"

తూర్పున ప్రఖ్యాతిగాంచిన "శుభలక్షణ పల్లవి" సృష్టి ఇచ్చటనే జరిగింది.

సీతారామ గజపతి కాలములో – సప్తతాళములందు జక్కిణి దరువులు, పదదరువులు, స్వరపల్లవులు, పోణ్ణంగిదరువులు విశేషముగా రచింపబడినవి. ఇవి యన్నియూ నాట్యకళకు అలంకారములు.



కార్వేటినగరము నేలిన వెంకట పెరుమాళ్ రాజేంద్రుల కాలములో నృత్యకళకు చాల ముఖ్యమైన గోవిందసామయ్య "వర్ణపంచకము"లనబడే ఐదు పెద్ద వర్ణనములు రచింపబడినవి.

ఈ వర్ణములు అపూర్వము. వీటికి నృత్యమాడుట నర్తకునికి పరీక్షవంటిది.

మోహన, నవరోజు, కేదారగౌళ, గౌళ, వరాళి – ఐదురాగములందు వర్ణనలు రచింపబడినవి. ఇందు "మోహన వర్ణము" – కార్వేటినగరము, కాళహస్తి, వెంకటగిరి ప్రాంతములందు, నవరోజు వర్ణము, కోస్తా జిల్లాలందు ప్రచారములోనున్నది.

వెంకటగిరి సంస్థానములో – బంగారేఖ భూపాలుర కాలములో నాట్యకళ చాలా వృద్ధిగాంచినది. ఆయన అనేక కవి, పండిత, గాయక, నాట్యాచార్యుల పోషించుటయేగాక – వివిధ ప్రాంతముల నుండి సంగీత విద్వాంసుల రప్పించి, చర్చించి నాట్యముపై ఒక గ్రంథము రచించిరి. అదియే *'సభారంజని'.*

మిగిలిన సంస్థానములందు నాట్యకళ అభివృద్ధి చెందిన వివరములు అంతగా తెలియటలేదు.

**(పుణ్యతీర్థములందు నృత్యకళ - వచ్చేనెలలో)**

---





*"... మేధోవర్గపు శత్రువులు – నిరంకుశులు*
*కాకారాయుళ్ళు – వీరితోనే పోరాటం,*
*మానవజాతిని విడుదల చేయాలి*
*రాజుల నుంచి – జనసమూహాల్నుంచి*
*మీ నుంచి – నా నుంచి !*
*యుద్ధం పేరుతో మారణకాండ*
*సైనిక విజయాలని – రిబ్బన్లు, మెడల్సు!*
*ఒక బంగారు బిళ్లకోసం – బతుకును బలిచేయటం*
*కేవలం బులెటిన్‌లో పేరు పడాలంటే*
*శరీరంలో బులెట్ దిగాలా?*
*ఒక్క కన్నీటి బిందువు ఆరిపోవటం కంటే*
*కీర్తి, గౌరవం పేరుతో ఉప్పొంగే సముద్రాలు*
*ఎండిపోవటం మేలుకదా?..."*

తన కవిత్వం 'ఆధునికం' అంటాడు బైరన్. సైనికుల గుండెల్లో మారుమ్రోగాలి – నాయకుల అహంకారానికి, బాధల పాలైన సామాన్యుల స్థితిగతులను విప్పి చెప్పాలి.

*"... గులకరాళ్ళకు కూడా బోధిస్తాను –*
*నేల మీద నిరంకుశులకు వ్యతిరేకంగా నిలబడమని!*
*మళ్ళీ రాళ్ళలాగా మారి – సింహాసనాలకు పీఠంలా మారవద్దని!*
*ప్రపంచానికి స్వాతంత్ర్యం రాకపూర్వం – ఎలా ఉండేదో – ఎలా ఉందో*
*మన తర్వాతి తరాలకు చూపాలి! –*
*కథానాయకులందరూ ఒంటరి గాళ్లే*
*తప్పుడు గుంపులను వ్యతిరేకిస్తూ ..."*

*(ప్రతులకు చివరి పేజీ చూడండి)*

# పెళ్ళిచూపులు...

'బాబాయ్! ఎందుకు నన్ను అమెరికా పంపిస్తున్నారు.... ఈ చదువు చాలదా..? నాన్నకు నువ్వైనా చెప్పలేవా?'

ఇదీ వాడి ఏడుపు. అమెరికా ఎమ్.ఎస్. చేయడానికి అన్ని ఏర్పాట్లూ చేసి, వీసాకు పంపుతుంటే.

ఆ తంతూ అయింది. వీసాతో వచ్చాడు. అప్పుడు నేను హైదరాబాదులోనే ఉన్నా. వాడికి నా ఫియట్ కారులో డ్రైవింగ్ నేర్పమని అన్నయ్య ఒకటే గొడవ.

ఆ పనీ పూర్తి చేశాను – వాడి ఏడుపూ గొడవ మధ్యలో. 'నువ్వు డ్రైవ్ చేయ్, నేను చూస్తాను అనేవాడు' అంత బద్ధకస్తుడు....

వాడు ఇంజనీరింగ్ వెలగబెట్టేప్పుడు కాలేజీ చూడటానికి వెళ్ళాను, కోయంబత్తూర్ దగ్గరలో. వాళ్ళ ప్రొఫెసర్‌నూ కలిశాను. 'మీరు?..' అన్నాడు. 'అఖిల్ బాబాయ్‌నండి!' 'ఓ! అలాగా! మీవాడు హాస్టల్‌లో నిద్రపోతుంటాడు... లేపుకురండి' అన్నాడు వెటకారంగా.

ఇవన్నీ అన్నయ్యకు చెబితే గోలపెడతాడు.

ఆ తర్వాత హాస్టల్‌లో ఉండనని స్నేహితులతో గదులూ వెలగబెట్టాడు. అక్కడకు కూడా వెళ్ళాను. బాగానే మర్యాద చేశాడు. 'ఏరా, చదువు ఎలా ఉంది?' అని అడిగితే, 'సినిమాకి వెళదాం పద' అన్నాడు. సినిమా అయిన తర్వాత 'అయిపోతుందా ఈ సంవత్సరం' అన్నాను.

కానీ, ఫైనల్ ఇయర్ గట్టెక్కలేదు. 'ఏరా' అంటే 'ఇది మామూలే. నువ్వేం కంగారుపడకు. ఈసారి లాగేస్తాగా' అంటాడు. 'ఏరా, కాస్త మారవా..' అంటే 'ఈ వయసులో ఏం మారతాం బాబాయ్' అంటాడు. అప్పటికి వాడి వయసు 22 ఏళ్ళే.

సరే, వీసా అయింది. వాళ్ళ అమ్మ ఏడుపూ అయింది. వాడి ఏడుపూ అయింది. 'నన్ను ఎందుకు పంపిస్తున్నారు? ఆర్నెల్లు ఉంటా, అంతే' అన్నవాడు – అమెరికా వెళ్ళి ఎమ్.ఎస్. చేశాడు, రెండు సంవత్సరాలు.

వాడు అమెరికాలో ఉండగా నేను రెండుసార్లు వెళ్ళాను. బ్రహ్మచారి బ్రతుకులు చూశాను. రెండేళ్ళు గడిచిపోయాయి. వస్తానన్న మాట ఇప్పుడు లేదు.

'ఏదైనా ఉద్యోగం చూడు' అన్నాడు. 'ఇండియాలోనా' అన్నాను ఏడిపించటానికి.

'కాదు, కాదు. ఇక్కడే... సంపాదించి వస్తా' అన్నాడు.

అలాగే ధర్మారావుగారికి చెప్పి, ఐ.బి.ఎమ్.లో పెట్టాం. ఫౌకిప్సీలో కుదురుకున్నాడు. నేను న్యూయార్క్ నుంచి ఫౌకిప్సీ ట్రైన్‌లో వెళ్ళి, వాడిని, లక్ష్మిని ఆమె భర్త శ్రీనివాసరావును కలిశాను. లక్ష్మి మా ఇద్దరినీ భోజనానికి పిలిచింది.



అప్పటికి వాడికి అమెరికా డ్రైవింగ్ అలవాటయ్యింది. ఇద్దరం వెళుతుండగా 'అరె, ఇక్కడ ఆపు... పళ్ళు కొందాం' అన్నాను. 'ఇప్పుడు ఎవరు తింటారు' అంటాడు. పళ్ళు తీసుకెళ్ళి లక్ష్మికి ఇస్తే 'నీకు ఇన్నిసార్లు భోజనం పెట్టాను. ఒక్కసారైనా మీ బాబాయ్‌లాగా పళ్ళు తెచ్చావా' అని తిట్టింది. 'బాబాయ్, నన్ను తిట్టించటానికే తెచ్చినట్లుంది' అన్నాడు.

అన్నయ్య, తరువాత వాడికి పెళ్ళి చేయాలి అని అంటే 'ఇంకేం, చూడు' అన్నాను. 'సరేలే, అదేగా నీకు చెప్పేది' అంటాడు ఆయన. 'వాడు డాక్టర్‌ను చేసుకుంటాను అని అంటున్నాడు' అని కూడా కలిపాడు. దానిలో ఆశ్చర్యం ఏముంది..... అక్కడ మనవాళ్ళందరికీ డాక్టర్ పెళ్ళామో, మొగుళ్ళో కావాలి. బాగా సంపాదిస్తారని ఒక ఆశ. అందుకని 'వీళ్ళైతే డాక్టర్లే కావాలి మరి' అన్నాను.

'నువ్వు ఆ పనిలో ఉండు' అంటాడు అన్నయ్య.

అది నా బాధ్యత అన్నట్లు.

సరే, డాక్టర్లయ్యేవాళ్ళు మెడికల్ కాలేజీలో ఉంటారు కదా. తెలిసినవాళ్ళకి చెప్పి, బెజవాడ, గుంటూరులలో ఉన్న మెడికల్ కాలేజీలలో మెరిట్ మెరికలను చూశాం. మెరిట్ లేకపోతే అమెరికాలో పనికిరారు, అందుకని.

దగ్గర స్నేహితుడు, దూరపు బంధువు కూతురు ఎమ్‌సెట్‌లో రెండవ ర్యాంకు వచ్చి, మెడిసిన్ పూర్తి చేసింది. ఇప్పుడు హౌస్‌సర్జన్ చేస్తున్నది. వారిని, వీరిని కలిసి, బెజవాడలో మా ఇంటికి పిలిపించి, పరిచయం చేసుకున్నాం.

ఈ విషయం చెప్పి, అన్నయ్యతో 'వాణ్ణి అమెరికా నుంచి రమ్మను, కావాలంటే ముందు ఫోటో పంపుదాం' అన్నాను.

వాడు రానూ వచ్చాడు. ఇప్పుడు పెళ్ళి అవసరమా అని గొణుగుతున్నాడు. అటు ఇటు చేసి హైదరాబాదులో పెళ్ళిచూపులు ఏర్పాటు చేశాం. అన్నిటికీ రెండు ప్రక్కల నేనే కదా. కొంచెం ఆర్భాటంగా, పద్ధతిగానే పెళ్ళిచూపులు జరిగాయి. ముందు అఖిల్‌ను అడిగాను 'ఏరా' అని. అన్నిటికీ మా అన్నయ్య నన్నే తోస్తాడు. 'ఇంటికెళ్ళి చెపుదాం బాబాయ్' అన్నాడు. 'ఏమిటి, తమాషానా! ఆలోచించుకో' అని అరగంట టైమ్ ఇచ్చాను. వాడి మనసులో సొనాలీబింద్రే ఉంటుంది, తెలిసిన విషయమే. ఈ అమ్మడు బింద్రేలా కనిపించటానికి కొంత సమయం కావాలి అంతే.

ఈలోపు నేను, అమ్మాయి ఉన్న గదికి ఒంటరిగా వెళ్ళాను. 'అమ్మా, నీ అభిప్రాయం?'

'నాకు, ఇంకో ఛాయిస్ ఉందా' అంది.

- ఎ.కె.

*(ఇంటికి వచ్చి డిక్షనరీలో 'ఛాయిస్'కి అర్థాలు చూశాను.)*

# అట్టమీది బొమ్మలు



రాజా రవివర్మ

**మొదటి, నాల్గవ అట్ట :** రాజా రవివర్మ.

రాజా రవివర్మ ఐదువేల సంవత్సరాలనాటి భారతీయ ఐతిహాస, పౌరాణిక మూర్తులకు రూపు రేఖా విలాసాలు కల్పించి, చిత్రాలు గీసి, అర్ష మతస్థుల గుండెల్లో తిష్ఠవేశాడు. బరోడా లక్ష్మీవిలాస్ ప్యాలెస్‌లో రాజా రవివర్మ, రాజా గైక్వాడ్ ఆహ్వానంపై 12 సంవత్సరాలు ఎంతో విలువైన సమయాన్ని గడిపి, 60 కి పైగా లైఫ్‌సైజ్ చిత్రాలను చిత్రించారు. కానీ 15 మాత్రమే ప్రదర్శనలో ఉంచారు. అవన్నీ కూడా భాగవత, రామాయణ, భారతాలలోని వ్యక్తులు, సంఘటనలే. ఇప్పుడు **మిసిమి** ముద్రిస్తున్న రెండు చిత్రాలు ఈ మధ్యనే వెలుగులోకి వచ్చాయి.

**రెండు, మూడవ అట్టలు :**

చిత్రకళ మీద ప్రేమతో, చిత్రకళను అభ్యసించి నిష్ణాతులైన వారెందరో ఉన్నారు. పల్లెటూరి నుంచి వచ్చిన వారిలో ప్రతిభామూర్తులెందరో! వారు తమ చిత్రాలను ఎలా మార్కెట్ చేసుకోవాలో తెలియక, సరైన భాషా వ్యక్తీకరణ (ఇంగ్లీషు) లేక జీవితాలు వెలమారుస్తున్నారు. పెంచలయ్య చిత్రాలను నేను కోనసీమ చిత్రకళాపరిషత్‌లో చూశాను. అక్కడే అతనితో పరిచయం. ఆయన వివరాలు ఆయన మాటలలోనే....

"నా తల్లిదండ్రులు కీ.శే. చుందాసు, పెంచలమ్మలు. మా అయ్య నాకు ఊహ తెలియకముందే చనిపోయినాడు. మా ఊరు దేవమాచుపల్లి, మాలవాడ. చిట్వేల మండలం, కడప జిల్లాలో ఉంది. మేము అయిదు మందిమి తోబుట్టువులం. అందరిలోకి కడగొట్టు వాడిని నేనే. మాది నిరుపేద కుటుంబం. మా అయ్య వీధి భాగవత కళాకారుడు. మాలవాడల్లో పురోహితం చేసేవాడు. పాటలు పాడేవాడు. తాగి తాగి ఆయన చనిపోయిం తర్వాత కుటుంబం మా అమ్మ రెక్కల కష్టంపై ఆధారపడింది. నా అయిదో ఏట మా ఊరు దేవమాచుపల్లి ఎలిమెంటరీ స్కూల్లో నన్ను 1వ తరగతి చేర్పించింది మాయమ్మ. 5వ తరగతి వరకూ అక్కడే చదివినాను. అప్పటికే మా చిన్నాన్న 7వ తరగతి వరకూ చదివి బడి మాని అమ్మకు చేదోడుగా ఉండేవాడు. సెలవు దినాల్లో నేనూ మా చిన్నాన్న ఏకునాదం మోగిస్తూ మా చుట్టుపక్కల పల్లెలు తిరుగుతూ పాటలు పాడుతూ బిచ్చమెత్తుకునేవాళ్ళం. హైస్కూలు చదువు కోసం మా అమ్మ నన్ను నెల్లూరు జిల్లా మహమ్మదాపురం పంపింది. అక్కడ మా పెద్దమ్మ కుమారుడు పచ్చా పెంచలయ్య డ్రాయింగ్ మాస్టరుగా పనిచేసేవాడు. ఆయనే నా ప్రథమ గురువు. ఆయన దగ్గర చాలామంది శిష్యులు డ్రాయింగ్ నేర్చుకునేవారు. వాళ్ళను చూసి నేనూ బొమ్మలు గీసేవాడిని. అలా మొట్టమొదటిగా బొమ్మలపై ఇష్టం ఏర్పడింది. అక్కడే హాస్టల్లో ఉంటూ 9వ తరగతి వరకూ లాగినా. కానీ ఆ సంవత్సరమే గురువుగారికి ట్రాన్స్‌ఫర్ అయి ఆయన కుటుంబంతో సహా వేరే ఊరు వెళ్ళిపోయినాడు. అప్పుడు నాకు 'పచ్చకామెర్లు' వ్యాధి వచ్చింది. కనుక్కోలేక ముదిరిపోయి ప్రాణంమీదికి వచ్చింది. చిక్కి శల్యమైన నన్ను చూసి మా అమ్మ భోరున ఏడ్చింది. చిత్తూరు జిల్లా కొట్టాలకు పోయి 'రక్ష' వేయించుకొని నాటుమందు తిన్న తర్వాత 3 నెలలకు ప్రమాదం తప్పింది. 3 నెలల తర్వాత బడికి పోతే బళ్ళో చేర్చుకోలేదు. ఇంటికొచ్చి కూలి పనికి పోతూ, పశువుల మేపుకుంటూ ఆ సంవత్సరం గడిపి, మరుసంవత్సరం టి.సి. తీసుకొచ్చి మా ఊరికి దగ్గర్లో చిట్వేల హైస్కూలులో మళ్ళీ 9వ తరగతిలో చేరినా, హాస్టల్లో సీటు ఇవ్వనందున రోజూ 6 కిలోమీటర్లు వచ్చిపోయేవాడిని.

పూట గడిచేదీ కష్టమైన రోజులు. మధ్యాహ్నం కారియర్ తీసుకుపోలేక పస్తులుండేవాడిని. కానీ ఇక్కడి టీచర్లు దయగా ఉండేవాళ్ళు. డ్రాయింగ్ మాస్టర్ అమర్‌నాథ్‌గారు నాచేత బొమ్మలు గీయించి తప్పులు దిద్దేవారు. పదవ తరగతి పాసయిన తర్వాత ఇంటర్మీడియట్ కోసం మా అక్క ఊరికి దగ్గరగా ఉండే వెంకటగిరికి వెళ్ళాను. వెంకటగిరి ఎంతో చైతన్యవంతమైన పట్టణం. ఆర్థిక అవసరాల కోసం అక్కడి సైన్ బోర్డు ఆర్టిస్టులతో కలసి బ్యానర్లు రాయడం, సైన్‌బోర్డులు రాయడం చేసేవాడిని. 1992 సంవత్సరం ఇంటర్ అయిపోయింది. ఒక సబ్జెక్ట్ పోయింది. ఆ సంవత్సరం కాలేజీలో

పాటల్లోనూ, చిత్రలేఖనం పోటీల్లోనూ నేనే ఫస్టు. తిరిగి ఇంటికి వచ్చి ఇక్కడి పరిస్థితులు తట్టుకోలేక వెంకటగిరికి పోయి ఏదో ఒక పనిచేసి డబ్బులు సంపాదిద్దామని రంగుల అద్దకం పనిలో చేరినా! అప్పుడక్కడికి మద్రాస్ నుండి 'బాతిక్' చిత్రకారులు వచ్చి పనిచేసి వెళ్ళేవాళ్ళు. ఆ పని నేర్చుకుంటే జీవికకి భరోసా ఉంటుందని నేర్పమని వాళ్ళనడిగితే దగ్గరకి రానిచ్చేవాళ్ళు కాదు. 'తిరువొట్టియూర్'కి చెందిన బాతిక్ చిత్రకారుడు 'శాంతారం' బాతిక్‌లో కొన్ని మెళకువలు నేర్పినాడు. అయినా నా డ్రాయింగ్స్‌లో పరిపక్వత లేదని గ్రహించి ఇంకా నేర్చుకోవాలని మద్రాసుకు పోయినా అక్కడ నిరాదరణకి గురయి దిండిగల్ జిల్లా చిన్నాలంపట్టికి పోయి సంవత్సర కాలం అక్కడ యూనిట్లలో పనిచేసి బాతిక్ గీయడం, అద్దకం నేర్చుకున్నాను. తిరిగి వెంకటగిరి వచ్చి సొంతంగా యూనిట్ పెట్టే ఆర్థిక స్థోమత లేక యూనిట్లలో రోజుకు 1995లో యాసాల బాలయ్య గారి బాతిక్ బొమ్మలు చూసిన తర్వాత బొమ్మలు వేయడం మొదలుపెట్టినా, అయితే చీరలకు రెండు రంగులు సరిపోతాయిగానీ, బొమ్మలకి ఎక్కువ రంగులు వేయాలి కదా ఎలాగైనా దీనిమీద పట్టు సాధించినా. 1993 నేను వేసిన (ప్రథమంగా) స్థాయి బొమ్మ (పెయింటింగ్) ఇంకా 'వెంకటగిరి సాయిబాబా మందిరం' ద్వారకామయిలో ఉంది. బాతిక్ చీరలకున్న డిమాండ్ బొమ్మలకు లేదు. అందువలన రోజుకు 20 నుండి 30 చీరలకు డిజైన్లు వేసేవాడిని. హంసలు, లేళ్ళు, నెమళ్ళు, లతలు, డాన్సింగ్ బొమ్మలు, గ్రామీణ స్త్రీల బొమ్మలు అందంగా గీసేవాడిని. ఖాళీ సమయాల్లో బొమ్మలు వేసేవాడిని. ఎక్కడ పని ఉంటే అక్కడికి తిరుగుతూ వందల మందికి 'బాతిక్' గీయడం నేర్పించాను.

విజయవాడ, తెనాలి, రాజమండ్రి, మద్రాసు, బళ్ళారి, కడప, గుంటూరు, అనంతపురం, నెల్లూరులలో పనిచేశాను. ఎక్కడ పనిచేసినా రోజుకు 200 రూపాయలకు మించి ఎక్కువ ఇచ్చేవారు కాదు. 1996లో మద్రాసులో డ్రాయింగ్ హైయ్యర్ పరీక్ష రాసి పాసయ్యాను. 1998లో గుంటూరులో టిటిసి చేశాను. నా బొమ్మలు ముఖ్యంగా గ్రామీణ వాతావరణంలోనే ఉంటాయి. నేను బ్రతికిన బతుకునే చిత్రిక పట్టాలని ఈ బొమ్మలు వేశాను. 2004లో మా అమ్మ, 2006లో మా చిన్నన్న చనిపోయారు. ఒకలాంటి డిప్రెషన్‌లోకి వెళ్ళాను. ఎవరి కోసం ఇంత కష్టపడ్డానో వాళ్ళే లేకపోయిన తర్వాత ఇవన్నీ ఎందుకని దుఃఖంలో కూరుకుపోయాను. మళ్ళీ జీవితం మొదటికొచ్చింది. 2010లో నాకిష్టమైన రచయిత గురుసమానులు నామిని సుబ్రహ్మణ్యం నాయుడుగారు నాచేత రెండు బొమ్మలు గీయించారు. నా బాతిక్ బొమ్మలు చూసి, పాత్రికేయులు ఆర్.ఎమ్. ఉమామహేశ్వరరావుగారికి పరిచయం చేశారు. ప్రస్తుతం డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్నాను.


పెంచలయ్య

ఫోన్ : 916 077 5810



మరికొన్ని బెంగాలీ బాతిక్ చిత్రాలు









# అడ్డగోలు కథలు

– గొల్లపూడి మారుతీరావు

ఇంగ్లండులో ఇంట్లో అడుగు పెట్టగానే "మనిద్దరం బయటికి వెళ్దాం రండి మారుతీరావుగారూ. ఓ గొప్ప ఇంగ్లీషు నానుడి ఈ ఊళ్ళోనే పుట్టింది. రుజువులు ఇప్పటికీ ఉన్నాయి" అన్నారు ప్రముఖ కవి బాలగంగాధర్ తిలక్ కుమారుడు సత్యనారాయణమూర్తిగారు.

"ముందు ఆ నానుడి ఏమిటో చెప్పండి" అన్నాను.

"కాక్ అండ్ బుల్ స్టోరీస్"

ఇంక ఆలస్యం చెయ్యలేదు. కారులో దూకాను. ఈ మధ్యనే మోకాలు ఆపరేషన్ చేయించుకున్నాలేండి.

✤ ✤ ✤

అసలు కథకి ప్రారంభం అదికాదు.

ఇంగ్లండుకి ఉద్యోగరీత్యా వలస వెళ్ళిన తెలుగు డాక్టర్లు ఎందరో ఉన్నారు. అప్పట్లో ఆంధ్రదేశంలో ఒకే ఒక్క ఆంధ్రా మెడికల్ కాలేజి. ఇంగ్లండులో ఈ డాక్టర్లు చెదురుమదురుగా అక్కడా అక్కడా ఉంటూ ఉద్యోగాలూ, వృత్తులూ చేసుకుంటున్నారు. తెలుగు దేశానికి దూరమైన బెంగ ఆ రోజుల్లో ఎక్కువ – కారణం ఇప్పటి మొబైల్ ఫోన్లు, ఫేస్‌బుక్‌లు లేని రోజులు. 30 ఏళ్ళ కిందట వీరంతా ఏటా ఒక్కసారి కలుసుకుని పండగ చేసుకోవాలని అనుకున్నారు. అది చాలా హృద్యమైన రూపం దిద్దుకుంది. ఆ విధంగా "ఆంధ్రా మెడికల్ కాలేజ్ గ్రాడ్యుయేట్స్ రీ యూనియన్" అనే సంస్థ ఏర్పడింది. క్రమంగా మెడికల్ కాలేజీలు విస్తరించి – మరిన్ని ప్రాంతాల డాక్టర్లు రావటం ప్రారంభించారు. ఆంధ్రాలో మిగతా కాలేజీల డాక్టర్లూ ఈ వార్షిక ఉత్సవంలో కలుస్తామన్నారు. అప్పుడు సంస్థ "ఆంధ్రా మెడికల్ గ్రాడ్యుయేట్స్ రీ యూనియన్" అయింది. ఇది నిజంగా నిజమైన పండగ. ప్రతి ఏటా సకుటుంబంగా అంతా రెండు రోజులు కలుస్తారు. పాటలు




కాక్ హోటల్

పాడుకుంటారు. కబుర్లు చెప్పుకుంటారు. నాటికలు వేస్తారు. తెలుగు భోజనం చేస్తారు. రెండు రోజుల తర్వాత మళ్ళీ ఎవరి పనుల్లో వాళ్ళు పడిపోతారు. ఈ ఉత్సవాలకి తెలుగు దేశం ప్రముఖుల్ని ఆహ్వానించి, సత్కరించి, వారు చెప్పే మాటల్ని విని ఆనందిస్తారు. ఈ సభలకి అక్కినేని నాగేశ్వరరావుగారు, భానుమతి, బాపు, రావికొండలరావు – ఇలా ఎందరో వచ్చారు. అయితే ఈ 30 సంవత్సరాలలో రెండుసార్లు ముఖ్య అతిథిగా ఆహ్వానింపబడిన ఘనత నాకే దక్కింది. అది వారి సౌహార్దం. మొదటిసారి – 2000లో వెళ్ళినప్పుడు కేవలం ముఖ్య అతిథిగా మాత్రం వెళ్ళలేదు. ఆ సంవత్సరం నా నాటిక "మనిషి గోతిలో పడ్డాడు" ప్రదర్శించాం. గమనించాలి – 'ప్రదర్శించాం' అన్నాను. మిత్రులు వ్యాకరణం అచ్యుతరామారావుగారు నాటిక తెప్పించుకుని అందరిచేతా ప్రాక్టీసు చేయించారు. నేను వెళ్ళి రిహార్సల్స్‌లో చేరి మరునాడు నాటికని ప్రదర్శించాం. ఇది నాకూ, వారికీ కొత్త అనుభవం. ఇంగ్లండులో ఎందరో మిత్రులు. అందరూ డాక్టర్లే. డాక్టర్ బాపూజీరావుగారు, తిలక్‌గారబ్బాయి దేవరకొండ సత్యనారాయణమూర్తిగారు, అచ్యుతరామారావుగారు, వివేకానందమూర్తి, పాల్‌రెడ్డి గోవర్ధన్‌రెడ్డి – ఇలా ఎందరో. ఉత్సవాల్లో డాక్టర్ చాపరాల బాబూరావుగారు నన్ను బర్మింగ్ హామ్‌కి ఆహ్వానించారు. షేక్స్‌పియర్ జన్మస్థలం స్టాట్‌ఫర్డ్‌కి తీసుకెళ్ళి నాటకం చూపిస్తానంటే వస్తానన్నాను. తీసుకెళ్ళారు. చూపించారు.

ఇప్పుడు – 16 సంవత్సరాల తర్వాత – మళ్ళీ అచ్యుతరామారావుగారు పూనుకోగా గొల్లపూడి శ్రీరామమూర్తి గారు నన్ను మళ్ళీ ఆహ్వానించారు. 35 డిగ్రీల వేడినుంచి – చెన్నైనుంచి – నాలుగు డిగ్రీల చలిలోకి పరకాయ ప్రవేశం చేశాం – నేనూ మా ఆవిడా. అచ్యుతరామారావు గారూ, సతీమణి పద్మగారూ, శ్రీరామమూర్తిగారూ, సతీమణి లక్ష్మిగారూ సాదరమైన ఆతిథ్యం ఇచ్చారు.

వ్యాకరణం రామారావుగారున్న కెంట్ నుంచి సమావేశం జరుగనున్న బ్రాడ్‌ఫోర్డ్‌కి అయిదున్నర గంటల ప్రయాణం.

కనుక చాలా చక్కని మజిలీని రామారావుగారు ప్లాన్ చేవారు. ఉదయమే వెచ్చగా బయలుదేరి, మధ్యలో భోజనాలు చేసి సాయంకాలానికి మిల్టన్ కేన్స్ అనే నగరం చేరాం. ఇక్కడ తిలక్‌గారి అబ్బాయి డాక్టర్ సత్యనారాయణ మూర్తిగారు ఉంటున్నారు. మిల్టన్ కేన్స్‌కి ప్రత్యేకమైన చరిత్ర ఉంది. ఇది మన దేశంలో చండీఘర్‌లాగ అద్భుతంగా, ఒక ప్రణాళికతో నిర్మించిన నగరం.

1960 ప్రాంతాలలో లండన్‌లో పెరుగుతున్న జనాభా రద్దీని తగ్గించడానికి అప్పటి పాలకులు లండన్‌కి 72 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఈ మిల్టన్ కేన్స్‌ని ఎంపిక చేశారు. లండన్, బర్మింగ్ హామ్, లెస్టర్, ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్‌లకు సమదూరంలో ఉన్న ఈ స్థలాన్ని ఎంపిక చేశారు. ఈ చుట్టుపక్కల 12 గ్రామాలను కలిపి ఒక నగరాన్ని చేసి వాటిలో ఒక గ్రామం పేరుని ఈ నగరానికి పెట్టారు. మిల్టన్ కేన్స్ అనే పేరులో ఇద్దరు మహానుభావులు ఉన్నారు. ఒక మహాకవి మిల్టన్ (పేరడైజ్ లాస్ట్!), ఒక మహా ఆర్థికవేత్త జాన్ మేనార్డ్ కేన్స్. బహుశా ఆర్థిక శాస్త్రంలో అనూహ్యమైన సిద్ధాంతాలకు రూపకల్పన చేసిన తొలి తరం వారిలో ఆయన ప్రముఖుడు. ఆయన కన్ను మూసిన కారణంగా ఆయనకి నోబెల్ బహుమతి తప్పిపోయింది – కీర్తిశేషులకి ఇచ్చే సంప్రదాయం లేదుకనుక.

మనం ఇప్పుడు అమరావతిని రాజధానిగా నిర్మించుకుంటున్నాం. మేం రాలేము బాబోయ్ అంటున్న సిబ్బందిని రావల్సిందేనని ప్రభుత్వం వత్తిడి చేస్తోంది. కాని ఆనాడు – ఇక్కడికి వెళ్ళమని పాలకులు ఎవరినీ కోరలేదు. ‘వెళ్ళకపోతే ఎలాగ?’ అనిపించే విధంగా నగరాన్ని నిర్మించారు. పది మైళ్ళ పొడవు, ఆరుమైళ్ళ వెడల్పు ఉన్న 22,000 ఎకరాల ఈ నగరం దేశానికే తలమానికం అనే విధంగా నిర్మించారు. ఇప్పటికీ ఇది చాలా అందమైన నగరం. రోడ్డుమీద కారు వెళ్తూ ఉంటే జనసమూహం ఉన్న నగరంలోకి వచ్చినట్టు ఉండదు. పచ్చటి అడవిలోకి వచ్చినట్టుంటుంది. దీన్ని ‘ఫారెస్టు సిటీ’ అన్నారు. రోడ్డుకి రెండుపక్కలా జనాభానీ, ఇళ్ళనీ దాచే చెట్లు. లోపల బారులు తీర్చిన ఇళ్ళు. సరస్సులు, పార్కులు – కన్నుల పండువుగా ఉంటుంది. ఆ రోజుల్లో యూరోపులోకల్లా ఒక మైలు పొడవైన వాణిజ్య సముదాయం (షాపింగ్‌మాల్) కట్టారు. రైలుస్టేషన్ విమానాశ్రయమంత విశాలం. బస్సు స్టేషన్ రైలు స్టేషన్ అంత విశాలం.




బుల్ హోటల్

ముచ్చటపడి ప్రజలు తరలివచ్చారు. ప్రపంచంలోకల్లా గొప్పగొప్ప వాణిజ్య సంస్థలు – ఫోక్స్‌వాగన్, మెర్సిడిస్, మినోల్టా, ఆమెజాన్ – ప్రధాన కార్యాలయాలు ఇక్కడ ఉన్నాయి. 35 ఏళ్ళ కిందట ఇక్కడ 10 శాతం కుటుంబాలకి ఒక కారు ఉండేది. ఇప్పుడు 80 శాతం కుటుంబాలకి రెండేసి కార్లు ఉన్నాయన్నారు సత్యనారాయణమూర్తిగారు.

నగర సంస్కృతి వచ్చి గ్రామీణ జీవన సంస్కృతిని కబలించివేయడం సహజం. మనం తరచు చూస్తాం. కానీ ‘ప్రాచీన వైభవాన్ని’ గర్వంగా నిలుపుకొనే స్వభావంగల బ్రిటిష్ వారు గ్రామీణ వైభవాన్ని ఇక్కడ భద్రంగా కాపాడుకున్నారు. నిజానికి అందుకే ఈ యాత్రాస్మృతి.

ఆధునిక, ప్రాచీన వైభవాలు చెయ్యిచెయ్యి కలిపి, ఇప్పటికీ సజీవంగా ఉన్న అరుదైన ప్రాంతమిది. పాతకాలపు సత్రాలు, పంటకాలువలు, అలనాటి పూరి ఇళ్ళు (అవును, ఊహించలేనంత అందంగా ఉంటాయి), ఇప్పటికీ వ్యాపార రవాణా జరిగే కాలువలు, బోట్లు – నగరాన్ని దాటిన అయిదారు మైళ్ళలోనే కనిపిస్తాయి. అలా ఈనాటికీ నిలిచి ఉన్న అయిదారు శతాబ్దాల కిందటి రెండు ప్రముఖమయిన సత్రాలు – ఆనాటి స్వరూపాలనూ, స్వభావాలనూ ఏమాత్రం వదలుకోకుండా ఇప్పటికీ నిలిచి ఉన్నాయి. అదే ఆశ్చర్యం. నేనూ సత్యనారాయణ మూర్తిగారూ సాయంకాలం ఆరుగంటల ప్రాంతంలో వెళ్ళాం. ఒక సత్రంలో పెద్ద బల్ల చుట్టూ కనీసం పదిమంది కూర్చుని పెద్దపెద్ద గాజు కుప్పెలతో బీర్ తాగుతూ సీలింగ్ కింద పడేలాగా నవ్వుతూ కబుర్లు చెప్పుకుంటున్నారు. తీరిగ్గా సత్రాల్లో కలుసుకోవడం – వైన్ తాగుతూ పిచ్చాపాటీ కబుర్లు చెప్పుకోవటం ఇప్పటికీ ఇంగ్లండు

గ్రామీణ సంప్రదాయ వైభవం అక్కడ యథాతథంగా కనిపించింది. ఇక్కడ వెలసిన రెండు సత్రాలు ప్రపంచంలోనే చరిత్రను సృష్టించే ఒక నానుడికి కారణమయాయి. ఆ రెండు సత్రాల పేర్లు కాక్ హోటల్ (కోడిపుంజు), బుల్ (ఎద్దు) హోటల్. ఇప్పటికీ అదే రూపంలో అలాగే ఉన్నాయి. ఇప్పుడయితే సత్రాలు బార్లయి, రెస్టారెంటులయి – ఆధునికమయిన పేర్లను – ఏ నన్‌షైన్‌లానో, ఏ రోజ్‌లాండ్‌గానో నిలిచేవేమో. ఒక గ్రామంలో అలనాడు వెలసిన గ్రామీణ జీవనాన్ని ప్రతిఫలించే రెండు సత్రాల పేర్లు – తెల్లారి లేస్తే గ్రామీణుల కళ్ళముందు కనిపించే రెండు ప్రాణుల పేర్లు. పేర్లకి ఏమీ అలంకారం లేదు. 'ది కాక్', 'ది బుల్'. ఇంతే.

ఆ రోజుల్లో వ్యాపారులు లండన్ ప్రాంతాల నుంచి – ఆ మాటకు వస్తే ఏ ప్రాంతంనుంచైనా – ఎందుకంటే – ఈ గ్రామం లండన్‌లో ప్రముఖ పట్టణాలకు సమదూరంలో ఉంది కనుక – గుర్రపు బళ్ళతో వచ్చి, మాంచెస్టర్ వేపు వెళ్తూ రాత్రికి ఇక్కడ బస చేసేవారు. బస్సు మజిలీలలో ఇప్పటికీ కొన్ని వందల బస్సులు ఆగుతున్న కారణంగా ప్రాముఖ్యాన్ని సాధించిన ఎన్నో చిన్న గ్రామాలు మనకు తెలుసు. తమిళనాడులో కనకమ్మ సత్రం, సుంకురామ చెట్టి సత్రం, విశాఖపట్నంలో తగరపు వలస – ఇలాగ. ఈ సత్రాలలో రాత్రి విడిదికి తమ గుర్రాల బళ్ళను విప్పి కట్టుకోవడానికి గుర్రపు శాలలు ఉన్నాయి. మీద గదులున్నాయి. వచ్చీపోయే రాదారీ ప్రయాణీకులు, వ్యాపారులతో రద్దీ కారణంగా ఈ సత్రాలకు మంచి రాబడి ఉండేది. ఆ కారణానికే ఈ రెండు సత్రాల మధ్య పోటీ ఉండేది. గిరాకీని తెచ్చే మధ్యవర్తులు ఉండేవారు. ఈ మధ్యవర్తులు 'కాక్' సత్రం ఎందుకు బాగులేదో, అందులో బసచేస్తే వచ్చే అనర్థాలేమిటో ఆయా స్థలాల నుంచి బయలుదేరే వ్యాపారుల చెవుల్లో వేసేవారు. "అయ్యా, బుల్‌లో తమరు దిగుతారని విన్నాం. అక్కడ మొన్ననే హత్య జరిగింది. ఆ దెయ్యం ఇంకా అక్కడే ఉండి, అర్ధరాత్రి మనుషుల గుండెకాయ నమిలేస్తోంది. మొన్ననే ఒకాయన చచ్చిపోయాడు. ఆ తర్వాత మీ ఇష్టం" ఇదొక నమూనా కథ. "బాబూ, కాక్‌లో తరచూ ఉంటారు కదా? ఈ సారీ ఉంటారు. కానీ ప్రాణాలతో వెళ్ళరు. ఎలకలు తినేసిన రొట్టెల్ని కాల్చి పెడుతున్నారు. మొన్న ఒకాయన కాక్ నుంచి బయలుదేరి మాంచెస్టర్ చేరేలోగా పక్షవాతం వచ్చి బండిలోనే చచ్చిపోయాడు." పట్టించుకున్నవాళ్ళు భయపడేవారు. భయపడకుండా సత్రాల్లో బసచేసి హాయిగా వెళ్ళినవారు ఈ కథలకి నవ్వుకునేవారు. వారు వైన్ తాగుతూ చెప్పుకునే కబుర్లలో "మొన్న కాక్‌లో బస చేసేవట కదా?" అంటే ఈయన నవ్వి, "ఆడ దెయ్యం కథేనా? అది కాక్ అండ్ బుల్ స్టోరీ బాబూ" అనేవాడు. ఈ విధంగా ఒక నానుడి పుట్టి – అభూతకల్పనకీ, అడ్డగోలు కథలకీ మంచి శీర్షికగా మారింది – కాక్ అండ్ బుల్ స్టోరీ.

ఈ కాక్ హోటల్ ముందు గర్వంగా పెట్టుకున్న ఒక ప్రకటన ఉంది. "1480లో ప్రారంభమయిన ఈ సత్రంలో ఇంగ్లీషులో మొదటి నిఘంటు కర్త శామ్యూల్ జాన్సన్, చార్లెస్ డికెన్స్ విల్లింగ్టన్ డ్యూక్ దొరగారు బసచేశారు" – అని రాసుకున్నారు. స్వీడన్‌లో ప్రఖ్యాత నాటక కర్త ఇబ్సన్ ఇంటికి దగ్గర్లో ఉన్న హోటల్‌లో ఆయన తరచు కూర్చుని వైన్ తాగే టేబుల్, కుర్చీని ఉంచారు. అక్కడ మేము ఫోటోలు తీసుకున్నాం. వెంటనే నా మనస్సు ఇండియాకి వచ్చి వాలిపోతుంది. ఫలానా కోమల విలాస్ హోటల్‌లో చిలకమర్తి లక్ష్మీనరసింహం, గురజాడ అప్పారావు, శ్రీశ్రీ ఇడ్లీ, కాఫీ తీసుకున్నారు – అని రాసే రోజు వస్తే గర్వపడాలనిపిస్తుంది.

ఇక బుల్ హోటల్ ముందు ఒక బోర్డు ఉంది. "1609 ప్రాంతాలలో ప్రారంభమైన ఈ సత్రంలోనే 1792లో గ్రాండ్ జంక్షన్ కెనాల్ ప్రారంభానికి చర్చలు జరిగాయి. దరిమిలాను అది గ్రాండ్ యూనియన్ కెనాల్ అయింది" – అని రాసుకున్నారు. చరిత్రనీ, సంస్కృతినీ కాపాడుకోవడంలో ఇంగ్లీషువారు ముందుంటారు. విజయనగరంలో గురజాడ ఇంటిని కొనుగోలు చెయ్యడానికి ఆ నగర కౌన్సిల్ ముందుకు రాలేదని పేపర్లో చూశాను. 450 సంవత్సరాల కిందటి వైభవాన్ని గర్వంగా దాచుకుని నిలుపుకున్న ఒక జాతి దక్షత ఇది. "తెరిచే కిటికీనిబట్టి పరతెంచే పుష్పపరాగం ఉంటుంది, గదికీ మదికీ కూడా గవాక్షాలుంటాయి" అన్నారు తిలక్. "చూసే దృష్టిని బట్టి వికసించే సంస్కృతీ వైభవం ఉంటుంది. ఊరుకీ వాడకీ కూడా చెప్పే ఊసులుంటాయి" అంటూ కొత్త విషయాన్ని ఆవిష్కరించి చూపించారు తిలక్‌గారబ్బాయి సత్యనారాయణమూర్తిగారు.

గొల్లపూడి మారుతీరావు
email : gmrsivani@gmail.com

## వెండితెరకు వన్నె తెచ్చిన

# వైజయంతిమాల

- *కాండ్రేగుల నాగేశ్వరరావు*

***జీ****వితం* చిత్రం వైజయంతిమాల కారు ప్రయాణంతో ప్రారంభమవుతుంది. 10 నిముషాల తరువాత ఆమె 'చక్కనైన కోయారాజుని ఎక్కడైనా చూశారా?' అంటూ నృత్యం చేస్తూ, పాట పాడుతూ ప్రశ్నిస్తుంది. జలతారులా వెండితెరంతా పరుచుకున్న ఆమె అందాన్ని చూడడానికే రెండు కళ్ళూ చాలనప్పుడు ఇక కోయరాజుని ఎవరు చూస్తారు?

అలా తెలుగు సినిమా *జీవితం* లో కారు ప్రయాణంతో మొదలైన వైజయంతిమాల వెండితెర ప్రయాణం మళ్ళీ వెనక్కి తిరిగి చూడలేదు.

అప్పటి సినిమాలలో హీరోయిన్ అంటే తండ్రి చాటు బిడ్డ. భర్త నీడలో బ్రతికే స్త్రీ. ఓ బిడ్డకు తల్లి. అంతే! ఈ మూస నుంచి బయటకు వచ్చిన ఆధునిక స్త్రీ గా వైజయంతిమాల తెలుగులో తన రెండవ తెలుగు చిత్రం *సంఘం*లో నటించింది. గుర్రపు స్వారీ, హంటర్ ప్యాంట్, ఇన్‌షర్టు వేసుకుని **'భారతవీర కుమారిని నేనే, నారీ రతనము నేనే, భారత నారీ అభ్యుదయానికి నాయకురాలిని నేనే. స్వార్థముతో, కులమత భేదముతో, సతతము పోరే భరతావనిలో, శాంతి జ్యోతి వెలిగిద్దాం. కర్షక సౌఖ్యం, కార్మిక ధ్యేయంలో మార్గం చూపిస్తాం. రాణీ రుద్రమ మల్లమ దేవి రెడ్డి నాగమ్మ నేనే. తిక్కన భార్య, సతిమాంచాలా, శౌర్య ధైర్యములు నావే'** –



వైజయంతిమాల

ఇలా ఆధునిక స్త్రీగా, అభ్యుదయవాదిగా, నిండైన వ్యక్తిత్వంతో నటించిన మొట్టమొదటి నటి వైజయంతిమాల. అంజలీదేవి వీణ వాయిస్తుండగా 'సుందరాంగ మరువగలేనోయ్....... హృదయ వీణ తీగలు మీటగ రావేలా...' అంటూ చేసిన నృత్యం ఎప్పటికీ మరువలేం.

ఆ విధంగా తెలుగు సినిమాతో మొదలైన వైజయంతిమాల చలనచిత్ర జీవితం మూడు పువ్వులు, ఆరు కాయలుగా మూడు దశాబ్దాల పాటు అప్రతిహతంగా సాగింది. ఈ రెండు చిత్రాలలో ఆమె తన సంభాషణలు తానే చెప్పుకుంది. అంతేకాదు ఆమె తెలుగులో 'దాచినాను రావోయ్, నీ కొరకు వేచినాను రావోయ్', 'నను చేరగ రావోయి ప్రియుడా' అనే రెండు లలిత సంగీత గీతాలు ఆలపించింది. ఈ పాటలకు మాస్టర్ వేణు సంగీత దర్శకత్వం వహించారు.

ఆ తరువాత 1954వ సంవత్సరంలో ఫిల్మ్‌స్తాన్ వారి నాగిన్ చిత్రం ఆ సంవత్సరం విడుదలైన అన్ని చిత్రాలకంటే అత్యధికంగా వసూలు చేసింది. హేమంత్ కుమార్ సంగీతంలో, కళ్యాణ్‌జీ వాయించిన నాగస్వర నాద లయకు అనుగుణంగా లతామంగేష్కర్ మనోహరంగా పాడిన 'మన్‌డోలే, తన్‌డోలే' అనే పాటకు ఆమె అభినయిస్తూ చూపించిన హొయలుకు మనసు, తనువు రెండూ 'డోలే' అంటూ పాములు కాదు, ప్రేక్షకులూ తన్మయత్వంతో తలలూగించారు. ఈ చిత్రంతో ఆమె హిందీ చిత్రసీమలో అగ్రస్థానాన్ని అందుకొని ఒక దశాబ్ద కాలంపైన ఆ స్థానాన్ని నిలబెట్టుకుంది. మూడు దశాబ్ద కాలాల్లో పేరుగాంచిన అందరి ప్రముఖ హీరోలతోను ఆమె నాయికగా నటించింది. అశోక్ కుమార్, కరణ్ దివాన్ లాంటి సీనియర్లు, దిలిప్ కుమార్, భరత్ భూషణ్, రాజ్‌కపూర్, దేవానంద్, కిశోర్ కుమార్, ప్రదీప్ కుమార్ లాంటి యాభైయవ దశాబ్దం కాలం నాటి మేటి హీరోలు, వారి తరువాత జూనియర్లుగా వచ్చిన సునీల్‌దత్, రాజేంద్రకుమార్, షమ్మీకపూర్లు, వయసులో తనకంటే చిన్నవారైన మనోజ్‌కుమార్, ధర్మేంద్ర, జాయ్‌ముఖర్జీ – ఇలా రెండు దశాబ్దాల పాటు ఒకరి తరువాత ఒకరుగా వచ్చిన

ప్రముఖ హీరోలతో పాటు, బెంగాలీబాబు ఉత్తమ్‌కుమార్, తమిళ నటులు ఎమ్.జి ఆర్, శివాజి, జెమినీ, శ్రీరామ్‌లతో నటించింది. అలానే అక్కినేనితో ఆమె ***అతిశయపెణ్*** అన్న తమిళ చిత్రంలో హీరోయిన్‌గా నటించింది. వైజయంతిమాల బొంబాయి సినీజీవిత ప్రవేశం ఒక గొప్ప మలుపుకు మార్గదర్శకమైంది. మొట్టమొదటిసారిగా ఒక దక్షిణాది తార అఖిలభారత తారగా ఎదిగి కీర్తిశిఖరాలను ఆక్రమించటమేకాక ఆ తరువాతి కాలంలో దానినొక వారసత్వంలా స్థిరపడేలా నిలబెట్టిన ఖ్యాతి వైజయంతిమాలదే. హేమామాలిని, రేఖ, శ్రీదేవి, ఐశ్వర్యారాయ్ వరకు ఈ ప్రస్థానం కొనసాగింది.

అఖిలాంధ్ర ప్రేక్షకులు ఆమెలో మొదటిసారిగా నృత్యం చేస్తున్న కథానాయికను చూశారు. ఆత్మాభిమానంగల బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుతెచ్చుకున్న ఆమెకు అతిశయం కూడా ఎక్కువే. కాకారాయుళ్ళకు ఆలవాలమైన చిత్రసీమలో ఆమె ఎవరికీ తలవంచలేదు. ఆమె నా వల్లనే పైకి వచ్చింది అని చెప్పుకునే అవకాశం ఎవరికీ ఇవ్వలేదు, ప్రఖ్యాత నటియైన తల్లి వసుంధరతోసహా.

1. దిలీప్ కుమార్ లాంటి హీరోతో తలపడి, ఒక్కరోజు షూటింగ్ తరువాత ***రామ్ ఔర్ శ్యామ్*** చిత్రం నుంచి తప్పుకుని నాగిరెడ్డి చక్రపాణి అంతటి దిగ్గజాల నుంచి ముందు అనుకున్నట్టుగా తనకు రావలసిన మొత్తం వారి నుంచి రాబట్టుకుని మరీ తలెత్తుకుని బయటికొచ్చింది. ఆ తరువాత కాలంలో దిలీప్‌తో ***సంఘర్ష్*** లో నటించినా షూటింగ్ సమయంలో అతనితో ఒక్క మాట కూడా మాట్లాడలేదు.

2. బిమల్‌రాయ్ ***దేవదాసు*** చిత్రాన్ని హిందీలో నిర్మించ తలపెట్టినప్పుడు మొదట పార్వతి పాత్రకు మీనాకుమారిని, చంద్రముఖి పాత్రకు నర్గీస్‌ను అనుకున్నారు. కానీ, పరిస్థితులు అనుకూలించకపోవటంతో వారు నటించలేదు. ఆ తరువాత చంద్రముఖి పాత్రకు బీనారాయ్, సురయాలు నిరాకరించటంతో ఆయన ఆ పాత్ర వేయవలసిందిగా వైజయంతిమాలను కోరారు. బిమల్‌రాయ్‌ని ఆమె ఒకే ఒక ప్రశ్న వేసింది. "ఈ పాత్ర నేను చేయగలనని మీకు నమ్మకం ఉందా? ఉంటే సరే!" అంది. "బిమల్‌రాయ్ దేవదాసులో వైజయంతి చంద్రముఖి అట! మరి దేవదాసు కిశోర్ కుమారా?" అంటూ కొన్ని పత్రికలు హేళన చేశాయి. నిజానికి ఆ సమయానికి ఆమె హిందీ చిత్రసీమలో అగ్రస్థానంలో ఉంటూ అత్యధిక పారితోషికం తీసుకుంటున్నా, ఎందరో నిరాకరించిన ఆ పాత్రను ధరించటానికి అంగీకరించటం ఆమె ఆత్మవిశ్వాసానికి చిహ్నం. ఈ సినిమా విడుదలై ఆమెకు పేరు తీసుకురావటమే కాక, ఫిల్మ్‌ఫేర్ నిర్వహించిన ఆ సంవత్సరపు ఉత్తమ సహాయ నటిగా ఎంపిక కావడానికి దోహదం చేసింది. అయితే "నేను నిర్వహించిన పాత్ర ముఖ్యమైనది, సహాయ పాత్ర ఎంతమాత్రమూ కాదు'' అంటూ ఆ అవార్డును తిరస్కరించింది. ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పరిగణించబడే ఆ అవార్డును తిరస్కరించిన మొదటి నటి ఆమె. ఈ సంఘటన ఎందరినో ఆశ్చర్యానికి లోను చేసింది. ఆ తరువాత కాలంలో బి.ఆర్. చోప్రా ఒక వేశ్యను హీరోయిన్‌గా చేసి తీసిన ***సాధన*** చిత్రానికి గాను (మొదట్లో ఈ పాత్రకు నిమ్మీ అనుకున్నారు.) ఆమె ఉత్తమ కథానాయికగా 1957వ సంవత్సరంలో ఫిల్మ్‌ఫేర్ అవార్డు అందుకుంది. తరువాత వచ్చిన ***గంగాజమున*** చిత్రం కోసం అవధ్ ప్రాంతంలో నున్న భోజ్‌పురి యాసను కష్టపడి మాష్టరీ చేసి తన సత్తాను చాటి, రెండవసారి ఫిల్మ్‌ఫేర్ అవార్డు సాధించింది. 1964వ సంవత్సరంలో రాజ్‌కపూర్ ***సంఘం*** చిత్రంలో ధరించిన రాధ పాత్రకు మూడవ సారి ఫిల్మ్‌ఫేర్ అవార్డును గెలుచుకుంది.



***అతిశయపెణ్***

3. ***మధుమతి*** చిత్రంలో ఔట్ డోర్ షూటింగ్ నైనిటాల్‌లో జరుగుతున్నపుడు ప్రతిరోజు తన స్నానానికిగాను బిందెడు పాలు కావాలని డిమాండ్ చేసి తెప్పించుకునేది. ఇది మరీ విడ్డూరంగా ఉంది, అని ఎంతమంది అన్నా ఈ చలిలో చర్మం పగలకుండా ఉండడానికి తన గ్లామరు కాపాడుకోవడానికి క్షీరాభిషేకం అవసరమని, దాని తర్వాతనే ఆమె షూటింగ్‌కు వచ్చేది.

4. ***జుయెల్‌థీఫ్*** చిత్రం నేపాల్‌లో షూటింగ్ జరుగుతున్నప్పుడు విజయానంద్ హేళనగా ఒక మాటన్నందుకు అందరి ముందు అతనికి చుక్కలు చూపించింది. ఆ తరువాత ఆమెతోనున్న సన్నివేశాలన్నిటికీ దేవానంద్ దర్శకత్వం వహించాడు.

“నేను నమ్మింది, నచ్చింది చేస్తాను” అనే తత్త్వం ఆమెది. 1966వ సంవత్సరంలో ఈగిల్ ప్రొడక్షన్స్ వారు నిర్మించిన ***ఆమ్రపాలి*** చిత్రంపై ఆమె చాలా ఆశలు పెట్టుకుంది. అయితే ఈ చిత్రం అపజయం ఆమెను క్రుంగదీసింది. ఆమ్రపాలి పాత్రను ఆమె ఎంతగానో ఇష్టపడింది. మనసుపెట్టి నటించింది. నృత్యాలు చేసింది. ఆమె అంతందంగా అంత ప్రావీణ్యంగా నాట్యం చేయటం, నటించటం అంతకు ముందెప్పుడూ లేదన్నది విమర్శకుల అభిప్రాయం. ***ఆమ్రపాలి*** చిత్రానికి గాను ఉత్తమ కథానాయికగా ఫిల్మ్‌ఫేర్ నామినేట్ చేసినా అవార్డు లభించలేదు. దీనితో తానిక సినిమాల్లో నటించనని ప్రకటించింది. ఇంచుమించు అదే సమయంలో రాజేంద్ర కుమార్‌తో జంటగా నటించిన ***సూరజ్*** చిత్రం ఘనవిజయంతో తన అభిప్రాయాన్ని మార్చుకుంది. ఈ చిత్రంలో “బహారో ఫూల్ బర్సావో” (ఓ వసంతమా! నా మనస్విని వస్తుంది - పూలు పరుచు. ఓ కాలమేఘమా! ఆమె కంటికి కాటుక దిద్దు. గోరింతా! ఆమె చేతికి రంగులు అద్దు) అంటూ పూల ఊయలలో ఆమె పవళించినప్పుడు ప్రియుడు ఆమెను లాలిస్తూ పాడిన ఈ పాటలో ఆమె సౌందర్యానికి మరో పేరుగా నిలిచింది. 1968వ సంవత్సరంలో విడుదలయిన ***సంఘర్ష్, సాథీ, దునియా*** చిత్రాలు విఫలం కావటంతో సినిమాలలో ఆర్థికంగా తన




బలం తగ్గిందని తెలుసుకొని సినిమాకు దూరమయింది. అదే సంవత్సరం రాజ్‌కపూర్ పర్సనల్ ఫిజీషియన్ చమన్‌లాల్ బాలీని వివాహం చేసుకొని తన నివాసం మద్రాసుకు మార్చింది. ఆమెకు




ఒక్కడే కుమారుడు, పేరు సుచేంద్ర బాలి. ఆ తరువాత కాలంలో గుల్జార్ *ఆంధీ* చిత్రానికి, చోప్రా *దీవార్* చిత్రంలో తల్లి పాత్ర పోషించడానికి ఎక్కువ డబ్బు ఆశ చూపినా ఆమె ఏ మాత్రం తొణకలేదు. చెంపలు నెరిసి, చత్వారం కళ్ళజోడు పెట్టుకొని అక్క - వదిన, అమ్మ, అత్త పాత్రలను తాను పోషించనని - హీరోయిన్‌గా వచ్చాను, హీరోయిన్‌గానే నిష్క్రమిస్తాను అని మాట నిలుపుకొన్న ఏకైక నటీమణి వైజయంతిమాల. ఇది చార్లీచాప్లిన్‌కూ చెల్లింది.

2007వ సంవత్సరంలో ఆమె తన స్వీయ చరిత్రను ***బాండింగ్*** అన్న పేరుతో ప్రచురించింది. అందులో తనమీద వచ్చిన పుకార్లన్నిటికీ సమాధానం చెప్పింది.

మద్రాసులో నాట్య శిక్షణా సంస్థ స్థాపించటంతోపాటు రాజకీయాల్లో కూడా చురుకుగా పాల్గొంది. 1984వ సంవత్సరంలో తమిళనాడు జనరల్ అసెంబ్లీకి, 1985, 89 రెండుసార్లు కాంగ్రెస్ తరఫున లోక్‌సభకు ఎన్నికైంది. తిరిగి 1993లో కాంగ్రెస్ తరఫున రాజ్యసభ మెంబరుగా నామినేట్ చేయబడింది. కాంగ్రెస్ పార్టీ, సామాజిక సేవల విషయంలో క్రమేపీ దూరమవుతుందని తెలుపుతూ సోనియా గాంధీకి రాజీనామా లేఖను సమర్పించింది. జనతా పార్టీ సభ్యత్వం తీసుకుంది. ఆమె గర్వం, అహంకారం రెండూ చంద్రునిలో మచ్చలాకాక, నవ వధువు బుగ్గపై చుక్కగా ఆమె విషయంలో శోభించింది.

ఆమె పొందిన అవార్డులు, రివార్డులు లెక్కలేనన్ని, దేశ, విదేశాలలో చేసిన నృత్యాలకు లభించిన ప్రజాదరణ, అభినందనలకు కొదవలేదు. సంగీత నాటక కళాపురస్కారం, సంగీత నాటక అకాడమీ సభ్యత్వం, ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పొందటం మనకు ఆశ్చర్యం అనిపించదు.

కళను తెరమీదకు తీసుకువచ్చిన కళాకారిణి వైజయంతిమాల!

కాండ్రేగుల నాగేశ్వరరావు
హైదరాబాద్.
ఫోన్ : 994 808 3387

# కారే రాజులు.. కొడక్ ఫిల్ములు...

నాకు బాగా గుర్తు 1980 వ సంవత్సరంలో రంగుల ఫోటోలను ప్రింట్ చేసే అనేక కలర్‌లాబ్‌లు ఆంధ్ర దేశంలోని ముఖ్యపట్టణాలన్నిటిలోనూ వెలిశాయి. అంతుకుముందు ఉన్న వెలకన్నా ఎంతో తక్కువకు ఇచ్చేవారు. Konica, Fujica అనే జపనీస్ సంస్థలు 35 రోల్ ఫిలిమ్‌ను 50 రూపాయలకే అమ్మేది. అయినా వారికి అందులో రూ. 20/- వరకూ మిగిలేది. మరొకప్రక్క కొడక్ 35 MM రోల్ ఫిల్మ్ ఖరీదు 250 రూపాయలు. అంటే ఒకొక్క ఫిలింమీద వాళ్ళ లాభం 220 రూపాయలు. ఇది కొన్ని వందల రెట్లు ఎక్కువ. ప్రపంచవ్యాప్తంగా వచ్చే సినిమాలలో జపాన్, రష్యా, హాంకాంగ్ మినహా మిగిలిన అన్ని దేశాలు Kodak రంగుల ఫిల్మ్‌నే వాడేవారు. షేర్ మార్కెట్‌లో ఒక షేరు వెయ్యింతలు విలువ సాధించి, మొదటిస్థానంలో నిలబడింది Kodak.

ఒక అర్థ శతాబ్దం తరువాత, లక్షా డెబ్బైవేల మంది ఉద్యోగస్తులు ఉన్న, ప్రపంచంలో 85 శాతం ముడి ఫిలుం, ఫోటో పేపరు అమ్ముతున్న కొడక్ కంపెనీకి ఒక శుభోదయాన అంతా తారుమారైంది. ఫిల్మ్ అవసరం లేని, ఫిల్మ్‌కంటే పదింతలు నాణ్యమైన రంగులను చూపించే డిజిటల్ టెక్నాలజీ అందుబాటులోకి వచ్చింది. తనకు సాటిలేదని విఱ్ఱవీగిన కొడక్ కంపెనీ ఒక్కసారిగా నష్టాలబారిన పడి దివాళా తీసింది. ఎంతలో ఎంత మార్పు! బళ్ళు ఓడలవడం, ఓడలు బళ్ళవడం అంటే ఇదేనా!

కంప్యూటర్ రంగంలో జరిగిన శాస్త్రీయ పరిశోధనలు, అనేక కొత్తకోణాలను వెలుగులోకి తేవడం, దానివల్ల వస్తువు నాణ్యత పెరగటం, ఎక్కువమందికి తక్కువ ధరకే అందుబాటులోకి రావటం ఇప్పుడు మనం చూస్తున్నాం. ఇది ఒక ప్రారంభం, ఒక శుభారంభం మాత్రమే. రాబోయే రోజులలో ఏమి జరుగబోతోంది? తలుచుకుంటేనే ఒళ్ళు జలదరిస్తుంది. ఒకటి మాత్రం నిజం. మానవ జీవితం ఎన్నో అద్భుతాలను చూడబోతోంది. ఇది ఊహల పల్లకిలోనికి ఎక్కించటం కాదు. మనిషి కలలు రూపుదిద్దుకోబోతున్న సమయం ఆసన్నమైందని చెప్పటం.

తరువాత వచ్చిన డిజిటల్ కెమెరాలు ఎంత త్వరలో ఎంత ప్రగతి సాధించాయో మనం ఎరుగనిది కాదు. ఇటువంటి మార్పులే మరెన్నో రాబోతున్నాయి. అత్యాధునిక శాస్త్రీయ యంత్ర మహా విప్లవ యుగం రాబోతోంది. ఈ 21వ శతాబ్దంలోనే అది నిజం కాబోతోంది. మరొక ఐదు, పది సంవత్సరాలలో సంప్రదాయక పద్ధతులలో నడుస్తున్న అనేక పరిశ్రమలు మూతపడబోతున్నాయి.

Uber ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీ. వారికి తమదంటూ చెప్పుకునే సొంత కారులు లేవు. కానీ అది ఇప్పుడు ప్రపంచ వ్యాప్తంగా టాక్సీలను నడుపుతున్న పెద్ద సంస్థ. అలాగే ఓయో, ఎయిర్ బిఎన్‌బి అనేవి హోటల్ గదులను అద్దెకు కుదిర్చే సాఫ్ట్‌వేర్ కంపెనీలు. వీరికి ప్రపంచంలో ఎక్కడా ఒక హోటల్‌గాని, ఒక ప్రాపర్టీ గానీ లేదు. కానీ రోజూ కొన్ని వందల గదులు అద్దెకు అవసరానికి కుదిర్చి కోట్ల వ్యాపారం చేస్తున్నారు. కృత్రిమ మేధలో కంప్యూటర్స్ ఎంతగా పురోగమించాయంటే అవి మనిషికంటే ఎక్కువగా ఈ ప్రపంచం గురించి ఆలోచిస్తున్నాయి, విశ్లేషిస్తున్నాయి. పది సంవత్సరాల తరువాత మాత్రమే సాధ్యమవుతాయి అనుకున్న ఎన్నో సాంకేతిక విజయాలు ముందుగానే తన లక్ష్యాన్ని సాధిస్తున్నాయి.

ఇప్పుడు అమెరికాలో న్యాయవాదుల పరిస్థితి మరీ అధ్వాన్నంగా తయారయింది.

IBM Watson ద్వారా మీకు ఏ విధమైన న్యాయ సలహానైనా ఒక్క నిమిషంలోపు వ్యవధిలోనే పొందవచ్చు. అది 90 శాతం ఖచ్చితత్వంతో సమాధానమిస్తుంది. మామూలు అడ్వకేట్ ఇచ్చే సలహా 70 శాతం స్పష్టత మాత్రమే కలిగి ఉంటుంది. బహుశ భవిష్యత్‌లో న్యాయవాదుల సంఖ్య గణనీయంగా తగ్గబోతుంది. నిష్ణాతులు మాత్రమే రంగంలో మిగులుతారు.

Watson పరిశోధనలు న్యాయశాస్త్రానికే పరిమితం కాలేదు. వైద్యరంగంలో కూడా ప్రవేశించింది. కాన్సర్ అవునో కాదో గుర్తించడానికి ఈ పరికరం వైద్యసిబ్బందికంటే నాలుగు రెట్లు మెరుగ్గా పనిచేస్తుంది. 2030లో కంప్యూటర్లు మానవ మేధస్సును అధిగమించబోతున్నాయి. ప్రయాణ రంగంలో మరో ముఖ్యమైన దశ రాబోతుంది. డ్రైవరు అవసరం లేని స్వయంచోదక కార్లు తయారవుతున్నాయి. ఇప్పటికే గూగుల్ కంపెనీ తయారు చేసిన ఈ కార్లు అమెరికాలోని కాలిఫోర్నియా రోడ్లమీద షికార్లు చేస్తున్నాయి. ఇలా చూసుకుంటూ పోతే రాబోయే కాలంలో సొంతంగా కార్లు కొనే అవసరం మనుషులకు ఉండబోదు. ఇప్పుడు పెద్ద

కంపెనీలైన హోండా, మెర్సిడెస్, బిఎమ్‌డబ్ల్యులు దుకాణాలు మూసుకోవలసి వస్తుంది. మీ పిల్లల పిల్లలకు డ్రైవింగ్ లైసెన్స్‌తో పని ఉండదు. 2018 నాటికి ఈ కార్లు అందుబాటులోకి రాబోతున్నాయి. మీరు స్మార్ట్‌ఫోన్‌లో కారు పిలవవచ్చు. డ్రైవరు లేకుండా కారు వస్తుంది. అందులో మీరు ఎక్కడి వెళ్ళాలో అక్కడ దిగవచ్చు. క్రెడిట్ కార్డుతో డబ్బులు కట్టవచ్చు. మీకు పార్కింగ్ బాధ, సిగ్నల్స్ బాధ, ప్రమాదాల బాధ ఏమీ ఉండదు. ఇప్పుడు దాదాపు 20 లక్షల మంది రోడ్డు ప్రమాదాలలో చనిపోతున్నారు.

ఈ స్వయంచోదక కార్లు వచ్చినప్పుడు కోటి కిలోమీటర్లకు ఒక్క ప్రమాదం కూడా జరగకపోవచ్చు. ఆ విధంగా పెద్దపెద్ద కారు కంపెనీలు దివాళా తీయబోతున్నాయి. ఈ టెక్ కారు కంపెనీలు టెస్లా, ఆపిల్, గూగుల్ విప్లవాత్మకమైన వాహనాలను తీసుకు రాబోతున్నాయి. ఇన్సూరెన్స్ కంపెనీలన్నీ మూతపడతాయి. ఎలక్ట్రికల్ కార్ల మూలంగా వాయుకాలుష్యం, ధ్వనికాలుష్యం ఏమి ఉండవు. ముఖ్యంగా సోలార్ ఎనర్జీతో కార్లు నడుస్తాయి కాబట్టి బొగ్గు, క్రూడు మూలంగా ఇప్పుడు జరుగుతున్న కాలుష్యం మొత్తం నివారించబడుతుంది. ఈ సంప్రదాయ కంపెనీలు 2025 కి కనుమరుగయిపోతాయి.

రాబోయే కాలంలో కరెంటు అతి చౌకగా తయారు చేయబడుతుంది. 75 శాతం సూర్యరశ్మితోనే కరెంటు పుట్టిస్తారు. మిగతాది పవన విద్యుత్ అందుబాటులోకి వస్తుంది.

ట్రైకార్డర్ ఎక్స్ అనే పరికరం అందుబాటులోకి వచ్చింది. ఈ ట్రైకార్డర్ ఎక్స్ మీ స్మార్ట్‌ఫోన్‌తో పనిచేస్తుంది. మీ కంటి రెటీనా స్కాన్ చేసి, మీకు బి.పి., షుగరులాంటి ఎటువంటి రుగ్మతులున్నా విశదీకరిస్తుంది. దాదాపు ఉచితంగా. అంటే, డయాగ్నెసిస్ సెంటర్‌లు అన్నీ మూతపడతాయా?

ప్రస్తుతం యాపిల్ కంపెనీ ఒక వాచీ తయారు చేసింది. అది మీ గుండె శబ్దాలన్నింటినీ పట్టి – మీకు రాబోయే ప్రమాదాలను – హార్ట్‌ఎటాక్, స్ట్రోక్ లాంటి ఆరోగ్యపరమైన ప్రమాదాలను హెచ్చరిస్తుంది. ఈ విధంగా ఇప్పుడు అమెరికాలో రోజూ ఎన్ని ప్రాణాలను ఈ యాపిల్ వాచీ రక్షిస్తోందో కథలు కథలుగా వస్తున్నాయి.

3డి ప్రింటర్ ఖరీదు 18 వేల డాలర్ల నుంచి 400 డాలర్ల వరకు పడిపోతుంది వచ్చే దశాబ్ద కాలంలో – 100 రెట్లు వేగంగా పనిచేస్తుంది. ఇప్పుడు మనకు చెప్పులు, బూట్లు అమ్ముతున్న పెద్దపెద్ద కంపెనీలన్నీ మూతపడబోతున్నాయి. మీ చెప్పులు మీరే 3డి ప్రింటర్‌లో చేసుకోవచ్చు. ఈ సంవత్సరం ఆఖరికి మీ స్మార్ట్‌ఫోన్‌లో 3డి స్కానర్ వస్తుంది.

చైనా ఇంకొక అడుగు ముందుకువేసి 3D సాయంతో 6 అంతస్థుల భవనాన్ని నిర్మించింది. 2027 నాటికి మనం ఉపగియోగించే వస్తువులలో 10 శాతం 3D ప్రింటింగ్ సాయంతో మనమే తయారు చేసుకోబోతున్నాం. ఇక వ్యాపార రంగంలో మీరు ఎలా ముందుకు వెళ్ళాలో సూచించే విధంగా సెల్‌ఫోనులు రాబోతున్నాయి.

మన జీవితాల్లో మరో 30 సంవత్సరాలలో సౌరశక్తి అతి ముఖ్యమైన శక్తిగా మనకు సేవలందించబోతుంది. పెట్రోలు, డీజిల్ బంకులు మ్యూజియమ్‌లు కాబోతున్నాయి. 2025 నాటికి ఆయిల్ కంపెనీలు మూతబడటం తథ్యం. విద్యుత్ ఛార్జీల భారం తగ్గటంతో సముద్రపు నీరు నుంచి ఉప్పును వేరుచేసి, మంచినీటిని తయారు చేసుకోవటం సులవవుతుంది. ఇక ఆరోగ్యరంగం మరింత మార్పులకు గురవుతుంది.

20వ శతాబ్దంలోనున్న ఎన్నో వస్తువులు 21 వ శతాబ్దపు మధ్యకాలం నాటికి పూర్తిగా కనుమరుగు కాబోతున్నాయి. భవిష్యత్‌లో 100 డాలర్ల ఖర్చుకే మీ అవసరాలను తీర్చే రోబో పాలేర్లు రాబోతున్నారు. వారు మొక్కలకు వృథాగా నీరు పోయ్యరు. అంతా లెక్కప్రకారమే సాగుతుంది. ఆవు పాలకంటే శ్రేష్టమైన, పెట్రీడిష్ రాబోతుంది. పురుగుల నుంచి ప్రొటీన్‌లు మార్కెట్‌లోకి వస్తున్నాయి. మూడీస్ అనే పేరుతో రాబోతున్న యాప్ నీవు ఏ మూడ్‌లో ఉన్నావో చెబుతుంది. నీ ముఖకవళికలు ఆధారంగా నీవు చెబుతుంది నిజమా? అబద్ధమా? అని తేలుస్తుంది. ప్రస్తుతం మనిషి సగటు జీవిత కాలం 79 సంవత్సరాలు. ప్రతి సంవత్సరం దీనికి 3 నెలలు పొడిగించబడుతున్నాయి. అంటే ప్రతి మూడు సంవత్సరాలకు సుమారుగా ఒక సంవత్సరకాలం పెరుగుతూ వస్తుంది.

2036 వ సంవత్సరం నాటికి ఇది సంవత్సరానికి ఒక సంవత్సరం అదనంగా పొడిగించబడుతుంది. అంటే 100 సంవత్సరాలు పైబడి జీవించేవారి సంఖ్య పెరుగుతూ వస్తుంది.

ఖాన్ అకాడెమి ద్వారా పేద దేశ విద్యార్థులకు విద్య ఆంగ్లంలో ఉచితంగా లేదా అతి తక్కువ ధరకు స్మార్ట్‌ఫోన్‌లు, టాబ్లెట్‌ల ద్వారా అందుబాటులోకి తెస్తున్నారు.

మానవాళి భవిష్యత్తు ఇక ముందు బంగారు బాటే.

# ఉమ్మిటి శివలింగం

**– వి. హర్షవర్ధన్**

*వి. హర్షవర్ధన్ కమర్షియల్ టాక్స్ (ఆం.ప్ర.) డిపార్టుమెంట్‌లో గ్రూప్-1 ఆఫీసరుగా నియమితులై ప్రస్తుతం సేల్స్‌టాక్స్ అప్పిలేట్ ట్రిబ్యునల్, విశాఖపట్నంలో మెంబర్‌గా పనిచేస్తున్నారు. సాహిత్యాభిలాషి. కళా సాహిత్యాలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో కొంతకాలం డిపార్ట్‌మెంట్‌ను వదలి ప్రభుత్వ సాంస్కృతిక విభాగంలో సంచాలకులుగా సేవలందించారు. **మిసిమి** శివలింగం వ్రాసిన ఎన్నో వ్యాసాలను ప్రచురించింది. ప్రత్యేకంగా చల్లపల్లి వెళ్ళి, శివలింగంగారిని కలిసి ప్రశంసలందచేసి వచ్చారు **మిసిమి** వ్యవస్థాపక సంపాదకులు ఆలపాటి రవీంద్రనాథ్.*

ఉమ్మిటి శివలింగంగారు సామాన్యులలో అసామాన్యులు. ఇరుగుపొరుగు అవటంతో వారి కుటుంబంతో మా కుటుంబానికి మూడు తరాల సాన్నిహిత్యం. జన్మతః సంక్రమించిన పేదరికంతో పోరాటం వారిని జీవితాంతం వదలలేదు. కాని ఆయన జ్ఞానాన్వేషణతో దాన్ని జయించారు. జీవన పోరాటం బ్రతుకు ఆరాటంతో ఆయన చదువు చల్లపల్లి రాజా హైస్కూల్‌లో ఎస్.ఎస్.ఎల్.సి.తో ఆగిపోయింది. చదువు ముగిసిన వెంటనే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏడాదిపాటు తాత్కాలికంగా పనిచేశారు. ప్రభుత్వ కొలువుతో రాజీపడలేక ఉద్యోగం విరమించుకున్నారు.

కులవృత్తినే నమ్ముకొని మగ్గం నేత పనిలో జీవితాంతం శ్రమించారు. స్వభావరీత్యా సాత్వికులు, సున్నిత మనస్కులు, ఎవ్వరినీ నొప్పించలేని స్వభావం కావడంతో పరిచయాలు కూడా పరిమితమే. స్కూల్ రోజుల నుండి పుస్తక పఠనం తీవ్ర వ్యసనం, చల్లపల్లి గ్రంథాలయంలోని అన్ని పుస్తకాలు చదివేశారు. ఒకసారి నేను చల్లపల్లిలో కలిసినప్పుడు "పుస్తకాలు చదవడంకంటె భోజనం అంత ముఖ్యమైంది కాదు అనిపించేది" అన్నారు. అలాగే జీవితాంతం సత్యాన్వేషణలో సాధన కొనసాగించారు. ఆఖరుకు బందరులో పాత పుస్తకాలు (అంతకంటె దూరంగా వెళ్ళలేని పేదరికంవల్ల) కొనడం, వాటిని చదవడంమాత్రం వదలలేదు. వారు ఎప్పుడు నాకు ఫోన్ చేసినా ఈ మధ్య ఏ పుస్తకాలు చదివారు? అన్న ప్రశ్నతో సంభాషణ ఆరంభించేవారు.

చదవడం, వ్రాయడం వారి ఉచ్ఛ్వాస, నిశ్వాసలంటే అతిశయోక్తి కాదేమో! చాలా చిన్న వయసునుండి గేయాలతో మొదలుపెట్టి వ్యాసాల వరకు రచనాభిలాషను కొనసాగించారు. తెలుగు, విద్యార్థి, భారతి, ***మిసిమి*** పత్రికల్లో వందలకొద్దీ వ్యాసాలు, కవితలు రచించారు. చల్లపల్లి లాంటి మారుమూల గ్రామం వదలక, ఏ డిగ్రీ పొందకవారు హిందూమతం, బౌద్ధం, జీవన శైలి, సమకాలీన సాహితీవేత్తలైన శ్రీశ్రీ, సినారె, నగ్నముని, గురజాడ, చలం, ఠాగూర్, తిలక్ రచనలను చాలా లోతుగా విశ్లేషించారు. ఎవరినీ ఏమీ ఆశించే కోరిక లేకపోవడం వలన విమర్శలన్నీ నిర్మొహమాటంగా, తాను అర్థం చేసుకున్న రీతిలో వ్యక్తీకరించారు. ఏ ఇజానికీ (Ism) కట్టుబడకపోవడం వలన వారి భావాల్లో స్వభావసిద్ధమైన స్వచ్ఛత ప్రత్యేకంగా కనపడుతుంది. మగ్గం నేత, సాహితీకృషి సుమారు అర్థశతాబ్దం (2008 వరకు) వరకు అలుపెరగక సాగించారు.

సాహితీ వ్యాసాలు పుస్తకం ముందుమాటగా "ఆత్మనివేదన"లో వినమ్రంగా "నేను సాహితీవేత్తను కాను. వేత్త అంటే తెలిసినవాడు. జ్ఞాని అని అర్థం ఉంది. సాహిత్య అభిమాని అంటే ఒప్పుకుంటాను" అని చెప్పుకున్నారు. అలాగే వ్యక్తులు "మొగ్గలా ఉన్న మనసును వికసింపచేసుకోవడానికి ప్రాపంచిక జ్ఞానాన్ని, శాస్త్ర అధ్యయనాన్ని పెంపొందించుకోవాలి. అంతర్గతంగా ఉన్న పరిపూర్ణ చైతన్య సాక్షాత్కారం కోసం మౌన ధ్యానాన్ని ఆశ్రయించాలి. అంతర్బహిర జగత్తుల సమన్వయ సాధన సాహితీవేత్త లక్ష్యం. అచంచల శాంతి సాధన తాత్త్వికుని గమ్యం" అని దిశానిర్దేశం చేసిన రుషితుల్యులు శివలింగంగారు.

2001లో నేను ఉద్యోగరీత్యా ఏలూరులో ఉన్నప్పుడు అనుకోకుండా మా స్వగ్రామం చల్లపల్లికి శ్రీరామనవమి జరుపుకోవడానికి వెళ్ళడం, అక్కడ మా బాబాయి శ్రీరామచంద్రరావు గారి (శివలింగంగారి బాల్యమిత్రులు) ద్వారా నాకు శివలింగం గారి పరిచయ భాగ్యం కలగడం దైవికమే కాక నా అదృష్టంగా భావిస్తాను. నాకు కొంత సాహిత్యాభిలాష ఉండటంచే వారితో సంభాషించటం, మాటల్లో వారి వ్యాసాల ప్రస్థావన రావటం జరిగింది. ఆ రోజు సాయంత్రం వారి ఇంటికి వెళ్ళాను, ఇల్లు అనేకంటే చిన్న కుటీరం (గది). వారి జీవితాంలాగే సగ భాగం పుస్తకాలతో, సగ భాగం మగ్గంతో, నిండి ఉంది. వారి ధర్మపత్ని గొప్ప సంస్కారంతో ఆప్యాయంగా నన్ను ఆదరించిన తీరు మరువలేనిది. వారిద్దరినీ చూసిన తరువాత మనుషుల్లో సంస్కారానికి, సంపదకి సంబంధం లేదనిపించింది. వారు

వ్రాసిన వ్యాసాల్లో వారు సేకరించి ఉంచినవి నాకు ఇచ్చారు. అవి అన్నీ పది రోజుల్లో చదివాను. వారి విషయ పరిజ్ఞానం, వివిధ అంశాలపై వారికిగల అవగాహన నన్ను సిగ్గుపడేలా చేశాయి. ఈ రోజున చాలా విశ్వవిద్యాలయాల్లో ఆచార్యులుగా, ఉపన్యాసకులుగా ఉన్న అతి కొద్దిమందికి మాత్రమే శివలింగం గారి స్థాయి ఉందని నాకనిపించింది.

మేమందరం ఏదో ఒక డిగ్రీ, ఒక పరీక్ష సాయంతో ఉన్నతోద్యోగులుగా చెలామణి అయిపోతుంటే, శివలింగం గారు వంటి మట్టిలో మాణిక్యాలు మరుగున పడి ఉండటం నన్ను బాధించింది. ఎలాగైనా వారి రచనలను కొన్నింటినైనా వెలుగులోకి తీసుకురావాలి అనుకొని వారి అనుమతి అడగటం, వారు సంతోషంగా అంగీకరించడంతో వారి వ్యాసాల్లో ఎక్కువమందికి అర్థమయ్యేవి మాత్రం (వారు వ్రాసిన కొన్ని వ్యాసాలు మేథోవర్గానికి మాత్రమే సంబంధించినవి కనుక) ఎంపిక చేసే పని మిత్రులు శ్రీ రంకిరెడ్డి రామ్మోహన్‌రావు (పెనుగొండ కళాశాల, ఆంధ్రోపన్యాసకులు) గారు స్వీకరించారు. మధు స్ర్కీన్స్ అధిపతి మిత్రుడు మధుగారు డి.టి.పి. చేయడం మరో మంచి మిత్రులు శ్రీ లక్ష్మీగణపతి ప్రింటర్స్ అధినేత శ్రీ వీరభద్రరావుగారు ప్రత్యేక శ్రద్ధతో ఉచితంగా ఆ వ్యాసాల్ని "సాహితీ వ్యాసాలు" పుస్తకంగా తీసుకొచ్చారు. ఆత్మీయ మిత్రులు ఆచార్యులు శ్రీ బేతవోలు రామబ్రహ్మంగారు సాహితీ వ్యాసాలు పుస్తకానికి పీఠిక వ్రాస్తూ "కచ్చితమైన తన అభిప్రాయాలను సాధారణంగా సుకుమారంగా చెప్పడం వీరి ప్రత్యేకత.... అనుభూతి అనేదీ స్వేచ్ఛ అనేదీ సృజనాత్మక రచనలకు ప్రాణమనే సిద్ధాంతంతో వారెక్కడా రాజీపడలేదు. నిబద్ధత పేరుతో ఈ రెండింటినీ పోగొట్టుకున్నవారికి ఆ విషయం తెలియజెప్పడం వెనకాడలేదు. తనకు నచ్చిన కవుల్లోనూ రచనల్లోనూ నచ్చని విషయాలను హేతుబద్ధంగా చెప్పడానికి జంకలేదు. ఉత్తమ విమర్శకుడికి ఇంతకన్నా కావలసిన గుణాలు ఏమున్నాయి?" అని అనడంలో శివలింగంగారి విమర్శనా పటిమ మనకు తెలుస్తుంది. వారు వ్రాసిన వ్యాసాలన్నీ పాఠకుల జ్ఞాన పరిధుల్ని విస్తరింపచేసి ఆలోచింపచేస్తాయి అనడంలో సందేహం ఏమీలేదు.

అలాగే వ్యాసాల్ని సమీక్షిస్తూ రామ్మోహన్‌రావుగారు "డబ్బు, అధికారం, అహంకారం, డిగ్రీలు, బిరుదులు, పదవులు, కుర్చీల తేడాలు, అవసరాలు, ఆశ్రయింపులులాంటి పరదాల వెనుక ఉండి, చీకటి అంతఃపురాల్లోంచి కాకుండా వెలుగురేఖల వెలుతురు నిండిన నిష్కల్మష సాహిత్య సత్యలోకంలో నిలబడి సాహిత్య విమర్శకుడైన శివలింగంగారి వ్యాసాల్ని మనసారా చదవమని" పాఠకుల్ని ఆహ్వానించారు.

ప్రతిభాశాలి, జ్ఞానపిపాసి శివలింగంగారు మే, 2011లో కీర్తిశేషులు కావడం దురదృష్టం. వారి వ్యాసాలు చదివి శ్రీమతి రాయదుర్గం విజయలక్ష్మిగారు నాకు ఫోన్‌చేసి, శివలింగం గారి సంస్మరణగా "పాలపిట్ట"లో ఒక వ్యాసం వ్రాశారు. ఈ విషయాలన్నీ తెలిసిన శ్రీ కాండ్రేగుల నాగేశ్వరరావుగారు నన్ను కూడా వారి గురించి ఒక వ్యాసం వ్రాసి స్మరించుకుంటే బాగుంటుందనటంతో నా ఈ ప్రయత్నం. శివలింగంగారి ఇతర పత్రికల్లో ప్రచురితమైన వ్యాసాల్ని ఇంకొక పుస్తకంగా తీసుకురావాలనే ప్రయత్నాన్ని ఆంధ్రప్రదేశ్ ఉపసభాపతి శ్రీ మండలి బుద్ధప్రసాద్‌గారితో నేను సాంస్కృతిక శాఖ సంచాలకునిగా పనిచేస్తున్నప్పుడు ప్రస్తావించడం శివలింగంగారితో వారికిగల సాన్నిహిత్యాన్ని మననం చేసుకుంటూ వారే పెద్దమనస్సుతో ఆ పుస్తకాన్ని ప్రచురిస్తానని అంగీకరించటం ముదావహం. త్వరలో ఆ ప్రయత్నం కార్యరూపం దాల్చి, పుస్తకం పాఠకులకు అందించటం జరుగుతుంది.

శివలింగంగారి చిరకాల మిత్రుడు శివానంద బాబు గారు చెప్పిన విషయాలు, జ్ఞాపకాల నుండి కొంత సమాచారం ఈ వ్యాసంలో పొందుపరిచాను. అందుకు వారికి నా కృతజ్ఞతలు. శివలింగంగారి జ్ఞానాన్వేషణ, వారి సాహితీ కృషి నేటి తరానికి ఒక వెలుగురేఖ కావాలి. అట్టి స్ఫూర్తిప్రదాత చిరస్మరణీయులు. జీవితంలో ఎన్ని ఒడుదుడుకులు ఎదుర్కొన్నా, ఎంత పేదరికం అనుభవించినా ఆయన ఆశావాదం వీడక గొప్ప దార్శికునిగా, స్థితప్రజ్ఞులుగా నిలిచారు. చివరిగా ఎక్కడో ఒక గేయంలో వారి జీవన దృక్పథాన్ని ఈ విధంగా ఆవిష్కరించారు.

*'అనంత చైతన్య పరిష్వంగం / ప్రశాంత విద్యుల్లహరీ ప్రవాహం*
*సమచిత్తం సమదర్శనం నీ సులోచనాలు కావాలి*
*అప్పుడే నీ దర్శనం పూర్ణయోగం / అప్పుడే నీ భావన సార్వకాలికం'*



వి. హర్షవర్ధన్
హైదరాబాద్.
ఫోన్ : 994 999 2880.

# కాటమరాజు వీరగాథ - ఆరుద్ర

- ఎమ్.వి. భారతలక్ష్మి

చారిత్రక సత్యాలనేగాక, చరిత్ర విస్మరించిన సత్యాలను కూడా ఆరుద్ర జానపద ఇతిహాసాల నుండి సంగ్రహించి తెలుగు జాతికి అందజేశారు. 'కాటమరాజు కథ'ను ఆరుద్ర సమగ్రాంధ్ర సాహిత్య చరిత్ర మొదలుపెట్టకమునుపే 1960-61లలో ప్రదర్శనకు అనుకూలంగా ఉండే నాటకంగా మలిచారు. సినీప్రముఖులు హెచ్.ఎమ్. రెడ్డిగారు, ఓసారి, ఖడ్గతిక్కన, కలం తిక్కన ఒకరేనా అని ఆరుద్రగారిని అడిగారట. బహుశా, రెడ్డిగారు ఖడ్గతిక్కన సినిమా తీయాలని సంకల్పించారేమో! పరిశోధనాసక్తులైన ఆరుద్ర, తిక్కనల గురించి సమాచారం సేకరిస్తోంటే, ఆయన దృష్టి, 'కాటమరాజు కథ' మీద పడింది. ఆరుద్ర నాటకం రాసేనాటికి, 'ఎఱ్ఱగడ్డ పోట్లాట', 'భట్టురాయభారం', 'కోటపాటి తోటివృక్షం' అనే మూడు వీరగాథలు మాత్రమే వెలుగుచూశాయి. వీటిని వేటూరి ప్రభాకరశాస్త్రిగారు మద్రాసు ప్రాచ్యలిఖిత పుస్తక భాండాగారం నుండి సేకరించి 1953లో ప్రచురించారు. తిమ్మావజ్ఝల కోదండరామయ్యగారు, చారిత్రక పరిశోధకులు మల్లంపల్లి సోమశేఖరశర్మగారు, కాటమరాజు కథల గురించి రాసిన రచనలను ఆధారం చేసుకొని, తాను మరికొంత పరిశోధన చేసి ఆరుద్ర ఈ నాటకాన్ని రచించారు. 'కాటమరాజు కథ'ను నాటకంగా రాయడానికి ప్రేరేపించిన వ్యక్తి, ఆయనవద్ద కుడిభుజంలా ఉండే పి.జె. శర్మ ఆరుద్రగారిచే స్టేజినాటకం ఏదైనా రాయించమని, సుప్రసిద్ధ రంగస్థల, సినీనటుడు జె.వి. రమణమూర్తి శర్మను పురికొల్పారట. నాటకం రక్తికట్టించటం అంత తేలికైన పనికాదని ఆరుద్ర నాటకం రాయడానికి సుముఖంగా లేరు. "సాంఘికం వద్దు, ఏదైనా రంగస్థల నాటకం రాస్తే రమణమూర్తి ట్రూపులో వేస్తాం" అని శర్మ పట్టుబట్టారట. ఆ విధంగా 'కాటమరాజు కథ'ను స్టేజి నాటకంగా రూపొందించి ఇచ్చారట ఆరుద్ర. జె.వి. రమణమూర్తి తన స్వంత బ్యానర్ 'నటరాజ కళాసమితి' తరపున ఈ నాటకాన్ని శ్రీకాకుళం నుండి కాకినాడ వరకు తూర్పు తీరంలో పది, పదిహను ప్రదర్శనలిచ్చారట. ఈ నాటకం ధారావాహికంగా 1-8-1969 నుండి 24-10-1969 వరకు 'ప్రగతి' వారపత్రికలో ప్రచురించారు.

జానపద ఇతిహాసానికి చెందిన 'కాటమరాజు కథ' అందరికీ తెలిసే అవకాశం తక్కువ. 'పల్నాటి వీరగాథ'ల తర్వాత అతి ప్రాచీనమైనవి, 'కాటమరాజు కథలు'. ఇవి ఒక సుదీర్ఘమైన కథాచక్రంగా ఏర్పడ్డాయి. ఇందులో కాటమరాజు పితామహుడు ఆవుల వలరాజు నుండి కాటమరాజు వరకు మూడుతరాలకు సంబంధించిన ముప్పైరెండు వీర గాథలున్నాయని, ఈ వీరగాథలన్నీ పరస్పర సంబంధం కలిగి, వరుస క్రమంలో ఒక పెద్ద ఇతిహాసంలా ఏర్పడ్డాయని తెలుగు వీరగాథ కవిత్వడు (1976)పై పరిశోధన చేసిన ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావుగారు తెలియజేశారు. కాటమరాజు కథాచక్రాన్ని శ్రీనాథుడు రచించినట్లుగా జనశ్రుతే కాకుండా కొందరు గాథాకవుల వాక్యాలు కూడా సాక్ష్యమిస్తున్నాయి. కాని శ్రీనాథుని పేరుతో ఉన్న వీరగాథ ఒక్కటి కూడా మనకు లభించడంలేదు. తంగిరాలవారు సేకరించిన తాళపత్ర గ్రంథాలలో కాటమరాజు కథలను రచించిన జానపద కవుల పేర్లు తెలియవచ్చాయి. 'గంగుల పినయెల్లయ్య'తోపాటు 'మల్లయ్య', వదరుప మద్దులేటి కవి, 'కనకబండి ఘట్టయ్య' 'మంగళగిరి వేంకటాద్రి' వంటి మరో ఆరుగురు జానపద కవుల పేర్లు వెలుగులోకి వచ్చాయి. 'కాటమరాజు కథలు' రాయబడిన తాలూకు పుస్తకాలు (తాళపత్ర గ్రంథాలు) ఎద్దులపై వేసుకొని ఊరూరా తిరుగుతూ సుద్దగొల్లలు లేక తెరచీర భక్తులు పాడేవారట. కాటమరాజు కథలకు, 'యాదవ భారతం' అనే పేరు కూడా ఉంది. 'యాదవ భారతం - ఎద్దుమోత బరువు' అనే సామెత కూడా పుట్టింది. వీరుకాక 'కొమ్ములవారు' అనే మాదిగ గాథాకారులు కూడా ఈ కాటమరాజు కథని పాడేవారు. వీరు యాదవుల్ని

యాచించి జీవించేవారు. జానపద వీరగాథల్ని తరతరాల నుండి పాడుతూ పరిరక్షిస్తున్నవారిని గురించి ఆచార్య తంగిరాల వేంకట సుబ్బారావుగారు ఇలా అంటారు – "రామాయణ మహాభారతాలు భారతీయ సంస్కృతికి పట్టుగొమ్మలయితే, 'పల్నాటి వీరచరిత్ర, కాటమరాజు కథ' ఆ సంస్కృతిలో ఉపసంస్కృతి అయిన మన ఆంధ్ర సంస్కృతికి ఆయువుపట్టులు. అచ్చమైన తెలుగుదనానికి మణిదర్పణాలు. పల్నాటి వీరచరిత్రను 'వీర విద్యావంతులు' అనే మూలవారు, కాటమరాజు కథలను 'కొమ్ములవారు' అనే మాదిగవారు తరతరాలుగా పాడుతూ పరిరక్షిస్తూ వచ్చారు. ఆంధ్రులంతా ఈ రెండు దళిత కులాలకు ఎంతో ఋణపడి ఉన్నారు. 'పల్నాటి వీరచరిత్ర'లో 'కన్నమదాసు', కాటమరాజు కథలో 'బిరినీడు' ఈ దళిత కులాలవారి శౌర్యప్రతాపాలకు ఎత్తిన విజయ పతాకాలు." స్వామి భక్తిలో తమ ప్రాణాలను తృణప్రాయంగా త్యజించిన మహోన్నత వీరులు.

ఆరుద్ర కాటమరాజు కథ నాటకాన్ని రాసేనాటికి, తంగిరాలవారి పరిశోధన పుస్తకరూపం దాల్చలేదు. ముప్పైరెండు కథలున్న సుదీర్ఘ కథాచక్రంలో *ఎఱ్ఱగడ్డ పోట్లాట, దక్షిణాది ఆవులమేపు* ముఖ్యమైనవి. ఆయువుపట్టులాంటి ఈ అంగాలను ఎంచుకొని, ఆరుద్ర 34 చిన్నచిన్న రంగాలుగల నాటకంగా మలిచారు. రెండు గంటలసేపు ఉత్కంఠభరితంగా సాగే వీర రసాత్మక నాటకం, *కాటమరాజు కథ.*

ఆరుద్ర నాటిక కాటమరాజు కథ విశ్లేషించేముందు సంగ్రహంగా కాటమరాజు వంశ చరిత్ర గురించి తెలుసుకుందాం. ఎలమంచి పాలించే కవులావుల గంగరాజుకు గంగమ్మ అనే భార్యవలన వలురాజు, హరిపాలుడు, నందగోపాలుడు, గోవర్ధనుడు అనే నలుగురు పుత్రులు కలిగారు. వలురాజు భార్య వల్లమ్మ. ఈ దంపతులకు సింహాద్రిరాజు, పెద్దిరాజు, ఎఱనూకరాజు, పోలురాజు అనే అయిదుగురు కొడుకులు. కొమరమ్మ అనే కూతురు జన్మించారు. జ్యోతిష్యుల ఆదేశాన్ని అనుసరించి రెండోకుమారుడైన పెద్దిరాజు సింహాసనమెక్కాడు. పెద్దిరాజుకు కాటమరాజు అనే కొడుకు, పాపనూక అనే కూతురు పుట్టారు. పెద్దిరాజు వాలికేతువ రాజుతో యుద్ధం చేసి ఆర్లసెంట్ల రణరంగంలో మరణించాడు. ఏండేండ్ల బాలుడైన కాటమరాజు వాలికేతువరాజుపై దండెత్తివెళ్ళి అతనిని చంపి పగతీర్చుకున్నట్లు వీరగాథలు చెప్తున్నాయి. కాటమరాజు పినతండ్రి పోలురాజు పుత్రులలో పెద్దవాడైన భక్తిరన్న కాశీకి పోతూ కాటమరాజును, పాపనూకను తెచ్చి దొనకొండలో ఉంచాడు. విష్ణుస్వరూపుడైన కాటమరాజుకు గోగణం అంతా ఇచ్చి పట్టంకట్టారు యాదవ బంధువర్గం. కాటమరాజు చంద్రవంశ క్షత్రియుడని, ఇతడు విష్ణుమూర్తికి 74వ తరంవాడని, శ్రీకృష్ణునికి 36 వ తరం వాడని కొన్ని వీరగాథలలోని వంశవృక్షాల వలన తెలుస్తోంది. కాటమరాజు శ్రీశైల ప్రాంతపు అడవులలో ఆలమందల్ని మేపుతున్నారు. అక్కడ క్షమంరావడం వలన ఆవులను దక్షిణ భూములకు తరలించాడు. కాటమరాజు తన ఆలమందతో నెల్లూరు సీమలో ప్రవేశించాడు. నెల్లూరు పాలించే నల్ల సిద్ధి రాజుతో పుల్లరి ఒప్పందం చేసుకొన్నాడు ఆ సీమలో ఉన్నంతకాలం, తన మందలో పుట్టిన కోడదూడల్ని నల్ల సిద్ధి రాజుకు పుల్లరిగా ఇవ్వటానికి ఒప్పుకొన్నాడు. తన ఆలమందకు ఏ విధమైన ఆపదా రాకుండా చూడవలసిన బాధ్యత వల్ల సిద్ధి రాజుదని తెలియజేశాడు. నల్ల సిద్ధి రాజు ఉంపుడుకత్తె కుందమాదేవి. ఆమె పెంపుడు చిలుక గూటినుంచి తప్పించుకొని వచ్చి యాదవుల ఆలమందలను తన కూతుతో బెదిరించింది. పద్మరాఘువుడు ఆ చిలుకను బాణంతో కొట్టి చంపాడు. ఈ విషయం కుందమాదేవికి తెలిసింది. ఆమె నల్ల సిద్ధి రాజుకు తెలియకుండా బోయలను పంపి ఆలమందను పొడిపించింది. యాదవులకు కోపం వచ్చి ఆ బోయల్ని చంపేశారు. తమ ఆలమందకు నష్టం వాటిల్లిన కారణంచేత పుల్లరి ఇవ్వవలసిన అవసరం లేదని సిద్ధిఱాజుకు తెలియజేసి, ఎఱ్ఱగడ్డపాటికి వెళ్ళిపోయారు. నల్ల సిద్ధి రాజు పంపిన భట్టు రాయభారం ఫలించలేదు. ఎఱ్ఱగడ్డపాడులో జరిగిన ఘోర యుద్ధంలో ఇరుపక్షాలవారు మరణించారు. వీరగాథల ప్రకారం చివరికి యుద్ధంలో యాదవులు జయించారు. యాదవ జానపద కవులు సిద్ధిరాజు సేనాని ఖడ్గతిక్కనను చంపకుండా వదిలేసిన యాదవుల ఔదార్యాన్ని, తిక్కన శౌర్యాన్ని కీర్తించారు. తమకు శత్రువైన తిక్కనను "ఖడ్గతిక్కన మహావీరుడు అతనికి సాటిగల వీరు మరొకడు లేడు" అని లోకానికి చాటిచెప్పారు. నిజానికి 'ఖడ్గతిక్కన' చరిత్రలో యుద్ధంలో వెన్నుచూపి తిరిగి వచ్చాడని, ఊరి ప్రజలు, ఇంట్లో భార్య, తల్లిదండ్రులు తిక్కనను అవమానించగా, ఆ అవమానాన్ని భరించలేక, యుద్ధానికి వెళ్ళి వీరమరణం పొందినట్లు చరిత్రలో ఉంది. ఏ కారణంచేత తిక్కనవంటి మహావీరుడు వెనుదిరిగాడో చరిత్ర చెప్పలేదు.

యాదవులను నాశనం చేయడానికి వచ్చిన ఖడ్గతిక్కనను చంపి బ్రహ్మహత్యాపాతకానికి ఒడిగట్టలేమని ఆయుధాలను దింపి, తలలు దించిన యాదవులు ధర్మనిరతులు. అటువంటి నిరాయుధులను చంపలేక తిక్కన యుద్ధరంగాన్నుండి వెనుదిరిగాడు.

*కాటమరాజు కథ* కు యాదవ భారతం అని పేరు ఉన్న మహాభారత కథలో పోలికలు లేవు. పల్నాటి వీరచరిత్రకు మహాభారతంతో పోలికలు ఉన్నట్లే (బాలచంద్రుడి పేరు వినగానే భారతంలో అభిమన్యుడు గుర్తుకు వస్తాడు ఎవరికైన). *కాటమరాజు కథ* కు రామాయణంతో పోలికలు ఉన్నాయి. ఈ విషయాన్ని ఆరుద్ర ఏ విధంగా పాత్రల సంభాషణల ద్వారా స్పష్టీకరించారో పరిశీలిద్దాం. యాదవుల కులదేవత గంగ. గంగమ్మ గుడి జాతరలో నాటకం ప్రారంభమై, 'గంగగుడి'తో ముగుస్తుంది. దీనినే థీమాటిక్ కొహిషన్ అంటారు. కథాశిల్పంలో చక్కని సంలగ్నత సాధించారు ఆరుద్ర. గంగమ్మను కొలిచేందుకు కాటమరాజు కుటుంబ స్త్రీలు గుడికి వస్తారు. కాటమరాజు పినతల్లి సిరిదేవి పూలు వేయగానే గంగమ్మ కళ తప్పడం అశుభసూచకంగా తోస్తుంది అక్కడివారికి. ఇంతలో ఆలమందను మేపుతున్న పద్మరాఘవుడు, పెయ్యల ఎఱ్ఱయ్య కాటకం వచ్చినట్లు కబురు తెస్తారు. శ్రీశైల ప్రాంతంలో కాటకం ఏర్పడినందున ఆలమందను దక్షిణాది భూములకు పాకనాడు సీమకు తోలుకుపొమ్మని పినతల్లి సిరిదేవి కాటమరాజును ఆజ్ఞాపిస్తుంది. మందను మేపడం కోసం శత్రుసీమకు పంపించడం, కైకమ్మ శ్రీరామచంద్రుణ్ణి అడవులకు పంపిన కారణమే అని నాటక రచయిత సిరిదేవి కూతురు అగుమంచితో పలికిస్తారు. తల్లి దురుద్దేశం కనిపెట్టిన అయితమరాజు, "అమ్మా! ఆనాడు రాముణ్ణి కానలకంపికైక ఏం బావుకొందో నీవూ అదే బావుకొంటావు. ఇవ్వరాని ఆజ్ఞలిచ్చిన నిన్ను ఇప్పుడే ఖండఖండాలుగా చేస్తాను' అని భరతుడిలా పలుకుతారు. రామిడిలా ధర్మబద్ధుడైన కాటమరాజు పినతల్లి ఆజ్ఞను శిరసావహించి శత్రుసీమకు ఆలమందను తోలుకువెళ్ళడానికి సంసిద్ధుడవుతాడు. పినతల్లి పిల్లలతో, అగుమంచీ! అయితన్నా! పదేపదే రామాయణంతో సామ్యం తీసుకురాకండి. ఆ పోలిక తీసుకువస్తే 'రామాయణ యుద్ధం జరిగి తీరుతుందమ్మా' అని మందలిస్తాడు. రాబోయే సంఘటనలు పాత్రల సంభాషణల ద్వారా సూచించడమేకాక, రచయిత రామాయణంతో *కాటమరాజు కథ* కున్న సామ్యాన్ని మరో సన్నివేశంలో కాటమరాజు వద్దనుండే కొమరు బంగరుభట్టుతో సిద్ధిరాజు రాయభారి రాయశృంగార భట్టుకి చెప్పిస్తారు. "మా *కాటమరాజు కథ* రామాయణ గాథే! అలనాడు సవతితల్లి కైకమ్మ పంపితే రాముడడవులు పట్టాడు. ఈనాడు పినతల్లి మాటప్రకారం కాట భూపతి పరసీమకు వచ్చాడు. పశువులున్న కోన పర్ణశాల. మాటలు నేర్చిన చిలుక, మాయలేడి. పాలేరే సముద్రం. నెల్లూరే లంకా పట్టణం. ఆనాడు రామాయణంలో ఆంజనేయులవారు అశోకవనం పాడుచేయలేదా? ఆ విధంగానే ఈ వనాలు పాడవక తప్పనిసరి. రావణాసురిడిలాగ మీ రాజు కూలడం తథ్యం" అంటూ నాటకాంశాన్ని రామాయణంతో పోల్చి కాటమరాజు కథాంశం ప్రేక్షకులకు పాఠకులకు సులభ గ్రాహ్యం అయ్యేటట్లు చేశారు. చిలకసాని (కన్నమదేవి) సాక్షాత్తూ సూర్పణఖ అని పాఠకులు గ్రహిస్తారు.

నాటకంలో పాత్ర చిత్రణకు, పటిష్టమైన సంభాషణలే ప్రాణప్రతిష్ఠ చేస్తాయి. పాత్రోచిత భాష, సన్నివేశానికి తగిన పదాలు, మనోభావాలు పలికించడంలో నాటక రచయితకు ఎంతో నేర్పు ఉండాలి. ఎన్నో సినిమాలకు సంభాషణలు రాసిన అనుభవంగల ఆరుద్ర తన రచనాకౌశలాన్నీ మరింత వాడిగా చూపించారీ నాటకంలో. సుదీర్ఘమైన సంభాషణలతో సాగదీయకుండా, చిన్నచిన్న డైలాగులతో రక్తికట్టించారు. అవసరమైనచోట్ల పద్యాలు, పాటలు గుప్పించారు. చారిత్రక, ఇతిహాస నాటకాలలో పద్యాలు, పాటలు లేకపోతే తెలుగువారికి నాటకం రుచించదు. పద్య, గద్య రచనతో సాగే ఈ నాటకంలో వీరగాథలో నున్న ద్విపద ఛందస్సును కొన్నిచోట్ల యథాతథంగా సన్నివేశానికి తగినట్లుగా 'ద్విపదను వచనంగా మార్చి వాడుకున్నారు. స్థానిక చరిత్రలోనున్న చాటుపద్యాలకు మెరుగులు దిద్ది సన్నివేశానికి తగినట్లుగా కొన్ని పాదాలు మార్చి వాడుకొన్నారు. "ధైర్యంబు, నీ మేన తగిలియుండుటజేసి" (స్థానిక చరిత్రలు - 18వ సంపుటి) అనే సీసపద్యాన్ని యాదవుల ఆస్థానకవి కొమరు బంగరు భట్టు ఖడ్గతిక్కన గురించి చెప్పినట్లు ఆరుద్ర అద్భుతమైన కల్పన చేశారని వీరగాథలపై పరిశోధన చేసిన ఆచార్య తంగిరాల సుబ్బారావుగారు వ్యాఖ్యానించారు.

పదిహేనవ రంగంలో తిక్కనామాత్యుని ఇంట, వీరమాత పోలమ్మ (తిక్కన తల్లి), వీరపత్ని జానమ్మ (తిక్కన భార్య)ల

ప్రతాపం చూపించే సన్నివేశం సందర్భోచితంగా కల్పించారు ఆరుద్ర. వీరగాథల్లోనూ, చరిత్రలోనూ జానమ్మ తిక్కన తలను ఒడిలో పెట్టుకొని 'సాగుమానం (సహగమనం) చేసినట్లుంది. సాంఘిక దురాచారమైన సతీసహగమనాన్ని ఆరుద్ర తన నాటకంలో తొలగించి, మరో అద్భుతమైన సన్నివేశం కల్పించారు. కాటమరాజు వద్దనుండే కొమరం బంగరు భట్టు, యుద్ధంలో వీరస్వర్గమలంకరించిన ఖడ్గ తిక్కన ఉంగరాన్ని తెచ్చి తిక్కన భార్యకు అందజేసినట్లు, తిక్కన రణరంగంలో వీరస్వర్గమలంకరించే సమయంలో భట్టు ఆయనకు "ధైర్యంబు నీ మేన తగిలియుండుటజేసె" సీసపద్యాన్ని తిరిగి వినిపించి మిగిలిన నాలుగు పాదాలు కూడా వినిపించినట్లు చెప్తాడు. తిక్కన ఆదేశప్రకారం, తిక్కన భార్య జానమ్మ నాలుగు కొదవ పాదాలకు నాలుగువేల వరహాలిస్తుంది. భట్టు ఆ డబ్బుతో తిక్కన విగ్రహాన్ని చేయించి ప్రతిష్ట చేస్తానంటాడు. తిక్కన ఔన్నత్యాన్ని, తిక్కన భార్య ఔదార్యాన్ని చాటిచెప్పే సన్నివేశమిది. తిక్కన బ్రాహ్మణ వీరుడని, ఆయనను చంపి బ్రహ్మహత్యా పాటకానికి ఒడిగట్టమని, కత్తులు ఒరలో పెట్టుకొని భక్తితో తలలు వంచిన యాదవ వీరులతో తలపడలేక తిక్కన ఇంటికొచ్చిన సన్నివేశం, ఊరి ప్రజలు, ఇంట్లోవారు తిక్కనను పరాభవించిన సన్నివేశాలు ప్రేక్షకులు/పాఠకుల హృదయాలపై చెరగని ముద్ర వేస్తాయి.

ఖడ్గతిక్కన, కవితిక్కన ఒక్కరే కాదన్న విషయం యథాలాపంగా చెప్పినట్లు పుల్లరి ఒప్పందానికి వచ్చిన కాటమరాజు అనుయాయులు పద్మరాఘవుడు, కొమరు బంగరు భట్టులకు రాయశృంగార భట్టుతో చెప్పిస్తారు నాటక రచయిత. *కాటమరాజు కథ* ఎన్నో మానవతావిలువలను తెలియజేస్తుంది.

ఆనాటి కాలంలో యుద్ధంలో యజమాని కోసం ప్రాణాలర్పించిన నమ్మినబంటు కుటుంబాలను ఆదుకొని వారిని స్వంత బిడ్డలకంటె ఎక్కువగా చూసుకొనేవారు. గోసంగి బీరన్న నిమ్నజాతివాడు. అతని తల్లి, తన భర్త యుద్ధంలో మరణించగా, తన బిడ్డను యజమాని భార్యకు (కాటమరాజు తల్లి) అప్పచెప్పి వీరపత్నిగా అసువులుబాసింది. యుద్ధానికి వెళ్ళేముందు గోసంగి బీరన్న కాటమరాజుతో ఇలా అంటాడు – "మీ తల్లిపాలు మీతో పంచుకొని బ్రతికాను. మీకన్నా ముందుగా నాకే అమ్మ పాలిచ్చేదట. ఎడమరొమ్ము ఇస్తే ఎడమవుతానని, కుడిరొమ్మిచ్చి కూర్మితో పెంచింది." కులం, జాతి, రక్తసంబంధంకంటే, మానవత్వం, మమతానురాగాలే గొప్పవని చెప్పే వీరగాథల సారాంశాన్ని ఒక్క సంభాషణలో కుదించి చెప్పారు ఆరుద్ర.

వీరరస ప్రధానమైన ఈ నాటకంలో సన్నివేశానికి తగినట్లుగా సున్నితమైన హాస్యం, శృంగారం జోడించి ప్రేక్షకులకు ఆహ్లాదం కలిగించారు. కొత్తగా పెళ్ళయిన పోచయ్య (అగుమంచి పెంపుడు కొడుకు) తన భార్య సిరిగిరి (అయితమరాజు కూతురు) వెనుకగా వచ్చి కళ్ళుమూసి, పేరు చెప్తేగాని కుదరదంటారు. సిరిగిరి చమత్కారంగా పోచయ్య పేరులో ఒక్కొక్క అక్షరం చెప్పి (పో.చ. అయ్య) చెప్పి కలిపి చదువుకోమంటుంది. అన్నీ కలిపి చెప్పకపోతే శ్రీశైలం వెళ్ళిపోతానని బెదిరిస్తాడు పోచయ్య. అక్కడ జంగాల మఠంలో కలిసిపోతాడన్న భయంతో వద్దని బ్రతిమాలడుతుంది సిరిగిరి. పోచయ్య నవ్వుతూ సంస్కృతంలో శ్రీశైలం అంటే తెలుగులో సిరిగిరి కదూ, అందుకే నా శ్రీశైలం దగ్గరే ఉంటానంటాడు. అక్షరాలతో ఆడుకొనే ఆరుద్ర పద చమత్కారమిది.

మహాభారతంలో ముఖ్యఘట్టాల్ని తీసుకొని తిరుపతి వేంకట కవులు 6 నాటికలుగా రూపొందించారు. 32 కథలున్న వీరగాథాచక్రంలో ముఖ్యఘట్టాల్ని ఎంచుకొని ఒకే నాటకంగా మలచిన ఘనత ఆరుద్రదే. వీర రస ప్రధానమైన నాటకం కావడంచేత రసవర్తకమైన డైలాగులతో వీరరసాన్ని పోషించారు. సినిమాలో వీలయినట్లు నాటకంలో యుద్ధం రంగస్థలం మీద చూపడానికి వీలుకాదు. రంగస్థలం మీద ఆవులు, ఎద్దులు పంటపొలాలు నాశనం చేస్తూ వెళ్ళడం, బొల్లావు యుద్ధాన్ని ఛాయానాటకం (షోడోప్లే)లో ఇమిడ్చి చూపించారు. ఛాయానాటకం టెక్నిక్కు ఉపయోగించి యుద్ధం చూపడంలో స్టేజి నాటకం పట్ల ఆరుద్రకున్న అవగాహన విశదమవుతుంది.

పతాక సన్నివేశంలో సిద్ధిరాజు, కాటమ నాయకుడు ఒకరికొకరు ఎదురుపడి కత్తులు దూస్తారు. కాటమరాజు "నీతిమాలిన సిద్ధిరాజు నీవేనా" అనడుగుతాడు. సిద్ధిరాజు, "ఓహో, ఆటవికతత్త్వంతో ఆలం చేసే కాటమరాజువు నీవేనా" అని ఎదురు ప్రశ్న వేస్తాడు.

కాటమరాజు – నాగరికత జీర్ణించిన నవీనుడివా నువ్వు? అందుకే –

మందుగుళ్ళతో మనుష్యులను పొట్టబెట్టుకొన్నావా?

సిద్ధిరాజు – ఆధునిక పరికరాలతో అధునాతన

యంత్రతంత్రాలతో పోరాడినవాడికే విజయం. కోటలు, కవచాలు, మందుగుళ్ళు లేకుండా కాటమరాజు యుద్ధానికి తలపడ్డాడు. సిద్ధిరాజు మందుగుళ్ళతో పశువుల్ని, మనుష్యుల్ని పొట్టనబెట్టుకుని "విధానం ఏదైదేనేం, విజయం నాకు ముఖ్యం" అంటాడు. వీరగాథాకారులు సిద్ధిరాజు అధర్మ యుద్ధంపై కాటమరాజు ధర్మయుద్ధం గెలిచిందని, దేవతలు పుష్పవృష్టి కురిపించగా చనిపోయిన యాదవులు, పశువులు బ్రతికాయని పాడుకొన్నారు. ఆరుద్ర ఎవరు గెలిచిందీ స్పష్టంగా చెప్పలేదు నాటకంలో. "ఏ యుద్ధంలో గెలిచినవాడైనా మరుక్షణం నుంచే క్షణక్షణం ఓడిపోతాడు" అంటాడు కాటమరాజు. నాటకం చివర శాంతిసందేశంలా కొమరు బంగరు భట్టు "చిట్టచివరికి ధర్మం జయిస్తుందని, నీతిపరులకు కీర్తివస్తుందని, భరతభూమి ధర్మబద్ధంగా ఉండాలని, ఆవులన్న కాటమరాజు చరిత్ర శాంతిసందేశాన్ని ఇస్తోందని" భరతవాక్యం పలుకుతాడు.

కాటమరాజు ఆలమందను చూపించడానికి ముఖ్యంగా కాటమరాజు కామధేనువుగా భావించి పూజించే బొల్లావు కళ్ళు పీకించాలని నల్ల సిద్ధిఋాజు ఉంపుడుగత్తె చిలకసాని (కన్నమదేవి) పన్నిన పన్నాగం, నల్ల సిద్ధిరాజు కొలువున ఉండే రాయశృంగారభట్టు ఖడ్గ తిక్కనకు తెలియకుండా లంచం పుచ్చుకొని, ఆ వరహాల మూట ఖడ్గతిక్కనే లంచంగా తీసుకొన్నాడని అపవాదు ప్రచారం చెయ్యడం, బొల్లావును చేజిక్కించుకోలేని చిలకసాని ఆ కారణంగా కాటమరాజుపై పగబూనడంవంటి సన్నివేశాల్ని నాటక ఇతివృత్తాన్ని మరింత పటిష్టం చేయడానికి ఆరుద్ర కల్పించారు. కాటమరాజు వంశస్థులకు కులదేవత గంగ. పశువులకు ప్రాణాధారం నీరే. అందుచేత గంగను కొలవటం యాదవుల ఆచారం. వారి పశుధనమే దేశానికి వారిచ్చే గొప్ప సంపద. అటువంటి అమాయక ప్రజల్ని మోసగించి వారి పశుసంపదను నాశనం చేస్తారు నాగరికులైన నల్ల సిద్ధిరాజు వర్గం. తరతరాలుగా అగ్రవర్ణాలకు వెనుకబడిన జాతులకు మధ్య జరిగే వర్గపోరాటమే *కాటమరాజు కథ.* చరిత్ర పాఠ్యాంశాలలో జానపద నాయకుడైన కాటమరాజుకి సముచిత స్థానం లేకపోయినా, ఈనాటికీ కాటమరాజును అవతార పురుషుడిగా కొలుస్తారు. గుడంచర్ల ప్రాంతంలో ఎ వేనూతల కాటమరాజు దేవాలయంలో, తెల్లారితే ఉగాది అనగా ఈ ఉత్సవం జరుగుతుంది. ఈ తిరునాళ్ళ కోసం గుడంచర్ల దేవాలయానికి పెద్దారవీడు, మార్కాపురం, పెదకోర్నాల, కంభం, అర్ధవీడు, రాచర్ల, గిద్దలూరు, తుర్లపాడు మండలాలకు చెందిన గ్రామాల నుండి బొల్లావులను, ఎద్దులను తోలుకొని దేవాలయం చేరతాడట. ఈ ప్రాంతంపై రైతాంగం ఎక్కువగా పాడిపరిశ్రమలపై ఆధారపడి ఉంది. అందుచేత తమ జీవసంపదను ఈ బొల్లావు ద్వారా కాటమరాజు కాపాడతాడని వారు నమ్ముతారు. బొల్లావులను రూపొందించి తెస్తారు. ఈ బొల్లావును కాటమరాజు కామధేనువు అవతారంగా భావించి పూజించాడని ప్రతీతి. బొల్లావును రెండున్నర అడుగుల ఎత్తుతో తేలిక చెక్కలతో తయారు చేస్తారు. రెండు చట్టల మీద ఆంజనేయుణ్ణి, గరుత్మంతుణ్ణి, డొక్కలో సింహతలాటం వీపున నాగబంధం, మోపు ఇరువైపులా శంభు చక్రాలు, ముఖాన గంగ.. ఇలా చక్కని రంగులు వేసి అలంకరిస్తారు. అలాగే కంభమెట్ల జంగంగూడు గ్రామంలో గంగ గుడి ఉంది. ఈ గ్రామ రెడ్లలో ఒక వంశంవారు గంగకు పసుపు, కుంకుమలు ఇచ్చి తిరునాళ్ళకు పంపుతారు. వారికీమె కులదేవత.

కాటమరాజు ఆలయంలో అతని శిలావిగ్రహం, దానికెదురుగా పురాతనమైన ఒరగోగు మాను చెట్టు, తరువాత గంగమ్మ విగ్రహం ఉంటాయి. 13వ శతాబ్దిలో కనిగిరి ప్రాంతంలో పాలన చేసిన కాటమరాజు పశుసంపద గురించి కాటమరాజు ఆవుల మంద కుదిరితే అరామడ, చెదిరితే పన్నెండామడ' అన్న సామెత ఉంది. పంచలింగాల కొండ క్రింద కాటమరాజు కోట ఉండేదని *కాటమరాజు కథ* నాటిక ముందుమాటలో ఈ నాటిక గురించి ఎన్నో చారిత్రక విశేషాలు తెలియజేశారు శ్రీమతి రామలక్ష్మి ఆరుద్ర. ఏడెనిమిదేళ్ళ క్రితం *కాటమరాజు కథ* నాటిక అచ్చువేయించి తంగిరాల వేంకటసుబ్బారావుగారిచే వీరగాథల గురించి ఉపోద్ఘాతం రాయించి, తెలుగు పాఠకులకు అపురూపమైన కానుకగా అందించారు. నాటకం చూడలేని ఈ తరంవారు కనీసం ఈ నాటిక చదివి ఆనందించవచ్చును.

డా. ఎమ్.వి. భారతలక్ష్మి
కాకినాడ.
ఫోన్ : 944 021 5330




*తెలుగు తెరపై తొలి ఘటోత్కచుడు*

# రాజంరెడ్డి రామిరెడ్డి

*- హెచ్. రమేష్‌బాబు*

తెలుగు సినిమా ప్రేక్షకులకు "ఘటోత్కచుడు" అనగానే ముందుగా గుర్తొచ్చే నటుడు 1957లో వచ్చిన 'మాయాబజార్'లో నటించిన "ఎస్.వి.రంగారావు", కానీ అంతకుముందు ఇరవైయేండ్ల కిందనే వచ్చిన 'మాయాబజార్' (లేదా శశిరేఖా పరిణయం'-1936)లో ఘటోత్కచుడుగా నటించిన రామిరెడ్డి దాదాపుగా ఈ తరం వారికి తెలియదనే చెప్పుకోవాలి. ఘటోత్కచుడుగా ఎస్.వి.రంగారావు ఆంగికాభినయంతో రక్తికట్టిస్తే, రామిరెడ్డికి ఉన్న అదనపు అర్హతలు 250 పౌన్ల బరువున్న భారీ ఆకారం గంభీరమైన గాన కౌశలం.

కర్నూల్ జిల్లా నంద్యాల తాలూకా బండి ఆత్మకూరులో 1899 ఆగస్టు 19న రాజంరెడ్డి వారి వంశంలో రామిరెడ్డి జన్మించారు. వారి పూర్వీకులు తాడిపర్తి దగ్గరలోని బోడాయిపల్లికి చెందిన వారు. కాగా, కరువు కారణంగా తాతల తరంలోనే బండి ఆత్మకూరుకు వలస వచ్చారు. రామిరెడ్డి తండ్రి రామలింగారెడ్డి మధ్యతరగతి రైతు. ఆ రోజుల్లో గ్రామాల్లో భూస్వాములు ఒక వర్గంగా ఉంటే, రైతు కూలీలు మరో వర్గంగా ఉండేవారు. రామిరెడ్డి పేద రైతుల పక్షంలో నాయకత్వం వహించి రాజకీయాలను వంటబట్టించుకున్నారు.

చదువుతో బాటు పాటలు పద్యాలు ఆయనకు అభిమాన విషయాలైనవి. దాంతో నాటకరంగంలో ప్రవేశించారు. తానే స్వయంగా "శ్రీ జనార్ధన నాట్యమండలి"ని స్థాపించి నాటకాలు ప్రదర్శించడం మొదలుపెట్టారు. రంగస్థలంపై భీముడు, ఘటోత్కచుడు, బొబ్బిలి పాపారాయుడు వంటి వేషాలు వేసేవారు. ఆ కాలంలో నాటకరంగంలో పేరున్న వారికి సినిమా అవకాశాలు వెదుక్కుంటూ వచ్చేవి. రామిరెడ్డికి కూడా అట్లానే అవకాశాలు వచ్చాయి. రామిరెడ్డి నటించిన తొలి చిత్రం 'మాయాబజార్'. (1936) వేల్ పిక్చర్స్ వారు తీసిన రెండో సినిమా ఇది. లక్ష్మణస్వామి (అభిమన్యుడు), శాంతకుమారి (శశిరేఖ) లతో కలిసి ఘటోత్కచుడిగా నటించిన రామిరెడ్డి ఆరున్నర అడుగుల ఎత్తుతో భారీ కాయంతో ఘటోత్కచుడుగా రామిరెడ్డి నటన ఆ సినిమాకు నిండు దనాన్ని తెచ్చి పెట్టింది. ఈ సినిమాలో ఆయన పాడిన

*"వివాహ భోజనంబు వింతైన సాయసంబు*
*ఘనమైన దప్పళంబు కదుమంచి అప్పళంబు*
*చవులూరజేయు విందు సంతోషముగ తిందు"* పాట ఆ రోజుల్లో బహుళ జనాదరణ పొందింది. ఇంకా ఈ చిత్రంలో "పారవార విజృంభనోద్ధతి ఘనవ్రాతార్భటిన్ రేగి", "అన్నమున విషమిడి యింటిగగ్గివెట్టి" అంటూ పాడిన పద్యాలతో ఆ రోజుల్లో థియేటర్లు దద్దరిల్లేవి.

రామిరెడ్డి నటించిన రెండో సినిమా "కచదేవయాని" (1938). ఇందులో ఆయన 'వృషపర్వుని' పాత్ర పోషించారు. ఆ తరువాతి 'మైరావణ' (1940)లో అహిరావణుడి పాత్ర పోషణతో గొప్పపేరు తెచ్చుకున్నారు. హీరోయిన్ చంద్రసేనగా నటించింది అలనాటి అందాల నాయిక కాంచనమాల. "పిబమధురం మనోహరం" పాట రామిరెడ్డి పాడగా పెద్ద హిట్. ఆ తరువాత రామిరెడ్డి 'భీష్మ' (1944)లో దాశరాజుగా నటించారు. 'యోగివేమన' (1947)లో అనవేమారెడ్డిగా నటించిన ఆయన ఇదే యేడాది వచ్చిన 'గొల్లభామ'లోనూ నటించారు. కాగా ఆయన చివరి చిత్రం 'మదాలస' (1948).

సినిమా, నాటక రంగాల్లో తనదైన ముద్రవేసిన రామిరెడ్డి హరికథలు చెప్పడంలో సాటిలేని ప్రతిభాశాలిగా పేరు తెచ్చుకున్నారు. ఆయన హరికథలు చెబుతుంటే వేలాది మంది

రాత్రిళ్లు కన్నార్పకుండా వినేవారు. ఇట్లా హరికథకులుగా ఆయన 12 బంగారు పతకాలు పొందారు. ఇటు కళారంగంతో బాటు ఆనాటి రాజకీయాల్లోనూ తనదైన పాత్ర పోషించారు. సుమారు 20 ఏండ్ల పాటు జిల్లా బోర్డు మెంబర్‌గా, పంచాయతీ బోర్డ్ ప్రెసిడెంట్‌గా పని చేశారాయన. ఇంకా అక్కడికి దగ్గరలోని శ్రీ ఓంకార సిద్దేశ్వర స్వామి ఆలయ ధర్మకర్తగా సుమారు రెండు దశాబ్దాల పాటు పని చేశారు.

ఇవన్నీ ఇల్లా వుండగా మరోవైపు స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించి క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నందుకు ఆంగ్లేయ ప్రభుత్వం ఆయన్ను జైల్లో పెట్టింది. ఆ రోజుల్లో స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని జైలుకెళ్లడమంటే సమాజంలో గొప్పగౌరవం పొందడమే. ఆయనను అరెస్టు చేసి తీసుకెళుతుంటే ఊరూరా ఊరేగింపులు, మంగళహారతులిచ్చి సాగనంపేవారు. ఆ చుట్టు ప్రక్క ప్రాంతాల్లో ఆయనను 'సినిమా రామిరెడ్డి', 'ఓటు రామిరెడ్డి' అని పిలిచేవారు.

జైలులో ఉండగానే ఆయనకు ఆస్తమా వ్యాధి సోకింది. దీనికి తోడు చివరి రోజుల్లో పక్షవాతానికి గురయ్యారు. ఆ జబ్బుతోనే 1957 జూలై 12న రామిరెడ్డి కన్నుమూశారు. టాకీలు వచ్చాక వచ్చిన తొలి 'మాయాబజార్'లో తొలి ఘటోత్కచుని పాత్ర పోషించిన రాజంరెడ్డి రామిరెడ్డిని ఆయన 116వ జయంతి సందర్భంగా గుర్తు చేసుకుందాం.

హెచ్. రమేష్ బాబు
మహబూబ్ నగర్ జిల్లా.
ఫోన్ : 944 092 5914

# వెన్నముద్దలు

మా పిన్ని పెద్ద కుండలో మీగడ పెరుగు, నీళ్ళు పోసి, రోజ్‌వుడ్ కవ్వంతో – నారతాడు చుట్టి చిలికేది – నేను – అక్క, ఆ మజ్జిగ చినుకులు ముఖంమీద పడేంత దగ్గరగా కూర్చునేవాళ్ళం.
పిన్ని నవ్వుతూ కబుర్లు చెపుతుండేది. కొంతసేపటికి మెత్తని 'మిసిమి'ని మరో గిన్నెలో తీసేది –



మా ఇద్దరికీ చెరో ముద్ద పెట్టేది. ఇంకా మజ్జిగ చుక్కలు రాలుతుండగా అపురూపంగా ఆరగించేవాళ్ళం – ఇది పొద్దున్న – ఆ తర్వాత బడికి వెళ్ళేప్పుడు జాడిలో ఆవకాయ, సద్ది అన్నంలో కలిపి మరొక వెన్నముద్ద – ఆహా ఏమి రుచి – అదీ అయిపోయింది – ఆ తర్వాత వెన్న కరగబెట్టి, కమ్మని నెయ్యి చేసేది – ఇవన్నీ చిన్ననాటి ముచ్చట్లు. ఇప్పుడు ఇవన్నీ ఎందుకు గుర్తువచ్చాయి –



మహర్షి

మొన్న మహర్షి – తన 'వెన్నముద్దలు' చిన్ని పుస్తకం చేతిలోపెట్టి వెళ్ళాడు – ఆ రాత్రే చూసి – తిరగేసి – చదివేశాను. ఇందులో పైన చెప్పిన మెత్తని 'మిసిమి' ముద్దలున్నాయి. తర్వాత ఆవకాయ పచ్చడి కారంతో ఉంది – చివరిగా కరిగిన నెయ్యి కమ్మని వాసనా ఉంది. జీవితంలో మనం చూడని, చూసినా పట్టించుకోని, పట్టించుకున్నా వదిలివేసిన ఎన్నో 'అబ్జర్వేషన్లు' పట్టి ఇచ్చిన ఈ పుస్తకం పండ్రెండు ముద్రణలు చేసుకున్నా – సొమ్ముచేసుకోకపోవటంలో ఆశ్చర్యం ఏముంది!
జానార్ధన్ మహర్షి – ఆకర్షణకు, వినయానికి, కాస్త పొగరుకు – లోకజ్ఞానమో, అజ్ఞానమో వీటన్నిటి దర్పణం – ఈ ముద్దలు – దర్పణం ఎందుకంటే ఈ వెన్నముద్దలు – ఆరగించలేరు – అనుభవించగలరు!
*ప్రతులకు – జనార్ధన మహర్షి, ఫోన్ : 984 803 4309.*

-ఎ.కె.

# ఆచార్య పింగళి లక్ష్మీకాంతం

*– పింగళి సూర్యసుందరం*

దాదాపు నూటపది సంవత్సరాల క్రితపు మాట ఇది. శతావధాని చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి బందరు హిందూ హైస్కూలులో తెలుగు పండితునిగా ఉద్యోగం చేస్తున్న రోజులవి. ఒకనాడు క్లాసులో "నదికీ కాలువకీ గల భేదమేమిట"ని విద్యార్థులని ఉద్దేశించి ప్రశ్నించాడు. వెంటనే పదమూడేళ్ళ బాలుడు లేచి "నది సహజంగా పుట్టి ప్రవహించేది, కాలువ మనిషి తవ్వితే ఏర్పడేది" అని సమాధానం చెప్పాడు. శాస్త్రిగారికా సమాధానం నచ్చి 'నీ పేరేమిటి నాయనా' అని అడగ్గానే ఆ బాలుడు "పింగళి లక్ష్మీకాంతం" అని బదులు చెప్పాడు. ఆ బాలుని గోత్రం గోతమస అని తెలుసుకొని శాస్త్రిగారు "చూస్తే పింగళి సూరన అంతటివాడివయ్యేలా ఉన్నావే" అని ఆశీఃపూర్వకంగా అన్నారు. కామేశ్వరీ ఉపాసకులైన శాస్త్రిగారి వాక్కు అమోఘమైన ఆశీర్వచనమై, బహుముఖ ప్రజ్ఞాశాలి అయిన ఒక సాహితీ ధూర్వహుని జీవితానికి అంకురమయ్యింది.

పై సంఘటన జరిగిన మర్నాడు లక్ష్మీకాంతం శాస్త్రిగారింటికి వెళ్ళి తనని శిష్యునిగా చేసుకొమ్మని అడిగితే 'నీ అభీష్టమేమిట'ని శాస్త్రిగారడిగారు. "నేను కవిని కావాలి" అని లక్ష్మీకాంతమిచ్చిన సమాధానానికి శాస్త్రిగారు ఆశ్చర్యపోయారు. వారిని ఆశ్రయించేవాళ్ళు ఏ వ్యాకరణమో, సంస్కృతమో బోధించమని అడిగేవారేగాని ఇట్లా "కవిని కావాలి" అని అడిగినవారెవ్వరూ లేరు. అప్పట్నుంచి లక్ష్మీకాంతం గురువుగారికి అయిదు సంవత్సరాలపాటు శుశ్రూష చేశారు. ఆ రోజులలోనే లక్ష్మీకాంతం తండ్రి, స్వగ్రామమైన చిట్టూర్పులో (దివిసీమలోని గ్రామం) కన్నుమూశారు. ఆయన పోవడంవల్ల కుటుంబం ఆర్థికంగా చితికిపోయింది. గ్రామానికి తరలివెళ్ళింది. ఆ తరువాత కొన్ని సంవత్సరాలు ఆర్థిక ఇబ్బందులతో సాగింది లక్ష్మీకాంతం జీవితం. ఆ రోజుల గురించి వ్రాస్తూ ఆయన,

*"గడిపితిని కొన్ని ఏండ్లు చీకటిమయమయి*
*గ్రుడ్డి వెన్నెలయైన నెరుంగకుండ*
*సత్యమొకటి ఆత్మవిశ్వాసమొకటి*
*కను వెలుంగయి నాకు మార్గమ్ము చూపె"*

అని రాసుకున్నారు. బందరులో తన 33వ సంవత్సరం వరకూ ఉన్నారు లక్ష్మీకాంతంగారు (మధ్యలో రెండున్నర సంవత్సరాలు మినహా). స్కూల్‌ఫైనల్ పరీక్షలయిం తరువాత బెజవాడ సబ్–మేజిస్ట్రేటు కోర్టులో బెంచి క్లర్క్‌గా పనిచేశారు ఆ కాలంలో. ఆ ఉద్యోగానికి రాజీనామా ఇచ్చి తిరిగి బందరు చేరి ఇంటర్, బి.ఏ.లు ఎవరెవరో చేసిన ఆర్థిక సహాయంతో పూర్తిచేశారు. విద్యార్థి దశలోనే ఆశుకవిత్వం చెప్పేవారు. ఈయన స్నేహాన్ని కోరి చాలామంది దగ్గరకు వచ్చేవారు. వారిలో కాటూరి వేంకటేశ్వరరావు ఒకరు. వేంకటేశ్వరరావు గారు ఆగర్భ శ్రీమంతులు. లక్ష్మీకాంతంగారు అట్లా కారు. వేంకటేశ్వరరావుగారు కూడ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారి శిష్యుడే. వేంకటేశ్వరరావు తన గురించి ఇట్లా చెప్పుకున్నారు–

*"పింగళి కాంత సుకవిలో*
*సంగాతము చెళ్ళపిళ్ళ సద్గురు*
*కృప నన్నుంకవి మాత్రుని గావిం*
*చెం గొండొక పద్యరచన చేతు జపలతకో"*

వీరిద్దరూ జంటకవులైనారు. ఆ రోజులలో "కృష్ణాపత్రిక" అని ఒక పత్రిక ఉండేది. ముట్నూరి కృష్ణారావుగారు సంపాదకులు దానికి. ఆ పత్రికకు కవులు తమ ఖండికలను పంపిస్తూండేవారు. ఆ ఖండికలలో కొన్ని విడివిడిగా రాసినవీ, కలిసి రాసినవీ కూడా ఉండేవి. *తొలకరి* అనే పేరుతో ఒక ఖండకావ్య సంపుటిని 1923లో వెలువర్చారు.

ఇది ఇలా ఉండగా బందరులో చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రి గారు రాయల్ థియేటర్ అని ఒక సంస్థని నెలకొల్పారు. తిరుపతి వెంకటకవులు అవధానాలు చేస్తున్నా ఊళ్ళలో తమ

పాండోవోద్యోగ విజయాలు నాటకాలని ప్రదర్శిస్తుండేవారు. ఒకసారి ధర్మరాజు వేషం వేయవలసినాయన రాలేదు. వెంటనే వేంకటశాస్త్రిగారు ఆ వేషాన్ని లక్ష్మీకాంతంగారిని వేయమని కోరారు. అప్పటికప్పుడు తయారై ఈయన రంగస్థలమెక్కారు. ఆ విధంగా 1912 నుండి 1927 వరకూ లక్ష్మీకాంతంగారు రంగస్థల నటునిగా ప్రసిద్ధులయ్యారు. వీరి అన్నగారు, నరసయ్య కూడ నాటకాలలో వేషాలు వేశారు. ఒకసారి రాజమండ్రిలో వీళ్ళ నటనని చూసి ఎంతో సంతోషించిన ఒక పెద్దమనిషి ఎవరయ్యా మీరు అని ప్రశ్నించగా లక్ష్మీకాంతంగారు ఆశువుగా ఈ పద్యాన్ని చెప్పారు –

*"వీర రసావతారుడని విశ్రుతికెక్కిన నాటకుండ వా*
*క్కూరుడు మానృసింహునకు కూరిమి తమ్ముడ హాస్యశోకశృం*
*గార రసప్రధానముల నాయక వేషధరుండ సత్కవిన్*
*పేరునకేను కాంతుడ పవిత్రపు పింగళి వంశజాతుడన్"*

పాండవోద్యోగాలలోనేకాక ఇతర నాటకాలలో కూడా వేషం వేసేవారాయన.

చదువు పూర్తయాక బందరులో నోబెల్ హైస్కూలులో, కాలేజీలో తెలుగు అధ్యాపకునిగా ఉండేవారు. ఈయన బోధన ఎంతో బాగుండటంవల్ల బందరులోనే ఉన్న హిందూ హైస్కూలు విద్యార్థులు కూడ వచ్చి ఈయన క్లాసులో కూర్చునేవారు.

వీటికి తోడు నోబెల్ కాలేజ్ ప్రిన్సిపాల్స్‌తో లక్ష్మీకాంతంగారు టెన్నిస్ పోటీలలో పాల్గొనేవారు.

కవిత్వం ఉండనే ఉంది. వేంకటేశ్వరరావు గారితో కలిసి అవధానాలు చేసేవారు. ఒక అవధానంలో పింగళి సూరన మీద ఒక పద్యం చెప్పమని ఒక పృచ్ఛకుడు అడిగినప్పుడు లక్ష్మీకాంతంగారు చెప్పిన పద్యమిది :

*"సంగడ మంతకున్ తగిన పావనుడై జనియించి జాహ్నవి*
*తుంగ గభీర భంగచయ తుల్య పటుత్వ కవిత్వర్తియై*
*బంగరు రంగువీనెడు ప్రబంధములన్ రాయించినట్టి మా*
*పింగళి వంశ సూరసుకవిక్వి వినుడింతు సభాంతరమ్ములన్'*

1927లో లక్ష్మీకాంతంగారికి ఒక గొప్ప అవకాశం లభించింది.

మద్రాసు యూనివర్శిటీలో Orient Manuscripts librarian fellowship అది. రెండున్నర సంవత్సరాల పాటు ఉండేలా fellowship కోసం మద్రాసు వెళ్ళారు. అక్కడ ఉండగానే తంజావూరులోని సరస్వతీ మహల్ లైబ్రరీలోని తాళపత్ర గ్రంథాలనిచూడాల్సిన అవసరం వచ్చింది. అక్కడే ఆయన మహాభారతానికి సంబంధించిన అనేక తాళపత్ర గ్రంథాలని పరిశీలించారు. fellowship అయిపోయినా మద్రాసులోనే కొన్ని నెలలు గడిపారు. fellowship ఉన్న రోజులలోనే మద్రాసు యూనివర్శిటీవాళ్ళ ఎం.ఏ. (తెలుగు, సంస్కృతం) పరీక్షల్లో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆ రోజులలో ఆయన మానవల్లి రామకృష్ణ కవిగారు "మీరు అనువదించాల్సినది దీన్ని కాదు, అశ్వఘోషుని *సౌందరనందాన్ని"* అని చెప్పి గోరఖ్‌పూర్‌లోని ఆ సంస్కృత గ్రంథ ప్రచురణకర్తల చిరునామా, వగైరాలిచ్చారు. ఆ గ్రంథాన్ని తెప్పించుకొని లక్ష్మీకాంతంగారు చదివారేగాని కేవలం బౌద్ధమత ప్రచారానికే ఉపయోగపడే గ్రంథాన్ని యథాతథంగా అనువదించటంకన్నా ఒకరకమైన కావ్యంగా రూపొందించాలని అనుకున్నారు. ఈ ఆలోచన రాగానే గ్రంథ రచన ప్రారంభించి, కొంత రాసి, విషయాన్ని వివరిస్తూ కాటూరి వేంకటేశ్వరరావుగారిని కూడ ఈ రచనలోని రమ్మని కోరారు. వేంకటేశ్వరరావుగారు "నేనిట్లా వ్రాయగలననే అనుకుని పంపావా? నా వల్ల కాదు, నీవే రాసుకో" అన్నారు. "మనం జంటకవులుగా లోకానికి పరిచయమయ్యాం. అట్లాగే నిలిచిపోవాలి. నేను రాసింది నీకు పంపుతాను, నీవు రాసిన భాగం నాకు పంపు. ఇట్లా పూర్తి చేద్దాం' అని బలవంతపెట్టి కాటూరి వారిని కావ్య రచనలోకి దింపారు. ఈలోగా ఆంధ్రా యూనివర్శిటీ వాళ్ళు తెలుగు ముఖ్యవిషయంగా బి.ఎ. (ఆనర్స్) కోర్స్‌ని ప్రారంభించడానికి నిశ్చయించుకున్నారు.

యూనివర్శిటీ ఉద్యోగం లక్ష్మీకాంతంగారికి లభించింది. అప్పటి వైస్‌ఛాన్సలర్ డా. సర్వేపల్లి రాధాకృష్ణ తర్వాత సి.ఆర్. రెడ్డి వచ్చారు. ఆ ఉద్యోగం స్వీకరించడానికి 1931లో విశాఖపట్నం వెళ్ళారు. లక్ష్మీకాంతంగారు బి.ఏ. ఆనర్స్ అంటే ఇంటర్ తరువాత మూడు సంవత్సరాలు సాగే కోర్సు. ఇక్కడ వారు చేసిన పని గురించి జి.వి. సుబ్రహ్మణ్యంగారే మాటలన్నారు "పింగళివారు కవులు, విమర్శకులు, మహావక్తలు, రచయితలు, ఉపాధ్యాయులు, నాటక ప్రయోక్తలు, నటులు.... అన్ని రంగాలలో వారు చేసిన ప్రయోగాలు ఒక ఎత్తు, ఆంధ్ర సాహిత్యాధ్యాపన రంగంలో వారు చేసి చూపిన ప్రయోగాలు మరొక ఎత్తు. ఆంధ్ర విశ్వకళాపరిషత్తులోని ఆంధ్ర సాహిత్యాధ్యయన శాఖకు వారు పితామహకల్పులు. దాని రూపురేఖలు దిద్దటం, జవసత్వాలను

కలిగించటం, ప్రయోగ ప్రమాణాలను రూపొందించటం, భవిష్యద్దర్శనాన్ని ప్రసాదించడం వారు తమ బాధ్యతగా స్వీకరించి సమర్థవంతంగా నిర్వహించారు."

పద్దెనిమిది సంవత్సరాలపాటు తెలుగుశాఖకి అధ్యక్షులుగా ఉండి 1949లో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి రిటైర్ అయ్యారు.

ఇది జరిగిన అయిదు సంవత్సరాలకి ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో సాహిత్య సలహాదారుగా నియుక్తులయారు. ఇక్కడ ఉండగా అనేక సాహిత్య కార్యక్రమాలను, ముఖ్యంగా ప్రముఖ సంస్కృత నాటకాలను రేడియో ప్రసారానికి అనుకూలంగా రూపొందించి కళాకారులకు తరిఫీదునిచ్చి ప్రసారం చేసేవారు. అట్లాగే రేడియోలో తెలుగు అష్టావధానం చేయించారు. అట్లా మొట్టమొదటిసారి అష్టావధానం చేసినవారు ఆ రోజులలో గుంటూరు హిందూ కాలేజీలో లెక్చరర్‌గా పనిచేసే పి.వి.ఎల్.వి. ప్రసాదరావు అని యువ కవి. ఈయనే ఉత్తరోత్తరా కుర్తాళం సిద్ధేశ్వరీపీఠాన్ని అధిష్టించారు.

1961లో లక్ష్మీకాంతంగారిని తెలుగు ప్రొఫెసర్‌గా ఆహ్వానించారు తిరుపతిలోని వేంకటేశ్వర విశ్వవిద్యాలయం వారు. అక్కడ నాలుగు సంవత్సరాలు ఆ ఉద్యోగాన్ని నిర్వహించి, ఇక విశ్రాంతి తీసుకున్నారు.

ఉద్యోగ విరమణ తరువాత తాను దాదాపు పాతిక సంవత్సరాలు బోధించిన సాహిత్య విమర్శ; సాహిత్య చరిత్రలను గ్రంథస్థం చేయబూనారు. ఆ క్రమంలో "సాహిత్య శిల్ప సమీక్ష" అనే గ్రంథాన్ని 1966లో ప్రచురించారు. ఇప్పటికీ ఆ గ్రంథం పునర్ముద్రితవుతూనే ఉంది. వెనువెంటనే ఆంధ్ర సాహిత్య చరిత్ర రచనకి పూనుకోక ఆయన తెలుగులో సంస్కృత వ్యాకరణ గ్రంథమొకటి రాశారు. దీని పేరు "సంస్కృత కుమార వ్యాకరణము" 1968లో వెలువడింది. 1971లో పునర్ముద్రింపబడింది.

ఆంధ్ర సాహిత్య చరిత్రని వ్రాయటానికి పూనుకునేప్పటికి ఆయన వయస్సు 74 సంవత్సరాలు. ఆయన భార్య 1969 లో అంటే ఆయనకి 75 సంవత్సరాల వయస్సులో గతించింది. ఆ తరువాత రెండున్నర సంవత్సరాలకి 1972 జనవరి 10న, తన జన్మదినాన్నే, లక్ష్మీకాంతంగారు స్వర్గస్థులయ్యారు. ఆంధ్ర సాహిత్య చరిత్రని అసంపూర్ణంగానే విడిచిపెట్టారు. ఈ అసంపూర్ణ గ్రంథాన్నే 1974లో అప్పటి ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమీ ప్రచురించింది. 1994లో లక్ష్మీకాంతం గారి శతజయంతి జరిగిన సందర్భంలో ఆయన విడిచి వెళ్ళిన సాహిత్య చరిత్రని ఆయన శిష్యుల వద్దనే ఉన్న ఆయన లెక్చర్ నోట్స్ ఆధారంగా పూర్తి చేయాలని సంకల్పించాం. ఈ పూరణను ఆచార్య కోలవెన్ను మలయవాసిని గారు చేశారు. పూర్తి గ్రంథం 1998లో ప్రచురించబడింది. ఇదే ఇప్పుడు కూడ పునర్ముద్రితమవుతున్నది.

లక్ష్మీకాంతంగారు కాలంచేసిన తరువాత గ్రంథ రూపంలో రాని వారి కవితలని కొన్నింటిని సంకలనం చేసి "ఆత్మలహరి" అనే పేరుతో ప్రచురించాం. అట్లాగే ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి విరమించిన తరువాత ఈయన *భారతి* పత్రికలో ప్రచురించిన గంగాలహరి, తేజోలహరి, అన్యాపదేశలహరి అనే కవితా ఖండికాలని కూడ 'మధుర పండిత రాజం'గా పునర్ముద్రించాం.

ఆయన వ్యక్తిత్వంలోని ప్రత్యేకత, ఆయన హుందాతనం. నైచ్యమంటే ఏమీ తెలియని, రాజనిక ప్రవృత్తి. ఎంత రాజసికమున్నా సాత్వికత కూడా అంతే ఉండేది. ఖండితవాది అవటంవల్ల ఎందరో శత్రువులుండేవారు. తెలుగు అధ్యాపకత్వానికి కొత్త గౌరవం తెచ్చిపెట్టినవారాయన. వారి గురించి నండూరి రామకృష్ణమాచార్యులు చెప్పిన ఈ పద్యం చూడండి :

*"నీ తలయూపు నీ నడక నీ నుడికారము లీవియే మహీ*
*నేతకు గల్గు? తెల్గునకు నీ వలనంగద గల్గె నేటి ని*
*ఖ్యాతి, కవీంద్రులన్ మలచినట్టి కవీశ్వర! సాహితీపరం*
*జ్యోతివి నీవు పింగళి మహోదయ విశ్వకళాజగద్గురూ!"*

ఇంత సాధించిన లక్ష్మీకాంతంగారు తన గురించి చెప్పుకున్న పద్యంతో ముగిస్తాను.

*"గర్వపు మాటలేవి గురుకారుణికత్వ మొకందుగాక, మా*
*పూర్వులు సూరనాదుల తపోబల సంపదకల్మి, సాహితీ*
*ధూర్వహుడన్న పేరునకు తోడు మహాకవియన్న కీర్తి యాం*
*ధ్రోర్వి లభించె నిక్కమిది, యోగ్యతలేని యశమ్ము మోసితిన్!"*

పింగళి సూర్యసుందరం
హైదరాబాద్.
ఫోన్ : 040 235 467 12

## వేదం వేంకటరాయ శాస్త్రి రచనలు :
# సామాజిక చరిత్ర

- జి. వెంకటేశ్వరరావు

తెలుగు భాషలో ముగ్గురు మాత్రమే చారిత్రాత్మక కావ్యకర్తలున్నారు. మొదటివారు పాల్కురికి సోమనాథుడు, రెండవవారు శ్రీనాథుడు, మూడవవారు వేదం వేంకట్రాయశాస్త్రి అని పింగళి లక్ష్మీకాంతం అన్నారు. "వేదం వేంకటరాయశాస్త్రి యుగపురుషులు. వారి వైదుష్యముకాని, సునిశిత బుద్ధి వైభవముకాని, ప్రతిభ కాని, అధునాత మత సమన్వయ నైపుణ్యం కాని ఇతరులకు లేదు. వారు మహాకవులు. ఆది కళాప్రపూర్ణులు, సర్వస్వతంత్రులు, మహామహోపాధ్యాయు"లని ధరణికోట వేంకటసుబ్బయ్య అనే కవి ప్రశంసించారు. "ఆయన భారతీయ విజ్ఞానవేత్త, పురాతన సంస్కృతి, చరిత్రయందు, భాషాతత్త్వశాస్త్రము నందు విశిష్ట పరిశోధనలు చేసిన వ్యక్తి. ఆంధ్ర గీర్వాణములందు వారు విజ్ఞాన సర్వస్వ స్వరూపుడ"ని అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ అన్నారు. ద్రావిడ భాషలలో చక్కని ప్రవేశంగల శాస్త్రిగారు మహావక్తగా, వ్యాఖ్యాత చక్రవర్తిగా, ఆదర్శ అధ్యాపకులుగా, ప్రఖ్యాత విమర్శకులుగా, నాటక కళాచార్యులుగా ప్రసిద్ధిగాంచినారు. నెల్లూరంటే తిక్కన ఊరు అంటారు. వేంకటరాయశాస్త్రి గారి ఊరని కూడ అంటారు. వేదం వేంకటరాయశాస్త్రి సారస్వత లోకములోని చీకట్లను తొలగించిన విజ్ఞాన భాస్కరులని వేదుల తిరువేంగడాచారి అనే కవి ప్రశంసించారు.

వేంకటరాయశాస్త్రి 1853 డిసెంబరు 2వ తేది నెల్లూరు జిల్లా (కోవూరు తాలూకా0లోని యల్లాయపాళెం అనే గ్రామములో జన్మించారు. తల్లి లక్ష్మమ్మ, తండ్రి వేంకటరమణ శాస్త్రి. శాస్త్రిగారు ఉపాధ్యాయులుగా అనేకచోట్ల పనిచేశారు. రాజమండ్రి, మద్రాసులలో ప్రదానోపాధ్యాయులుగా పనిచేశారు. (1886లో) మద్రాసులోని క్రిష్టియన్ కళాశాలలో 24 సంవత్సరాలు అధ్యాపక వృత్తిలో ఉండినారు.

వేంకటరాయశాస్త్రి తెలుగులోకి సంస్కృత గ్రంథాలను అనువదించటం, సంస్కృత గ్రంథములకు అమూల్యమైన వ్యాఖ్యాలు వ్రాసి, సంస్కృత గ్రంథాలలోని విశిష్టార్థములను తెలుగు జాతికి అందించడం ఒకవిధమైతే, తెలుగు ప్రబంధములకు లోకోత్తరమగు వ్యాఖ్యలు వ్రాసి, వాని అర్థములను, భావములను, సంప్రదాయమును సుస్పష్టంగా ప్రతిపాదించడం మరొక విధము. వేంకటరాయశాస్త్రి నాటకములలో పాత్రోచితమైన భాషను ప్రవేశపెట్టిన వారిలో ప్రథములు. వీరి విమర్శనా గ్రంథములలో ప్రాకి విమర్శనా పద్ధతులకు పాశ్చాత్య విమర్శనా పద్ధతులను జోడించి తెలుగు వాఙ్మయమునకు (ఒక) నూతన శకమును స్థాపించినారు. ఆధునిక ఆంధ్ర వ్యాఖ్యాన చక్రవర్తిగా నిలిచారు. శాస్త్రిగారు కవిత్వము అతి ప్రౌఢమయినది. సంస్కృత పద బహుళమేగాని, సరళము, భావగాంభీర్యము కలిగిన నవ్య కల్పనల కారకమైన మనోజ్ఞ వర్ణనలతో సొంపుగా ఉండును.

వేంకటరాయశాస్త్రి బహు గ్రంథ రచయితలు. *స్త్రీ పునర్వివాహ దుర్వార నిర్వాపణము* అనే గ్రంథమును, ఉషాపరిణయము, బొబ్బిలియుద్ధం అనే నాటకాలను, అనువాద గ్రంథములైన *నాగానందము, అభిజ్ఞాన శాకుంతలము మాళవికాగ్ని మిత్రము, ఉత్తర రామ చరిత్ర, మేఘసందేశ* వ్యాఖ్య, *శృంగార నైషధ సర్వంకష వ్యాఖ్య, ఆముక్తమాల్యదా* సంజీవనీ వ్యాఖ్య మొదలు గ్రంథములు ఆయన జీవితకాలంలోనే వెలుగును చూశాయి.

వేంకటరాయశాస్త్రికి ఆంధ్ర భాషాభిమానము అత్యధికము. ఆంధ్ర భాష విషమ స్థితిలో ఉన్నప్పుడు, తెలుగు భాషకు సరియైన మార్గాన్ని చూపటంకోసం, పాశ్చాత్య వ్యామోహమును తొలగించి, తెలుగు భాషకు గల పూర్వ ఔన్నత్యమును గుర్తుకు తీసుకొని వచ్చి అందులోని అపార మహిమను తెలియజేశారు. శృంగార నైషధము, ఆముక్తమాల్యద మొదలగు తెలుగు కావ్యములకు విపులమైన వ్యాఖ్యలు వ్రాసి, ఆంధ్ర భాషా గౌరవమును పెంపొందించినాడు. శాస్త్రిగారికి భావనాశక్తి ఎక్కువ. వారు వ్రాసిన స్వతంత్ర నాటకాలు వారి భావనా మహిమను తెలియజేస్తున్నాయి.

శాస్త్రిగారికి నాటక రచన ప్రయోగములందు అభిరుచి ఎక్కువ. *ప్రతాపరుద్రీయము, ఉషాపరిణయము, బొబ్బిలియుద్ధము* అనే స్వతంత్ర నాటకాలే కాక, వారు అనువదించిన సంస్కృత నాటకములు వారికిగల కళాపారీణతను తెలియజేస్తున్నాయి. వీరు రచించిన ఉషాపరిణయము అనే పౌరాణిక నాటకము సంస్కృత నాటక లక్షణములననుసరించి రచింపబడినది. *బొబ్బిలియుద్ధము, ప్రతాపరుద్రీయము,* ప్రథమాంధ్ర చారిత్రక నాటకములుగా

ప్రసిద్ధిగాంచినవి. వీరి నాటకాలలో ఎన్ని భాషాభేదములు ఉన్నవో, వానిని అన్నింటిని పాత్రోచితముగా జీవకళ ఉట్టిపడునట్లు ప్రయోగించి, అందు వారికెంత స్వాతంత్ర్యము కలదో ప్రకటించారు. ఇదేకాక సంభాషణలు పాశ్చాత్యుల సొత్తని భావించినవారికి శాస్త్రిగారు తమ నాటకాలలో రచించిన సంభాషణలు కనువిప్పును కలిగిస్తాయి.

వేంకటరాయశాస్త్రి ప్రతాపరుద్రీయ నాటకంలో హిందూ – మహమ్మదీయ ఐక్యతను ప్రోత్సహిస్తూ, కథను సుఖాంతం చేశారు. శాస్త్రిగారు ఈ నాటకాన్ని వేంకటగిరి రాజా గోపాలకృష్ణ యాచేంద్రకు అంకితమిచ్చారు. ప్రతాపరుద్రీయములో శాస్త్రిగారు చూపిన భాషాతత్పరతకు, దేశభక్తికి, చారిత్రక వాతావరణమునకు కథానిర్మాణము గొప్పగా ఉన్నాయి. ఈ నాటకంలో పాత్రలను, సంస్థలను, ఆదర్శప్రాయంగా సృష్టించారు అని గురజాడ అప్పారావుగారు ఈ నాటకాన్ని ప్రశంసించారు. యుగకర్తగా ఆదరింపబడిన గురజాడ వ్యావహారిక భాషావాది. అటువంటివారు అనేక విషయాలలో వేంకటరాయశాస్త్రిని మెచ్చుకొన్నారు).

పింగళి లక్ష్మీకాంతం ప్రతాపరుద్ర నాటకాన్ని గురించి వ్రాస్తూ "ప్రతాపరుద్రీయము చారిత్రాత్మక నాటకం. దీనిలో కాకతీయుల కాలంనాటి ఆంధ్రుల ఔన్నత్యమును గురించి కనులకు కట్టినట్లు చిత్రింపబడినది. యుగంధరుడనే మంత్రి చరిత్రలో కనిపించాడా? అనే ప్రశ్నను చరిత్రకారుడు మాత్రమే అడుగగలడు. కవి చరిత్ర పాఠాన్ని చెప్పడానికి కోసం కావ్యాన్ని వ్రాయడు. చారిత్రక నాటకాన్ని చదివేవారుగాని, చూచేవారుగాని చరిత్ర నేర్చుకోవడానికి కోసం ఆ పని చేయరు. పేరు యుగంధరుడైనను, శివదేవయ్య మంత్రి ఐనను ఒకటే. ఆంధ్ర మంత్రి గొప్పవాడనియు, కావ్య దురంధరుడనియు తెలిస్తే చాలును. *ప్రతాపరుద్రీయము* నాటి ఆంధ్రుల ఔన్నత్యాన్ని అద్భుతంగా చిత్రించిన నాటకము. ఈ నాటకం మనలో ఆంధ్ర జాతీయాభిమానాన్ని స్ఫురింపజేస్తుంది. అందువల్లనే ఈ నాటకం జాతీయ నాటకంగా ప్రసిద్ధి చెందినది. దీనిని రచించిన వేంకటరాయశాస్త్రి తెలుగు జాతీయ కవిగా ప్రసిద్ధిగాంచారు."

(ప్రముఖ) ఆంధ్ర దేశ చరిత్రకారులు, ఆంధ్రప్రదేశ్ హిస్టరీ కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షులు) డా. నేలటూరు వేంకటరమణయ్య ప్రస్తావిస్తూ "బాల్యందు వినియుండిన చరిత్రను ఆధారం చేసికొని వేంకటరాయశాస్త్రి ఈ నాటకాన్ని రచించానని చెప్పుకొన్నారు. అయితే నాటక కథ అంతా వారిచే కల్పితమైనదని చెప్పక తప్పదు. (నాటకంలో ప్రతాపరుద్రుడు ఓరుగల్లును రాజధానిగా చేసికొని, తెలుగుదేశాన్ని పంపి, మోసంతో ప్రాతప రుద్రుని ఖైదుచేసి, ఢిల్లీకి తీసుకొనిపోయి కారాగారంలో బంధించాడు. ప్రతాపరుద్రుని మంత్రి యుగంధరుడు మారువేషంతో ఢిల్లీకి వెళ్ళి, పిచ్చివానివలె పురవీధులలో తిరుగుతూ, రాజనీతి చతురతతో ప్రతాపరుద్రుని ఢిల్లీనుండి ఓరుగల్లుకు తీసుకొనివచ్చి, తిరిగి సింహాసనముపై కూర్చుండబెట్టి, అతనితో ఢిల్లీ సుల్తానుకు మైత్రిని కుదిర్చి, తిరిగి సుల్తానును ఢిల్లీకి పంపించాడు. ఈ అల్ప కథయే శాస్త్రిగారు నిర్మించిన మాయాప్రపంచమునకు మూలము. ఇది నిజంగా జరిగిన చారిత్రక కథయని భ్రమ కలిగించుచున్నది. సుప్రసిద్ధ పరిశోధకులు కూడ నాటకమున వివరింపబడినట్లు ప్రతాపరుద్రుని జీవితకథ వాస్తవముగా జరిగినదని విశ్వసించి, దాని కథను ఋజువు చేయడానికిగల సాక్ష్యములను స్వీకరించి, దాని ఆధారంగా కొంత చర్చను నడుపుతూ వచ్చారు. కాని తరువాత పరిశోధనల వలన ప్రతాపరుద్రీయ నాటకం కథ అని చారిత్రక సత్యము కాదని తెలిసినది" అని వివరించారు.

చైనా భారత భూభాగంపై దండయాత్ర (1962) చేసినపుడు ప్రజలలో దేశభక్తిని, హిందూ మహమ్మదీయ ఐక్యతను పెంపొందించే నాటకాలను ఆలిండియా రేడియో ద్వారా అన్ని భాషలలో ప్రసారం చేయాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఉత్తర కోస్తా ఆంధ్రకు చెందిన కొందరు గురజాడ అప్పారావుగారి కన్యాశుల్క నాటకాన్ని ప్రదర్శిస్తే బావుంటుందని సూచించారు. (అదృష్టవశాత్తూ) ఆ సమయంలో పింగళి లక్ష్మీకాంతంగారు (స్టేషన్ డైరెక్టరు, ఆలిండియా రేడియో) కేంద్ర ప్రభుత్వానికి వేదం వేంకటరాయశాస్త్రి రచించిన *ప్రతాపరుద్రీయ* నాటకం హిందూ మహమ్మదీయ మైత్రిని ప్రబోధించే నాటకమని సూచించారు. ఆలిండియా రేడియోవారు ప్రతాపరుద్రీయ నాటకాన్ని 14 భాషలలోనికి అనువదించి ప్రసారం చేశారు. ఇది ఆంధ్రులు గర్వించదగిన విషయం (ఈ విధంగా వేదం వేంకటరాయశాస్త్రి దేశవ్యాప్తంగా పేరుగాంచారు).

'బొబ్బిలి యుద్ధం' నాటకం వేదంవారి స్వతంత్ర రచన అని చెప్పవచ్చును. ఒక బుర్రకథ ఆధారంగా దీనిని రచించారు. శాస్త్రిగారు ఈ నాటకాన్ని వాస్తవిక

వాతావరణంలో సమకాలీన జీవితాన్ని చిత్రించారు. డా. నేలటూరు వేంకటరమణయ్య మాటలలో చెప్పాలంటే, బొబ్బిలి యుద్ధం ప్రతాపరుద్రీయ నాటకంలాగా చారిత్రాత్మకమైనదే. అయితే దీనిలో కథాకల్పనలకు అంతగా అవకాశం ఇవ్వలేదు. ప్రతాపరుద్ర కథ జరిగింది 14వ శతాబ్దంలో. మన తెలుగువారు చరిత్ర రచనయందు విముఖులగుట వలన అప్పటి వృత్తాంతము మనకు చక్కగా తెలియదు. మహమ్మదీయ చరిత్రలయందు చెప్పినవానినే వాస్తవమని నమ్మి చరిత్ర రచనలను సాగించిన రోజులవి. హిందపూక్షము నుంచి ఒక్క చారిత్రాకాంశము కూడ అప్పటికి వెలుగులోకి రాలేదు. ఆ నాటికి ఇతిహాస సాహిత్యము ఉండినది. విద్యావంతులు వాటిని కట్టుకథలని నిరసించారు. వాఙ్మయం ఉండినది. కాని ఇది చారిత్రాత్మకము కాదని త్రోసిపుచ్చినారు. అందువల్ల వేంకటరాయశాస్త్రి ప్రతాపరుద్రీయ కథను తమ కల్పనా ప్రతిభతో ఇష్టం వచ్చినట్లు కూర్చుటకు అవకాశం ఉండినది. ఆ విధంగా కాకుండా బొబ్బిలి యుద్ధ నాటక కాలము నడిచినది 18వ శతాబ్దపు ఉత్తరభాగంలో. అప్పటికి చారిత్రక గ్రంథములు, సమకాలీన రచనలు అనేకం ఉన్నాయి. ఆంగ్లేయుల యొక్కయు, పోర్చుగీసు కంపెనీల యొక్కయు నివేదికలు, మహమ్మదీయ చరిత్రలు, కైఫీయతులు, బొబ్బిలియుద్ధం యొక్క కారణాలను, యుద్ధం నడిచిన విధానాన్ని, ఆ యుద్ధంలో ఉభయ పక్షాలలో పోరాడిన వీరులను, వారి చర్యలను గురించిన వర్ణనలు ఉన్నాయి. బొబ్బిలి యుద్ధం నాటకంలో శాస్త్రిగారి కల్పనకు అవకాశం లేకుండా పోయింది. అయినను ఈ నాటకంలో కొన్ని నూతన సన్నివేశములకు అవకాశం ఉండినది. బొబ్బిలి కథలో వెంగళరావు పెళ్ళి ప్రస్తావనము ఉన్నది. కాని శాస్త్రిగారు దీనిని యాభై పెళ్ళిళ్ళు జరిగినట్లుగా వర్ణించారు. బొబ్బిలియుద్ధం విషాదాంత నాటకంగా నిలిచిపోయింది. (యుద్ధమును గురించి క్లుప్తంగా రాబర్ట్ ఆర్మ్ తన East India Contamy వారి యుద్ధముల చరిత్రలో వ్రాసియున్నాడు). నాటకములు మంగళాంతముగా ఉండాలనే భరతనాట్య శాస్త్ర మర్యాదను ఉల్లంఘించకుండా ఉండడానికోసం, శాస్త్రిగారు దశమాంకమును వ్రాసి, బొబ్బిలియుద్ధ నాటకానికి అతికించారు (కాని పరిశీలించి చూచినట్లయితే, నాటకంలో దశమాంకానికి తావులేదు. నాటకం యుద్ధప్రదర్శనతో సమాప్తమయినది. నాటకం యొక్క నడక కూడ అంతటితో నిలిచిపోయినది. అందువలన దశమాంకము బొబ్బిలియుద్ధ నాటకంలో చేరదు). అది ఒక ప్రత్యేక నాటకం కావచ్చును. కాబట్టి బొబ్బిలియుద్ధ నాటకం విషాదాంత నాటకం అనడంలో సంశయించవలసిన అవసరంలేదు. బొబ్బిలివారు తమ పైకి వస్తున్న అపాయమును గురించి ఊహించక పెళ్ళిసందడిలో ఉండగా, శత్రువులు దొంగదారుల వెంబడి వచ్చి కోటను ముట్టడించి, తమను తాము రక్షించుకొనే ప్రయత్నాలను చేసికొనడానికి కూడా అవకాశం ఇవ్వకుండా వారిని చంపడం ప్రారంభించినారు. తమ అసహాయతను, శత్రువుల బలమును గురించిన విషయాలు రంగారావు వాక్యముల ద్వారా మనసును కలవరపెడుతున్నాయి. ఇటువంటిదే గుండెలను చీల్చే సన్నివేశం మరొకటి ఉంది. అదే బొబ్బిలికోట నేలకూలడం. కోటలో ఉన్న చాలామంది ప్రజలు మరణించారు. ఇటువంటి విషాద సమయంలో విజయం పొందిన శత్రురాజునకు ఆ పట్టణంలో అభిషేకం జరగాలి. అందుకోసం కోటలోని శవాలను తొలగించి స్థలాన్ని శుభ్రపరచమని వెట్టివారిని ఆజ్ఞాపించడం జరిగింది. తమ పక్షంవారు మరణించడంతో వెట్టివారికి జీవితంపై విరక్తి కలిగినది. బొబ్బిలిలోని ఈ స్థలాన్ని చూచినట్లయితే, షేక్స్పియర్ వ్రాసిన 'హ్యామ్లెట్' నాటకంలోని 'గ్రేవ్ డిగ్గర్స్ సీను'ను గుర్తుకు తెచ్చే విధంగా ఉంది. ఇట్టి సన్నివేశాలను నాటకంలో ఇంకనూ చూపవచ్చును. కాని శాస్త్రిగారు బొబ్బిలికథ నిర్మాణంలో తన కౌశలాన్ని, అపూర్వ శిల్ప చాతుర్యాన్ని ప్రదర్శించిన తీరు వారి ప్రతిభాపాటవాలను, అపూర్వమైన వారి నాటక రచనా పటిమను తెలియచేస్తున్నాయి.

**వేంకటరాయశాస్త్రిగారి విద్వత్‌గోష్ఠులు :**

వేంకటరాయశాస్త్రిగారి గోష్ఠులు విజ్ఞాన వినోదములతో కూడినట్టివి. అభిజ్ఞాన శాకుంతల నాటకాన్ని గురించిన గోష్ఠిలో వారి ధోరణిని గమనించినట్లయితే, వారి కావ్యరస పిపాస, శాకుంతల నాటకాభిమానం తెలుస్తుంది. ప్రతాపరుద్రీయ నాటక గోష్ఠిలో ప్రస్తావిస్తూ "యుగంధరుడు వెర్రివాని వేషంలో ఢిల్లీ సుల్తాన్ పట్టుకుపోతాన్! అని పాడుతూ యుక్తితో రాజును విడిపించి, సుల్తానును బంధించిన ఘట్టాన్ని తాను బాల్యంలోనే విన్నానని, ఈ పాట చరణం ఆ కాలంలో బాగా వ్యాప్తిలో ఉన్నదని, ఈ జనశృతిని ఆధారం చేసుకొని, నాటక కథావస్తువును అల్లుకొంటినేగాని, చారిత్రక పరిశోధనలు చేయలేదని అన్నారు. (కాని చరిత్ర పరిశోధకులు కొందరు

విమర్శిస్తూ "శాస్త్రిగారు బుద్ధిపూర్వకంగానే చారిత్రక అంశములను తారుమారు చేశారని" అన్నారు. దానికి వేంకటరాయశాస్త్రిగారు స్పందిస్తూ "ఈ విమర్శ ఎంతవరకు సమంజసమో చదువరులు నిర్ణయించగలర"ని సమాధానం ఇచ్చారు. ఈ నాటకాన్ని గురించి శాస్త్రిగారు విశదీకరిస్తూ "ప్రేక్షక సమూహములో ఎక్కువమంది మహమ్మదీయులు తెలుగువారు పేరిగాని, పిచ్చివాని వికృత హాస్యానికి బాగా నవ్వుచుండేవారేగాని, వస్త్వైక్యము, అంగాంగ తారతమ్యము, కల్పనా చమత్కృతి, నిర్మాణ సౌభాగ్యము, పాత్రౌచిత్య పోషణము, ప్రధాన రసము మొదలగువాటిని పరిశీలించి, దాని విలువను తెలిసికొనేవారని వ్రేళ్ళపై లెక్కపెట్టవచ్చున"ని చెప్పారు. మన జాతీయోద్యమమునకు అనుగుణంగా మహమ్మదీయ సోదరుల మనస్సు నొచ్చుకోకుండా ఢిల్లీసుల్తానుకు నాటకాంతమున హైందవ ప్రభువు వలన సత్కారమును, సగౌరవమగు వీడ్కోలును సమకూర్చి ఢిల్లీనాథుని బంధీ చేసితివి" అను పాఠమును, ఢిల్లీనాథుని మిత్రుని చేసినవి అని మార్చి హిందూ మహమ్మదీయ రాజుల మైత్రిని గురించి ఈ నాటకంలో వ్రాశానని శాస్త్రిగారు ఈ గోష్ఠిలు చెప్పారు.

బొబ్బిలియుద్ధ నాటకాన్ని గురించి ఒకానొక గోష్ఠిలో ప్రస్తావిస్తూ "బాల్యం నుంచి బొబ్బిలి కథను జంగమ దేవరలు పాడగా అనేక పర్యాయములు విని రసతన్మయుడనైతిని. ఈ నాటకం యొక్క ద్వితీయ ముద్రణ చేసే సందర్భంలో కొంత మార్పు చేయవలసి వచ్చినది. ఈ నాటకం ప్రథమ ముద్రణలో చెప్పినట్లు బొబ్బిలి విజయనగర సంస్థానమునకు లోబడినది కాదనియు, రంగరాయుడు విజయనగర రాజునకు పాలెగాడు కాదనియు, అతనితోపాటు స్వతంత్ర ప్రభువనియు, బొబ్బిలి నుంచి నాకు కబురు వచ్చింది. అందువల్ల బొబ్బిలి కథను మార్చి వ్రాయవలసి వచ్చినద"ని శాస్త్రిగారు చెప్పారు.

**వేంకటరాయశాస్త్రి గారి గోష్ఠులలో సామాజిక స్పృహ :**

శాస్త్రిగారి ఏకాంత గోష్ఠులలో కావ్యేతరమైన సామాన్య విషయములను గురించి ముచ్చటించేవారు. ఒక కాంగ్రెస్ ప్రచారకుడు శాస్త్రిగారిని "అస్పృశ్యతా నివారణోద్యమమును గురించి మీ అభిప్రాయమేమి?" అని ప్రశ్నించారు. ఆ కాలానికి "హరిజన నామకరణం" ఇంకా జరిగి ఉండలేదు. (అంటే అప్పటికి గాంధీయుగం ప్రారంభం కాలేదు). అందుకు శాస్త్రిగారు సమాధానం ఇస్తూ "అస్పృశ్యతకు మూలకారణం మానవ ప్రకృతియందే కనబడుచున్నది. (నేను ఇతరులకంటే హెచ్చుగా ఉండవలెనను దురహంకారమువల్లనే ఇది జరుగుచున్నది. ఈ అహంభావమే అన్ని అనర్థాలకు మూలము. ఇదే మానవ సౌభ్రాత్రమునకు వేరు పురుగు వంటిది. దీనినే అస్పృశ్యము అంటారు). ఇది అందరిలో కొద్దిగానో, ఎక్కువగానో ఉంటుంది. అందువల్ల ప్రతి ఒక్కరు ఆత్మపరీక్ష చేసుకొని ఈ దురహంకార రూపమైన అస్పృశ్యతను రూపుమాపి, సర్వసమత్వాన్ని అలవరచుకొన్నట్లయితే అస్పృశ్యతను నివారించవచ్చున"ని అన్నారు.

ఒకానొక గోష్ఠిలో మలబారు నందలి కన్యావిక్రయ దురాబారమును గురించి చర్చించే సమయంలో శాస్త్రిగారిని గుఱ్ఱం సుబ్బరామయ్య అనే ఆంగ్లోపన్యాసకులు ప్రశ్నిస్తూ "మీరు సంఘసంస్కరణకు తీవ్ర ప్రతికూలురనియు, శుద్ధ సనాతనులనియు ఒక వదంతి ఉన్నది. ఇది నిజమేనా?" అని అడిగారు. శాస్త్రిగారు దీనికి సమాధానం ఇస్తూ "ఈ వదంతి సరియైనది కాదు. సంఘసంస్కరణ వేషధారులు, నాస్తికులు కొద్దిమంది మాత్రమే ఉన్నారు. ధర్మశాస్త్రములకు ప్రకరణ విరుద్ధములగు అపార్థములు కల్పించి, లోకులను మోసగించుట చూచి సహింపలేక సాధువాదమును సమకూర్చుటకు నేను వారితో ఢీకొంటినేగాని ఆ శాస్త్రములు శిలాశాసనం మాదిరిగా ఎప్పుడూ ఒకేతీరున చెప్పబడాలని అనుకోవడంలేదు. నేను సంస్కరణలకు విముఖుడనుకాను. ఈ కాలపు పరిస్థితులను అనుసరించి మన సంఘంలో అనేక మార్పులు అవసరమని అంగీకరించెదను). కాని ఎవరికి వారే యమునాతీరే అను అరాచకమునకు నేను సమ్మతింపను. మన సంఘం బాగుపడాలంటే ఒక ఆస్తిక జన పరిషత్తును స్థాపించవలసిన అవసరం ఉంది. దీనిలో హిందూమతంపై నమ్మకం కలిగిన శ్రద్ధావంతులు. ధర్మశాస్త్ర పారంగతులగు పండితులు, స్వార్థం లేని మహనీయులు సభ్యులుగా ఉండవలెను. ఈ పరిషత్తు వారు సాంఘిక దోషములను సమగ్రంగా చర్చించి, ఆర్యధర్మముల మూలసూత్రములకు విరోధము కాని విధంగా నవరింపవలెను. వారి అనుశాసనములకు హైందవ సంఘమంతా బద్ధులు కావలెను. ఇది నా నిశ్చితమైన అభిప్రాయం. ఇటువంటి పరిషత్తును ఏర్పాటు చేయడానికి సజ్జనులు ఎవరైనా ఉద్యమం చేపట్టినట్లయితే, వారికి నా చేతనైన సహాయం చేస్తాన"ని శాస్త్రిగారు చెప్పారు.

సాంఘిక సంస్కరణల విషయంలో వేదం వేంకటరాయ శాస్త్రికి, ఆనాటి సంఘసంస్కర్త కందుకూరి వీరేశలింగం పంతులికి విభేదం వచ్చింది. వేదం వేంకటరాయశాస్త్రి 1883 వ సంవత్సరంలో వీరేశలింగం గారి స్త్రీ పునర్వివాహ వాదమును ఖండించుచూ 'స్త్రీ పునర్వివాహ దుర్వాద నిర్వాపణము' అను గ్రంథాన్ని రచించారు. వీరేశలింగం పంతులు అనేక స్మృతుల నుండి యథేచ్ఛముగ శ్లోకములను తీసుకొని, వానికి వ్యాఖ్యానం వ్రాసి స్త్రీ పునర్వివాహము శాస్త్రసమ్మతమని వాదించుచుండినారు. వేదం వేంకటరాయ శాస్త్రి ఆ వాదములోని దోషములను, లోపములను శాస్త్రజ్ఞానముతో ఖండించి, స్త్రీకి పునర్వివాహము ఉండదని సప్రమాణంగా ఆ గ్రంథంలో వివరించారు.

ఆ తరువాతి కాలంలో శాస్త్రిగారి మిత్రులు కొంతమంది వారిని ఈ విధంగా ప్రశ్నించారు. "అయ్యా! మీరు నిజముగా స్త్రీ పునర్వివాహమునకు వ్యతిరేకులా?" శాస్త్రిగారు వారికి సమాధానం ఇస్తూ ("నేడు బ్రాహ్మణ కుటుంబములతో విధవలకు, వారు బాలవిధవలైనను, వయోవిధవలైనను మళ్ళీ వివాహం చేసే ఆలోచనలేదు. కాని ఈ ఆచారములు కాలమునుబట్టి ఏర్పడుతాయి). వివాహ ధర్మములు జాతి ప్రాచీన కాలం నుంచీ కొద్దికొద్దిగా మారుతూనే వచ్చాయి. ఈ మార్పులు సాంఘిక పరిస్థితులను బట్టి వచ్చుచుండినాయి. కాలక్రమంలో భవిష్యత్తులో విధవా వివాహములు పరిపాటి కావచ్చున''ని చెప్పారు. కాని వీరేశలింగం పంతులు చూపిన ప్రమాణములు దుష్టములని, కలుషితములని నిరూపించడానికే ప్రయత్నించాను తప్ప, సంస్కరణలకు నేను ఏమాత్రం వ్యతిరేకం కాను. మారుతున్న కాలాన్నిబట్టి సంఘంలో మార్పులు రావడానికి నేను అంగీకరిస్తాన"ని వేదం వేంకటరాయశాస్రిత గారు సంఘసంస్కరణల విషయంలో తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పారు.

శాస్త్రిగారికి చారిత్రక స్పృహ ఉన్నది అనడానికి వారు వ్యాఖ్య చేసిన 'ఆముక్తమాల్యదా సంజీనీ గ్రంథము' ఆధారము. ఈ గ్రంథం శాస్త్రిగారికి అభిమాన పాత్రమైన ప్రబంధము.

"ఆముక్తమాల్యద ప్రచురణ నాటికి లేఖక, ముద్రాసకుల దోషములు జొరబడుటచే ఆ గ్రంథము చదువరులకు కష్టమైనది. అలాంటి స్థితిలో ఈ గ్రంథము అగ్రాహ్యము, గహనము అనే అపనిందలకు గురియైనది. ఇందులకు భిన్నుడనై ఎంత కష్టమునకైనను ఓర్చి, సాధుపాఠమును తయారుచేసి, విపుల వ్యాఖ్యాన సంగీతముగా ప్రకటింప నిశ్చయించుకొంటిని. అది జీర్ణదేవాలయ పునరుద్ధరణ వంటి పుణ్యకారము" అని తలచితినని శాస్త్రిగారన్నారు.

ఒకానొక గోష్ఠిలో "ఏక మతములో విభిన్న శాఖలు వాని తారతమ్యమూ అనే విషయం చర్చకు రాగా శాస్త్రిగారు ఈ విధంగా అన్నారు : "హైందవ, బౌద్ధ, మహమ్మదీయ మతములు ప్రఖ్యాతి చెందిన మతములు. అద్వైత, విశిష్టాద్వైత, ద్వైత మత భేదములన్నియు మనకు సమానమే. మతప్రవక్తలంతా పామరుల దృష్టిలో హిమాలయ పర్యంతమంత ఎత్తైనవారే. వారిలో ఎక్కువ తక్కువలను కొలత పెట్టడానికి ఎవరికి తగుతుంది? కాని మతములన్నీ మన ఊహలే. సత్యం ఇందే గలదు, అందులేదు అని ఎవరు నిర్ధారింపగలరు? బుద్ధిసూక్ష్మత ఉన్నట్లయితే ఎటువంటి మతమునైనా ఆక్షేపించవచ్చును. ఎవరికి వారు స్వానుభవంతో ప్రత్యక్షంగా తెలిసికొనవలసిందే. అందువల్ల ఈ మతములన్నీ ఊహామాత్రములే. వీనిలో సత్యాసత్యములను నిర్ణయించుట సామాన్య మానవ బుద్ధికి అందని పని. మనోవ్యాపారము నధిగమించిన ఆత్మానుభవమే అందులకు ప్రమాణము" అని శాస్త్రిగారు అన్నారు.)

వేంకటరాయశాస్త్రి గారికి 'అభినవ మల్లినాథ' అనే బిరుదు ఉన్నది. 1920లో ఆంధ్ర మహాసభ వారు 'మహోపాధ్యాయ' బిరుదును ఇచ్చి సత్కరించారు. కట్టమంచి రామలింగారెడ్డి ఆంధ్ర విశ్వవిద్యాలయ కులపతిగా ఉన్నప్పుడు శాస్త్రిగారికి ప్రప్రథమంగా 'కళాప్రపూర్ణ' బిరుదును ఇచ్చి సత్కరించారు. ఆ సందర్భంలో కృష్ణాపత్రిక సంపాదకులు ముట్నూరు కృష్ణారావు ప్రశంసిస్తూ "అట్టి మహాపండితునకు కళాప్రపూర్ణ బిరుదు ప్రదానమువలన ఆ పండితునికన్న, బిరుదమునకే రౌరవము అతిశయించిందని" అన్నారు.

వేంకటరాయశాస్త్రి గారు జూన్ 18, 1929వ సంవత్సరములో స్వర్గస్థులైనారు. సింహపురి కీర్తిపతాకాన్ని ఆంధ్ర దేశమంతా ఎగురవేసిన శాస్త్రిగారు అభినందనీయులు. వారి సారస్వత సేవ చిరస్థాయిగా నిలిచిపోతుంది.

డా. జి. వెంకటేశ్వరరావు
పొగతోట, నెల్లూరు.
ఫోన్ : 949 145 7496

# అలెగ్జాండ్రియా గ్రంథాలయం

– గబ్బిట కృష్ణమోహన్

ప్రపంచ ప్రఖ్యాత అమెరికన్ ఖగోళ శాస్త్రజ్ఞుడు కార్ల్ సెగాన్ (1934–1996) పాపులర్ సైన్సు రచయితగా కూడా ప్రసిద్ధుడు. సైన్సుకి సంబంధించి ఎన్నో పుస్తకాలు రాశాడు. వాటిల్లో కాస్మాస్ (1980) అన్నది అయిదేళ్ళలో 50 లక్షల కాపీలకి పైగా అమ్ముడయింది. దాని ఆధారంగా తీసిన డాక్యుమెంటరీ డిస్కవరీ ఛానెల్లో బహుళ ప్రజాదరణ పొందింది.

భారత దేశానికి చెందిన ప్రాచీన గణిత శాస్త్రజ్ఞులు ప్రపంచానికి 0 (జీరో, సున్నా) యివ్వడమే కాదు, అరబిక్ అంకెలుగా ఆంగ్లేయులు చెలామణి చేసిన (మనకి కూడా అలానే నేర్పారు!) మిగతా అంకెలు కూడా భారత దేశంలో సశాస్త్రీయంగా, ఎంతో మేధస్సుని ఉపయోగించి రూపొందించారని, మన దేశం నుండి వర్తకం ద్వారా అరబ్బులు, వారి నుంచి ఆంగ్లేయులకి చేరి వాటికా పేరు వచ్చిందని వేరే సందర్భంలో ప్రపంచానికి తెలిపాడు. ఎన్నో శతాబ్దాల కిందట భారతదేశపు గణితజ్ఞులు రూపొందించిన అంకెలు ఈవిధంగా వున్నాయట:

1 2 3 4 5 6 7 8 9 0

ఒకటైన అంకెలో వున్న కోణాల మొత్తమే ఆ సంఖ్య విలువ అని శోధించి ప్రపంచానికి చాటాడాయన. ఇప్పటికీ మనం వాడుతున్న అంకెల రూపం దాదాపు యిదేకదా! సున్నాతోపాటు ఇవి కూడా మన వారసత్వమేనని గర్విద్దాం!

* * *

ఈజిప్టులోని అలెగ్జాండ్రియా నగరంలో క్రీస్తు శకానికి ముందు దాదాపు మూడు వందల సంవత్సరాల (300 బి.సి.ఇ. – బిఫోర్ క్రిస్టియన్ ఇరా – అను) నుంచి ఆరు వందల ఏళ్ళబాటు చెప్పదగిన పరిణామం – మానవజాతి తన మేధస్సును వుపయోగిస్తూ ఆరంభించిన సాహస యాత్ర. అది మనలనిప్పుడు విశ్వపు తీరాలని చేరువ చేసింది. మహత్తరమైన పాలరాతి కట్టడాలతో పరిఢవిల్లిన ఆ నగరపు రూపురేఖలు, శోభ మనకు ఏమాత్రం మిగలకపోవడం కడు శోచనీయం. విషయ పరిజ్ఞానాన్ని వ్యతిరేకించిన శక్తులవల్ల, అణచివేతల మూలాన ప్రాచీన అలెగ్జాండ్రియా నగరం రూపు లేకుండా పోయింది. ఆ నగరం మహర్దశలో వున్నంతకాలం అక్కడి ప్రజలు నానాజాతుల సమూహం అనేది అబ్బురపరిచే విశేషం. మెసిడోనియా నుంచి, ఆ తరవాత రోము నుంచి వచ్చి చేరిన సైనికులు, ఈజిప్టుకి చెందిన మతాధిపతులు, గ్రీకు దేశానికి చెందిన ధనిక వర్గం, ఫినీసియాకి చెందిన నావిక బృందాలు, యూదు వర్తకులు, భారత దేశంతోపాటు లోతట్టు సహారా నుంచి వచ్చి చేరిన పర్యాటకులు – ఒక్క బానిస జాతి తప్ప అంతా – ఎంతో సామరస్యపూర్వకంగా, పరస్పర గౌరవంతో కలిసి మెలిసి జీవించారు.

ఆ నగరానికి పునాది వేసినది అలెగ్జాండరయితే – నిర్మించినవాడు అతని మునపటి అంగరక్షకుడు. విదేశీయులకు చెందిన విలక్షణ సంస్కృతులపట్ల గౌరవం చూపడమేకాక, జ్ఞాన సముపార్జనని నిష్కల్మషమైన మనసుతో అలెగ్జాండర్ ప్రోత్సహించాడు. ప్రపంచంలో మొట్టమొదటగా నిర్మించిన డైవింగ్ బెల్ సహాయంతో నిజంగా ఎర్రసముద్రం అడుగుకి చేరాడన్నది సాంప్రదాయకంగా చెప్పుకుంటూ వస్తున్న వుదంతం.

పర్షియా, భారత దేశపు మహిళల్ని వివాహమాడమని తన సైనికుల్ని ప్రోత్సహించాడు. అన్ని జాతుల దేవుళ్ళని గౌరవించాడు, చిత్రవిచిత్ర జంతుజాలాల్ని – తన గురువు, అరిస్టాటిల్ కోసమని ఒక ఏనుగుతోసహా – సేకరించాడు. వాణిజ్యానికి, సంస్కృతికి, విషయ పరిజ్ఞానానికి – ప్రపంచానికి కేంద్రంగా వుండేలా తన నగరాన్ని బృహత్తర శైలిలో రూపొందించాడు. 30 మీటర్ల వెడల్పు బాటలతో,

రమ్యమైన భవన నిర్మాణంతో, శిల్పాలతో, అలెగ్జాండరుకి స్మారక చిహ్నంగా వున్న అతని సమాధితో, ప్రాచీన కాలపు ఏడు వింతల్లో ఒకటైన అతి పెద్ద దీపస్తంభం (లైట్ హౌస్) అయిన ఫారోస్‌తో ఆ నగరం విరాజిల్లింది.

అయితే అలెగ్జాండ్రియా నగరానికి మకుటాయమానం అక్కడి గ్రంథాలయం, దానికి అనుబంధంగా వున్న మ్యూజియం.

ప్రపంచ ప్రఖ్యాతమైన ఆ గ్రంథాలయంలో యిప్పుడు మిగిలి వున్నవి – కేవలం చెమ్మతో కూడిన నేలమాళిగతోపాటు గ్రంథాలయానికున్న అనుబంధ నిర్మాణం. ఒకప్పుడు

దేవాలయంగా వున్నదాన్ని తరవాత కాలంలో జ్ఞాన సముపార్జనకి అంకితం చేశారు. ధూళితో క్షీణదశలో వున్న కొన్ని అరలే భౌతికంగా నిలబడ్డ శిధిలాలు. అయినా ఆ గ్రంథాలయం – ఒకప్పుడు ప్రపంచంలోనే గొప్పగా పరిగణించబడిన నగరపు యశస్సుకి, మేధోసంపత్తికి ఆలవాలంగా వుండి ప్రపంచ చరిత్రలో మొట్టమొదటి పరిశోధనా సంస్థగా నిలిచింది. అక్కడి విద్వద్వరేణ్యులు సంపూర్ణ విశ్వాన్ని (కాస్మాస్‌ని) ఒక క్రమమైన రీతిలో అధ్యయనం చేశారు. కాస్మాస్ అన్న గ్రీకు పదానికి అర్థం – orderliness (సువ్యవస్థితం). ఒక విధంగా చూస్తే కేయాస్ (గజిబిజి, గందరగోళం – అను) అన్నదానికి వ్యతిరేక పదం. సృష్టిలో వున్న పదార్థాల ప్రగాఢ అనుసంధానం అన్నది సూచిస్తుందది. చాలా తికమక పెడుతూ, గ్రహించడానికి సులభ సాధ్యం కాని, సంభ్రమం కొలుపుతుండే విశ్వపు అనుసంధాన విధానాన్ని తెలుపుతుందా పదం. అక్కడి విద్వాంసుల బృందం – భౌతిక శాస్త్రం, సాహిత్యం, వైద్యశాస్త్రం, ఖగోళ శాస్త్రం, భూగోళ శాస్త్రం, తత్వశాస్త్రం, గణితం, జీవశాస్త్రం, యంత్రశాస్త్రం (ఇంజినీరింగ్) విభాగాల్లో అవగాహన పెంచుకున్నారు. విజ్ఞాన శాస్త్రమూ, విద్వత్తూ కౌమార దశకు చేరాయి. ప్రతిభ పరిఢవిల్లింది. ప్రపంచంలోని వివిధ దేశాల మేధోసంపత్తిని చింతనాత్మకంగా, క్రమబద్ధంగా పోగుచేయడం జరిగింది కూడా అలెగ్జాండ్రియా లైబ్రరీలోనే.

- **ఎరటోస్తనీస్**తోపాటు **హిప్పార్కస్** అనే ఖగోళ శాస్త్రజ్ఞుడు నక్షత్ర రాశుల (తారాగణం) పటాలు గీసి వివిధ నక్షత్రాల తేజస్సు (బ్రైట్‌నెస్)ను అంచనా కట్టాడు;
- క్షేత్రగణితాన్ని (జామెట్రి) అద్భుతమైన ప్రజ్ఞతో **యూక్లిడ్** క్రమబద్ధం చేయడమేకాక, గణితంలో ఒక మహా చిక్కు సమస్యతో సతమతమవుతున్న రాజుగారితో, "జామెట్రీలో రాజమార్గం లేదు ప్రభూ," అన్నాడట;
- భాషాభాగాలని (పార్ట్స్ ఆఫ్ స్పీచ్) నిర్వచించి, జామెట్రీకి యూక్లిడ్ చేసిన సేవకి సమానంగా, భాషాధ్యయనానికి థ్రేస్‌కి చెందిన **డైనోసియస్** తోడ్పడ్డాడు;
- మనిషి తెలివితేటలకి పీఠం మనసు కాదు – మెదడు – అని **హెరోఫిలస్** అనే శారీరక విజ్ఞాన శాస్త్రజ్ఞుడు (ఫిజియాలజిస్ట్) యిక్కడే స్పష్టీకరించింది;
- అలెగ్జాండ్రియాకి చెందిన **హెలోన్** గేర్ల శ్రేణులని, ఆవిరి యంత్రాలని కనుక్కుని, మానవాకారపు స్వయంచాలిత యంత్రాల (robots) గురించిన మొట్టమొదటి గ్రంథం – **ఆటోమేటా** – రచించాడు;
- శంకువు విభాగాలైన (conic sections) దీర్ఘవృత్తం (కోడిగుడ్డు ఆకారం), పరావలయం, అతిపరావలయాలు (ఎలిప్స్, పెరాబొలా, హైపర్‌బొలా) – వక్రరేఖలు (curves) అని పైగాకి చెందిన **అపోలోనియస్** ప్రకటించాడు, అవి గ్రహాలు, నక్షత్రాలు, తోకచుక్కల భ్రమణరేఖలని మనకిప్పుడు అవగతం;
- లియొనార్డో డవిన్చి (Leonardo da Vinci)కి ముందు యంత్రశాస్త్రంలో మహా మేధావిగా **అర్కిమిడిస్** వినుతికెక్కాడు;
- ఖగోళ శాస్త్రంతోపాటు భౌగోళిక శాస్త్రజ్ఞుడిగా వినుతికెక్కిన **టోలెమి** అక్కడివాడే. ఇప్పుడు శాస్త్రీయం కాదనుకుంటున్న జ్యోతిశ్శాస్త్రం (యాస్ట్రాలజి)లో విశ్వానికి కేంద్రం భూమేనన్న అతని ప్రతిపాదన 1500 వందల సంవత్సరాలపాటు ఆధిపత్యం వహించి, భయంకర తప్పిదానికి మేధో సంపత్తి పూచీ కాదని హెచ్చరిస్తుంది.

ఇంతటి మహావ్యూహల మధ్య గణిత, ఖగోళ శాస్త్రాల్లో నిష్ణాతురాలిగా పరిగణింపబడే **హైపాషియా** అనే మహిళ కూడా వుండటం విశేషం. ఆ గ్రంథాలయానికి ఆఖరి జ్యోతిగా వెలుగొందిన హైపాషియా బలిదానం – ఏడు వందల సంవత్సరాల కిందట ఆరంభమైన ఆ గ్రంథాలయపు వినాశనానికి దారి తీసి ముగించింది.

అలెగ్జాండరు తరవాత వచ్చిన ఈజిప్టు రాజులు విషయ పరిజ్ఞానాన్ని గాఢంగా విశ్వసించారు. ఆ గ్రంథాలయంలో పరిశోధనల కోసం శతాబ్దాల తరబడి ఆయా కాలపు గొప్ప గొప్ప మేధావులకి చక్కటి వాతావరణం కలగచేశారు. ప్రతి విషయానికి ప్రత్యేకించిన విశాలమైన చావడులు (halls); జలయంత్రాలు (fountains), వరుస స్తంభాలు (colonnades); వృక్ష సంపద; జంతుప్రదర్శనశాల;

జంతువుల్ని, మొక్కల్ని అంగాంగాలు కోసి పరీక్షించేందుకు వసతి వున్న గదులు; వేధశాల (అబ్జర్వేటరి);

వుత్పన్నమయ్యే ఆలోచనల్ని తీరికగా కూచుని లోతుగా చర్చించేందుకు అనువుగా విశాలమైన భోజన శాల.

ఆ గ్రంథాలయపు ఆత్మ - గ్రంథ సేకరణ. దాని సంచాలకులు ప్రపంచంలో వున్న అన్ని సంస్కృతుల్ని, భాషల్ని నిశితంగా పరిశీలించారు. తమ ప్రతినిధుల్ని దేశదేశాలకు పంపించి గ్రంథాలయాల్నే కొనుక్కు తెచ్చుకున్నారు. వర్తకానికి అలెగ్జాండ్రియా రేవులో ఆగిన పడవల్ని రక్షకభటులు నిషిద్ధ వస్తువుల కోసం కాక పుస్తకాల కోసం శోధించేవారు. ప్యాపిరస్ కాగితాల మీద రాసిన గ్రంధాల చుట్టల్ని (స్క్రోల్స్) అరువుగా తీసుకుని, నకళ్ళు రాయించి, ఆయా యజమానులకు తిరిగి యిచ్చేసేవారు.

అలాంటి గ్రంథాలయంలో మొత్తం ఎన్ని పుస్తకాలుండేవో నిక్కచ్చిగా చెప్పడం కష్టమే అయినా సుమారు కొన్ని వేలకు పైబడి అని అంచనా వేయవచ్చు. ప్రతి ఒక్కటీ ప్యాపిరస్ కాగితాల మీద రాసిన చుట్టలే. ఆ గ్రంథాలన్నీ ఏమైపోయాయి? వాటిని సృష్టించిన ఆ ప్రాచీన నాగరికత పతనమైంది, దానితోపాటు ఉద్దేశ్యపూర్వకంగా ఆ గ్రంథాలయాన్ని విధ్వంసం చేశారు (మతఛాందసులు - అను). వాటిల్లో విషాదంగా మిగిలిన కొన్ని కాగితపు తునకలు మినహాయించి అతి స్వల్పభాగం కాలానికి నిలబడింది. ఆ తునకలు, ముక్కలు ఎంత సమ్మోహన పరుస్తాయని! ఉదాహరణకి ఆ గ్రంథాలయం అరల్లో - భూమి కూడా గ్రహమేనని, తక్కిన గ్రహాలలాగా సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తుందని, ఆకాశంలో మనకు దగ్గర దగ్గరగా కనిపించే నక్షత్రాలు నిజానికి బహుదూరంలో వుంటాయని సమోస్‌వాడైన అరిస్టార్కస్ వాదించిన గ్రంథం కూడా వుండేదని ఇప్పుడు మనకు వ్యక్తమైంది. అతను నిరూపించి తెలిపినవన్నీ యదార్థాలు. అయితే వాటిని మరోసారి కనుక్కొని నిరూపించడానికి దాదాపు రెండు వేల సంత్సరాలు పట్టింది. **అరిస్టార్కస్** ఎంతో కృషి చేసి రాసిన గ్రంథం మనకు దక్కకపోవడాన్ని లక్ష రెట్లు గుణిస్తే - ప్రాచీన నాగరికత సాధనలు మహా గొప్పవని, దాని వినాశనం చాలా విషాదమని సమగ్రంగా అర్థం చేసుకోడానికి ప్రయత్నించవచ్చు.

ఆ కాలపు శాస్త్రవిజ్ఞానాన్ని మనం ఇప్పుడు ఎన్నో రెట్లు అధిగమించాం. అయితే మన చరిత్రలో సరిదిద్దడానికి శక్యం కాని లోట్లు వున్నాయి. అలెగ్జాండ్రియా లైబ్రరీ సభ్యత్వ కార్డు తీసుకుని మన గతం గురించి వున్న చిక్కుముడులు తెలుసుకుంటే ఎంత బాగుంటుందోనని వూహించుకుందాం. బాబిలోనియాకి చెందిన మతాచార్యుడు, **బెరోసస్**, మూడు సంపుటాల్లో ప్రపంచ చరిత్ర రాశాడని మనకిప్పుడు తెలుసు, అది కూడా ధ్వంసం అయింది. అందులో మన పూర్వీకుల గురించి ఏమేమి రాసున్నదోగదా?

* * *

## అలెగ్జాండ్రియా - తుది మాట

- ఎన్నార్కె

కొన్ని ముఖ్యమైన వ్యాసాలకు ఇంట్రో వ్రాసి వ్యాసం ముందు ప్రచురించటం ***మిసిమి*** ప్రత్యేకత.

గబ్బిట కృష్ణమోహన్‌గారు కార్ల్‌సెగాన్ వ్రాసిన వ్యాసానికి చేసిన అనువాదం సులభ శైలిలో గ్రాహ్యంగా ఉంది. అయితే కార్ల్‌సెగాన్ వ్రాసిన మూల వ్యాసంలో కొన్నిచోట్ల సంక్షిప్తత చోటుచేసుకుంది. వీటికి కొంత చారిత్రక సింహావలోకనం అవసరం. అందుకే ఈ తుది మాట.

గ్రీసు దేశానికి ఉత్తర భాగంలో ఉన్న రాజ్యం మేసడోనియా. ఫిలిప్స్ దీనికి రాజు. 356 బి.సి.లో పుట్టిన అలెగ్జాండర్ అతని కుమారుడే. తరువాత కాలంలో గ్రీసు దేశంలోని ఏథెన్స్‌ను జయించి, మేసిడోనియాను గ్రీసు రాజ్యంతో కలిపి గ్రీకువీరునిగా ప్రసిద్ధిగాంచాడు. ప్రపంచ విజేత కావాలన్న కోరికతో మొదట గ్రీసు, తరువాత ఈజిప్ట్, ప్రష్యాల నుంచి పశ్చిమ భారతదేశం వరకు (ఇప్పటి పాకిస్థాన్) తన విజయయాత్ర కొనసాగించాడు.

అలెగ్జాండర్, ఆ కాలంలో గొప్ప మేధావిగా పరిగణించబడుతున్న అరిస్టాటిల్ వద్ద 11 సంవత్సరాల నుంచి 16 సంవత్సరాల వయసు వరకూ విద్యనభ్యసించి, సంగీత, సాహిత్య, చిత్రకళ, శిల్పకళ, నృత్యాలను ఎక్కువగా ప్రేమించాడు.

అరిస్టాటిల్ గురువైన ప్లాటో భావవాది. జ్ఞానానికి కేంద్రం మనసు అన్నది అతని సిద్ధాంతం. దీనికి భిన్నమైన ఆలోచనాస్రవంతి అరిస్టాటిల్‌ది. జ్ఞానేంద్రియాలు ద్వారా మాత్రమే జ్ఞానం వస్తుందని, మెదడు దానికి కేంద్రమని భావించిన వాస్తవవాది అరిస్టాటిల్. అలెగ్జాండర్‌పై గురువు ప్రభావం ఎక్కువగా ఉంది. పునర్జన్మ లేదని గట్టిగా నమ్మిన అలెగ్జాండర్ తాను మరణించిన తరువాత తన పేరు ఈ భూమిమీద శాశ్వతంగా ఉండాలనే కాంక్షతో ఒక ఉన్నత నగరాన్ని తన పేరుమీదుగా నిర్మించాలని, అది సాహిత్యానికి,



Alexandria Bibliotheca - 2002 A.D.

లలిత కళలకు ప్రపంచవ్యాప్తంగా పేరువెూయాలని భావించాడు. తన విజయయాత్రలో భాగంగా ఈజిప్ట్ వచ్చినపుడు ఓడల రేవుగా నైలు నది ఒడ్డున ఉన్న ఒక ఊరు అతన్ని ఆకర్షించింది. దానికి అలెగ్జాండ్రియా అన్న పేరు పెట్టి, ముందుకు సాగాడు. పది సంవత్సరాల అనంతరం చేసిన తిరుగు ప్రయాణంలో అలెగ్జాండ్రియా చేరకుండానే బాబిలోనియాలో తన 33వ ఏట మరణించాడు.

అలెగ్జాండర్ మరణానంతరం, అతని వద్ద పనిచేసిన నలుగురు గ్రీకు సైన్యాధ్యక్షులు అతను గెలిచిన రాజ్యాలను పంచుకున్నారు. గ్రీకు వీరుడైన సెల్యూకస్ భారతదేశాన్ని, ఈజిప్ట్ దేశాన్ని టాలమి పంచుకున్నారు. ఈజిప్ట్ రాజు (ఫారో) యుద్ధంలో మరణించటంతో టాలమి అలెగ్జాండ్రియా రాజధానిగా – తాను ఫారోగా పిలువబడుతూ రాజ్యపాలన చేశాడు. ఇతను టాలమి-I గా చరిత్రకెక్కాడు. గ్రీకులకు ప్రపంచంలో తామొక్కరమే నాగరికులమని మిగిలిన ప్రజలంతా అనాగరికులనే అహంకారం ఉండేది. తమ రక్తంలో మరొక రక్తం కలవకూడదనే భావన బలంగా ఉండటంచేత ఏకోదరులయిన సోదర, సోదరీల మధ్యనే వివాహ బంధాలు ఏర్పరచి దానినొక సంప్రదాయంగా కొనసాగించారు. టాలమి అలెగ్జాండ్రియాలో లైబ్రరీని 288 బి.సి.లో స్థాపించాడు. ఎన్నో దేశాలకు రాయబారులను పంపి విలువైన పుస్తకాలను సేకరించాడు. పెపైరస్ అనబడే గడ్డితో చేయబడిన పొడవైన బట్టలాంటి కాగితంపై ఆనాటి రచనలు సాగేవి. ఇది కాగితం అంత సులువుగా చిరగదు. టాలమి-I తరువాత టాలమి-II రాజ్యానికి వచ్చాడు. అలెగ్జాండ్రియా లైబ్రరీ చరిత్రలో అదొక సువర్ణఘట్టం. ఇతని కాలంలోనే ఈ గ్రంథాలయం మరింత అభివృద్ధి గాంచింది. ఇతని తరువాత వచ్చిన టాలమి-III తన తండ్రి, తాతల వారసత్వాన్ని కొనసాగించాడు. టాలమి-IV రాజ్యానికి వచ్చిన తరువాత లైబ్రరీపై శ్రద్ధ తగ్గింది. 30 బి.సి.లో జూలియస్ సీజర్ అలెగ్జాండ్రియాను ఆక్రమించుకున్నప్పుడు రోమన్ సైనికులు తమ నావల నుంచి విసిరిన అగ్ని బాణాలకు రేవుపట్టణంతో బాటుగా లైబ్రరీ కూడా అగ్నికి ఆహుతయింది. నలభై వేలకు పైగా పుస్తకాలు దగ్ధమైనట్లు సెనిక అనే చరిత్రకారుడు పేర్కొన్నాడు. ఆ సమయంలో క్లియోపాత్ర తన తండ్రైన టాలమి-XIIతో కలిసి  రాజ్యపాలన నెరుపుతుంది.

క్లియోపాత్ర తండ్రి మరణానంతరం అన్నయిన టాలమి-XIIIని, అతని మరణానంతరం తమ్ముడయిన టాలమి-XIVని, వివాహం చేసుకొని రాజ్యం ఏలుతూ ఉండేది. జూలియస్ సీజర్ ఆమెతో శృంగార సంబంధం ఏర్పరచుకుని టాలమి-XIV హత్య చేయటంతో ఆమె ఈజిప్ట్‌కు రారాణి అయింది. సీజర్ తరువాత మార్క్ ఆంటోనీతో సంబంధం ఏర్పరచుకోవటం, అగస్టస్ సీజర్ ఈజిప్ట్‌పై దండయాత్ర చేయటంతో ఆంటోనీ, క్లియోపాత్రలు ఆత్మహత్యలు చేసుకోవటం అందరికీ తెలిసిందే! అగస్టస్ సీజర్, క్లియోపాత్ర ముగ్గురు సంతానాన్ని హతమార్చి టాలమి వంశాన్ని దుంపనాశనం చేశాడు.

ఆ తరువాతకాలంలో అలెగ్జాండ్రియా, ఈజిప్ట్ రోమన్ సామ్రాజ్యపు ఆధిపత్యంలోనికి వచ్చింది. కాన్ స్టాంటైన్ క్రైస్తవ మతాన్ని అధికారమతంగా 300 ఎ.డి.లో (సుమారుగా) ప్రకటించాడు. దానితో అంతకుముందు ఉన్న బహుదేవతా ఆరాధన (Paganism) బహిష్కరించబడటమేకాక ఆ మతాన్ని అనుసరించటం నేరంగా పరిగణించబడింది. దీని పర్యవసానంగా అనేక దేవాలయాలు నేలమట్టమయ్యాయి. దీనితోబాటుగా 391 ఎ.డి.లో తిరిగి ఊపిరి తీసుకున్న అలెగ్జాండ్రియా లైబ్రరీని మరోసారి అగ్నికి ఆహుతి చేశారు. దీనికి ముఖ్యకారణం టాలమి దానిని ప్రారంభించినప్పుడు దానిని తొమ్మండుగురు దేవతలకు (9 Muses) అంకితమిచ్చాడు. వారంతా Pagan దేవతలే! ఈ గ్రంథాలయం కూడా Pagan ఆలయంలో భాగంగా క్రైస్తవ బిషప్ పరిగణించటంతో ఈ విజ్ఞాన మేధం జరిగింది.

642 ఎ.డి.లో అలెగ్జాండ్రియాను ఇస్లాం అరబ్బులు గెలుచుకోవటంతో, ఈ గ్రంథాలయంలో ఉన్న పుస్తకాలలోని విషయాలన్నీ ఖురాన్‌లో ఉండి ఉంటే, ఇక వాటి అవసరం లేదు. అలా కానప్పుడు ఖురాన్‌లో లేని విజ్ఞానమంటూ బయట




లైబ్రరీలో ఒక గది

ఏదీ ఉండకూడదు, కాబట్టి ఎలా చూసినా దానిని ధ్వంసం చేయాలని హుకుం జారీ కావటంతో అలెగ్జాండ్రియా గ్రంథాలయం మొత్తం బూడిదరాశై చరిత్రలో ఒక జ్ఞాపకంగా తలదాచుకుంది. మరి ఆ తరువాత ఏమైంది? ఒకప్పటి మహోన్నతమైన విజ్ఞాన భాండాగారానికి గుర్తుగా తిరిగి గ్రంథాలయాన్ని పునఃనిర్మించాలని అలెగ్జాండ్రియా యూనివర్శిటీ, 1974లో నిర్ణయించింది. ఈ మహత్తర కార్యక్రమంలో మేమంతా పాలుపంచుకుంటామంటూ ఎన్నో దేశాలు ముందుకు వచ్చాయి. UNESCO నడుం బిగించింది. అరబ్ దేశాలు ఆర్థిక సహాయమందించాయి. 1994లో ఈ భవన నిర్మాణం ప్రారంభమై 2002లో పూర్తయింది. 220 మిలియన్ డాలర్ల ఖర్చుతో ఇది నిర్మితమైంది. ఈజిప్ట్ రాజులకు 'ర' (సూర్యుడు, బహుశ రవి) ప్రధాన దేవత. ఈజిప్ట్ రాజులు సూర్యబింబం ఆకారంలోనున్న డిస్క్‌ను కిరీటంలో ధరిస్తారు. కాబట్టి ఈ గ్రంథాలయాన్ని డిస్క్ ఆకారంలో తీర్చిదిద్దారు. మొత్తం ఏడు అంతస్తుల భవంతిలో బయటకు మూడే కనిపిస్తాయి. మిగిలినవి undergroundలో ఉన్నాయి. ఈ భవంతిచుట్టూ Papyrus కాగితాన్ని తయారు చేయడానికి మూలమైన పెపైరస్ చెట్లను నాటారు. ప్రఖ్యాత Aswan డామ్ ప్రాంతంలో లభించే రాతిని ఉపరితలానికి ఉపయోగించారు. ఫ్రెంచ్ దేశం తాము ఎంపిక చేసిన యాభైవేల పుస్తకాలను బహుమతిగా ఇచ్చింది. అలానే అమెరికా, ఐరోపా దేశాలు కూడా. ఇదీ అలెగ్జాండ్రియా గ్రంథాలయ చరిత్ర.

- ఎన్నార్కె




ప్రొ. రావినూతల సత్యనారాయణ

తెలుగు భాషలో 'కేంద్ర సాహిత్య అకాదెమీ పురస్కారం' పొందిన వారి రచనలను, సమీక్షించాలని మిసిమి సంకల్పించింది. అందుకు తగినట్లు ప్రొ. రావినూతల సత్యనారాయణ గారు స్పందించారు.

ఇదొక బృహత్ కార్యం. ఇందులో రచయితల రచనలే కాకుండా ఒక్కొక్కప్పుడు వారి జీవితంలోకి తొంగిచూడవలసిన అవసరం రావచ్చు. కేవలం రచనలు చదివితే సరిపోదు. రచయిత స్వభావంపట్ల కూడా అవగాహన ఉండకపోతే సమీక్ష తేలిపోతుంది. రచయితలు తాము రాసే రాతకు, జీవించే జీవితానికి పొంతనే ఉండదు. వీటిని సమన్వయపరుస్తూ వారి రచనలను విశ్లేషించగలగాలి. కవిత్వమైనా, కథయైనా, నవల అయినా, నాటకమైనా, విధానమేదైనా అన్నీ వ్యక్తిత్వ సూచికలే. రచయిత అనుభూతి పరిసరాల వీచికలే.

ప్రతి రచయితా తన మనసులో ఒక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకుంటాడు. ఆనందం, ఆవేశం, ఆవేదన, ఆర్తి - ఇవన్నీ తన రచనలలో ప్రతిబింబింపచేస్తాడు. రచయితలకు భావావేశం ఎక్కువ. దానికి భిన్నమైన తర్కం కూడా ఉంటుంది. అవన్నీ పాఠకులలో గందరగోళాన్ని సృష్టిస్తాయి. రచయితను, పాఠకుడిని ఎదురెదురుగా నిలబెట్టి కరచాలనం చేయించగలిగినవాడే నిజమైన సాహితీ సమీక్షకుడు. ఆయన తన సమీక్షలో ఆయా రచయితలకు సంబంధించిన ఏ పుస్తకాన్నీ వదలలేదు.




తెలుగు భాషలో వెలుగు చూసి, పురస్కారం పొందిన రచనలన్నింటినీ, రచయితలెందర్నో సమీక్షించి, పరిచయం చేసి తెలుగు పాఠకులకు గ్రంథ రూపంలో అందిస్తున్నారు. ఇది విజ్ఞులైన పాఠకులకూ, పరిశోధనాశీలురైన విశ్వవిద్యాలయ విద్యార్థులకూ కరదీపికగా ఉండగలదని ఆశిస్తున్నాం.

(ప్రతులకు *మిసిమి* కార్యాలయాన్ని సంప్రదించండి.)

# కథా కమామీషు




నా భర్త ఉత్తరం నేను చదువుకోలేనా? (అచ్చమాంబ)

నా సోడా నేను కొనుక్కోలేనా? (రంగనాయకమ్మ)

నా వోడ్కా నేను తాగలేనా? (ఇప్పటి మహిళ)

వంద సంవత్సరాలు తెలుగు కథ ఎంతవరకు పెరిగింది, ఎలా రూపుదిద్దుకుంది?

ఇంతవరకూ పాఠకుల ఉత్తరాలను గానీ, స్పందనలను గానీ పరిగణనలోనికి తీసుకుని, కథలను బేరీజు వేశారా? కేవలం విమర్శకుల మాటలే వింటున్నారా?

20 సంవత్సరాలు వీరేశలింగం ఉద్ధరించడానికి పోరాడినా – కకావికలైన స్త్రీ జాతిమీద రచనలు ఎన్నివచ్చాయి?

ఇతర వర్ణాల కథలు ఎందుకు రాలేదు? రాసేవారు లేకా? చదివేవారు లేకా?

వితంతు సమూహాలు, బాల్యవివాహాలు, అనాదరణకు గురైన స్త్రీ జాతి కథలు లేవు కదా?

గాంధీ ప్రయోగం! గాంధీజీ తన స్వాతంత్రోద్యమానికి భారతజాతి బలహీనతలన్నీ బలంగా వాడుకున్నాడు – జాతిని సంఘటితపరిచాడు. విద్యాలేమిని, పేదరికాన్ని, కరువును, కులాలను, మత నమ్మకాలనూ, భాషనూ..... అన్నింటినీ ఆయన జాతిని జాగృతం చేయడానికే ఉపయోగించాడు – మరి కథకులు ఏమిచేశారు?? ప్రచారం తప్ప ఒక్క కథకుడు గాంధీ ఉపయోగించుకున్న ప్రక్రియలను కథస్థం చేయలేదు.

చలం సెన్సువల్ గురించి, కేవలం పరస్పర ఆకర్షణ, సెక్సు గురించే రాశాడు.

వడ్డెర చండీదాసూ ఇదే పొడిగించాడు. అయితే వీరు భాషాపదాల విషయంలో ప్రత్యేకం.

కథారచనలో ముందుకు వెళ్ళని సంక్షోభ సమాజం – దీనికి తిరగా మరగా చూడవచ్చు!

తెలుగు కథలలో పూర్వీకుల ప్రశంస తప్పా మరేమైనా ఉందా?

అమెరికాలో కూర్చుని అనకాపల్లి కాకమ్మ కథలు రాయటం సబబా?

కథావిమర్శ క్రాస్‌రోడ్స్‌కు వచ్చిందా? కేవలం పొగడ్తలతోనే కాలక్షేపం చేస్తోందా?

స్త్రీ – దళిత – మానవ ప్రవర్తన – అస్తిత్వ మూలాలు – ఇవి సుస్పష్టంగా వినిపించిందా? తెలుగు కథ మూలం ఏమిటి?

రైతు కథ ఎప్పుడైనా వచ్చిందా?

ఐపిల్ స్త్రీకి స్వాతంత్ర్యాన్ని ప్రసాదించిందా?

విప్లవంలో కాల్పనికత ఏమిటి, ఎందుకు?

ప్రేమకథల ఛత్రానికి ఇంత పెద్ద నీడ అవసరమా? దానిలో నుంచి బయటికి రావా? (రచయిత)

అభ్యుదయ కథ శిఖరాలు బీటలువారుతున్నాయా లేక సానువులు క్రుంగిపోయాయా?

ప్రగతి వాద కథకులు ఏరి?

దేనిని ప్రగతివాదం అంటున్నారు?

గాసట బీసటగా కథామాధ్యమం ఉందా? నేలబారుగా – ఉత్సుకత కలిగించలేని FIR లేనా?

125 ఏండ్ల కథను బౌద్ధిక స్థూపాలుగా, కాలక్షేప స్రవంతిగా, ఐహిక రసధారగా విడగొట్టగలమా?

శిలాశాసనం ఎక్కడైనా వాడారా? పోనీ అలాంటి కథ –

కథకులు విస్మరించి, పట్టించుకోని సంవేదనాశీల రంగాలు, ఉదయిస్తున్న సమస్యాత్మక అలజడులు ఏవి?

కథ ఇంకా ఆశయం, ఆలోచనతోనే చెప్పబడుతున్నది. సమకాలీన జ్ఞాన సంపద నుంచిగాని – మించిగాని ఏమైనా కథలు వచ్చాయా?

ఇంకొంచెం మూలాలలోకి వెళితే –

అసలు కథకుడు ఎవరు?



1. వస్తువును చూపే ఫోటోగ్రాఫరా?
2. వస్తువును నడిపే నిర్దేశకుడా?
3. పాత్రను నటించే నటుడా?
4. వస్తువు నడకను అనుసరిస్తూ పోయే ఒక బాడీగార్డా?

ఈ కథకుని పాత్ర ఏమిటి?

1. కార్పెంటరా (వడ్రంగి మేస్త్రా?)
2. తోటమాలా?
3. కుండలు చేసే కుమ్మరా?
4. చిత్రకారుల నుంచి కథకుడు ఏమైనా నేర్చుకున్నాడా?

సాధారణ పాఠకుల స్పందన తెలియని విమర్శకులే కథను బ్రతికిస్తున్నారా?

1. డి ఫెమిలియారిటీ ఉండాలి కదా? మరి కథకులు ఎందుకు చేయలేకపోతున్నారు?
2. డివియేషన్ ఉండాలి – దారి మళ్ళింపు కూడా చేతకాదా?
3. ఫోర్‌గ్రౌండ్ – అసలు దీనిని ఎవరైనా పట్టించుకున్నారా?

పరిచయమైనదానినే కొత్తగా చెప్పకలగాలి కదా – దానికి భాష ఏది?

1920లో రష్యాలో కవిత్వం కోసం చేసిన (సూత్రచ్ఛయం) కథకు వర్తించదా?

కథకుడు సోమరిపోతా?

తన పరిధిని ఒంటి కంటితోనే చూసేవాడా?

శాస్త్రజ్ఞానం (సైన్స్) తత్త్వవేత్తలకు అందకుండా పోయిందికదా?

ఇంకా తత్త్వవేత్తల ఆలోచనలనే కథాంశంగా తీసుకుంటున్నారేమిటి?

అందుకే శాస్త్రజ్ఞానం కథకుడికి అందకుండా పోయిందికదా!

పెన్ను పుచ్చుకున్న ప్రతివాడూ రచయితగా చలామణీ అవుతాడా?

ప్రగతివాద కథలలో ప్రగతివాద భాష ఉన్నదా?

అసలు భాష మార్చటానికి ప్రయత్నం చేస్తున్నారా?

కథకుడు చెప్పేవన్నీ కథకు పనికివచ్చేవేనా?

కథ అంటే గార్బేజి కంటైనరా? (అదే చెత్తబుట్ట అందామా?)

అసలు అనన్యతను ఫోకస్ చేసిన – చేయగలిగిన కథ ఏమయినా వచ్చిందా?

Poem is complex, why short story is not complex?

చివరిగా నవల.... అచంట జానకీరాం ఏరిన ఆరు నవలలను మించి మరొక్కటి ఏదైనా వచ్చిందా?

*ప.ప. శాస్త్రి వీలునామా, తుఫాను, కాలాతీత వ్యక్తులు, బారిష్టర్ పార్వతీశం, చివరకు మిగిలేది, రాజశేఖర చరిత్ర* – గాక.

Why Novel has become rant? reckless - ruthless? careless - mindless?



పన్నాల సుబ్రహ్మణ్యం భట్టు
విజయవాడ.
0866 - 2475120.

# అమరత్వం

– ము.పా.సా.

క్రోమోసోమ్ కథనమ్ – 12

చరిత్ర పూర్వ దశ (Pre-history)

*ప్రాచీన కాలమంటే ప్రపంచానికి శైశవ దశ*

*– ఫ్రాన్సిస్ బేకన్*

పిండోత్పత్తి దశలో కీటకాలు, ఈగలు, కోళ్ళు, మనుషులు – ఇలా అన్ని జీవుల్లోని జన్యువులూ ఒకేలా ఉన్నాయంటే అన్నింటికీ మూలం ఒకటన్నమాటేగదా. ఇలా అన్నీ ఒకదానితో ఒకటి పోలి ఉన్నాయని చెప్పటానికి కారణం DNA కోడ్‌లోని అక్షరాలు, భాష. డెవలప్‌మెంట్ జన్యువుల పదాలలో తేడా లేదు. ఈ ఉదాహరణను మనం మరో ప్రతిపాదనకు కూడా ఉపయోగించవచ్చు. మనుషులు వాడే పదాలకు, భాషలకు కూడా మూలం ఒకటే. ఇటాలియన్, ఫ్రెంచి, స్పానిష్, రుమేనియన్ భాషలు లాటిన్ నుండి పుట్టుకొచ్చినవే. మనుషుల భాషాశాస్త్రమూ, జన్యువుల భాషాశాస్త్రమూ ఒకే విషయం స్పష్టం చేస్తున్నాయి : వలసలు. మనుషులు వలసపోవటం అనాదిగా జరుగుతున్నది. ఈ వలసన గురించి సరైన సాక్ష్యాధారాలు లభించటం లేదంటారు చరిత్రకారులు. చరిత్ర పూర్వం జరిగిన విషయాల గురించి లిఖితపూర్వక సాక్ష్యాలుండవు. కాని జన్యువుల భాషల్లో వలసనల గురించిన రికార్డులు పదిలంగా ఉన్నాయి. జన్యువుల చరిత్ర గురించి తెలుసుకోవటానికి క్రోమోసోమ్–13 సరైనచోటు.

1786లో కలకత్తాలో జడ్జిగా పనిచేసిన సర్ విలియం జోన్స్, తన రాయల్ ఆసియాటిక్ సొసైటీ ఉపన్యాసంలో “లాటిన్, గ్రీక్ భాషా కుటుంబానికి చెందిందే సంస్కృతం. ఈ విషయం తన అధ్యయనంలో తేలింది” అన్నాడు. అంతేకాదు ఈ మూడు భాషలకూ, కెల్టిక్, గోతిక్, పెర్షియన్ భాషలకూ పోలికలున్నాయన్నాడు. అంటే, “అన్నింటికీ మూలస్థానం ఒకటే.” ఈయన వాదనకూ, ఆధునిక జెనెటిసిస్టుల వాదనకూ తేడా లేదు. 530 మిలియన్ సంవత్సరాల క్రితం గుండ్రటి పలకలాంటి పురుగు ఒకటుండేది. భాషలకు మూలం అక్కడుండొచ్చు.

ఉదాహరణకు మూడు సంఖ్యను లాటిన్‌లో 'Tres', గ్రీకులో 'Treis', సంస్కృతంలో 'Trays' అంటారు. అయితే, మనం ఉచ్చరించే భాషలకూ, జన్యుభాషలకూ తేడా ఉంటుంది. జన్యుభాషలలో, పదాల మార్పిడి ఎక్కువగా జరుగుతుంది. సంస్కృతంలో 'Trays' అనబడే పదం పశ్చిమ భాషల నుండి వచ్చి చేరింది. ఒకప్పుడు మనుషులందరూ ఒక ప్రాంతంలో ఒకే భాష మాట్లాడేవాళ్ళన్న జోన్స్ మాటల్లో నిజముండవచ్చు. వాళ్ళ వారసులు, ఆయా భాషల్ని దూరప్రాంతాలకు తీసుకుపోయారు. భాషల విస్తృతికి ఇదో ముఖ్యకారణం.

భాషల అధ్యయనం ద్వారా మనుషుల గురించి కూడా మనం చాలా విషయాలు తెలుసుకోవచ్చు. ఈ ఇండో–యూరోపియన్లు (కొందరు వీళ్ళను ఈ పేరుతోనే పిలుస్తారు) తమ మాతృభూమి (ఇప్పటి యుక్రెయిన్ ప్రాంతం) లేదా టర్కీ (ఈ భాషలో కొండలకూ, కాలవలకూ ప్రత్యేక పదాలున్నాయి) నుండి ఇతర దేశాలకు తరలిపోయి ఉంటారు. ఏది ఏమైనప్పటికీ వీళ్ళది వ్యావసాయిక సమాజం అన్న విషయంలో సందేహం లేదు. భాషావ్యాప్తికి సంబంధించినంత వరకు ఈ వివరణ సరిపోతుందనుకున్నా జన్యు వైవిధ్యానికి కూడా ఇదే కారణమా?

ఇప్పుడు, ఇండో–యూరోపియన్ ప్రాంతమైన ఆనటోలియాలో, ఇండో–యూరోపియన్ భాషా కుటుంబానికి చెందని టర్కిష్ మాట్లాడతారు. ఈ భాష వీళ్ళకు అశ్వికులైన సంచార జాతుల నుండి అలవడి ఉంటుంది. గుర్రాలకు ఈ భాషలో చాలా పదాలున్నాయి. ఇండో–యురోపియన్, అల్టాయిల్, ఉరాలిక్ భాషల మధ్య సంబంధముంది. వీటన్నింటికీ మూలం, యురేషియాలో 15,000 సంవత్సరాలనాడు మాట్లాడిన భాష ఏదో అయి ఉంటుంది.

కాలం గడచినా కొన్ని పదాలు మారవు. అవి ఆధారంగానే భాషాకుటుంబాల గురించి మనం ఏదైనా నిర్ధారణలు చేయవచ్చు. ఉదాహరణకు, ఇండో యురోపియన్, ఉరాలిక్, మంగోల్, చుక్చి, ఎస్కిమో భాషల్లో ‘నేను’ అనటానికి ‘ఎమ్’ శబ్దాన్ని ‘నువ్వు’ అనటానికి ‘టి’ లేదా ‘టు’ శబ్దాన్నీ ఉపయోగిస్తారు. పోర్చుగల్, కొరియాలలో మాట్లాడే భాషలు ఒకే కుటుంబానికి చెందినవి. అయితే ఏది మహాకుటుంబం (Nostratic) దాని నుండి విడిపడి విస్తరించిన భాషలేవి అని ఖచ్చితంగా చెప్పటం కష్టమే. దీని గురించి భేదాభిప్రాయాలు కూడా ఉన్నాయి. నాస్ట్రాటిక్ ప్రజలు, కుక్కల సాయంతో జంతువులను వేటాడి ఉంటారు. విల్లు, బాణాలను

ఉపయోగించి ఉంటారు. ప్రాచీన చరిత్ర అధ్యయనమంటే ఊహాగానాలు ఎక్కువ, ఆధారాలు తక్కువ.

1980లో ఒక ప్రముఖ ఇటాలియన్ జెనెటిసిస్ట్ లూయిజీ లూకా కవాలి ఫోర్జాకు ఒక సందేహం వచ్చింది. మాట్లాడుకునే భాషలకున్న పరిమితులే, జెనెటిక్ భాషలకూ ఉన్నాయా? జెనెటిక్ భాషల మధ్య సరిహద్దు రేఖలు అస్పష్టంగా ఉంటాయి. ఫ్రెంచి, జర్మన్ భాషల మధ్య చాలా తేడా ఉంది గానీ, ఈ ప్రజల జన్యువుల మధ్య తేడా లేదు.

జన్యువులు రూపుమార్చుకోవటం సహజం. గణాంక వివరాలు సేకరించి, వాటి విశ్లేషణ తర్వాత కవాలి ఫోర్జా, యూరోపులో, అయిదు జన్యు కుటుంబాలున్నాయని నిర్ధారణకు వచ్చారు. అనాదికాలంనుండీ మనుషుల్లో వలసలు సర్వసాధారణమే అని నిరూపిస్తాయి జన్యువులు.

కొత్త రాతి యుగంలో మానువులు ప్రధానంగా వేటాడి ఆహార సేకరణ చేసుకునేవారని చెబుతుంటారు. ఇలాంటివాళ్ళు యూరోపులో నివాసం ఏర్పరచుకున్నారు. అంటే మరెక్కడినుండో ఇక్కడికి వచ్చారని అనుకోవాలా? మరి, అప్పటికే ఇక్కడ ఉన్నవాళ్ళేమైపోయారు? వీళ్ళు మరెక్కడికో వెళ్ళిపోయారా. లేదా వాళ్ళను సంహరించారా? లేక ఇద్దరూ కలిసి కొత్త జాతి/జాతులుగా ఏర్పడ్డారా? వాళ్ళ సాంకేతిక సామర్థ్యం, భాష, సంస్కృతులను స్థానికులు స్వీకరించారా? ఇలా ఎన్నైనా ప్రశ్నలు వేసుకోవచ్చు. ఏదైనా జరిగే అవకాశమూ లేకపోలేదు. 18వ శతాబ్దంలో, స్థానికులను పూర్తిగా నిర్మూలించి అమెరికాను ఆక్రమించారు తెల్లవాళ్ళు – జెనెటిక్‌గా బాషాపరంగానూ జరిగిన విధ్వంసమిది. 17వ శతాబ్దంలో మెక్సికోలో కూడా ఇతర జాతులవాళ్ళు స్థానికులతో కలిసిపోయారు. పంతొమ్మిదవ శతాబ్దంలో ఇండియాలో ఇంగ్లీషు భాషా వ్యాప్తి జరిగింది. ఒకప్పటి ఉర్దూ/హిందీల స్థానంలో దీనికి ఆదరణ పెరిగింది. కాని జెనెటిక్‌గా ఈ మార్పులు జరగలేదు.

జన్యు అధ్యయనం వల్ల, చరిత్ర పూర్వకాలంలో ఏం జరిగిందో తెలుసుకునే అవకాశముంది. కవాలి ఫోర్జా ప్రకారం, వేట వృత్తిగా ఉన్న స్త్రీలను, వ్యవసాయం వృత్తిగా గల పురుషులు పెళ్ళి చేసుకున్నారు. దక్షిణాఫ్రికాలో, పిగ్మీలకూ వ్యవసాయం చేసుకుంటున్న వాళ్ళ పొరుగు జాతుల వాళ్ళకూ మధ్య సంబంధాలలాగే బలపడ్డాయి. వేటవృత్తిగా ఉన్నవాళ్ళకన్న వ్యవసాయం చేసుకునేవాళ్ళు ఎక్కువమంది స్త్రీలను పెళ్ళిచేసుకునే అవకాశముంది. స్థిరనివాసాలు ఏర్పరచుకున్నవాళ్ళకు, సంచార జాతులవాళ్ళు అనాగరికులుగా కనిపిస్తారు. అందువల్ల వీళ్ళ పురుషుల్ని, స్థిరనివాసం ఏర్పరచుకొన్న స్త్రీలు పెళ్ళి చేసుకోరుగాని, పురుషులు మాత్రం ఆ స్త్రీలను చేసుకుంటారు (పొలం పనుల్లో వాళ్ళ అవసరముంటుంది మరి!).

ఇంతకూ ఈ కబుర్లకూ, క్రోమోసోమ్–13కూ ఏమైనా సంబంధముందా? ఉంది. అసలు విషయమేమిటంటే, క్రోమోసోమ్–13 మీద చిచ్చరపిడుగులాంటి $BRCA_2$ జన్యువుంది. పరిణామ క్రమాన్ని, వంశపారంపర్య దశలను చెప్పటంలో దీనిదే ప్రధానపాత్ర. 1994లో దీన్ని బ్రెస్ట్‌కాన్సర్ జన్యువుగా గుర్తించారు. ఈ జన్యువున్నవాళ్ళకు బ్రెస్ట్‌కాన్సర్ వచ్చే అవకాశమెక్కువుంది. ఐస్‌లాండ్‌లోని కుటుంబాలను అధ్యయనం చేస్తున్నప్పుడు ఈ విషయం వెలుగులోకొచ్చింది. 900 AD లో నార్వేజియన్లు ఇక్కడ స్థిరపడ్డారు. ఆ తర్వాత ఇక్కడికి వలస వచ్చినవాళ్ళు ఇక్కడ లేరు. ఇక్కడున్న 2,70,000 మందీ వైకింగ్‌ల సంతతివాళ్ళే. అంటే జన్యుపరిశోధనకు ఇంతకన్నా అనువైన ప్రాంతం మరొకటి ఉండదు. బ్రెస్ట్ కాన్సర్ చరిత్ర ఉన్న ఇక్కడి రెండు కుటుంబాల మూలపురుషుడు ఒక్కడే. జన్యువిభజన కూడా ఒకేరకంగా జరిగింది. జన్యువులోని 999వ అక్షరం తర్వాతి 5 అక్షరాలు తొలగించబడ్డాయి. ఆ తర్వాత మరికొన్ని యూదు కుటుంబాలలోని బ్రెస్ట్‌కాన్సర్ జన్యు విభజన గురించి పరిశోధనలు జరిగాయి. జెనెటిక్ జాగ్రఫీ గురించి మరిన్ని ఆసక్తికరమైన విషయాలు తెలిశాయి. దీని ఆధారంగా చరిత్ర, చరిత్ర పూర్వ దశల గురించీ, అనేక ఇతర విషయాల గురించీ పరిశోధన జరిగింది. ఉదాహరణకు, కొందరు అధికమొత్తంలో మద్యం సేవించగలగటానికి కారణం వాళ్ళలో ఉత్పత్తి అవుతున్న ఆల్కహాల్ డీమైడ్రోజెనసిస్ అనబడే ఎంజైమ్. అలాగే, పాలు జీర్ణం కావటానికి కారణాలు లాక్టేస్ జన్యువు.

## క్రోమోసోమ్–13
## అమరత్వం

***జీవిత గ్రంథంలోని వర్తమానమనే పేజీ తప్ప, తరువాతి పేజీలు చదవలేం మనం.***

*– అలెగ్జాండర్ పోప్*

ఇప్పటికి మనం తెలుసుకున్న విషయాలను సమీక్షించుకుంటే, జన్యువుకు మరణం లేదన్న విషయం

స్పష్టమవుతుంది. ఈ సృష్టిలోని తొట్టతొలి జన్యువు నుండి నేటిదాకా వాటి లంకె తెగలేదు. ఈ గొలుసు ఎంత పెద్దదంటే నాలుగు బిలియన్ సంవత్సరాలుగా, యాభై బిలియన్‌సార్లు ఇది తనను తాను పునావిష్కరించుకుంటూనే ఉంది. ఎక్కడా ఒక చిన్న పొరబాటు కూడా జరగలేదు. అయితే, ఇప్పటివరకు జన్యువులు మృత్యుంజయులే కావచ్చుగాని భవిష్యత్తులో కాలగర్భంలో కలిసిపోవని నమ్మకమేమిటి? అయితే ఇవి మరణించటం అసాధ్యమనే అనిపిస్తుంది. ఇదే జరిగితే పరిణామ క్రమంలో జీవులు తమను తాము కొత్త పరిస్థితులకు అనుకూలంగా మార్పు చేసుకునే అవకాశం ఉండదు. మానవజాతి మరో పదిలక్షల సంవత్సరాలు ఉంటుందనుకున్నా, తరువాతి తరాల వాళ్ళ కోసం మనం కొత్త జన్యువులనేమీ వదిలి వెళ్ళటం లేదు. అంటే, భవిష్యత్తులో, పునరుత్పత్తి సాధ్యం కాదు గనక ఈ జాతి అంతరించిపోవచ్చు. అయినప్పటికీ, భూమి ఇప్పుడున్న స్థితిలోనే కొనసాగితే ఏదో ఒక జీవజాతికి చెందిన జన్యువుల గొలుసు కొనసాగుతుంది. అమరత్వం అంటే అదే.

మరి, జన్యువులు మృత్యుంజయులనుకుంటే, శరీరం ఎందుకు మరణిస్తుంది? నాలుగు బిలియన్ సంవత్సరాల ఫోటోకాపీయింగ్ వల్ల జన్యువులలోని సందేశాలలో ఏ మార్పూ రాలేదు (ఈ సందేశం డిజిటల్ రూపంలో ఉండటమే దీనికి కారణం). కానీ వయసు పెరిగేకొద్దీ మనిషి చర్మం సాగే గుణం (elasticity) కోల్పోతుంది. కణం తనను తాను యాభైసార్లు డబ్లింగ్ చేసుకోవటంవల్ల ఫలదీకరణ చెందిన అండం శరీరంగా మారుతుంది (శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి 'వడ్లగింజలు' కథ తెలిస్తే మీకీ ఉదాహరణ బాగా అర్థమవుతుంది.). చదరంగం బోర్డు మీది మొదటి గదిలో ఒకటిగా ఉన్న వడ్లగింజ, ప్రతి గదికీ రెండింతలుగా పెరిగి, 64వ గదికి వచ్చేటప్పటికి ఇరవై మిలియన్ మిలియన్ మిలియన్ గింజలుగా ఎదుగుతుంది. శరీరం ఎదుగుదలా ఇలాంటిదే. అండం రెండుగా విభజించబడి, ఆ తర్వాత అవి పునర్విభజించబడి... అలాగ శరీరంలో 100 ట్రిలియన్ కణాలుంటాయి. అంటే క్రోమోసోమ్స్ అనేక వందలసార్లు తమను తాము రెండుతో చెరిగిపోయే అవకాశముంది. కాని సృష్టి ప్రారంభం నుండీ జరిగిన యాభై మిలియన్ డబ్లింగ్ తర్వాత కూడా ఇలా జరగలేదు. దీనికి సమాధానం మనకు క్రోమోసోమ్-14లో లభిస్తుంది. దీనిమీద TEP1 అనబడే జన్యువుంటుంది. టెలోమారేస్ అనబడే అసాధారణమైన బయోకెమికల్ యంత్రంలోని ఒక భాగమిది. ఒక్కమాటలో చెప్పాలంటే, టెలోమారేస్ స్థాయి తగ్గితే మనకు వృద్ధాప్య లక్షణాలు వస్తాయి. ఇది ఎక్కువగా ఉంటే దీర్ఘాయుష్కులమో, అమరులమో అవుతాం.

DNA సహ ఆవిష్కర్త జేమ్స్ వాట్సన్ 1972లో దీని గురించి తెలుసుకున్నాడు. అలాగే 1948లో కరోల్ గ్రైడర్, ఎలిజబెత్‌లు టెలోమెరేస్‌ను ఆవిష్కరించారు. తనలో ఉన్న RNA ను ఇది టెలోమీర్స్‌ని పునర్నిర్మించటానికి ఉపయోగిస్తుంది (DNA కాపీ చెయ్యబడే క్రమంలో ఉత్పత్తి అయ్యే వ్యర్థ పదార్థాన్ని 'టెలోమీర్' అంటారు). ఈ టెలమీర్స్‌లో కొన్ని వేలసార్లు పునశ్చరణ చెయ్యబడే TAG అనబడే మాట క్షీరదాలన్నింటిలోనూ ఒకేలా ఉంటుంది. నిజానికి, ప్రోటోజోవాలతో సహా, జీవులన్నింటిలోనూ ఇంచుమించు ఇలాగే ఉంటుంది. మొక్కల్లో మాత్రం ఒక T అదనంగా ఉంటుంది.

ఈ టెలోమెరేస్ జన్యువులను మనం యవ్వనం జన్యువులు (Genes for youth) అనవచ్చు. కణాలకు మరణాన్ని దరిచేరనివ్వదు టెలోమెరెస్. టెలోమెరేస్ పరిశోధనలో అధిక కృషి చేస్తున్న జెరాన్ కార్పొరేషన్ 1997లో టెలోమెరేస్ క్లోనింగ్‌లో పాక్షికంగా విజయం సాధించటంతో కంపెనీ షేర్ల విలువ అమాంతం పెరిగింది. మరణాన్ని నివారించటంలో జెరాన్ తొలి అడుగు వేసిందని అందరికీ తెలిసింది. మనిషి ఎదుగుదల క్రమంలో, కొంతకాలం తర్వాత టెలోమెరెస్‌ను తయారుచేసే జన్యువులు నిద్రాణ దశకు చేరుకుంటాయి. ఇలా జరిగిందంటే స్టాప్‌వాచ్‌లో టైం చూడటం ప్రారంభమైందన్నమాట.

అయితే, మెదడుకు వచ్చే వృద్ధాప్య లక్షణాలను విశ్లేషించటం అంత సులభం కాదు. ఎందుకంటే, జీవితకాలంలో, మరణించిన మెదడు కణాల స్థానంలో కొత్త కణాలు పుట్టవు. అయినా మన టెలోమీర్ సిద్ధాంతానికి వచ్చిన నష్టమేమీ లేదు. మెదడుకు సహాయంగా ఉండే గ్లయల్ (glial) కణాల్లో పునరుత్పత్తి జరుగుతుంది. నిజానికి, కాన్సర్, కండరాల బలహీనత, స్నాయువు (tendon) బిగుసుకుపోవటం, జుత్తు నెరవటం, చర్మం సాగే లక్షణం కోల్పోవటం వగైరా లక్షణాలను మనం మృత్యువుకు చేరువ కావటంతో సమానంగా పరిగణిస్తాంగాని, కణాల పునరుత్పత్తికీ వీటికీ

సంబంధం లేదు. కాన్సర్ విషయంలో కణ విభజన జరగవలసిన దానికన్నా ఎక్కువ వేగంగా జరుగుతుంది. జీవితకాలం అన్ని జీవుల్లోనూ ఒకే రకంగా ఉండదు. పెద్ద సైజు జంతువులు, చిన్నవాటికన్నా ఎక్కువ కాలం బతుకుతాయి. కాని తాబేళ్ళ లాంటి చిన్న జంతువులు కూడా ఎక్కువ కాలమే జీవిస్తాయికదా. దీన్నెలా అర్థంచేసుకోవాలి? ఫిజిసిస్టులు దీనికో కారణం చెబుతున్నారు. ఒక జీవితకాలంలో అన్ని జంతువుల హార్ట్‌బీట్స్ సంఖ్య ఇంచుమించు ఒకటే. ఏనుగు, ఎలుకకన్నా ఎక్కువకాలం బతుకుతుందా, ఏనుగు గుండె కొట్టుకొనే వేగం, ఎలుకతో పోలిస్తే తక్కువ. హార్ట్‌బీట్స్ పద్ధతిలో రెండింటి జీవితకాలమూ ఒకటే. కాని ఈ వాదనకూ మినహాయింపులున్నాయి. పక్షులు, గబ్బిలాల సంగతి తీసుకోండి. చిన్న గబ్బిలాలు కనీసం ముప్ఫైఏళ్ళు బతుకుతాయి. జీవించినంత కాలమూ విపరీతంగా తింటూ, శ్వాస పీలుస్తూనే గడుపుతాయి. ఇతర జంతువులకన్న అనేక రెట్లు ఎక్కువ ఉష్ణ రక్తం కలిగిన పక్షులు (వీటి బ్లడ్ షుగర్ సాంద్రత రెండింతలు ఎక్కువ. ఆక్సిజన్ ఉపయోగమూ ఎక్కువే.) ఎక్కువ కాలం జీవిస్తాయి. ఒక స్కాటిష్ ఆర్నిథాలజిస్ట్ (పక్షుల శాస్త్రజ్ఞుడు) 1950, 1992లలో ఒకే జత పక్షులతో దిగిన ఫోటోలున్నాయి. రెండు ఫోటోలలోనూ, పక్షుల్లో పెద్దగా మార్పులేదు. వయసు పెరిగినట్టుగా కనిపించదు.

బయోకెమిస్ట్‌లు చెయ్యలేని పనిని పరిణామవాదులు చేసి చూపించారు. జె.బి.ఎస్. హాల్డేన్, పీటర్ మెడావర్, జార్జి విలియంస్ వృద్ధాప్య కారణాలను వివరించారు. పునరుత్పత్తి దశ తర్వాత, జీవులలో వృద్ధాప్య లక్షణాలు ప్రారంభమవుతాయి. దీనికి కారణం జన్యువులే.

ఈ సిద్ధాంతాన్ని సమర్థించటానికన్నట్టుగా ఓ ప్రయోగం జరిగింది. అమెరికాలోని జార్జియా రాష్ట్రంలో ఒకచోట బాహ్య ప్రపంచంతో సంబంధం లేని ఆపోసమ్ (ఓ రకమైన పాలిచ్చే జంతువు కంగారుల్లాగ దీని పొట్టకో సంచి ఉంటుంది. పిల్లల్ని అందులో పెట్టుకుని పరుగెడుతుంది)లున్నాయి. ఇవి ఎక్కువకాలం బతకవు. కొన్ని రెండేళ్ళకే ముసలివై, చచ్చిపోతాయి. శుక్లదోషం, కాళ్ళనొప్పులు, చర్మం ముడతలుపడటం కూడా జరుగుతుంది. అదీ చివరిదాకా బతికితే. ఈలోగానే వాటిని ఏ గుడ్లగూబో గుటుక్కుమంటుంది. లేదా నక్కలు ఇష్టంగా ఆరగిస్తాయి. ఇవేవీ జరక్కపోయినా రోడ్డు ప్రమాదాల్లో తరచూ మరణిస్తూనే ఉంటాయి. కాని, కొన్నింటిని అభయారణ్యంలాంటిచోట పెంచినప్పుడు, అవి ఎక్కువ కాలం ఆరోగ్యంగా బతికాయి. జంతువుల గురించి ఎందుకుగాని, మనం మనుషుల గురించి మాట్లాడుకుందాం రండి. ఆత్మరక్షణలో మనకెవరూ సాటి రారు కదా! (చింపాంజీలు కూడా చిరుతలను కర్రలతో పారద్రోలగలవు!) అడవి జంతువులకు మనం సహజ ఆహారం కాదు. మన జీవిత కాలం కూడా మరీ తక్కువేమీ కాదు. వృద్ధాప్య ఛాయలు అంత త్వరగా రావు. శిశుమరణాల సంఖ్య 50 శాతం పిల్లలు అయిదేళ్ళలోపే మరణిస్తున్నారు. చాలా ఎక్కువ కనిపిస్తుందిగాని, ఇతర జంతువులతో పోలిస్తే ఇది తక్కువే. రాతియుగం నాటి మన పూర్వీకులు, ఇరవై ఏళ్ళ నుండి ముప్పై ఏళ్ళ దాకా పిల్లల్ని కని, మరో ఇరవై ఏళ్ళు వాళ్ళను పెంచి యాభై అయిదేళ్ళ ప్రాంతంలో, ఇంకా పునరుత్పత్తి దశలోనే మరణించారు. మనలో సహజంగా యాభైఅయిదు తరవాతే తలనెరుస్తుంది. కీళ్ళనొప్పులు ప్రారంభమవుతాయి. కొన్నిసార్లు అన్ని ఆరోగ్య సమస్యలూ ఒకేసారి కట్టకట్టుకుని వచ్చినట్టుగా ఉంటుంది. పిల్లల్ని కని, పెంచటం కోసమే ప్రకృతి మన శరీరాల్ని నిర్మించింది. బాధ్యతలు తీరగానే, ముసలితనం వెదుక్కుంటూ వస్తుంది. మన టెలోమీర్‌లు 75 నుండి 90 ఏళ్ళ దాకా పనిచెయ్యగలవు. మనుషుల జీవిత కాలాల్లో తేడా అంటే అది టెలోమీర్స్ పొడవులో ఉన్న తేడానే.

అయితే శరీరంలోని ఇతర భాగాలు అంగాలు క్షీణించిపోతే, కేవలం టెలోమీర్స్ మనల్ని రక్షించలేవు. అయినా, దీర్ఘాయుష్షు గురించి ప్రయోగాలు కొనసాగుతూనే ఉన్నాయి. కొన్ని శరీర కణాలు 350 ఏళ్ళ దాకా బతకగలవని గుర్తించారు శాస్త్రజ్ఞులు. కొందరు ఫ్రెంచి శతవృద్ధులను పరిశీలించినప్పుడు, క్రోమోసోమ్-6 మీదున్న ఒక జన్యువు ఇందుకు కారణమని తెలిసింది.

అయినప్పటికీ, వృద్ధాప్యానికి, కేవలం ఏ ఒక్క జన్యువో కారణమని చెప్పలేం. వృద్ధాప్య లక్షణాలకు మన జీనోమ్‌లోని 7000 జన్యువులు కారణమంటాడో శాస్త్రజ్ఞుడు. అవును. శరీరం క్షీణించటమే వృద్ధాప్యం. పునరుత్పత్తి దశ తర్వాత శరీరం బలహీపడుతుందన్నది మాత్రం నిర్వివాదాంశం.

(Matt Ridley రచన ఆధారంగా)

తెలుగు : ము.పా.సా. హైదరాబాదు.
ఫోన్ : 917 767 8708

# కామినేని మల్లారెడ్డి

*- ధూపాటి శేషాద్రి రమణ కవులు*

ఆంధ్ర కవులలో ప్రథమ ప్రముఖుడిగా చెప్పబడినవారు రెడ్డి వంశస్థులలో కామినేని మల్లారెడ్డి. కాకతీయ సామ్రాజ్యం అభివృద్ధిలోకి వచ్చిన పిదప కాలవశమున క్షీణదశలోకి రాగానే సామంత సేనా నాయకులంతా స్వతంత్రం ప్రకటించుకొని స్వతంత్ర రాజ్యాలు నేర్పరచుకొన్నారు. వెలమ దొరలు రాచకొండ సింగవరం భువనగిరి మొదలైన దుర్గములనాశ్రయించి బలపడిరి. హరిహరరాయాదుల తుంగభద్రానది తీరమున కేగిరి. రెడ్డి రాజన్యులు నెల్లూరు మండలం యథేచ్ఛముగా పరిపాలించగ ఆక్రమించిరి. ఆనాటి రెడ్డి కవీంద్రులు అనేక సాహిత్య గ్రంథములను వ్రాయించారు. శ్రీనాథుడు ఎఱ్ఱాపగడలు మహాకవులీ రెడ్డి రాజ్య పతాకం ఎగురవేశారు. సుఖజీవనం గడిపారు. రెడ్డి వీరులలో గోన బుద్ధారెడ్డి తర్వాత కామినేని మల్లారెడ్డి కవిగా ప్రసిద్ధులు.

మల్లారెడ్డి ఇంటిపేరు కామినేనివారు. వీరు పాకనాటి వారు నివానస్థానం, బిక్కనవోలు సంస్థాం. ఇది హైదరాబాదుకు సుమారు నేడెనిమిది ఆమడలు దూరంలో ఉన్నది. మల్లారెడ్డి పూర్వము కృష్ణామండలం వారై బిక్కనవోలు ప్రాంతములకు వలసిపోయినటుల శివధర్మోత్తర ఖండములోని ఈ క్రింద పద్యములు తెలియచేయబడును.

*మ॥ ఘనుడాకాశ నృపాల శేఖరుడ, మున్‌గర్ణాట*
*దేశంబునందున దుర్గేది పతిత్వ వైభవముతోడు*
*గాంచి సుల్తాను పిల్పున గృష్ణానదిదాటి యా*
*మెదకు బల్ దుర్గంబు క్రిందన్ జిరం తనమూ బిక్క*
*నవోలనుండెనది యాత్రాస్థాన రాజంబుగన్*

కర్ణాటక దేశంలో ఉన్న ఘనత చెందిన రాజులలో సుల్తాను తన దుర్గమునకు కృష్ణానది అవతలకు పిలిపించుకొని మెదకు దుర్గం క్రిందనున్న బిక్కనవోలు రాజ్యంనకు అధిపతి చేశాడు. అట్లు వచ్చిన కాబారెడ్డి గారి కొమారుడు, పిలిపించిన సులతాను పేరు మాత్రం తెలియరాలేదు.

*తె.గీ. ఇప్పుగిది కాచరెడ్డి భూమీశ మౌళి*
*యెదురులేని పరాక్రమమొసగఁ మెసగ*
*నవని యేలంగ సుల్తాను మహమ్మదనెడు*
*హిందు పాదుష గోల్కొండ నేలుచుండె*

అను పద్యము వలన మహమ్మదు మాత్రం గోలుకొండ పరిపాలించేనని ఆ సమయంలో కృష్ణానది దాటి నిజాం రాష్ట్రంలోనికి అడుగుపెట్టినట్లుగా తెలుస్తున్నది. మల్లారెడ్డి యుక్తవయస్సులోనున్నప్పుడు అతని అన్నయగు కామిరెడ్డి పరిపాలించేవాడు. గోల్కొండ నవాబుల వద్ద మంచి పలుకుబడియున్నట్లుగా తెలుస్తున్నది. అతని పోషణలో మల్లారెడ్డి సంస్కృతాంధ్రములలో నైపుణ్యం సంపాదించెను. దానితో గ్రంథ రచన చేయుడం మొదలుపెట్టాడు. ఉమాపతీనిభ్యుదయముననొక విచిత్ర కథ చెప్పబడినది.

శ్రీరామాలయం కట్టింపవలయునని మల్లారెడ్డి నిశ్చయించి సామంతుల జయించి పన్నులు గొనిరా నిశ్చయించి సామంతులను జయించగ దేశాటనుగావించి సిద్ధసంకల్పుడై ద్రవ్యముతో బయలుదేరి వచ్చుచుండగా దేవగిరి వద్ద ప్రొద్దుక్రుంకెను. పరిజనమంతయు నటనిదురించెను. రాత్రి కాలమున శ్రీరామమూర్తి మల్లారెడ్డి స్వప్నములో ప్రత్యక్షమై తనయా రాక్షసుల బాధలకోర్వక దేవతలు విష్ణుమూర్తిని శ్రీరామావతారమెత్తమని ప్రార్థించిన చోటది. కావుననే దీనిని దేవగిరియని వ్యవహరింతురు. శైలాగ్రమమున నొక పుట్టగలదు. దాని చెంత నొక సీతారామ విగ్రహము కలదు. విశాల ఫణిముగల సర్పము విగ్రహమునకెండ తగులకుండా పడగ విప్పియుండెడి ఆ స్థలమును నీవు గుర్తించి దేవాలయం నిర్మింపుమని యాజ్ఞ యిచ్చి యంతర్ధానమయ్యెను. కలలో ఇచ్చిన ఆదేశము మేరకు శ్రీరాముని దర్శించి, ఆలయము కట్టించెను. ఇష్టదైవమయిన

శివాలయం కూడ నిర్మించెను. మల్లారెడ్డి కవి వ్రాసిన గ్రంథములలో *పద్మపురాణం, శివధర్మోత్తర ఖండము* షట్చక్రవర్తుల చరిత్రములు మాత్రమే ముద్రితములయ్యాయి. కొందరు తద్వంశీయుల కృతినొంది దానిని విమర్శ దృష్టితో చూడసాగిరి. మల్లారెడ్డి సిద్ధరామేశ్వరస్వామి భక్తుడు. ఈ దేవాలయం బిక్కనవోలుకు దక్షిణదిక్కున సిద్ధతీర్థము. సరస్తీరయున యున్నదని ఆధారాలు కలవు. పద్మపురాణమందున నీ యంశము స్థిరపడును.

*కం॥ బిక్కనవోల్ ఘనదక్షిణ*
*దిక్కున దురుసిద్ధతీర్థ తీరోన్నత స*
*మ్యక్కనక ప్రాసాదము*
*జక్కగ నెలకొన్న భక్తజన పాలనకున్*

మల్లారెడ్డి నివాస స్థానము బిక్కనవోలు గోదావరి మండలములోనిది కాదు. నిజాం రాష్ట్రములోనిది. పద్మపురాణమున కవి తన నివాస స్థానము ఈ క్రింద విధముగా వర్ణించినాడు.

*సీ॥ శ్రీ సిద్ధరామేశ శీతలాలో కన*
*సంజాత సమ్మద చంద్రకంబు*
*శ్రీ వెంకటేశ వక్షో వైజయంతికా*
*గంధానిల విహార బందురంబు*
*భద్రాదాయక వీరభద్రమహోత్సవమ్*
*బాహాబలాక్రాంత పాలితంబు*
*మైలారి లింగ పూజాలబ్ధ నిఖిలార్థ*
*సంపత్తి సుఖిత ప్రజావ్రజంబు*
*తే॥గీ॥ వెలయఁ నభ్రంకషాదీప్త విఫణి సౌధ*
*గోపురో పదవ తటాక కుంజురాశ్వ*
*రథ భటాది నిరంతరా రాతి హృదయ*
*ఘట్టనంబగు బిక్కనోల్పట్టంబు*

మల్లారెడ్డి తన యగ్రజుడగు కామరెడ్డి యొవరించిన ధర్మముల బెక్కులుగ్గడించుచు నాతడు నిర్మించిన గ్రామముల నిటుల బోర్కొని శివధర్మోత్తరము వ్రాసియున్నాడు.

*సీ॥ తన గురూత్తమ పేర జనకునిపేరును*
*ఆనయన్న పేరును ఆనదు పేరఁ*
*దమ్ముల పేరున తనయ పేరిటఁదల్లి*
*పేరును సోదర పేర భార్య*
*పేర మరదలి పేరును లింగా పు*
*రంబును గాధాపురంబుజంగ*
*మారెడ్డి పురము కామారెడ్డినెల్ల*
*రెడ్డిపేటయు మల్లారెడ్డి కామె*
*తే॥గీ॥ రెడ్డిపేటలు తిష్టాపురంబు సిరుల*
*బొదలు లింగాపురంబును బోతసాని*
*పల్లెయును మించగట్టించెభవ్యకీర్తి*
*ప్రభలేమాయన్న శ్రీకామిరెడ్డి ఘనుడు*

తన పేరు, అన్న పేరు, సోదరి పేరు మరదలి పేరు తన తల్లి పేరున వెలసిన పురము లింగాపురము ఆ పురమే మా రెడ్డిపురము. ఆ రెడ్డిపేటకు మల్లారెడ్డియే ఘనుడని చాటిన పద్యాలు వ్రాశారు.

నిజాం రాష్ట్రంలోని దోమకొండ సంస్థానం ప్రభావులైన మిగుల ప్రఖ్యాతలైనారు. వారి ఆదరణముతోడనే మల్లారెడ్డి *శివధర్మోత్తరము, పద్మపురాణములను* మన ఆంధ్రులకు చదువ అవకాశము కలిగెను. ఇలాంటి రెడ్డి రాజుల కాలంనాటి ప్రముఖ కవి మల్లారెడ్డి గురించి మనకు తెలియజేసినారు శ్రీ దూపాటి శేషాద్రి రమణ కవులు తెలంగాణా శతావధానులుగా మనకు దొరకటం మన అదృష్టం.

రచన : ధూపాటి శేషాద్రి రమణ కవులు
సేకరణ : ధూపాటి శేషకుమారాచార్యులు
రేడియో రచయిత, హైదరాబాద్.
ఫోన్ : 944 188 4744

## షోపెన్ హావర్ – మంచిమాటలు

- ఆత్మహత్య పిరికిపంద లక్షణమంటారు. అనైతికమంటారు. కాని ఈ లోకంలో బతికివున్న ప్రతి వ్యక్తికీ ఉన్న ఒకే ఒక హక్కు అది.
- జీనియస్‌లందరిదీ ఒంటరి బతుకే.
- ప్రజాభిప్రాయం గడియారానికున్న పెండ్యులంలాంటిది. ఎప్పుడూ కుడిఎడమలకు తిరుగుతూనే ఉంటుంది.
- ఏ అర్హతా లేనివాడు కూడా ఆత్మత్యాగం వల్ల పేరు గడిస్తాడు.
- మతం మనుషుల్ని సర్కస్ జంతువుల్లా తయారుచేసింది. ఎవరు ఎలా ఆలోచించాలో, ఎలా ప్రవర్తించాలో నేర్పించింది.

# చరిత్రలో ఆవిష్కృతమైన అద్భుత సంఘటన

స్టాన్‌ఫోర్డ్ యూనివర్శిటీలో 1892లో జరిగిన వాస్తవ సంఘటన

18 సంవత్సరాల ఆ యువకుడు ఫీజులు కట్టలేక ఏమిచేయాలో తెలీని స్థితిలో ఉన్నాడు.

అతడూ అతడి స్నేహితుడూ కలిసి ఒక పథకం ఆలోచించారు. వాళ్ళ యూనివర్శిటీలో ఒక సంగీత కచేరీ ఏర్పాటు చేద్దామనీ, అందులో ఖర్చులు పోను మిగిలినదానితో తమ ఫీజులు కట్టెయ్యవచ్చు అనీ ఆశించారు.

అప్పట్లో గొప్ప పియానో వాద్యకారుడు Ignace J. Paderewski వద్దకు వెళ్ళారు. ఆయన గారి మేనేజరు ఫీజురూపంలో 2000 డాలర్లు కనీస మొత్తంగా ఇవ్వాలనీ, ఆ పైన ఇతర ఖర్చులు అనీ చెప్పగా అలాగే ఒప్పందం చేసుకున్నారు. టికెట్లు అమ్మడం సాగించారు. అనుకున్న రోజు వచ్చింది. ప్రోగ్రాం అద్భుతంగా జరిగింది. అయితే, వీళ్ళు ఆశించినట్లు వసూళ్ళు రాలేదు. మొత్తం 1600 డాలర్లు మాత్రమే వచ్చింది.

వాళ్ళు పడొరెస్కీ దగ్గరకు వెళ్ళారు. వసూలు అయిన మొత్తమూ, దానితోపాటు 400 డాలర్లకు చెక్కు పట్టుకువెళ్ళి జరిగిన విషయం చెప్పారు. సాధ్యమైనంత త్వరలో ఆ మిగిలిన సొమ్ము చెల్లిస్తామని, క్షమించమని అన్నారు.

వాళ్ళ గురించి పడొరెస్కీకి తెలియదు. ఆయన వాళ్ళని అంతకు ముందు చూడలేదు. ఆయన ఆ చెక్కును చింపేశాడు. 1600 డాలర్లూ వాళ్ళ చేతిలో పెడుతూ ఆయన ఇలా అన్నాడు : మీకు అయిన ఖర్చు ఎంతో లెక్కపెట్టుకోండి. మీ ఫీజులకు ఎంత అవుతుందో అది కూడా ఇందులో నుండి మినహాయించుకోండి. ఏమైనా మిగిలితే ఆ మిగిలిన సొమ్ము నాకు తెచ్చి ఇవ్వండి."

ఈ సంఘటన పడొరెస్కీ మానవతను చాటిచెబుతుంది. తనకు తెలియని, తనకు ఏమీ కానివారివలన ఎటువంటి ప్రయోజనమూ ఆశించకుండా తన శ్రమనూ, ఆదాయాన్నీ ఇవ్వడం పడొరెస్కీ హృదయం గురించి చెబుతోందికదూ!

మనలో చాలామందిమి అనుకుంటాం "నేను అతడికి సహాయం చేస్తే నాకేమిటి ప్రయోజనం?"

పడొరెస్కీ అనుకున్నాడు "నేను సహాయపడకపోతే వాళ్ళకి ఎవరు సహాయపడతారు?" అని.

అదే ఉత్తములకీ మనకీ తేడా!

ఇది ఇక్కడితో ఆగిపోలేదు.

పడొరెస్కీ తర్వాతి కాలంలో పోలాండ్ ప్రధాని అయ్యాడు.

రెండో ప్రపంచ యుద్ధంలో పోలాండ్ సర్వనాశనం అయిపోయింది. 15 లక్షలమంది ఆకలితో అలమటించే స్థితికి చేరారు.

పడొరెస్కీకి ఏమిచెయ్యాలో తోచలేదు. ఎవరిని అడగాలో దిక్కు తోచలేదు. చివరికి అమెరికా ఆహార, పునరావాస విభాగాన్ని సంప్రదించాడు. దానికి అధిపతి Herbert Hoover. ఇతడే తర్వాత అమెరికా అధ్యక్షుడు కూడా అయ్యాడు. అతడు వెంటనే ప్రతిస్పందించాడు. టన్నులకొద్దీ ఆహారపదార్థాలు పోలాండ్‌కు సరఫరా జరిగింది. పోలాండ్‌లో ఆహార సంక్షోభం నివారించబడింది.

Herbert Hoover చేసిన సహాయానికి కృతజ్ఞతలు చెప్పడానికి పడొరెస్కీ అమెరికా వెళ్ళి హూవర్‌ను కలిశాడు. కృతజ్ఞతలు చెబుతూ ఉండగా హూవర్, "కొన్ని సంవత్సరాల క్రితం మీరు కాలేజీ ఫీజులు కట్టలేని ఇద్దరు యువకులకు సహాయం చేశారు, వారిలో నేనూ ఒకడిని" పడొరెస్కీ ఆశ్చర్యపోతుండగా చెప్పాడు.

ఈ ప్రపంచం ఒక అద్భుతమైన ప్రదేశం. నీవు ఏది ఇస్తావో దానిని నీవు అనేక రెట్లు పొందుతావు అనే గీతాసారం గుర్తురావటం లేదూ?

దేవినేని మధుసూధనరావు
(ప్రస్తుతం అమెరికా పర్యటనలో)

# షాజహానా కవిత్వం

– దిలవార్

అస్తిత్వవాదం నేడు, ఎన్నడూ లేనంత ఉచ్ఛ్రవంతో వినిపిస్తున్నది. దళిత, బహుజన, మైనారిటీ, స్త్రీవాదాలు అస్తిత్వవాదంలోని భాగాలే. అందునా మైనారిటీవాదానికి ఒక ప్రత్యేకమైన ధిక్కారస్వరం. హిందూ మతతత్వ వాదానికి వ్యతిరేకంగా, బ్రాహ్మణవాద ఆధిపత్యానికి వ్యతిరేకంగా, వారి అన్నిరకాల అణచివేతలకు వ్యతిరేకంగా, తమ ఆత్మగౌరవాన్ని, ఉనికిని సగౌరవంగా, ఆత్మవిశ్వాసంతో ఎలుగెత్తి చాటుతున్న బలమైన గొంతుక నేటి మైనారిటీ కవిత్వానిది.

జనరలైజ్ చేయబడిన స్త్రీవాదం ఎటూ ఉండనే ఉంది. అస్తిత్వవాదంలో ఒక భాగమే స్త్రీవాదం. మళ్ళీ అందులో ఒక ప్రత్యేకమైన పాయ ముస్లిం స్త్రీవాదం. అణచివేయబడిన, అవహేళనలకు గురికాబడిన 'దూదేకుల' వర్గం కూడా మైనారిటీల్లో ఒకటే. మళ్ళీ దూదేకుల వర్గంలో స్త్రీల దయనీయమైన అస్తిత్వం! శ్రీశ్రీ చెప్పినట్టు బానిసకొక, బానిసకొక, బానిసలా ఉందన్నమాట మైనారిటీ స్త్రీల పరిస్థితి.

తెలుగు సాహిత్యాకాశంలోకి ఒక మెరుపులా దూసుకొచ్చింది షాజహానా. సుడిగాలిలా సుడివేసింది. ఎగసిపడే సముద్రపు కెరటంలా హోరెత్తింది. ముస్లిం స్త్రీవాదాన్ని మెరుపులు మెరిపించింది. రాజీపడటం ఎరుగని కవయిత్రి షాజహానా. అది బయటివారి నుంచైనా, తమవారినుంచైనా ఎలాంటి ఆధిపత్యం, అణచివేతలు ఎదురైనా 'బోల్డ్'గా ఎదుర్కొనే గట్స్ ఉన్న కవయిత్రి. మనవాద సమాజాన్నైనా, తన 'షరియత్'ల సమాజాన్నైనా తీవ్ర ధిక్కార స్వరంతో ప్రశ్నించగల ధైర్యం ఆమె సొంతం. దళిత బహుజనులు హిందూత్వ ఆధిపత్యాన్ని ప్రశ్నించినట్టే తమ మతంలోని లొసుగులను ఎండగట్టడానికి కూడా వెనుకాడలేదు మైనారిటీ కవులు. తమ మతాన్ని ఉపేక్షించుకుంటూ రాయడం వల్ల ఒక సమతౌల్యాన్ని సాధించారీ కవులు. అందువల్లనే దళిత వాదం కంటే భిన్నంగా ఒక ప్రత్యేకతను సంతరించుకున్నది మైనారిటీ కవిత్వం.

షాజహానా ఇప్పటివరకు నఖాబ్ (ఇది **మిసిమి**లో ప్రచురించారు), దర్దీ అన్న రెండు కవితా సంపుటులు ప్రచురించింది. కవితావేశం, భావావేశం, భావోద్వేగం, స్వర తీవ్రత – రెంటిలోనూ ప్రతిభావంతంగా చిత్రించింది.

ఇక ఆమె కవిత్వావరణంలోకి ప్రవేశించుదాం.

*'నాకు, పక్కింటికి / బిన్‌లాడెన్ సరిహద్దయిందు'*

అని 'అపరిచిత' అన్న కవితలో అంటుంది షాజహానా. సాధారణంగా ఇరుగు పొరుగుల ఇండ్ల మధ్య రాళ్ళతోనో, ఇటుకలతోనో కట్టిన గోడలో, ఇనుప ముళ్ళ కంచెలో సరిహద్దులుగా ఉంటాయి. కానీ ఇక్కడ షాజహానా ఇంటికీ, పక్కింటికీ మధ్య 'బిన్ లాడెన్' సరిహద్దయిందట. షాజహానా వ్యక్తిగతంగా కాక ముస్లింలందరికీ ప్రాతినిధ్యం వహిస్తున్నది. ముస్లింల ఇండ్లకు ఎవరొచ్చినా అనుమానపు నీడలే. పాకిస్తానీయులో, ఉగ్రవాదులో వచ్చినట్టే. ముస్లిం జీహాదీలు వచ్చినట్టే.

*'ప్రతి ఒక్కడి రాజ్యానికి రక్తం బలికావాలి / సరిహద్దుల్లో తొణికేట్టుగా మతం కావాలి / జాతీయంగానో అంతర్జాతీయంగానో / ఏం జరిగినా..... హఠాత్తుగా నా పరిసరాల్లో/నేను అపరిచితనైపోతాను...'*

షాజహానా విమర్శించడంలో తనవారికీ మినహాయింపు లేదు. అందుకే 'ప్రతి ఒక్కడి రాజ్యానికి రక్తం బలికావాలి' అంటుంది. ఇదివరకు యుద్ధాలంటే సాధారణంగా సామ్రాజ్య విస్తరణ కాంక్ష ప్రధాన పాత్ర వహించేది. కానీ ఇప్పుడు యుద్ధాల స్వరూపాలు మారిపోయాయి. పరమత ద్వేషం, అసహనాలే ప్రధాన కారణాలవుతున్నాయి. 'సరిహద్దుల్లో తొణికేట్టుగా మతం కావాలి' అన్న చరణంలో ఈ భావనే తొంగి చూస్తున్నది. నేడు ముస్లింలు నిత్యశంకితులుగా, అడుగడుగునా తమ విశ్వసనీయతను ప్రకటించుకోవలసిన చిత్రమైన పరిస్థితి నెలకొని ఉన్నది. దేశం గర్వించదగ్గ, అంతర్జాతీయ ఖ్యాతినార్జించిన సానియా మీర్జాకు కూడా పదేపదే ఈ చిత్రమైన పరిస్థితి ఎదురైందంటే పరిస్థితి తీవ్రతను

అంచనా వేయవచ్చు.

'ఇన్సానియత్' అన్న మరొక కవితలో –

*'ఈ క్షణం హత్యించబడ్తున్న / మనుషుల గురించి, మసీదుల గురించి కన్నీళ్ళుగానో కవిత్వంగానో పలవరిస్తాను / ఈ మట్టిలో కలసిన మా రక్తమాంసాలను / చేతనైతే జల్లెడ పట్టండి / ఈ భూమిలో మమేకమైన మా మనసులను / విడగొట్టగలరేమో చూద్దాం'*

'భారత జాతీయత అనే అవిభాజ్య సమైక్యతాభావంలో నేనూ ఒక అంశం. ఈ గొప్ప సౌధంలో నేను విడదీయరాని భాగాన్ని. నేను లేకుండా ఈ సుందర సౌధం అసంపూర్తిగానే మిగిలిపోతుంది' అని తన దేశభక్తిని తన్మయత్వంతో ప్రకటించుకున్నాడు మౌలానా అబుల్ కలాం ఆజాద్. 'ఈ మట్టిలో మట్టిగా కలిసిపోయిన మా రక్తమాంసాలను చేతనైతే జల్లెడ పట్టండి' అన్న షాజహానా చరణంలో ఆ సమైక్యతా భావమే అణువు అణువునా నిండి ఉంది. తన దేశభక్తిని ప్రకటించుకుంటూనే–

*'ఎప్పుడో కూల్చబడ్డ దేవాలయాల బరువు / ఇప్పటి నా భుజాలపై వేయొద్దు / నొప్పితో సలుపుతున్న గాయాల్ని / కవిత్వీకరించుకుంటున్న మమ్మల్ని / ఈగల్లా మతవాదులమన్న ముద్రతో సతాయించవద్దు*

అంటూ నిష్ఠురమే అయినా నిజాన్ని ప్రకటిస్తున్నది 'ఇన్సానియత్' అన్న కవితలో. 'ఒంటరి కఫన్' అన్నది ఒక బలమైన కవిత. దీనిలోని భావచిత్రాలు వేరే సందర్భం కోసం రాయబడి ఉండొచ్చు. కాని గుజరాతీ గాయాన్ని తప్పక 'సెల'వేస్తాయి ఈ image లు.

> *'పుట్టక ముందే / మత క్రూరత్వపు కత్తి మొన మీద దిగబడేసిన పసిబిడ్డ దేహంలోంచి మాట్లాడుతున్నాను'*

అని దుర్భర దుఃఖాన్ని దిగమింగుతూ అంటుంది షాజహానా.

> *'ఆకాశాన్ని చీరి / చందమామని లాగిపారేస్తే / చీకటి రక్తపు అమావాస్య / ఆ తల్లి కడుపులోంచి మాట్లాడుతున్నాను'*

అని దుఃఖోద్వేగంతో చలించిపోయి అంటుంది షాజహానా. ఈ గుజరాత్ అమానుషత్వానికి బలి అయి సర్వస్వాన్నీ కోల్పోయిన ఓ అమాయకుని కళ్ళలో ఇంకా తారట్లాడుతున్న తాలూకు నీలి నీడల్ని 'మెహమాన్' అన్న కవితలో ఒడిసిపట్టుకుంది షాజహానా. అతని దయనీయ, భీతావహ మానసిక స్థితిని హృదయాలు ద్రవించేట్టు చిత్రించింది.

అతనికేం ఇష్టమని అడిగితే 'నా కుటుంబంతో కలిసి తినడం' అంటాడు అతిథి. లోపలేముందో తెలియని పూడుకుపోయిన బావిలా ఉన్నాడట అతను. నమ్మకం కోల్పోయిన బెదురు చూపులతో సందేహిస్తూ ఉన్నాడట. మెతకు మెతుక్కూ కుటుంబాన్ని కలవరిస్తూ తింటున్నట్టు లేడట – ఏతమేసి అంతర్లీన సముద్రాల దుఃఖాన్ని తోడుతున్నట్టున్నాడట. 'ఇంకా దొరకని తమ్ముడు..... ఎత్తుకెళ్ళిన అక్క, ధ్వంసమైన కుటుంబాలు, దూరమైన వతన్, పలవరింతై నామరూపాల్లేని తమ గల్లీని, నాశనమైన దోస్తులని, రూపు కోల్పోయిన ఊళ్ళని, చిందరవందరైన జాతిని తలచి, కళ్ళు రెండూ సరిపోక సమస్త దేహంతో దుఃఖిస్తున్నట్టున్నాడట' – మనసుల్ని తొలిచివేస్తూ, హృదయాలను కలచివేస్తూ చాన్నాళ్ళ దాకా వెంటాడే ఆర్ద్రమైన కవిత ఇది.

ముస్లిం వాద కవిత్వంలో ఓ ప్రత్యేకత ఉన్నది. కేవలం ముస్లింల తరపున 'హిందూత్వ' ఆధిపత్యాన్ని ప్రశ్నించడం, వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ ఆధిపత్య స్థితిగతులను సాహిత్యీకరించడం మాత్రమే కాదు, ముస్లింల మతఛాందసత్వాన్ని ఎత్తిచూపుతూ సంస్కరణల అనివార్యతను, వాటి ప్రాధాన్యతలను కవిత్వీకరించడం, ముస్లిం స్త్రీవాద సాహిత్యాన్ని సృష్టించడం కూడా ముస్లిం వాద కవిత్వంలోని భాగమే. అంటే బాహిర్ వ్యతిరేక శక్తులతో పోరాటం మాత్రమే కాక అంతర్ అభివృద్ధి నిరోధక శక్తులతో కూడా పోరాడే సాహిత్యం సృష్టించడమన్నమాట. ఈ మౌలికాంశాలను చాలా ప్రతిభావంతంగా చిత్రించింది షాజహానా. ఇందుకు ఉదాహరణగా షాజహానా రాసిన అనేక కవితలను చూపించవచ్చు.

> *'న అల్లా / నా పురుషుడూ / నా మతమూ పెట్టే హింసే అనుకుంటే నీ దేముడు / నీ పురుషుడు / నీ మతమూ....*
>
> *గుడ్డల్ని చీరి పీలికలు చేసినట్టు / మా దేహాల్ని చీల్చేస్తుంటే...'*

మతహింసకు తర తమ భేదాల్లేవు అంటుంది. ఎక్కడ ఏ గొడవ జరిగినా ముందుగా స్త్రీల మానప్రాణాలే పేలాలై గాలిలోకెగురుతాయి అని ఒక సార్వజనీన సత్యాన్ని కవిత్వీకరిస్తుంది. ఇంతకు ముందే చెప్పుకున్నట్టు కేవలం బాహిర్ పోరాటం మాత్రమే కాక తన మతంలోని, సంప్రదాయాల్లోని, సంస్కృతిలోని లొసుగుల్ని కూడా ధైర్యంగా ఎండగడుతుంది షాజహానా. ముస్లిం మతఛాందస సంప్రదాయానిల్లోని పురుషాధిపత్యాన్ని అనేక కోణాల్లో భావోద్వేగాల వీరావేశంతో శక్తివంతంగా నిరసిస్తుంది. ముస్లిం స్త్రీల అణచివేతను, వారిపట్ల ప్రదర్శితమవుతున్న వివక్షను చీల్చిచెండాడుతుంది.

*'రసాన్నంతా జుర్రుకొని బతుకుల్ని డొల్లచేసి*
*పరదాల పిరమిడ్‌లలో ప్రాణంలేని మమ్మీలుగా చేసి*
*మమ్మల్ని మౌనమాంసాలుగా / ఉత్పత్తి యంత్రాలుగా బతకమన్న*
*మీ సంప్రదాయానికో సలాం'*

అంటూ పట్టరాని ఆవేశంతో విరుచుకుపడుతుంది 'ఖబడ్దార్' అన్న కవితలో.

*'ముప్పైసార్లు తలాఖ్‌లు చెప్పి / నువ్వైతే ముప్పైమూడుసార్లు*
*నిఖా పేరుమీద / నిఖార్సైన వ్యభిచారం బహిరంగంగా చెయ్యొచ్చు*
*దయామయుడైన అల్లా ఏ ఆంక్షలు విధించడు.*
*నేను మాత్రం కలుగులో ఎలుకలా / చీకటి మహల్‌లో ఒంటరి*
*దయ్యాన్నై / నీ సరదాల మంచానికి / నేను ఏదో కోడునై*
*శాశ్వతంగా పాతుకుపోవాలి' అంటే 'ఖౌసేఖిజా'*

అన్న కవితలో సంప్రదాయాన్ని ఈసడిస్తుంది. 'ఖౌసేఖిజా' అంటే ఇంద్రధనుస్సు అని అర్థం. తన కవితకు ఆ పేరెందుకు పెట్టిందో చివరలో చర్చిద్దాం.

*'ఏ పరదాల మాటున ఎంత నైరాశ్యం గూడుకట్టుకొని ఉందో....?*
*ఏఏ మహాస్వప్నాలు ఒంటరి పరదాల గుహలలో*
*బలైపోతున్నాయో......?*
*ఎన్ని ఆశలు - ఆశయాల కిరణాలు*
*చీకటి పరదాల మాటున మొక్కవోయి ఉన్నాయో.....?*
*జీవితం పర్దాలమాటున ఖైదీ అయిన చోట*
*అణగదొక్కబడుతున్న కొద్దీ ఆడదాన్ని అణచాలనుకునే*
*వెర్రి ఆచారాల మర్రి వృక్షాలున్నచోట*
*ఒక్కసారి ముసుగుతీసి చూడు....'*

అని 'పర్దా హటాకె దేఖో...!' అన్న కవితలో అంటుంది కవయిత్రి. ఆక్రోశం, ఆవేశం, ఆవేదనా ముప్పేటగా అల్లుకున్న కవిత ఇది. ముస్లిం స్త్రీకి కూడా సాధారణ స్త్రీకున్న సమస్యలు ఉండనే ఉన్నాయి. కాకపోతే ముస్లిం స్త్రీకి అదనపు సమస్యలున్నాయి. ముస్లిం స్త్రీల ప్రత్యేక జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, మతఛాందసత్వం, మత సంబంధమైన షరియత్‌లు ముస్లిం స్త్రీల ప్రత్యేక సమస్యలకు, వారి కష్టాలకు, కడగండ్లకు కారణభూతమవుతున్నాయి.

*'ఆంక్షల్లో, హద్దుల్లోనే ఆడబానిసగా పెద్దయి / ఇవ్వాల్టి పద్నాలుగేళ్ళ - నా వసంతాన్ని / అరవై ఏళ్ళ శిశిరానికంకితమియ్యమంటే నా అందం వెనకున్న రక్తమాంసాల్ని / అరబ్బు షేకు దేక్కళ్ళతో పీల్చేస్తుంటే / నా శరీరం ముద్దకు వాడ వెలకడుతోంటే / కటికోడు కిలోల కొద్దీ మాంసం అమ్మినట్టు / కిరాతకంగా నన్ను వ్యభిచార బానిసగా అమ్మేస్తుంటే... / స్వేచ్ఛ; కనీసం వినటానికిక్కూడా నిషేధింపబడినదాన్ని! / కలలో అనుభూతించటానికిక్కూడా అర్హత లేనిదాన్ని!'*

'పర్దా హటాకే దేఖో...' అన్న కవితలోని పాదాలివి. పాతబస్తీ సాక్షిగా ఎంతమంది అమాయక అమీనాల, ఎంతమంది ఫాతిమాల, ఎంతమంది పర్వీన్‌ల మాంసం అరబ్బు పులులకు ఆహారంగా వేయబడుతున్నదో తలచుకుంటే ఇప్పుడు కూడా ఒళ్ళు జలదరిస్తుంది, కంపరమెత్తుతుంది. ముస్లిం స్త్రీల సమస్త శక్తుల్నీ దోపిడీ చేస్తూ, వారి స్వేచ్ఛను యథేచ్ఛగా కబళిస్తూ దారుణ హింసకు గురిచేస్తూ ఆధిపత్యం చలాయించే ముస్లిం పురుషుల క్రౌర్యాన్ని ప్రపంచానికి చాటుతున్నది షాజహానా. ఆలోచించడానికే భయమేసే ఇలాంటి పైశాచిక కవిత్వాన్ని నిర్భయంగా, పునాదులు కదిలేట్టుగా లోకానికి చాటిచెపుతున్నది.

*'నా వెనుకటి తరాలకే కాదు / ముందు తరాల వెనుకబాటుకీ కొనసాగింపు అతడే! / గడపకవతలకి పాదం జారినా / చూపు ఏ కొత్త దృశ్యంగా ప్రవహించినా / గుబులై తీరని దిగులై / అధికారపు ఉచ్చులో బంధించేస్తాడు / ఎన్ని ఆంక్షల ముగుతాళ్ళనో మోస్తున్న నిస్సహాయురాలిని / ఎంతటి క్రూర కౌగిలింతల్లైనా / ఆలిగిస్తున్నదాన్ని*

అని అంటుంది 'థుత్కార్' అన్న కవితలో. పురుషాధిపత్య చీకటి కోణాలను అది ఎన్ని రూపాలలో ఉన్నా బట్టబయలు చేస్తుంది షాజహానా. లింగవివక్ష కారణంగా స్త్రీల హక్కుల్ని దారుణంగా అణచివేతకు గురిచేస్తున్నారు పురుషులు. ఆ వివక్షను ప్రశ్నించేదే ఫెమినిజం. ఇది మొదట పాశ్చాత్య దేశాల్లో మొదలైంది. మేరీవోల్ స్టోన్‌క్రాఫ్ట్ రాసిన *indication of the rights of women* అన్న పుస్తకంలోనూ, సైమన్ ది బోవియర్ రాసిన *second sex* అన్న పుస్తకంలోనూ, ఆమె రాసిన 'సెక్సుయల్ పాలిటిక్స్' అన్న పుస్తకంలోనూ ఫెమినిజం విపులంగా వివరించబడింది. 'ఏ ప్రాణి అయినా స్త్రీగా పుట్టదు. స్త్రీగా రూపొందుతుంది. నాగరికత మొత్తమంతా కూడి ఆ ప్రాణిని సృష్టిస్తుంది' అని అంటుంది సైమన్ ది బోవియర్. 'ఇప్పటి వరకూ పురుషుడి దృష్ట్యా ఉన్న మానవ ప్రపంచాన్ని స్త్రీలు తమ దృష్ట్యా చూడటం, మాట్లాడటం, రాయటం, అంతిమంగా మార్చడం స్త్రీవాదం. ఈ పని చేస్తున్న వారు స్త్రీవాదులు' అని అభిప్రాయపడింది ఒక ఫెమినిస్టు రచయిత్రి. మతం, తండ్రీ, మొగుడూ - అణచివేత ఏ రూపంలో ఉన్నా ఆ ఉక్కు సంకెళ్ళలోంచి బయటపడటానికి తీవ్రమైన

పెనుగులాట కనిపిస్తుంది షాజహానా కవిత్వంలో.

*'నీ కళ్ళు కురిపిస్తున్న ప్రేమధారని గుర్తించకే కాబోలు / అబ్బాజాన్ నిరంతరం పరాయి నిషాలలోకి తూలుతుంటాడు / బట్టలకు అత్తరతద్దుకున్నట్టు / శరీరానికి ఔరత్‌ల అందాల / నద్దుకోవాలని ఆరాటపడుతుంటాడు / తెల్లపావురాయిలా భయంగా ఒదిగే నీపై అనుమానపు కీలల్ని మోహరిస్తాడు / మాటల కమ్చీలతో నీ పారదర్శక అందాలలో / పరపురుషుల నీడల్ని కెలుకుతుంటాడు / పెళ్ళయిన ఐదార్నెల్లకే జిందగీ జహరని / కొత్త పాఠాలు నేర్పి ఉంటాడు.*
*............. / ఏ కాలానికీ తీరని అతని ఇసుక పొరల / దేహదాహంలో ప్రవహించీ ప్రవహించీ / జీవనదిలాంటి నువ్వు ఇంకిపొయ్యావు'*

అని అంటుంది 'తస్వీర్' అన్న తన కవితలో షాజహానా. ఘూంఘట్ తెరవెనక ఉన్న తన తల్లి ముగ్ధమనోహర చాంద్ మాఁ లాంటి – పెళ్ళి ఫోటోలోని అందాన్ని తలచుకుంటూ చెప్పిన కవిత ఇది. జవజీవాలున్న పదచిత్రాలలో తన తల్లి అందాల్ని, భోలీపనాను పొదిగి అందంగా తీర్చిదిద్దిన తస్వీర్ ఇది. అయితే ఆ అందాలను తండ్రి ఎలా రాచి రంపాన పెట్టాడో patheticగా చెబుతుంది. అతని అనుమాన దృక్కులను ఎక్స్‌రే తీసి ప్రదర్శిస్తుంది. ఆత్మాశ్రయంగా చెప్పినా సాధారణీకరించబడిన కవితే ఇది.

*'నిజంగా నికాహ్ కుబూలే... / షాదీ ఐన్నాటినుండీ / నేను అతని హవాలా అయిన్నాటినుండీ / ఆకాశమంత నవ్వుని కత్తిరించి / చిర్నవ్వుగా మార్చాడు! / నన్ను బావిలో ఊటని చేశాడు / ఎవరితో మాట్లాడినా నరాలు తెగ్గొట్టే హావభావాలు! / మాటలెక్కడా మనసులెక్కడా కన్నీళ్ళతోపాటు అవెప్పుడో రాలిపొయ్యాయి / నామాట నా నవ్వు... అన్నీ నిషేధాలైపొయ్యాయ్ / పెదవుల తలుపులెప్పుడూ / అతని ఆజ్ఞల బీగాలను బిగించుకొనుండాలి / ప్రతి అనుభూతినీ గుండెలో రిజర్వ్ చేసుకొని / ఏ అర్ధరాత్రో అతని కామం లాకులెత్తినపుడు / నేను నవరస నాయికనై ప్రవహించాలి / కదలని అతని కాలం ఓడకి నేనో తెరచాప...'*

పెళ్ళి స్త్రీని ఎంతటి పరాధీనతలోకి నెట్టివేస్తుందో కళ్ళకు కట్టినట్టు చిత్రించిన కవిత ఈ గూంగ. మాట, నవ్వు, హావభావాలు, అనుభూతులు, కలలూ అన్నీ నిషేధాలైనచోట ఏ స్త్రీకైనా పెళ్ళి సంతోషదాయకమనీ, అనివార్యమనీ భరోసా కలగదు. పెళ్ళి గురించి సావిత్రి కూడా ఒక బలమైన, ప్రసిద్ధమైన కవిత రాసింది. అయితే దానిలో వ్యంగ్యం పాళ్ళు ఎక్కువ. షాజహానా కవితలో సీరియస్‌నెస్ ఎక్కువ. ఆక్రోశంతో చెప్పినట్టే ఉంటుంది. కాని అంతర్లీనంగా గుండెను మెత్తగా కోసే pathos నిండుగా ప్రవహిస్తూ ఉంటుంది.

*'కాటుక కళ్ళ మత్తులో సోలిపోయే ఏ ఒక్కడూ / కాటుక చాటు కన్నీటిని స్పృశించడు / రివాజుల మోనాస్టరీలో / ఊపిరాడని బతుకులకేసి తొంగి చూడ్డు / నెలవంకల అందాల వెనుక / ఆకాశమంత చీకటిని ఎవ్వడూ పట్టించుకోడు'*

అని అంటుంది 'అనార్కలి' అన్న కవితలో. తమకు సుఖాలనివ్వడానికే స్త్రీల అందాలున్నది అని పురుషునికో వెర్రి నమ్మకం. ఆ నమ్మకం పురుషుని అహంలోని భాగమే. ఆ అందాల నెలవంక కల వెనుక ఎంత దిగులూ, ఎంత గుబులూ, ఎంత నైరాశ్యం, ఎంత శూన్యం అలుముకొని ఉంటాయో ఏ పురుషుడూ ఆలోచించడు. అన్యాపదేశంగా అనార్కలిని అడ్డంపెట్టుకొని రాసినా, నిజానికి త్యాగమయి అయిన ఏ ప్రేమికురాలికైనా అన్వయించవచ్చు. ఏ ప్రేమ తాపసి విలవిలలాడినా నువ్వే గుర్తుకొస్తావు. గుండెలో నెగడువై రక్తాన్ని మరిగిస్తుంటావ్! అంటూ ప్రేమకు బలి అయిన అభాగినుల వెతలను తలపోస్తున్నది షాజహానా. తాపమో.. ప్రేమో... కోరికో... తడి లేకుండా పోవడానికి స్త్రీలు ఎడారులు కారు కదా! మనిషికి నిద్ర, ఆహారం ఎంత అవసరమో కోరిక తీరడం కూడా అంతే అవసరం. సహజాతాలకు లింగవివక్ష ఉంటుందా? కాటుక కళ్ళు – వాటి వెనుక ఉన్న కన్నీరు, నెలవంకల అందాలు వాటి వెనుక ఉన్న ఆకాశమంత చీకటి – ఇలా విలోమ అభివ్యక్తితో కవితకు బలం చేకూర్చింది కవయిత్రి. సాధారణంగా కవులు నాస్టాలజియా నుంచి తప్పించుకోలేరు. గతంలోని వస్తువులపై, ప్రదేశాలపై, అంశాలపై, మనుషులపై, జ్ఞాపకాలపై అనురాగంతో కూడిన తీవ్రమైన మక్కువ ఉంటుంది కాబట్టి వాటిని వ్యక్తీకరించేటప్పుడు గొప్ప పారవశ్యానికి లోనవుతాడు కవి. షాజహానా కూడా అందుకు భిన్నం కాదు. 'ఎత' అన్న కవితలో తన అమ్మమ్మ జ్ఞాపకాలను తలపోసుకుంటూ ఉద్విగ్న మనస్కురాలు అవుతుంది షాజహానా.

*'ఆ చేన్ల ఈ చేన్ల, ఏరకొచ్చిన లేత కంకుల ఊసబియ్యం / గ్యాపకం పొట్టుబడని గింజై / గొంతడ్డం పడతంది / ........ / ఉప్పుటేర్లు పారుతున్న ఊర్లై / సుక్కల్ల సెంద్రునోల్లై / మురిపించుకుంట ఒక్క మంచి నీల్ల బాయి... / కుండనిండ నీల్లతోని మైళ్ళునడిచీ... / కావడి బద్దయిన నడుము! / నానీమా! పాన్‌దాన్‌ల నీ పచ్చటి ఆకులు / నీ బత్కులెక్కెండిపాయె... / నా లేత అరచేతుల్ల మైదాకోల్లై / ఎర్రగ పండిన నీ నోరు / ఎలిసిపోయిన ఎడారయ్యె....'*

అంటూ తన అమ్మమ్మ దీనావస్థను విచారంగా తలచుకుంటున్నది. వరంగల్ జిల్లా మహబూబాబాద్ తాలూకాలో రాజోలు అన్న గ్రామం ఉంది. అదే షాజహానా అమ్మమ్మగారి ఊరు. ఆ ఊళ్ళో చిత్రమేమిటంటే ఊరు మొత్తం ఒక్క చుక్క మంచినీరైనా దొరకదు. ఊరునిండా ఉప్పునీటి బావులే. ఊరికి రెండు మూడు మైళ్ళ దూరంలో 'అమ్మబాయి' అని ఒక బావి ఉంది. దాన్నిండా మంచినీటి గంగే! ఊళ్ళోని ఆడవాళ్ళంతా కడవలతో ఆ బావి నీరు తీసుకొచ్చుకోవలసిందే. నెత్తిమీద నిండు కుండతో మైళ్ళ తరబడి నడిచీ నడిచీ తన అమ్మమ్మ నడుము కావడి బద్దయిందని వాపోతున్నది షాజహానా. రసార్ద్రంగా సాగిన ఈ కవిత హృదయాలను కదిలిస్తుంది. 'చిన్నె' అన్న మరో కవిత నాస్టాల్జియాకు మంచి ఉదాహరణ. ఖమ్మంజిల్లా, ఇల్లెందు తాలూకాలోని కమలాపురం మా స్వగ్రామం. షాజహానా ఇక్కడే జన్మించింది. కమలాపురంలోని మా ఇల్లూ, దాని పరిసరాలూ, షాజమానా దాదీమా (మా అమ్మ), ఇప్పుడవన్నీ ఉత్త జ్ఞాపకాలుగానే మిగిలిపోయాయి.



షాజహానా

*'ఇప్పుడక్కడ ఏమీ లేదు / ఏదో ఉందనే తపన / ఈ శిథిలాల్లో పురాతత్వ శాస్త్రవేత్తనై / ఏ జ్ఞాపకాన్ని తవ్వుకోను / ...... / మట్టిగోడలపై జాడమొలిచింది / మా జిందగీల్లాగే అదీ కొన్నిరోజుల్లో ఎండిపోతుంది ..... కోడళ్ళతో నున్నగా అలికించుకొని / ఎర్రమట్టి అంచుతో జ మా దాదిమా రంజాన్ రోజు / కొత్త చీర కట్టుకున్నట్టు జ ఎంత ఠీవిగా ఉండేది మా ఇల్లు! ....... జ కాలానికి కరిగిపోయిన మా ఇల్లేది వర్షానికి నాని కారిపోతున్న గోడలు / నిండు దేహాన్ని ఎవరో కోస్తే సగాలైన మొండాలు / కప్పు; దాదా ఆస్థిలా / ఏ తుఫాను తాకిడికి కొట్టుకుపోయిందో'*

అంటూ తను పుట్టి పెరిగిన, సహేలీలతో ఆటలాడిన, దాదా, దాదీ, అబ్బా, అమ్మీ, చిచ్చాలు, చిచానీలతో కళకళలాడిన, పండుగలకు పబ్బాలకు కొత్త పెళ్ళికూతురులా ముస్తాబయిన ఇల్లు కాలానికి కరిగిపోతే..... ఆ విషాదం అనుభవించిన వాళ్ళకే తెలుస్తుంది. అందుకే ఈ కవిత చాలా ఆత్మీకంగా హృదయాన్ని తాకుతుంది. ఈ తరం స్త్రీలు అబలలు కారని, జరుగుతున్న అన్యాయాలను, అత్యాచారాలను, అణచివేతలను మౌనంగా చూస్తూ ఉండలేరని, సాహసోపేతంగా ఎంతటి క్లిష్టమైన సమస్యలనైనా అధిగమించగల చేవ ఉన్న వారని, నిర్భయంగా, నిర్ద్వందంగా ప్రకటిస్తున్నది షాజహానా.

డా. దిలావార్

ఖమ్మం.

ఫోన్ : 986 692 3294

---

## రంగస్థల నటి కోటేశ్వరి దేవి

కోటేశ్వరి దేవి శ్రీ రామకృష్ణ నాట్యమండలి సభ్యురాలు. సురభి కుటుంబానికి చెందిన వెంకట్రావు, నరసమాంబలకు 1937, జులై 13న జన్మించింది. తల్లిదండ్రులు వృత్తిపరంగా నాటక కళాకారులు కావడంతో కోటేశ్వరిదేవి చిన్నప్పుడే ప్రహ్లాదుడు, లోహితాస్యుడు, లవుడు, కుశుడు పాత్రలలో నటించింది. ఆవేటి నాగేశ్వరరావు స్థాపించిన న్యూ పూర్ణానంద కంపెనీలో నెల జీతంతో, ఈయన శిక్షణలోనే చంద్రమతి, శ్రీకృష్ణుడు, ద్రౌపది, సత్య, చింతామణి, అనసూయ, కనకసేనుడువంటి స్త్రీ, పురుష పాత్రలలో నటించింది. ఈ కంపెనీ ప్రదర్శనలలో నటిస్తున్నప్పుడే 1958లో త్రినాథరావుతో వివాహమైంది. భర్త నటుడు కావడంతో 1962 వరకు సురభి కంపెనీలు ప్రదర్శించిన నాటకాలలో నటించింది. నెలజీతంతో జీవిక సాగించడం కష్టంకావడంతో ఔత్సాహిక నాటక సమాజాలు ప్రదర్శించే నాటకాలలో నటించడానికి కొంతకాలం కర్నూలులో నివాసముంటూ రాయలసీమలోని పలుప్రాంతాలలో ప్రదర్శించిన నాటకాలలో స్త్రీ, పురుష పాత్రలలో నటించి రాణించింది. 1970లో గుంటూరులో జరిగిన అఖిలాంధ్ర సత్యహరిశ్చంద్ర నాటక పోటీలలో శ్రీ రామకృష్ణ నాట్యమండలి పక్షాన *చంద్రమతి* ప్రదర్శించిన నాటకానికి ఉత్తమ ప్రదర్శన బహుమతి, హరిశ్చంద్ర పాత్రలో నటించిన పొన్నాల రామసుబ్బారెడ్డికి ప్రథమ బహుమతి లభించాయి. ఆంధ్రదేశంలో విభిన్న పాత్రలలో పలు కళావేదికలపై నటించిన కోటేశ్వరిదేవికి అసంఖ్యాకంగా వెండి, నగదు బహుమతులు లభించాయి, సన్మాలు జరిగాయి. ఆకాశవాణి (విజయవాడ)లో కూడా *సత్యహరిశ్చంద్ర, చిత్రనళీయం, సారంగధర, శకుంతల* నాటకాలలో నటించి కళారంగంలో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న నటి కోటేశ్వరిదేవి.



కోటేశ్వరి దేవి

# చదవండి...

– ఎన్నార్కె



✧ **చిట్టిమనసులు సమిష్టి శతకం** : 'భవిష్యత్ తరాలను సామాజిక బాధ్యతతో ఎదిగేలా చేయూతనిద్దాం' అనే సత్‌సంకల్పంతో సాగిన 108 చిట్టిపొట్టి గీతాలు. రచనా విధానంలో, భావనలలో వేమన ప్రభావం కనిపిస్తుంది. *పేజీలు : 64, వెల : ₹ 30/-, ప్రతులకు – 944 191 3829 కు ఫోన్ చేయండి.*




***విజ్ఞాన ప్రచురణలు*** *(జనవిజ్ఞాన వేదిక 162, విజయలక్ష్మినగర్, నెల్లూరు – 524004. సెల్ : 944 050 3061) వారు పిల్లలో వైజ్ఞానిక దృష్టిని పెంచడానికి ఎంతో అర్థవంతంగా, సులువైన భాషలో ఈ రెండు పుస్తకాలను ప్రచురించారు. కె.బి. గోపాలం శాస్త్రీయ స్ఫూర్తితో రచన సాగించారు. పిల్లలేకాదు, పెద్దలు కూడా చదివి, తెలుసుకోవలసిన విషయాలనేకం ఉన్నాయి.*

✧ **(1) మిణుగురులలో వెలుగు ఎలా వస్తుంది?** : రసాయనశాస్త్రంలో కొన్ని ప్రశ్నలు – సమాధానాలు. సైన్స్ అని తెలియకుండానే జీవితం నడుస్తుంది. ఈ సంగతి అర్థమయితే మాత్రం బతుకు తీరు మారుతుంది అని చెబుతారు రచయిత. *పేజీలు : 63, వెల : ₹ 30/- ప్రతులకు – 944 050 3061 కు ఫోన్ చేయండి.*




✧ **(2) పక్షులు ఎలా ఎగురుతాయి? - భౌతిక శాస్త్రంలో కొన్ని ప్రశ్నలు - సమాధానాలు** : సిద్ధాంతం తెలుసుకుని ఉదాహరణలు చెప్పేకన్నా ముందు ఆ ఉదాహరణలు చూపి, విషయం తరువాత పరిచయం చేశారు రచయిత. ఇది శాస్త్రీయపద్ధతి. *పేజీలు : 72, వెల : ₹ 30/- ప్రతులకు – 944 050 3061 కు ఫోన్ చేయండి.*




***'విహారి'*** *అనే పేరుగల జి.యస్. మూర్తి, హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్, జర్నలిజంవంటి అంశాలలో డిప్లమో చేశారు. జాతీయ, అంతర్జాతీయ సెమినార్‌లలో ప్రసంగాలు చేశారు. తెలుగు సాహిత్యంపై, సాంఘిక దృక్పథంపై అనేక వ్యాసాలు వ్రాశారు. ఈ మధ్య వారి రచనలు ఐదు సంపుటాలుగా వెలువడినవి.*






**విహారి'**

✧ **(1) ప్రస్తావన - వ్యాససంపుటి** : తెలుగు కథాపరిణామాల్ని, అందులోని వివిధ పార్శ్వాలను అధ్యయనం చేసి, వ్రాసిన వ్యాసాలు. *పేజీలు : 116, వెల : ₹ 100/- ప్రతులకు – 984 813 2208 కు ఫోన్ చేయండి.*

✧ **(2) మాయతెర - కథానిక సంపుటి** : అందరూ ఆడిపోసుకునే మధ్యతరగతి మందహాసాల వెనుక దాగిన సింబల్స్‌ని, ప్రతీకలను ఔపోసనపెట్టి రచించిన 15 కథలు. *పేజీలు : 120, వెల : ₹ 100/- ప్రతులకు – 984 802 5600 కు ఫోన్ చేయండి.*




✧ **(3) కథానిక వస్తురూపాలు** : కథాసాహిత్యం విస్తృతిగా వస్తున్న ఈ కాలంలో, వాటిలోని వస్తువు గురించి, రూప గుణ విశేషాల్ని గురించి విశ్లేషిస్తూ వివిధ సందర్భాలలో వ్రాసిన వ్యాసాల సంపుటి. *పేజీలు : 162, వెల : ₹ 120/- ప్రతులకు – చినుకు పబ్లికేషన్స్, గాంధీనగర్, విజయవాడ–520 003, నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ, హైదరాబాద్.*




✧ **(4) కథాకృతి (పరిచయాలు - పరామర్శలు) మూడవభాగం** : తెలుగులో కొన్ని గొప్ప కథలు, కొందరు గొప్ప కథకులు ఉన్నారు. వారి కథలను, శైలిని వివరణాత్మకంగా విశ్లేషిస్తూ వ్రాసిన వ్యాససంపుటి. ఇందులో మొత్తం 5 వ్యాసాలున్నాయి. చదివి, ఆలోచింపజేసే రచనలు. వేదగిరి కమ్యూనికేషన్స్ ప్రచురణ. *పేజీలు : 166, వెల : ₹ 100/- ప్రతులకు – 939 134 3916 కు ఫోన్ చేయండి.*

✧ **(5) దీపిక - సలీం నవలా పరామర్శ :** కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత వ్రాసిన 7 నవలలపై ఇది విశ్లేషణాత్మక పరామర్శ. "విమర్శకాగ్రేసరులు పట్టించుకోని సమకాలీన రచనల్లోని మంచిని చూపడానికే కాని చెడు చెప్పే ఉద్దేశం లేదు, రంధ్రాన్వేషణ చేసే విమర్శకుడన్న పేరు వద్దనే వద్దు అంటారు" విహారి.

*పేజీలు : 180, వెల : ₹ 150/- ప్రతులు - అన్ని ప్రముఖ పుస్తక విక్రయ కేంద్రాలలో లభ్యం.*




✧ **ఖమ్మం కథలు - 1911-2016 :** మధ్యకాలంలో ఉద్యమాల గుమ్మంగా భావించబడుతున్న ఖమ్మం జిల్లా నుంచి వెలువడిన కథల సంపుటి. 'ఇది సర్వస్వం కాదు, తనకు లభించని కథకులు కూడా ఉండవచ్చు' అని తెలిపారు సంపాదకురాలైన జ్వలిత. వికేంద్రీకృత సాహిత్యానికి ఆహ్వానం అంటూ వ్రాసిన వ్యాసం ఆలోచింపజేస్తుంది. మొత్తం 104 కథలను సేకరించటం, వాటిని క్రొనలాజికల్ క్రమంలో ప్రచురించటం అభినందనీయం.

*పేజీలు : 672, వెల : ₹ 500/- ప్రతులకు - జ్వలిత - 998 919 8943.*




✧ **శ్రీ కృష్ణదేవరాయలు :** రచన భట్టరుశెట్టి పద్మారావు రాయలు - రచయిత రాయలును చంద్రవంశ బలిజ క్షత్రియుడని పౌరాణిక, చారిత్రక, సామాజిక, పరిశోధనల ఆధారంగా దీనిని రచించినట్లుగా తెలిపారు. కృష్ణదేవరాయలు బలిజ కులస్థుడంటూ అనేక శాసనాధారాలను పేర్కొన్నారు. రాయలుపై అభిమానమున్నవారందరూ చదవదగిన పుస్తకం. ఇది మూడవ ముద్రణ.

*పేజీలు : 240, ప్రతులకు - శ్రీ అన్నయ్యగారి సాయికుమార్ రాయలు, కడప. ఫోన్ : 944 043 3429.*




*మంచి పుస్తకం* *అన్న పేరుతోనున్న ప్రచురణ సంస్థ బాలసాహిత్యానికి తమవంతు సాయం అందిస్తూ సార్థక నామధేయులమనిపించుకుంటున్నది. ఈ మధ్య నాలుగు పిల్లల పుస్తకాలు ప్రచురించారు. వీటిలోనున్న కథలు అల్లిబిల్లి గారడీ కథలు కావు. పిల్లల విజ్ఞాన వికాసాలు పెంపొందించేవిగా ఉన్నాయి.*




✧ **(1) జతగాళ్ళు కతగాళ్ళు** : రచయితలు కెం. మునిరాజు, గౌనోళ్ల సురేశ్ రెడ్డి.

*పేజీలు : 120, వెల : ₹ 55-*




**(2) మొయిన్, రాక్షసుడు :** బాలల రచయిత్రిగా పేరుగాంచిన అనుష్కా రవిశంకర్ మూలానికి తెలుగు అనువాదం కె. సురేశ్. అనితా బాలచంద్రన్ వేసిన బొమ్మలు అర్థవంతంగా, కళకు దోహదం చేసేలా ఉన్నాయి. *పేజీలు : 106, వెల : ₹ 100/-*




**(3) మాధురీ పురందరే - ఒక వేసవి రోజు :** ఇందులో రెండు కథలున్నాయి. సామాన్యంగా బాలసాహిత్యంలో జానపద, పౌరాణిక గాథలకే ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. ఇది వర్తమాన, సాంఘిక నేపథ్యంలో సాగిన కథ. *పేజీలు : 90, వెల : ₹ 50/-*




**(4) నీలపు దీపం** : జాకబ్, విల్హెల్మ్ గ్రిమ్ జర్మనీకి చెందిన గ్రిమ్ సోదరులు జర్మనీకి చెందిన భాష మరియు సాంస్కృతిక పరిశోధకులుగా ప్రసిద్ధులు. 19వ శతాబ్దపు జానపద కథలను సేకరించి, వాటిని తెలుగు పరిసరాలకు అనుగుణంగా మలచి ఊట్ల కొండయ్య అనువాదం చేశారు. ఇందులో కొన్ని కథలు మొదటిసారిగా 1958లో ప్రచురించబడినప్పుడు వీటికి బాపు బొమ్మలు వేశారు. బాపు చిత్రకళలో రేఖలు పుష్కలంగా ఉన్న ఈ చిత్రాలను తిరిగి ప్రచురించిన పబ్లిషర్స్ అభినందనీయులు. బాపు చిత్రకళా పరిణతిని విశ్లేషించడానికి ఇవి ఎంతగానో సహకరిస్తాయి.

*పేజీలు : 130, వెల : ₹ 65/-*

*(పై పుస్తకాలు కావలసినవారు ఈ అడ్రస్‌లో సంప్రదించవచ్చు - మంచిపుస్తకం, 12-13-439, వీధి నెం. 1, తార్నాక, సికింద్రాబాద్-500 017.)*

# మిసిమి
మాసపత్రిక

**మీరు చందాదారులుగా చేరండి** **బహుమతిగా పంపండి**

మీ ఊరు, మీరు చదివిన బడి, మీరు పట్టభద్రులయిన కళాశాల – ఇవన్నీ మీకు అపురూపమైనవేకదా! మీకు ప్రియమైనవారు, స్నేహితులు – మీకు ఎంతో ముఖ్యంకదా! వీరందరికీ మీరు **మిసిమి** ని బహుమానంగా నెలనెలా పంపవచ్చు. మీరూ ఒక బహుమతిని పొందవచ్చు. ప్రక్కన వున్న పుస్తకాలలో మీకు కావలసిన పుస్తకాన్ని ఎంపిక చేసుకోండి. దాన్ని మీకు బహుమతిగా పంపిస్తాం. మీ ఊరి గ్రంథాలయానికి లేదా మీరు చెప్పిన స్నేహితులకోసం చందా **మిసిమి** పేర ₹300/- పంపండి. వారి పూర్తి చిరునామా ఈ క్రింది గడులలో ఇవ్వండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం. ప్రతినెలా మీరు వారిని పలకరించినట్లే మంచి సారస్వతంతో....

**ఈ క్రింది బహుమతి పుస్తకాలలో**
**మీకు కావలసిన పుస్తకాన్ని ఎంచుకోండి**

1. పారాయణ వర్గ, 2. నేనొక ప్రవాహాన్ని (అన్నపరెడ్డి వెంకటేశ్వరరెడ్డి), 3. బుద్ధ-ధమ్మ-సంఘ (జె. లక్ష్మీరెడ్డి), 4. బుద్ధుని సూత్రసముచ్ఛయం, 5. మానవీయ బుద్ధ, 6. యతిగీతం – వివేకానందుడు (గజ్జెల మల్లారెడ్డి), 7. అంతర్వీక్షణం, 8. దూరతీరాలలో, 9. అగాధం, 10. ఓ ఖైదీ వీరగాథ, 11. నాలో నేను (వి. అశ్వినీకుమార్), 12. **మిసిమి** వ్యాసాలు (డా. ఇన్నయ్య).

**పేరు :** ..........................................................
**ఇం.నెం**....................................**వీధి**..........................
**ఊరు**......................................**పిన్** ..........................
**సెల్** ..........................................................
**సంతకం :** ..........................................................

మీ చిరునామా ఇక్కడ రాసి, వాట్సాప్ (994 951 6567)గానీ, ఇ-మెయిల్ (misimi_monthly@yahoo.in) ద్వారాగానీ పంపండి.

**Our A/c Details for Online Transfer :-**

| | | |
|---|---|---|
| Bank | : | **STATE BANK OF INDIA** |
| Account | : | **MISIMI** |
| A/c. No. | : | **10261569316** |
| Branch | : | **Saifabad, Hyderabad, INDIA** |
| IFS Code | : | **SBIN0007315** |

(ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్‌కు రూ. 50/- బ్యాంకు ఛార్జీలు కలపండి.)



రెండు సంవత్సరాల చందాదారులకు (₹ **600+50/-**) *ఏరియల్ (షెల్లీ)* గ్రంథం బహుమతి



నాలుగు సంవత్సరాల చందాదారులకు (₹ **1200+50/-**) *నా కథ చార్లీ చాప్లిన్* గ్రంథం బహుమతి





మూడు సంవత్సరాల చందాదారులకు (₹ **900+50/-**) *బైరన్ (జీవిత కథ)* గ్రంథం బహుమతి



అయిదు సంవత్సరాల చందాదారులకు (₹ **1500+50/-**) **మిసిమి 2013/2014** సంచికల బౌండ్ పుస్తకం బహుమతి

**మిసిమి**
మాసపత్రిక
Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. **040-27645536.**



అరక

MISIMI / మిసిమి / RNI Regd.No.45042/90 Telugu Monthly, Hyderabad - 500 020
Postal Regd.No.H/SD/191/2015-17
Date of Posting: On 29th & 30th of every month.
Date of Publication: 25.06.2016



అమ్మ రూపం